# స్పందన

కథా సంపుటి

డా॥ అమృతలత

## మధ్యతరగతి మనుషుల
## ముసుగుల్ని చించిన కథలు....



**- డా॥ అంపశయ్యా నవీన్**

(కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత)

అమృతలత విద్యార్థినిగా కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లోనే- ఆమెలోని రచయిత్రి మేల్కొంది. ఆనాటినుండి ఈనాటివరకూ అనేక పత్రికల్లో ఆమె రచనలు చోటుచేసుకున్నాయి. పాఠకుల హృదయాల్లో పదికాలాలపాటు నిలిచిపోయే కథలు ఆమెవి.

అయితే ఆమె ఇంతకాలానికి - ఆలస్యంగానైనా సరే 'స్పందన' పేరిట తన మొదటి కథా సంకలనాన్ని వెలువరించడం ముదావహం.

ప్రారంభంలో ఆమె రచించిన 'కాలం వెక్కిరించింది', 'ఆశయాలూ- ఆదర్శాలూ' లాంటి కథల్ని అభివ్యక్తి దృష్ట్యా చూసినపుడు, ఆమె రచనల్లో ఎంతో పరిపక్వత కనిపించినా, ఇతివృత్తాలలో మాత్రం అది కొంత లోపించినట్లు ద్యోతకమవుతుంది - సాధారణంగా ఆ వయసులో అందరు రచయితల్లో ఉన్నట్టే అమృతలత రచనల్లో కూడా ప్రేమలూ, త్యాగాలూ, ఆత్మహత్యలూ, కన్నీళ్ళలాంటి సెంటిమెంట్ల పట్ల ఆకర్షణ కనిపిస్తుంది. బహుశ ఆ రోజుల్లో ఆమె చూసిన కొన్ని సినిమాల ప్రభావం కూడా ఆమె మీద పనిచేసి ఉండవచ్చు - కానీ ఆ ప్రభావాల నుండి ఆమె తొందరగానే బయటపడి, కొత్త కోణాల్లో రచనలు సాగించినట్లు, తర్వాతి రచనల ద్వారా గ్రహించగల్గుతాం.

ఒక క్లాసు రూంలో జరిగే చర్చ ద్వారానే కథను నడిపించవచ్చునని ఈ సంపుటిలోని 'అన్‌రెస్ట్' అన్న కథ రుజువుచేస్తుంది.

ఒక మహిళా కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు, అధ్యాపకురాలికి మధ్య దేశాన్ని వేధిస్తున్న అనేక వివాదాస్పదమైన అంశాలను గూర్చిన చర్చ జరుగుతుంది. ఇంకెంత కాలం రిజర్వేష న్లుండాలి, అసలు రిజర్వేషన్లుండటం సరిఅయిన విధానమేనా ? నక్సలైట్లు సాగిస్తున్నది వ్యక్తిగత హింసావాదం కాదా ? వాళ్ళ వల్ల సమసమాజం ఏర్పడడం సాధ్యమేనా ? చైనాలో జరుగుతున్న ఆర్థికాభివృద్ధికి, భారతదేశంలో జరుగుతున్న ఆర్థికాభివృద్ధికి మధ్యన వున్న వ్యత్యాసమేమిటి ? ఇలాంటి అనేక అంశాలను గూర్చిన విద్యార్థినుల సందేహాలకు వాళ్ళ లెక్చరర్ అరుణ సమాధానాలు చెబుతుంది. అయితే ఆమె అభిప్రాయాలతో ఏకీభవించని వివిధ వర్గాల వారు ఆమెను బెదిరిస్తూ ఉత్తరాలు రాస్తారు. తర్వాత ఆమెనెవరో హత్యచేస్తారు. ఆమెని అభిమానించే ఆమె విద్యార్థినులు కూడా ఆమె హత్యను ఖండించడానికి భయపడ్తారు.

'మన దేశంలో ఉన్నది స్వేచ్ఛలేని, సమానత్వంలేని అరాచకత్వం - స్వేచ్ఛపేర జనించిన విశృంఖలత్వం. అసలు ఈ అరాచకత్వం మనదేశంలో ఇలా కొనసాగుతున్నంత కాలం తాము ఏ స్వేచ్ఛనీ, ఏ సమానత్వాన్నీ అనుభవించలేరు' అన్న మాటలతో రచయిత్రి ఈ కథను ముగిస్తారు. ఇప్పుడు దేశంలో తాండవిస్తున్న అరాచకత్వాన్ని చూస్తూన్న వాళ్ళు రచయిత్రి ఈ అభిప్రాయలతో ఏకీభవించకుండా ఉండలేరు.

'స్పందన' కథ ఇతివృత్తంలో కొత్తదనం ఉంది. ఈ కథంతా కొత్తగా పెళ్ళి చేసుకున్న మాధవీ - రవి చుట్టూ, ఎప్పుడో పెళ్ళయి పిల్లలున్న అరుణా-శ్రీనివాస్‌ల చుట్టూ తిరుగుతుంది. మొదటి జంట ఒకరినొకరు అర్థం చేసుకుంటూ తమ దాంపత్య జీవితాన్ని సుఖమయం చేసుకుంటారు. కాని రెండో జంట విషయంలో మాత్రం - శ్రీనివాస్ తన భార్య అరుణ ఫీలింగ్స్‌ని అర్థం చేసుకోడు. పై పెచ్చు ఆమె మూడ్స్ పాడు చేస్తూ - ఆమెని ఓ జడపదార్థంగా తేల్చేసి, ఆనందిస్తుంటాడు. శృంగారానికి సంబంధించిన విషయాల పట్ల దంపతులకి పరస్పర అవగాహన ఉండడం ఎంత అవసరమో ఈ కథలో రచయిత్రి సమర్థవంతంగా చెప్పగలిగారు. ముఖ్యంగా అరుణ హృదయ స్పందనని ఎంతో హృద్యంగా- ఎలాంటి అశ్లీలతకీ తావివ్వకుండా అత్యంత మనోజ్ఞంగా చిత్రీకరించారు.

'కాలని తెప్ప' అన్న కథలో కూడా రచయిత్రి సునిశిత దృష్టి కన్పిస్తుంది. _యాదృచ్ఛికత ఎక్కువైపోయినట్టనిపించినా ఈ కథ బాగుందని నాకనిపించింది. అవసరం తీరగానే పేదలపట్ల ధనికులెలా ప్రవర్తిస్తారో, కొందరి ధనికుల మనస్తత్వం ఎంత నీచంగా ఉంటుందో ఈ కథలో రచయిత్రి చాలా బలంగా చిత్రించారు.

అమృతలత కలం నుండి వెలువడ్డ మరో మంచికథ 'స్వీట్ నాన్సెన్స్'. ఈ కథలో ఆస్తులు తారుమారై పరిణామం చెందినా - సుఖం కంటే - తృప్తికి విలువ ఎక్కువ అన్న సత్యం చాటారు.

'అంతుపట్టని ఆంతర్యాలు' అనే కథ - భార్య పక్కలో ఉన్నప్పుడే మరో స్త్రీ ఒంటిమీద చెయ్యివేసే భర్త, ఉద్యోగం కోసం చెల్లెలంటూ ప్రేమ నటించిన సారథి, తన తండ్రి కూడా అవినీతిపరుడే అని గుర్తించిన కథానాయిక - వ్యక్తులు వేసుకునే ముసుగుల్ని బహిర్గతం చేస్తుంది. ఈ సంపుటిలోని మంచికథల్లో ఈ కథ కూడా ఒకటి.

'ఆమెనవ్వు' కథలో ఒక కొత్త ఇతివృత్తాన్ని తీసుకుని దాన్ని ఓ మంచి కథగా మలచడంలో రచయిత్రి సఫలీకృతులయ్యారు. ఇలాంటి కథ రాయడానికి రచయితలకు చాలా సాహసం కావాలి. అది పుష్కలంగా ఉన్న రచయిత్రి తానని అమృతలత నిరూపించుకున్నారు.

ఆనాటి స్వాతంత్రోద్యమ పోరాటాన్ని ప్రతీకాత్మకంగా మలిచిన కథ 'పొదరిల్లూ మాది!'

ప్రారంభ దశలో రాసిన 'కాలం వెక్కిరించింది', 'ఆశయాలూ - ఆదర్శాలూ,' 'కన్నీళ్ళతో కాలక్షేపం', 'మనసు ఎదగని మనుషులు' అన్న కథల్ని - తర్వాతి కథలైన 'ఆమెనవ్వు', 'అంతుబట్టని ఆంతర్యాలు', 'స్వీట్ నాన్సెన్స్', 'కాలని తెప్ప', 'స్పందన', 'అన్‌రెస్ట్', 'నేనుసైతం' కథలతో పోలిస్తే - రచయిత్రిగా ఆమె క్రమక్రమంగా ఎలా ఎదిగారో పఠితలు సులభంగా గ్రహించగలుగుతారు.

అమృతలత కథలు పాఠకులను కదిలిస్తాయి, ఆలోచింపజేస్తాయి, చాలా కాలం నిలుస్తాయి.

రచయిత్రికి అభినందనలు !

# రాజహంస కథలు



-వి. ప్రతిమ

'భౌతిక రణరంగంలో జరిగే యద్ధాలనీ, బీభత్సాలనీ చరిత్ర నమోదు చేస్తుంది. ఆ భౌతిక పునాదుల మీద సాగే మానసిక యుద్ధాల్ని అక్షరబద్ధం చేస్తుంది సాహిత్యం. మనం బతుకుతున్న పరిసరాలనీ, పరిస్థితుల్నీ ఏ కొంచమైనా పట్టుకోలేకపోతే ఆ సాహిత్యం వల్ల ప్రయోజనం శూన్యం' అంటారు అఫ్సర్ ఒకచోట...

అమృతలతగారు రాయడం మొదలు పెట్టిన్నాటినుండీ కూడా తన చుట్టూవున్న సమాజ పరిస్థితుల్నీ, అందునా స్త్రీల దుస్థితినీ యింకా అనేక రకాల వెలుగు నీడలనీ లోతుగా ఆకళింపు చేసుకుని తనదైన ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పరచుకున్నట్లుగా మనకీ కథలు చదువుతూంటే అర్థమవుతుంది. తెలంగాణ ప్రాంతపు గడీలలో పుట్టి పెరిగినప్పటికీ సామాన్య జన జీవితాలను అతి దగ్గరగా పరిశీలించి పట్టుకోగలగడం ఆమెలోని ప్రత్యేకత.

స్త్రీల గురించీ, స్త్రీల కోణం నుండీ స్త్రీపురుష సంబంధాలను విశ్లేషిస్తూ విద్యార్థి దశలోనే కథలురాసి బహుమతులూ, సాహిత్య గౌరవాన్నీ పొందిన రచయిత్రి అమృతలత... అతి చిన్న వయస్సులోనే సాహిత్యరచన ప్రారంభించినప్పటికీ ఆమె ప్రవేశించిన విద్యా రంగమూ, యింకా ఆమెకున్న యితరేతర వ్యాపకాల మూలంగా అతి తక్కువ కథలు రాసి పాఠకుల మీద అత్యధిక ప్రభావాన్ని ప్రసరింపచేసిన రచయిత్రి ఆమె.

నలభయ్యేయిదేళ్ళ క్రితమే స్త్రీల పక్షాన నిలబడి స్త్రీలమీద హింస లేనటువంటి సమాజం కోసం ఎంతగానో పరితపన పడిన సత్యాన్ని తెలియజేస్తాయీ కథలు. లేదంటే 'కన్నీళ్ళతో కాలక్షేపం' చేయడానికి ఇచ్ఛగించని వజ్రమాల వంటి పాత్ర, జీవితాలని తమదైన మార్గంలో నిలుపుకోవడానికి ప్రయత్నించిన సుజ్జీ వంటి స్త్రీలు మనకి కన్పించరు. భయపడితే భయపెట్టే బెదురుకుక్కల్నీ, అనుమానప్పిశాచుల్నీ

ఎదిరించి ప్రతిఘటించాలే తప్ప భయపడుతూ కూర్చోకూడదంటారు అమృతలత. ఏ వాదాన్నీ ఆధారం చేసుకోకుండా పురుషాధిపత్యాన్ని ఎదిరించగల ఎరుక ఆమెకి సహజంగా అబ్బిన విద్యేమో అన్పిస్తుంది.

తక్కువ మాట్లాడ్డం, ఎక్కువ ఆలోచించడం, అంతకంటే ఎక్కువగా పనిచేయడం, ఎప్పుడూ గుంపులో వుంటూనే తనదైన ఏకాంతాన్ని తాను అనుభవిస్తూ జీవితానికి సంబంధించిన కొత్త చలన సూత్రాలను ఒడిసి పట్టుకోగల నేర్పు అమృతలత సొంతం.

బాల్యంలోనే సమాజంపట్ల ఆసక్తినీ, సాయపడాలన్న అనురక్తినీ ఏర్పరచుకున్న పదేళ్ల కథానాయికని సృష్టించి అత్యంత విశ్వస నీయంగా, సహజంగా పాఠకులకు పరిచయం చేస్తారు... తమకంటూ ఒక ఇల్లు, ప్రాంతమూ, తగిన ఆదాయమూ లేని సంచార జీవులు ఎండకు ఎండి, వానకు తడవడంతో స్పందించి తమ యింట్లో ఆశ్రయమిచ్చిన ఓ పదేళ్ల పాప ద్వారా. మాస్టర్లు నేర్పిన సింధూ నాగరికత, మెసపొటేనియా నాగరికతల సంగతేమో గానీ 'అవసరంలో వున్నవారికి సాయంచేయాల'ని తల్లి నేర్పిన ఈ నాగరికత మాత్రం బాగా అర్థమయి ఆనందం కలుగుతుందామెకి.

ఒక్కోసారి ఒడలన్నీ బండ్లయి, ... బండ్లు ఒడలు ఎలా అవుతాయో, ఒడలయిన తర్వాత కూడా మనిషి బండ్లని మర్చిపోరాదన్న సత్యాన్ని అంతర్లీనంగా కదిలిస్తూ 'స్వీట్‌నాన్సెన్స్' అన్న కథని చదువుతున్న పాఠకుడి గుండె తడి అయ్యేలా చెప్తారు అమృతలత. డబ్బు కలిగిన వాడు కాదు, తృప్తి కలిగిన వాడే నిజమైన ధనవంతుడు అన్న సత్యం మనకీ కథలో గోచరిస్తుంది.... అసలా మాటకొస్తే ఈ కథలన్నీ కూడా అనుభవాత్మక సత్యాలే సుమా అన్పిస్తుంది.... అందుకే వీటిని నేను 'కథా సత్యాలు' అంటున్నాను. ఆమె కథ ఏదయినా సరే, ఆమె చర్య ఏదయినా సరే స్త్రీల జీవితాలలోని చీకటి కోణాలను వెతికి పట్టుకుని ఆ మూలాల్లో వెలుగు రేఖల్ని ప్రసరింపచేయడమే.

'మనసు ఎదగని మనుషులు' అన్న కథని ఆమె విద్యార్థిదశలోనే రాసి బహుమతి పొందారు అనుకుంటే ఆశ్చర్యమేస్తుంది. ఆ చిన్న

వయసులోనే ఆమెకున్న జీవితానుభవం, దాన్ని పొందిగ్గా వ్యక్త పరచినతీరు పాఠకుడిని విస్మయపరుస్తుంది.

ఈ సంపుటిలో 'అన్‌రెస్ట్' అని ఒక మంచి కథ వుంది... రిజర్వేషన్లు కల్పించడం మూలంగా విద్యాలయాల్లో కులాల ప్రస్తావన ఖచ్చితంగా తీసుకు రావల్సివస్తుంది. ఇష్టమున్నా లేకున్నా మాస్టర్లు 'మీదే కులం!' అని విద్యార్థుల్ని ప్రశ్నించక తప్పదు. ఈ నేపథ్యంలో నుండి ఒక తరగతి గదిలోని ఓసీ, బీసీ, ఎస్సీ విద్యార్థులకీ, కొత్తగా వచ్చిన మేస్టరమ్మకీ మధ్యన జరిగిన ప్రశ్న - జవాబుల చర్చలా శిల్పాన్ని సంతరించుకుంటుందీ కథ. ఆ చర్చలో భాగంగా అనేకానేక సామాజిక విషయాలు మనముందుకి వస్తాయి.

'ఆస్తి సంపాదనకు స్వేచ్ఛ వున్నటువంటి సమాజంలో ఆస్తిసంపాదనే కదా ఏ మనిషికైనా ధ్యేయంగా వుంటుంది... అలాంటప్పుడు అసమానతలు లేకుండా ఎలా వుంటాయి ? సమ సమాజమే లక్ష్యమైన వాళ్ళు అజ్ఞాతంగా వుండకుండా ప్రజల మధ్యకొచ్చి తమ సిద్ధాంతాలనీ, లక్ష్యాలనీ ప్రచారం చేస్తూ, పార్టీ స్థాపించి తమ మేనిఫెస్టో ప్రకటించి, ఎన్నికల్లో గెలిచి, సంపూర్ణ సోషలిజాన్ని స్థాపించాలి కదా!' అన్న విద్యార్థిని ప్రశ్నకు ఆ ముళ్లదారుల్ని 'వాళ్ళు' ఎంచుకోవడానికి గల అసలైన కారణాల్ని, రాజ్యం స్వభావాన్ని కూడా మేస్టరమ్మచేత వివరింపజేస్తారు. పిల్లల్లో అభ్యుదయ భావాలనీ నింపుతున్నారన్న నెపంతో, ఆ మేస్టరమ్మ హత్య గావింపబడుతుంది. అదంతా వేరే విషయం!

మొత్తంమీద రిజర్వేషన్ల మూలంగా పై చదువులు చదవడాన్ని నిరసించే అగ్రకులాలవాళ్ళు లక్షలు లక్షలు కొండకచో కోట్లుకట్టి పై చదువులు చదవడం ఎంత వరకూ సబబో... రద్దు చేయాల్సివస్తే డొనేషన్లను కూడా రద్దు చేసి విద్యార్థుల్లో మేధస్సును పెంపొందించాలంటారామె... సమ సమాజ నిర్మాణమనే కర్తవ్యం చుట్టూ రచయితలు మెలగాలన్న వాక్యాన్ని ఈ కథ రుజువు చేస్తున్నట్టుగా వుంటుంది. ఈ కథని రచయిత్రి 1989లోనే రాశారనుకుంటే అభినందించకుండా వుండలేం! అనేకానేక యితర వ్యాపకాల

మూలంగా సాహిత్యమే ఆమె ప్రధాన కార్యక్షేత్రం కాకపోవడం... నిజంగా పాఠకులు చేసుకున్న దురదృష్టమేమో అన్పిస్తుంది. లేదంటే మరెంతో వస్తు వైవిధ్యమున్న ఎన్నో కథా సంపుటాలు పాఠకులకి అంది వచ్చేవి.... ఆధునిక కథా సాహిత్యానికి చేర్పు జరగివుండేది.

ఇప్పుడు ప్రపంచం ఒక కుగ్రామమైపోయిందని మనందరికీ తెలుసు. నెలల తరబడి కబురందని కాలం నుండి క్షణాల మీద వేలమైళ్ళు ప్రవహించగల యాప్స్ కాలంలో వున్నాం మనం! అయితే ఈ టెక్నాలజీ లేదా ఏ కొత్త సంస్కృతి అయినా ఇరవై శాతం మాత్రమే సద్వినియోగమవుతుంది. మిగిలిన ఎనభైశాతం రకరకాల మార్గాల్లో జనం దుర్వినియోగం చేస్తుండటం కూడా మనందరికీ తెలిసిన విషయమే.

ఇటీవల ఫేస్‌బుక్‌లో ఫేక్ ఫోటోలు పెట్టి అనేక విధాలుగా నమ్మించి మోసపుచ్చి మన రాష్ట్రపు అమ్మాయి వద్ద నుండి పద్దెనిమిది లక్షలు కాజేసిన విదేశీ యువకుడి గురించీ, యింకా అనేకానేక దుర్మా ర్గాల గురించీ మనం టీవీలలో చూస్తున్నాం. పేపర్లలో చదువుతున్నాం ఆడపిల్లల ఫోటోల మార్ఫింగ్ గురించయితే సరేసరి. ఫలితంగా అమాయకమైన అమ్మాయిల ఆత్మహత్యలు! ఇక నిర్భయ కేసులో అయితే ప్రజల ఉక్రోషాన్నీ, పోరాటాన్నీ కొత్త చట్టాలు చేసి ప్రభుత్వం ఎట్లా పక్కదారి పట్టించిందో మనందరమూ ఎరిగిందే... ఇదంతా యిటీవల పరిణామాలు! అయితే అనాటికే జనం బలహీనతల్ని సొమ్ము చేసుకుంటున్న 'అక్రమార్కులపై కొరడా' ముసుగులో జంధ్యాలేసుకున్న నక్కల గురించి ప్రస్తావిస్తారు అమృతలత... ఏ కాలంలోనైనా రాజ్యపు స్వభావంలో పెద్ద తేడా వుండదేమో అన్న అవగాహన కలుగుతుంది మనకి.

స్త్రీ, పురుష భేదాలు అంటే ఆడ, మగ తేడా అన్నది బాల్యం నుండే మొదలవుతోందనీ, దాన్ని తల్లిదండ్రులిరువురూ పిల్లలు చిన్న వయసులోనే చాలా జాగ్రత్తగా వాళ్ళకి పనులు పురమాయించడం దగ్గర్నుంచీ వారికి ఆహారం యివ్వడం దాకా ఎక్కడా ఏ చిన్న తేడా చూపించరాదని చెప్తూ 'నాసరి నీవని... నీ సరినేనని' అని ఒక మంచి

కథ రాసారు.

ఆ కథలో కుటుంబం దగ్గర్నుండీ, సమాజం వరకూ ఎట్లా ఈ స్త్రీ, పురుష అసమానతలని నరాల్లోకి ఎక్కిస్తూ వస్తారో, దాన్ని మనం ఎలా సున్నితంగా పిల్లలకి అర్థం చేయిస్తూ తిప్పి కొట్టవచ్చో చెప్తారు రచయిత్రి. ఆ క్రమంలోనే ఈ టెక్నాలజీ అమ్మాయిల్ని ఆత్మహత్యల వైపు ఎట్లా నెడుతుందో కూడా ప్రస్తావిస్తారు... కథలకంటే జీవితాన్ని ఎక్కువగా చదువుకోవడం వల్ల ఈ అనంతమైన వస్తు వైవిధ్యం అమృతలత కథల్లో మనకి కన్పిస్తుంది.

ఒక మొక్క చిన్నదిగా వున్నప్పుడు అక్కడ్నుంచి తీసి మరోచోట నాటినట్టయితే నిలదొక్కుకుని పెరిగే అవకాశం కొంతవరకూ వుంటుంది. కాని అది ఒక చెట్టయ్యాక దాన్ని పెకిళించి మరోచోట నాటితే అది నిలదొక్కుకోగలుగుతుందా ?... మరి చెట్ల పరిస్థితే యిలా వుంటే ఇరవై, పాతికేళ్ళు పుట్టింట్లో ఒకరకమైన కుటుంబ వాతావారణంలో పుట్టి పెరిగిన ఆడపిల్ల పెళ్ళి పేరుతో మరో కొత్తచోటుకి వెళ్ళి నిలదొక్కు కోవడం సాధ్యమేనా? .... తీరా నిలదొక్కుకుని ఎన్నో ఏళ్ళు గడిచిపోయాక భర్త మరణించిన తర్వాత - 'ఈ యింటి తాళాలు నీకివ్వం. నువ్విక్కడి దానివి కాదు పొ'మ్మంటే ఆమె ఎక్కడికి వెళ్తుంది? 'ఆమె ఇల్లు' ఏది ? ఎక్కడ ? స్త్రీలంటే కేవలం ఇంటి బాధ్యతలు పంచుకుంటూ చాకిరీ మాత్రం చేసే జీతం బత్తెంలేని పనిమనుషు లేనా? అత్తింటి పౌరసత్వాలని వాళ్ళెప్పటికీ పొందలేరా? ఇదెక్కడి సమాజన్యాయం ? ఇదెక్కడి చట్టం?' అంటూ సభ్య సమాజాన్ని నిలదీస్తారు అమృతలత.

డెబ్భయిల్లో వరకట్న పిశాచం సమాజాన్ని ఏలుతూ వుండేది... అది యిప్పుడు పేరు మార్చుకుని వటుడింతై అన్నట్లుగా మహావృక్షమై పోయింది అది వేరే విషయం... వరకట్నాల గురించి రాస్తూ యువత రం తలచుకుంటే ముళ్ళకంపలా వున్న సమాజాన్ని పూలపాన్పులా మార్చుకోవచ్చునంటారామె. యువశక్తికున్నటువంటి ప్రజ్ఞ గురించి చాలా చోట్ల చాలా రకాలుగా ప్రస్తావిస్తారు. ఒక నూతన సమాజ సౌధ నిర్మాణానికి పునాది రాళ్ళు వేయడం యువతరానికి అసాధ్యమేమీ

కాదంటారామె.

'సమాజమంటే ఎవరు ? మనం... మనమే సమాజం, సమాజమే మనం మారుతోన్న ఫ్యాషన్లకనుగుణంగా మనం మారడం లేదూ ? అలాగే సమకాలీన పరిస్థితులకి తగినట్లుగా మనక్కావల్సిన సమాజాన్ని మనమే సృష్టించుకోవచ్చుకదా! అందుకు ఎవరో ఒకరు పూనుకోక తప్పదు. నా ఒక్కరితో ఏం జరుగుతుంది అనుకుంటే ఎన్నేళ్ళు గడిచినా ఈ సమాజంలో మార్పురాదు. అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించామని విర్రవీగుతోన్న మనం యింకా కట్నాలూ, కానుకలూ అంటూ బూజుపట్టిన అభిప్రాయాలు, ఆచారాలూ వదల్లేకుండా వున్నామంటే సిగ్గుగాలేదూ' అన్పిస్తారు ఒక పాత్రచేత... ఎప్పుడూ? పందొమ్మిది వందల డెబ్భయిలో! నాలున్నర దశాబ్దాల తరువాత యిప్పుడు కూడా ఆ బూజు మరింత దట్టమై మనల్ని చుట్టుకుపోయి వుందంటే - సిగ్గుతో కుంచించుకు పోవాల్సిందే!

చాలా కాలంగా నాకో ఆలోచన.... ఇన్నేళ్ళ తెలుగు కథా సాహిత్యంలో, ఎన్నెన్నో సమాజ సంచలనాలని వివిధ కోణాల నుంచి వైవిధ్యభరితంగా పట్టుకున్న ఆధునిక తెలుగుకథలో స్త్రీల లైంగిక అసంతృప్తుల గురించిన ప్రస్తావన ఎక్కడా కన్పించకపోవడం బాధాకరం. చివరికి చలం వారసత్వాన్ని అందిపుచ్చుకున్న స్త్రీవాదులు కూడా ఈ వస్తువుని దాదాపుగా స్పృశించలేదనే చెప్పాలి. జయప్రభ రాసిన 'రసఝరీ యోగం' కథ అనందపు ఆవలి కోణాన్ని మాత్రమే పట్టుకుంది గానీ... వేలాది స్త్రీల అసంతృప్తిని గురించి మాట్లాడలేదు. కీ॥శే॥ పుష్పాంజలి స్త్రీల లైంగిక స్వేచ్ఛని గురించి చాలా కథలు రాశారు కానీ కుటుంబాల్లో స్త్రీల లైంగిక అసంతృప్తుల గురించి తక్కువగా స్పృశించారు.

ఎనభయిల్లోనే వైవాహిక కుటుంబిక జీవితాల్లో స్త్రీల యిష్టాయిష్టాలని ఏ మాత్రం ఖాతరు చేయకుండా వారిని జడపదార్థాలుగా చిత్రించి ఈసడించే పురుషుల గురించీ, భార్య పక్కనుండగానే పరాయిస్త్రీల నగ్నత్వాన్ని గురించి చొంగకార్చే మగాళ్ళ గురించీ, మందుతో పాటు ఎవరయినా మరో ఆడదాన్ని (భార్య కాకుండా)

వాంఛించే వాళ్ళ గురించి - ఇలా అనేకరకాల మగవాళ్ళని దుయ్య బడుతూ తన కథల్లో చర్చిస్తారు అమృతలత.

నిజానికి ఒక మంచి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించిన నట్టయితే స్త్రీల హృదయాలు ఎట్లా రసఝరీ యోగాల నిస్తాయో, వీణల్లో సరిగమలు పలుకుతాయో ఎంతో సున్నితంగా ఎక్కడా కూడా శృంగారం అన్న పదాన్నే వాడకుండా అత్యంత సహజంగా 'స్త్రీలకీ హృదయ ముంది, దానికి తృప్తినివ్వాలి' ధ్వనింపజేస్తారు. 'స్పందన' నిజంగా చాలా గొప్పకథ....

అక్కడక్కడా కొన్నికథల్లో అమ్మాయిల ఆత్మహత్యలు పంటికింది రాళ్ళులా మనని ఇబ్బంది పెట్టినప్పటికీ అది ఆనాటి స్త్రీల అసహాయతగా మనం అర్థం చేసుకోవాలే తప్ప మరోటికాదు. సాహిత్యాన్ని చదివేటప్పుడు కాలాన్ని ఎప్పుడూ మనం పరిగణనలోకి తీసుకోవాల్సి వుంటుంది కదా...

అదలావుంటే - సామ్రాజవాద ప్రపంచీకరణ మూలంగా తొంభయ్యో దశకం నుండి మన జీవితాల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానాలు మనవి. మార్కెట్టుకు బానిసల్ని చేసి స్త్రీలను సరుకులుగా మార్చి వేసిన నేపథ్యంలో కుటుంబాల్లో విలువలూ, సంబంధాలు దెబ్బతినిపోయాయి. ఈ క్రమంలో స్త్రీలకు 'ప్రేమ' ఒక నిర్బంధపు చర్యగా మారి, ప్రేమని నిరాకరిస్తే అమ్మాయిల్ని హత్యచేసే విష సంస్కృతిగా మారిపోయింది... యాసిడ్ దాడులు కూడా యిందు లో భాగమే...

వరంగల్ యాసిడ్ దాడి సంఘటనలో ఐదుగురి విద్యార్థుల కుటుంబాలు ఎట్లా ధ్వంసమయ్యాయో మనందరికీ తెలిసిందే! వేగవంతమైపోయిన ఈ యుగంలో తల్లిదండ్రుల నుండి ప్రేమనీ, దగ్గరితనాన్నీ కోల్పోయిన యువత మితిమీరిన స్వేచ్ఛతో ఎట్లా అడ్డదారులు తొక్కుతున్నారో కూడా విదితమే... ఈ నేపథ్యంలో తమ శక్తిని ఉపయోగించుకుని వున్నతంగా ఎదగాల్సింది పోయి - చరిత్ర సృష్టించడం కోసం ఓ యువకుడు నేరాన్ని ఆధారం చేసుకుని మీడియాకెక్కడం నిజంగా ఎంత బాధాకరం... పాఠకుల్నీ, అధ్యా

పకుల్నీ, తల్లి దండ్రుల్నీ కూడా 'చరిత్రసృష్టిస్తా!' అన్న ఈ కథ ఆలోచింపచేస్తుంది.... ఈ సంపుటిలోని కథలన్నీ కూడా ఆలోచంప జేసేవే...

అమృతలతని ఒక రచయిత్రిగానో, విద్యా సంస్థల అధిపతిగానో, ఒక నాయకురాలిగానో, ఒక మెంటర్‌గానో అమృతలత, అపురూప పురస్కారాల స్థాపకురాలిగానో మాత్రమే గుర్తించలేం, ఎప్పుడయినా, ఏదయినా సంస్థ ఆమెకి పురస్కారాన్నివ్వాల్సి వస్తే 'ఆల్ ఇన్ వన్' అన్న ప్రత్యేక పురస్కారంతో ఆమెని సత్కరించాల్సి వుంటుంది. ఏమనిషిలోనైనా చెడుని పరిహరించి, మంచిని మాత్రమే తీసుకోగల రాజహంస ఆమె... ఆ కోణం నుండే ఈ కథల్ని చదవాల్సి వుంటుంది!

ఆమె కథలకు ప్రేరణ, భూమిక, ఆధారమూ, జవమూ, జీవమూ అంతా మానవ జీవితమే.. జీవితాన్ని మరింత సంస్కారవంతంగా, ప్రగతి శీలంగా దోపిడీ పీడనా రహితంగా మలుచుకోగలిగే స్పృహనూ, చైతన్యాన్నీ అందించే ఈ కథలను మీ అంతట మీరుగా చదివి నిగ్గు తేల్చుకోగలరు.

***తేదీ: 30-06-2017***

# కృతజ్ఞతలు



**డా॥ అమృతలత**

కథావస్తువును ఎన్నుకోవటంలో ప్రత్యేకత - రచనలో సూటిదనం, నిర్భీతి - కథనంలో పటుత్వం - పాఠకులను ఆలోచింపచేసేవిగా ఉంటాయి ఆయన రచనలు!

కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత **డా॥ అంపశయ్య నవీన్** గారు ఓపిగ్గా నా కథలన్నీ చదివి - ఈ కథాసంపుటి పై తన 'స్పందన'ని - 'ముందుమాట' లో వెలిబుచ్చారు. వారి పెద్దమనసుకి నా ధన్యవాదాలు.

కథ, కవిత్వం, వ్యాసం లాంటి ప్రక్రియల్లో విరివిగా రచనలు చేస్తూ - ఒక పుస్తకం ఆమూలాగ్రం చదివి, ఆ పుస్తకంపై పాఠకులకు ఆసక్తి కలిగించడంలో విశేష పట్టున్న ప్రతిభామూర్తి ప్రముఖ రచయిత్రి వి. ప్రతిమ 'స్పందన' కథాసంపుటికి 'ముందుమాట' రాసినందుకు నా కృతజ్ఞతలు.

బాబు గీసిన ముఖచిత్రం, వివిధ కథలకి బాలి, సుబాని, త్రిగుణ్, ధర్, కె. బాబు, కవిత మరియు ఉమ గీసిన చిత్రాలు ఈ పుస్తకానికి మరింత నిండుదనం చేకూర్చాయి.

విజయ్ విద్యాసంస్థల నిర్వహణలో.... ఒక దశాబ్దం పాటు మరుగున పడిపోయిన నా రచనా వ్యాసంగం మీద మక్కువతో - నాతో పోరి - నన్ను ఒప్పించి, ఈ **'స్పందన'** కథల సంపుటికి శ్రీకారం చుట్టిందీ - ఇది అందంగా రూపుదిద్దుకునేదాకా అహర్నిశలూ కృషిచేసిందీ - మాటవరుసకైనా పరుల గురించి నెగెటివ్ మాట్లాడని మిత్రులు,

నిష్కల్మష హృదయులు ఎ. శంకర్ గారు. వారికి నా కృతజ్ఞతలు.

పుస్తక ప్రచురణలో అన్నిటికన్నా కష్టమైందీ... పంటికింద రాయిలా బాధించేదీ... ఆయా పుస్తకాల్లో అనుకోకుండా దర్శనమిచ్చే అచ్చుతప్పులు ! ప్రూఫ్ రీడింగ్ ద్వారా నా పుస్తకాన్ని జల్లెడపట్టి - అచ్చుతప్పుల్ని ఏరిపారేసే కార్యక్రమాన్ని ఓపిగ్గా నిర్వహించింది నా ఫ్రెండ్స్ తుర్లపాటి లక్ష్మి, కిరణ్‌బాల, ఎ. తారా చౌదరి, కె. విజయలక్ష్మి మరియు ఎ. శంకర్.


వారి సహాయం వెలకట్టలేనిది.

వారందరికీ నా కృతజ్ఞతలు !

రాత్రింబవళ్ళూ కృషిచేసి - ఎంతో ఓపికగా డీ.టీ.పీ చేసి పెట్టి - దీనికో అందమైన ఆకృతినిచ్చిన కృష్ణపతి, మదన్ ల సహకారం మరువలేనిది!

ఈ కథలు ప్రచురించిన ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, మయూరి, స్వాతి తదితర పత్రికాధిపతులకు నా నమోవాకాలు! ఇవి వివిధ పత్రికలలో ప్రచురింపబడినపుడు- స్పందించి, తమ అమూల్య అభిప్రాయాల్ని వెలిబుచ్చిన పాఠకులకి నా ప్రత్యేక ధన్యవాదాలు.

ఇంకెందరో మహానుభావులు ! అందరికీ వందనాలు !!



01-09-2017


# కథల క్రమం


| | | | |
|---|---|---|---|
| 1. | హమేషా... మజాగా....! | ('ఆంధ్రభూమి' వీక్లీ, 17-11-2016) | 1-10 |
| 2. | చరిత్ర సృష్టిస్తా! | ('ధిక్కార' కథాసంకలనం - 2014) | 11-14 |
| 3. | ఆత్మీయ స్పర్శ | ('ఆశాదీపం' కథాసంకలనం - 2014) | 15-20 |
| 4. | టెంప్టేషన్ | ('ఆంధ్రభూమి' వీక్లీ, 7-11-2013) | 21-33 |
| 5. | నా సరి నీవని... నీ సరి నేనని... | ('భూమిక' మంత్లీ, జనవరి-2013') | 34-44 |
| 6. | పొదరిల్లు మాది! | 'వందేమాతరం' - శతజయంతి ఉత్సవాలు-(2005) | 45-48 |
| 7. | కీ | (2004) | 49-53 |
| 8. | నేను సైతం | ('ఆంధ్రభూమి' వీక్లీ, 3-12-1992) | 54-60 |
| 9. | అన్‌రెస్ట్ | ('ఆంధ్రభూమి' మంత్లీ, 19-10-1989) | 61-79 |
| 10. | ఇదోరకం ముష్టి ! | ('కేకలు' వీక్లీ, నవంబర్ - 1987) | 80-83 |
| 11. | స్పందన | ('మయూరి' వీక్లీ, 25-10-1985) | 84-99 |
| 12. | కాలని తెప్ప | ('ఆంధ్రజ్యోతి' వీక్లీ, 12-2-1982) | 100-113 |
| 13. | స్వీట్ నాన్సెన్స్ | ('ఆంధ్రజ్యోతి' వీక్లీ, 13-4-1979) | 114-127 |
| 14. | అంతుబట్టని ఆంతర్యాలు | ('ఆంధ్రజ్యోతి' వీక్లీ, 7-3-1975) | 128-141 |
| 15. | ఆమె నవ్వు | ('ఆంధ్రజ్యోతి' వీక్లీ, 20-7-1973) | 142-152 |
| 16. | కన్నీళ్ళతో కాలక్షేపం | ఉస్మానియా విద్యార్థి కథా సంకలనం (ఎమెస్కో ప్రచురణ: మే-1971) | 153-168 |
| 17. | మనసు ఎదగని మనుషులు | ('స్వాతి' మంత్లీ, ఏప్రిల్-1971) | 169-181 |
| 18. | ఆశయాలూ - ఆదర్శాలూ | ('ఆలిండియా రేడియో' - 13-9-1970) | 182-191 |
| 19. | కాలం వెక్కిరించింది! | (విమెన్స్ కాలేజీ మ్యాగజైన్ - 1969) | 192-201 |
| ★ | స్పందన | (పాఠకుల లేఖలు) | 202-206 |

# హమేషా... మజాగా...



2016



ప్లాట్‌ఫాం మీదికి అప్పుడే వచ్చి ఆగింది అజంతా ఎక్స్‌ప్రెస్.

“ట్రెయిన్ ఇక్కడే ఆగుతుంది. మీరిక్కడే వుండండి !” అని చెప్పి వెళ్ళిపోయిన కూలీ జాడేలేదు! ఈసురోమని దంపతులిద్దరం మా

లగేజీ మేమే మోసుకుంటూ ట్రెయి నెక్కాం!

లగేజీ అంతా సీట్లమీద పడేసి - "ఇప్పుడే వస్తాను శాంతీ! సామాన్లు జాగ్రత్త!" అంటూ ట్రెయిన్ దిగి వెళ్లిపోయారు మా శ్రీవారు.

ఎక్కేవాళ్ళతో, దిగేవాళ్ళతో కంపార్ట్మెంటంతా గోల గోలగా - చేపల మార్కెట్లా వుంది. పది నిమిషాలు గడిచాయి. 'లగేజీ సర్దకుండా ఈయన ఎక్కడికి వెళ్ళినట్టు? పుస్తకాల పిచ్చికదా - ఏ హిగ్గిన్ బాదమ్స్లోనో దూరుంటారు!' కిటికీ ఊచలగుండా ఆయన కోసం బయట కలయచూస్తూ అనుకున్నాను.

"మేడమ్! ఈ సీట్ల మీదున్న మీ సామాన్లు తీసేస్తే నేనిక్కడ కూర్చోగల్గుతాను!"

మర్యాద ఉట్టిపడ్తోన్న స్వరం విన్పించి, వెనక్కి తిరిగాను.

మెరుపుతీగ లాంటి ఓ అందమైన అమ్మాయి నవ్వుతూ కన్పించింది!

"నాకు తెలుసు - మీరు ఎవరికోసమో బయటికి చూస్తున్నారని! కాసేపు నించునే ఓపిక లేదని కాదుగానీ... వచ్చీపోయే వాళ్ళందరికీ తోవలో అడ్డుగా వున్నాననీ!" సంజాయిషీగా చెప్పింది ఆమె.

"అయాం సారీ" అంటూ సీట్ల మీదున్న మా సామాన్లు తీసి - సీట్ల కింద సర్దబోతూంటే - తనూ సాయంచేసి - మా ఎదురు బెర్త్ కిటికీ పక్కనున్న సీట్లో కూర్చుంది.

మాటల సందర్భంలో తనది లోయర్ బెర్త్ అని తెలిసి ఉసూరుమ న్నాను.

ఇరవయ్యేళ్ళ అమ్మాయికేమో లోయర్ బెర్త్. ఈ అరవై అయిదేళ్ళ వయస్సులో నాకు మధ్యబెర్త్... డెబ్బయ్యేళ్ళ వయసులో మా ఆయనకి పై బెర్త్.

'ఛ! ఏమ్మనుషులో ? టిక్కెట్లిచ్చేప్పుడు కనీసం వయసుని కూడా దృష్టిలో పెట్టుకోరు!' రైల్వే వాళ్లని తిట్టుకున్నాను.

ఈయన ఇంకా రాలేదు. ఎక్కడున్నారో?

ఎదురుగా ఆ మెరుపుతీగ పక్కనున్న మిగతారెండు సీట్లూ... సైడ్ బెర్త్స్ రెండూ... మా వరుసలో కిటికీ పక్కనున్న మరో సీటూ... మొత్తం ఐదు సీట్లూ ఖాళీగానే కన్పించాయి.

'ఫర్లేదు - ఐదు సీట్లల్లో ఎవరూ లేదు' అని సంతోషించేలోపు-

“ఇవిగో మన సీట్లు ఇక్కడున్నాయి జానకీ!” అంటూ లోపలికి వచ్చి - ఆ మెరుపుతీగ పక్కనున్న సీట్లలో ఆ చివర వచ్చి కూర్చున్నాడు ఓ షావుకారు. కూడా వచ్చిన జానకి ఆ షావుకారికీ - మెరుపుతీగకీ - మధ్యలో కూర్చుంది.

ఆ దంపతుల ఆకారాలు చూసి నా ఆశలు ఆవిరయ్యాయి! పై బెర్త్‌లోకి వీళ్ళేం ఎక్కగలరు? వీళ్ళ కన్నా నేనే నయం!

ఇంతలో -

‘అమ్మా! మీ వరుసలో ఆ కిటికీ పక్కనున్న సీట్ నాది!’ చెప్పాడు అప్పుడే వచ్చిన ఓ గళ్ళచొక్కా నన్నుద్దేశించి.

నేను కిటికీ పక్కనుంచి జరిగి, ఆ అబ్బాయికి చోటిచ్చాను.

ఇక మిగిలినవి సైడ్ బెర్త్స్.

‘దేవుడా దేవుడా - కనీసం ఈ సైడ్ బెర్త్ అయినా - ఏ కాలేజీ పిల్లలదో అయితే బావుండు’!

ఇంతలో ఆదరాబాదరాగా ఇద్దరబ్బాయిలు ఓ ముళ్ళపంది జుట్టూ, మరో టీషర్టూ వచ్చి - “ఇదిగో... మన సీట్లు ఇవేరా!” అంటూ సైడ్ బెర్త్ సీట్లలో కూర్చున్నారు.

‘అమ్మయ్య! ఈ అబ్బాయిల్లో ఎవర్దో ఒకర్ది కింది బెర్త్ అయి వుంటుంది! కుర్రాళ్ళు కదా - బతిమాలితే కనీసం నా ఒక్కదానికైనా కింది బెర్త్ ఇచ్చి, పై బెర్త్‌లో సర్దుకుంటారు! అంతగా అయితే - మా వారు గళ్ళ చొక్కాని బతిమాలుకుంటార్లే’ అని ఆశపడ్డాను.

ట్రెయిన్ కొంచెం ముందుకు కదిలింది. ఇంకా ఆయన రాడేం? నాలో టెన్షన్!

“శాంతీ! ఇదిగో నీకిష్టమైన ‘భక్తి’ పుస్తకం!” అంటూ మా వారు ఆయాసంగా రొప్పుతూ వచ్చి - ఏ పసిపిల్లాడినో పదిలంగా మోసుకొచ్చినట్టు ఓ పుస్తకాల కట్టని తన ఒళ్ళో వేసుకుని - నా పక్కన కూర్చున్నారు.

‘హమ్మయ్య!’ నా గుండె కుదుటపడింది.

‘ట్రెయిన్ బయల్దేరేంత వరకూ ప్లాట్‌ఫాం మీద పుస్తకాలు కొంటూ - కుర్రాడికి మల్లే పరుగున వచ్చి - కదిలే ట్రెయిన్ ఎక్కడం ఈ వయసులో అవసరమా? ఏ కాలో చెయ్యో విరిగితే...’ కోపం వచ్చింది!

రైలు స్పీడందుకుంది!

"మేము షిర్డీ వెళ్తున్నాం! అమ్మాయ్.... మీరెక్కడిదాకా?" మెరుపుతీగతో మాటలు కలిపింది జానకి.

"నిజామాబాదు ఆంటీ!" నవ్వుతూ బదులిచ్చింది ఆ అమ్మాయి.

పుస్తకాలు కొనడం - అందరికీ పంచి పెట్టడం ఆయనకో సరదా! రైల్లోనే కాదు - ఇంట్లోనూ ఇదే తంతు! ఇరుగు పొరుగు వాళ్ళకి తెల్లారేది ఈయన పుస్తకాలతోనే!

నాకు ఎప్పటికీ అర్థంగాని విషయం... సరదాల పేరిట వీకెండ్స్‌లో హోటళ్ల కోసం పది వేలయినా తగిలేసే జనం పుస్తకాల కోసం పట్టుమని పది రూపాయలైనా ఖర్చు చేయకపోవడం!

మానసికానందాన్నీ, మనోల్లాసాన్నీ, మనోవికాసాన్నీ కల్గించే పుస్తకాలపట్ల ఇసుమంతైనా ఆసక్తిచూపని మనుషుల్ని నేనెందుకో క్షమించలేను!

అందుకే - మావారు ఎన్ని పుస్తకాలు కొన్నా నేను ఆక్షేపించను. ముఖ్యంగా పుస్తకాల్ని ప్రేమించే మనుషులంటే నాకు వల్లమాలిన అభిమానం... ఆలోచిస్తున్నాను.

"ఇవిగో అమ్మా - మీ పుస్తకాలు..." అంటూ తన పుస్తకాల కట్టలోంచి కొన్ని పుస్తకాలను ఆ అమ్మాయికి అందించారు మావారు.

ఆ మెరుపుతీగ మాటతీరూ, మర్యాద, మన్ననా నాకు బాగా నచ్చాయిగానీ... ఆ పిల్లకూడా అందరిలాగే మావారి పుస్తకాలు తీసుకోవడం నాకు నచ్చలేదు.

నా భావాలు పసిగట్టినవాడిలా - "హిగ్గిన్ బాదమ్స్‌లో నేను పుస్తకాలు కొంటూంటే... ఈ అమ్మాయి అక్కడికి వచ్చింది శాంతీ! ఆ రష్‌లో ఆమె కొనుక్కోలేకపోయింది. దానికి తోడు ఇదిగో నీ పక్కన కూర్చున్నాడే... ఆ గళ్ళ చొక్కా కుర్రాడు ఆమె వెన్నంటే వచ్చి - 'మీకేం పుస్తకాలు కావాలి మేడం?' అంటూ బాగా సతాయించాడు. ఆ అమ్మాయిది మన కోచేనని తెలిసి - 'నేను తెస్తా - నువ్వెళ్ళమ్మా' అని చెప్పి పంపించాను" అంటూ నాకు మాత్రమే విన్పించేలా చెప్పారు మా వారు.

ఆ అమ్మాయి పుస్తకాన్ని చదవడంలో మునిగిపోయింది! నేను కదిలే రైల్లో పుస్తకాలు చదవలేను, అందుకే సైలెంట్‌గా అందర్నీ గమనిస్తున్నాను.

సైడ్ బెర్త్‌లో వున్న అబ్బాయిలిద్దరూ ఆ అమ్మాయిని ఓరకంట చూస్తూనే వున్నారు.

'ఆడవాళ్లకే మోహం కల్గించే అందం ఆమెది! పాపం మగాళ్లు ! అందునా కుర్రాళ్లు! కేవలం చూపులే కదా! చూడనీ... ఏం పోయింది?' నవ్వుకున్నాను.

"మీ పుస్తకం చూసిస్తాను. ఒకసారి ఇస్తారా ప్లీజ్?" అడిగాడు నా పక్కనున్న గళ్ళచొక్కా కుర్రాడు.

వాళ్ళలో ఒక్కరి చేతుల్లోనూ పుస్తకాల్లేవు.

ఏ పుస్తకాన్నివ్వాలా అని మా వారు తలెత్తి చూశారు.

కాని... ఆ కుర్రాడు అడిగింది మావారిని కాదు - చేతిలోని పుస్తకం మూసి, కిటికీలోంచి బయటకి చూస్తూ... ఏదో ఆలోచిస్తోన్న ఆ అమ్మాయిని!

ఆ అబ్బాయి వాలకం చూస్తే - ఏదో మిషమీద ఆ అమ్మాయితో మాటలు కలపాలని చూస్తున్నట్టుగా అన్పించింది!

మొహమాటపడుతూనే ఆ పుస్తకాన్నిచ్చిందామె.

ఓ అయిదు నిమిషాలు ఆ పుస్తకాన్ని ఇటూఇటూ తిరగేసి -

"రియల్లీ యూ ఆర్ గ్రేట్!" మాటలు కలిపాడు గళ్ళ చొక్కా తన ఎదురుగా కూర్చున్న మెరుపు తీగతో...

ఆ అమ్మాయి భృకుటి ముడివడింది.

"వావ్! ఎన్ని పుస్తకాలు కొన్నారండీ! ఎంతైనా మీలాంటి పుస్తకాల పురుగులే కదా పత్రికా రంగానికి మహారాజ పోషకులు! మాలాంటి వాళ్ళం ఏదో తేరగా దొరికితే చదవాలనుకుంటాం తప్ప, పుస్తకాలు కొనడానికి పైసా విదిల్చం!"

సంభాషణ పట్ల మెరుపుతీగ ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు, అయినా గళ్లచొక్కా ఆమెని వదిలి పెట్టడంలేదు.

"మీలాంటి వాళ్ళని ఆ పత్రికాధిపతులూ, ప్రచురణ కర్తలూ ఘనంగా సత్కరిస్తే తప్ప రీడర్షిప్ పెరగదు - కదా అంకుల్!" పలకరించాడు గళ్ళచొక్కా మా వార్ని.

ఆయన నవ్వి వూరుకున్నారు.

"పోనీ మీ పేరైనా తెలుసుకోవచ్చా?" పట్టు వదలని విక్ర

మార్కుడిలా ఆ అమ్మాయితో మాటలు పొడిగిస్తూనే వున్నాడు.

సైడ్ బెర్త్‌లో కూర్చున్న టీషర్ట్, ముళ్ళపంది జుట్టు కుర్రాళ్ళు... చెవులు రిక్కించారు...

"పుస్తకాల పురుగు!" టకీమని బదులిచ్చింది మెరుపు తీగ.

'ఫర్లేదు! పిరిగ్గొడ్డు కాదు! గడుసు పిండమే! అడపిల్లలంటే అదీ అలా వుండాలి!' మనసులోనే మెచ్చుకున్నాను ఆ అమ్మాయిని.

"అమ్మయ్య! నోరు విప్పిందిరోయ్!" కిసుక్కుమన్నాడు సైడ్ బెర్త్‌లో కూర్చున్న టీషర్ట్.

"అవున్రా!" వంత పాడాడు ముళ్ళపంది జుట్టూ.

"కొంతమంది అమ్మాయిలు అంతే బ్రదర్స్! మాట్లాడతేనే మైలపడిపోయినట్టు బిగదీసుక్కూర్చుంటారు!" అన్నాడు గళ్ళచొక్కా.

"మిస్! ఇంతకీ - మీ సొంతూరు నిజామాబాదేనా?"

మీకెందుకన్నట్టుగా చిరాగ్గా ముఖం పెట్టింది ఆమె.

"అది కాదండీ... మా బంధువుల ఇంట్లో ఎక్కడో మిమ్మల్ని చూసినట్టుగా వుంటేనూ..." నసిగాడు.

ఆమె మాట్లాడలేదు!

"నేనూ నిజామాబాదులోనే దిగుతాను - స్టేషన్‌కి మా కారొస్తుంది. మన ట్రెయిన్ గంట లేటంటున్నారు. మనం నిజామాబాదు చేరేసరికి ఎంతలేదన్నా రాత్రి పదవుతుంది! మీరుండేది ఏ స్ట్రీట్‌లోనో చెప్తే మిమ్మల్ని ఇంటిదాకా దిగబెడతాను" చెప్తున్నాడు గళ్ళచొక్కా.

ఇహ లాభంలేదు. వీడు లిమిట్స్ ఎక్సీడవుతున్నాడు. వీడినుండి ఈ అమ్మాయిని ఎలాగైనా రక్షించాలి!

"నీకా శ్రమ అక్కర్లేదు బాబూ! ఆ అమ్మాయి ఎవరో కాదు... మా దూరపు బంధువులు. వాళ్ళ నాన్నగారు వస్తానన్నారు స్టేషన్‌కి!" అడ్డుపుల్ల వేసాను!

గళ్ళచొక్కా ఒక క్షణం నావేపు చిత్రంగా చూసి... ఎందుకో తనలో తానే నవ్వుకున్నాడు.

కానీ... గళ్ళచొక్కాకి తను కన్పించకుండా - ఓ పుస్తకం అడ్డుపెట్టుకొని అచ్చు మహానటి సావిత్రిలా ఓ పెదవి విరుపుతో నాకు 'థ్యాంక్స్' చెప్పి, లేచి రెస్ట్ రూమ్స్ వైపు నడిచింది ఆ మెరుపుతీగ.

‘‘మనం కూడా అలా వెళ్ళొద్దాం పదరా!’’ లేచాడు టీషర్ట్, ఫాలో అయ్యాడు ముళ్ళపంది జుట్టు.

వెళ్తోన్న మెరుపు తీగని ఓ సారి తేరిపారచూసి -

‘‘ఆ అమ్మాయి ఎవరోగానీ కుందనపు బొమ్మలా వుంది కదండీ! మన పెద్దోడికి ఇలాంటి అమ్మాయి దొరికితే బావుండు’’ జానకి భర్తతో మాట్లాడుతూనే - ‘‘ఆ అమ్మాయి... మీ దూరపు బంధువులన్నారు కదా... ఏం చదువుతోందేమిటి?’’ అడిగింది నన్ను...

నా సమాధానం ఆశించకుండానే మళ్ళీ మొదలెట్టింది -

‘‘అందం, చదువూ అన్నీ వున్న ఆడపిల్ల దొరకాలంటే ఎలా చెప్పండి! ఏంటో మా వాడు ఎవర్ని చూసినా ఏదో వంక దాటేస్తున్నాడు! ఇప్పటికే ముప్పై నిండాయి. అసలు నేనీజన్మలో వాడి పెళ్ళి చూస్తానో... లేదో?’’ జానకి మాటల్లో దిగులు తొంగి చూస్తోంది.

ఏదో పనున్నట్లు లేచి వెళ్ళబోతూ - ‘‘మీ వాడికోసం పేరయ్య నవుతాను! ఆ అమ్మాయిని ఒప్పించమంటారా ఆంటీ?’’ అడిగాడు గళ్ళచొక్కా.

జానకి కళ్ళల్లో దిగులు మాయమైంది. అంతలోనే-

‘‘కానీ... ఏ కులమో - ఏమో?’’ మరో దిగులు మొదలైంది ఆమెకి.

గతుక్కుమన్నాను.

‘ఈ కులాల గొడవేమిట్రా దేవుడా - ఇప్పుడు ఆవిడ మా కులం అడుగుతుందేమో!’

‘‘అయినా కులం ఏదైతేనేం... అమ్మాయి బంగారపు బొమ్మలా వుంది! మా వాడు కాదనడు! బాబ్బాబూ నీకు పుణ్యం వుంటుంది... అడుగు తండ్రీ! ఆ అమ్మాయి ఒప్పుకుంటే అదే పదివేలు!’’ అడిగింది జానకి మరింత ఆశగా.

‘‘సర్లేమ్మా!’’ అంటూ జేబులోంచి సెల్‌ఫోన్ తీసి -

ఎవరికో డయల్ చేసి - ‘‘మా ట్రైయిన్ గంటన్నర లేటంటున్నారు! మా కోసం చూడకుండా - నువ్వు భోంచేసి పడుకోమ్మా!’’ అంటూ - మెరుపుతీగ, ముళ్ళపంది జుట్టు, టీషర్టు

కుర్రాళ్ళు వెళ్ళిన వైపు నడిచాడు గళ్ళ చొక్కా.

ఆ మెరుపుతీగనీ ఆ ముగ్గురూ కలిసి ఏం సతాయిస్తారో అన్పించి - "మీరూ వెళ్ళండి" అంటూ పక్కన వున్న మా వారి చెయ్యి గిల్లాను.

మా వారు లేచేలోపు - ఆ అమ్మాయి తిరిగి రావడం చూసి 'హమ్మయ్య' అనుకున్నాను.

కాస్సేపటికి గళ్ళచొక్కా వచ్చి కూర్చుంటూ -

"మేడమ్! మీరేమనుకోనంటే చిన్న మనవి!" అడిగాడు ఆ అమ్మాయిని.

ఆ అమ్మాయి బదులివ్వలేదు.

"ఏంలేదూ... మీ పక్కన కూర్చున్న ఆంటీకి మీరు బాగా నచ్చారట.... వాళ్ళబ్బాయి..."

మెరుపు తీగ కొరకొరా చూసింది.

"మెడిసిన్ చదువుతున్నాడట... కట్నం తీసుకోరట... బాగా వున్నవాళ్ళట!"

నాకు అరికాలి మంట నెత్తికెక్కింది.

ఆ మెరుపుతీగ అంత కూల్‌గా వుండటం నాకెందుకో నచ్చట్లేదు.

"పైగా పదికిలోల బంగారం కూడా పెడ్తారట!"

"మిస్టర్! మైండ్ యువర్ ఓన్ బిజినెస్!" సీరియస్‌గా వార్నింగిచ్చింది మెరుపుతీగ.

నా మనస్సు శాంతించింది.

నిజామాబాద్‌లో ట్రెయిన్ ఆగింది. మెరుపుతీగ తన సీటుకిందున్న సామాన్లు తీసుకుని ట్రెయిన్ దిగడానికి లేచి నిల్చుంది. నా వైపు తిరిగి "ఆంటీ - బై!" అంటూ ట్రెయిన్ దిగింది.

గళ్ళచొక్కా మెరుపు తీగని ఉద్దేశించి - "మేడమ్! మరిచి పోకండి! మీ ఆంటీ వాళ్ళ కారు రాకపోతే - బయట పార్కింగ్‌లో నా కారుంది. మిమ్మల్ని డ్రాప్ చేస్తాను!" అంటూ ఆమెని అనుసరించాడు.

"అమ్మాయ్! ఇదిగో నా సెల్‌ఫోన్ నంబర్. అవసరమైతే ఫోన్ చెయ్" అంటూ అమె చేతిలో ఓ స్లిప్ పెట్టాను.

''థాంక్యూ ఆంటీ! సీయూ - బై'' అంటూ ట్రెయిన్ దిగింది మెరుపుతీగ.

'ఇంకెవరూ ఇక్కడ ఎక్కకపోతే బావుణ్ణు - హాయిగా పడుకోవడానికి బెర్త్ దొరుకుతుంది' అనుకున్నాను.

కానీ... గళ్ళచొక్కా ఖాళీ చేసిన సీట్లో... ఓ నల్ల కళ్ళద్దాల కుర్రాడూ, మెరుపుతీగ ఖాళీ చేసిన సీట్లో... మరో అమ్మాయీ, బహుశః ఆ కుర్రాడి కుర్రది కాబోలు... కూర్చున్నారు!

''ఒరేయ్! అటు చూడ్రా!'' అంటూ ముళ్ళపంది జుట్టు ప్లాట్‌ఫామ్ వైపు చూపించాడు టీషర్టుకి.

'ఏమిటబ్బా?' అని నేనూ అటువైపు చూశాను.

మెరుపు తీగ నడుం చుట్టూ చెయ్యేసి, ఆమె చెవిలో ఏదో చెప్తున్నాడు గళ్ళచొక్కా. ఆమె నవ్వుతూ వింటూ అతనితో పాటు నడిచి వెళ్తోంది.

''ప్చ్! చూడండి! ఆ అమ్మాయిని వాడెలా బుట్టలో వేసుకున్నాడో?'' చెప్పాను మా వారికి ఆ దృశ్యాన్ని చూపిస్తూ దిగులుగా.

''బుట్టలో పడింది ఆ అమ్మాయి కాదు... మేడమ్! మీరే!'' అన్నాడు ఆ నల్ల కళ్ళద్దాల కుర్రాడు నవ్వుతూ...

నేను అయోమయంగా చూస్తుంటే -

''ఇందాక ట్రెయిన్ దిగి పోయిన జంట గురించా మేడమ్ మీ బాధ? వాడు నా ఫ్రెండ్! వాడెప్పుడూ అంతే, ఉత్త అల్లరోడు! బయటికి వస్తే చాలు... ఎవర్నో ఒకర్ని ఆట పట్టిస్తుంటాడు. పైగా అవి రొటీన్‌కి భిన్నంగా, కొత్తగా వుండాలని ఆశిస్తాడు! అందులో 'ఫన్' వుండాలని చూస్తాడు!''

అతడి మాటలకి అడ్డొస్తూ -

''ఒక్క మాట చెప్పనా ఆంటీ - వాళ్ళిద్దరూ భార్యాభర్తలు! మా పక్కింటి వాళ్ళే! ఆట పట్టించడంలో ఇద్దరూ సమవుజ్జీలే! ఈ రోజు వాళ్ళ మ్యారేజ్‌డే! పొద్దున హైదరాబాద్ వెళ్ళి - ఇదిగో మీతోపాటు ఈ ట్రెయిన్‌లో రిటర్న్ అయ్యారు!'' చెప్పింది ఆ కుర్రాడి కుర్రది.

నేను తెల్లబోయాను.

“వార్నీ...” మా వారిలో సంభ్రమాశ్చర్యాలు!

“ఛ! నాకిదేం బాగాలేదు!” అన్నాను మా వారికి మాత్రమే వినిపించేలా.

“అదేమిటీ?” ఆశ్చర్యంగా చూశారు మా వారు.

“ఫన్ కోసం కదా ఆమె తన భర్తతో చేతులు కల్పింది. అనుకోకుండా వాళ్ళ ఫ్రెండ్ మనకి తటస్థపడి - ‘వాళ్ళిద్దరూ భార్యభర్తలు’ అన్న విషయం చెప్పాడు కాబట్టి సరిపోయింది! కానీ అది తెలియనివాళ్ళు... ఆ అమ్మాయి పరాయివాళ్ళతో అలా వెళ్ళి పోయిందేమిటా అని అపార్థం చేసుకోరా?” అన్నాను బాధగా.

“మరీ అంత సున్నితంగా ఆలోచించకు శాంతీ! ఆ అబ్బాయిని చూస్తే ముచ్చటేస్తోంది నాకు... అంది వచ్చిన ప్రతి అవకాశాన్నీ సరదాగా, సరికొత్తగా - జీవితం మళ్ళీ అప్పుడే మొదలైందేమో అన్నంత యిష్టంగా, ఖుషీగా, మజాగా మలచుకొంటున్నాడు. నిజానికి మగాళ్ళంతా ఆ అబ్బాయిలా వుంటే - భార్యలందరూ ఎంతో సుఖ పడ్తారు! ఐ అడ్మయిర్ హిజ్ స్టైల్ ఆఫ్ ఎంటర్ టెయినింగ్ హిజ్ వైఫ్” అన్నారు మా వారు.

“అహఁ... అలాగా? మరి మీ సంగతేమిటి? ఎప్పుడు చూసినా... మౌన మునీంద్రుడిల్లా - ఓ మాటా ముచ్చటా లేకుండా... ఏదో లోకంలో వున్నట్టుంటారే!” అన్నాను ఉడికిస్తూ...

“మరి నువ్వేంచేస్తున్నట్లో... నేను పుస్తకాల్లో తలదూర్చి విశ్వామిత్రుడిలా తపస్సు చేస్తుంటే నువ్వలాగే చూస్తూ ఎందుక్కూర్చుంటావ్... మేనకలా భంగం కల్గించొచ్చుకదా!?” అన్నారు రెచ్చగొడ్తూ...

నా దృష్టి మా వారి బట్టతలపై పడింది.


‘తలలు బోడులైన తలపులు బోడులా...’ గుర్తొచ్చి, నవ్వొచ్చింది!

*‘ఆంధ్రభూమి’ వీక్లీ, 17-11-2016*

# చరిత్ర సృష్టిస్తా !



2014



'నేను చరిత్ర సృష్టిస్తాను!' కాలు మీద కాలేసుకుని దర్జాగా కాళ్ళూపుతూ చెప్పాడు నరేష్.

'నీ ముఖం! ఎస్సెస్సీ మూడుసార్లు ఫెయిల్ అయినవాడివి... నువ్వు చరిత్ర సృష్టించడమేమిటి?' గేలి చేశాడు రవి.

'బహుశ : వాడు మరో పదిసార్లు ఫెయిలై చరిత్ర సృష్టిస్తాడేమో లేరా?' నవ్వాడు గోపాల్.

గొల్లుమన్నారు మిత్ర బృందం.

'మీరలా నవ్వకండి ప్లీజ్! నవ్విన నాప చేను పండుతుందని మీకు తెలీదా? సీరియస్‌గా చెప్తున్నాను! చదువులో నేను మీతో సరితూగనేమో కానీ అన్నింట్లో అలాగేనని ఎందుకనుకుంటున్నారు? ఒక ఐడియా మనిషి జీవితాన్నే మార్చేస్తుందంటారు కదా! - మరి నన్నెందుకలా ఆట పట్టిస్తున్నారు?' కోపంతో నరేష్ ముక్కు పుటాలు అదిరాయి.

'అవున్లేరా- పాపం! వాణ్ణి ఎందుకలా ఎగతాళి చేస్తారు? ప్రపంచంలో ఎంతో మంది ఎన్నో రంగాల్లో పైకివచ్చి చరిత్ర సృష్టించారు! వారిలో అందరూ తెలివైన వాళ్ళే లేరు! కొందరు... అత్తెసరు మార్కులతో పాసయ్యారు. మరికొందరికి చదువే వొంటపట్టలేదు! అంతమాత్రాన వాళ్ళు జీవితంలో పైకి రాలేదా? లెటజ్ ఎంకరేజ్ హిమ్!' అన్నాడు ఆనంద్ సానుభూతిగా.

'సరే - మా మాటలకేంగానీ - ఇప్పుడు చెప్పు వింటాం, నువ్వెలా చరిత్ర సృష్టిస్తావో?' కుతూహలంగా అడిగాడు రవి.

'తినబోతూ రుచి అడగడం దేనికి? మీరే చూస్తారుగా!' ఊరించాడు నరేష్.

'సర్లే - ముహూర్తం ఎప్పుడో చెప్పు, ఎదురుచూస్తాం!' వస్తోన్న నవ్వునాపుకుంటూ అడిగాడు గోపాల్.

'ఎప్పుడో కాదు... రేపు... సరిగ్గా... ఇదే సమయానికి!'

'మరి చూడటానికి ఎక్కడికి రావాలో అది కూడా చెప్పు!'

'ఎక్కడికీ వద్దు! నేనే మీ ఇళ్ళకి వస్తాను!'

'మా ఇళ్ళకా?'

'అవును... మీ అందరి ఇళ్ళకీ వచ్చి చూపిస్తాను!'

'అందరి ఇళ్ళకీ ఒకేసారి వచ్చి ఎలా చూపిస్తావు, నాన్సెన్స్!' కొట్టిపారేశాడు గోపాల్.

'అదేరా సస్పెన్స్! మీరంతా నన్ను చాలా అండరెస్టిమేట్ చేస్తున్నారు! నా శక్తి ఏమిటో, సామర్థ్యం ఏమిటో రేపీపాటికీ మీకు తెలిసొస్తుంది!'

'చాల్లేరా... బడాయ్!'

'నిజం! కావాలంటే పందెం! నేనోడిపోతే... మీకు తలా వెయ్యి రూపాయలిస్తాను! కానీ... నేను గెలుస్తాను... మీరంతా మీమీ గుమ్మాల్లో పూలదండలతో రెడీగా వుండండి, నన్ను సన్మానించేందుకు!'

★★★

మర్నాడు... నరేష్ కోసం వెయిట్ చేస్తూ మిత్రులందరూ ఎవరింటి ముందు వాళ్ళు... అతడు చెప్పిన సమయానికి పూలదండలతో రెడీగా వున్నారు... నరేష్‌కి ఎట్లాగూ చరిత్ర సృష్టించే సీన్ వుండదనీ... పందెం తాలూకు డబ్బు ఎంచక్కా తలా వెయ్యి రూపాయలు అందుకోవచ్చనీ!

ఇంతలో... అందరి ఇళ్ళల్లో కలకలం!

గుమ్మం ముందు పూలదండల్తో నించున్న తమ పుత్రరత్నాల్ని కేకేస్తూ -

'అరేయ్! టీవీలో ఏం చెప్తున్నారో చూడండి! మీ ఫ్రెండ్ నరేష్...' పిలుస్తున్నారు తలిదండ్రులు.

ఒక్కుదుటున టీవీ హాల్లోకి వచ్చి పడ్డారు కొడుకులు.

తను ప్రేమించిన అమ్మాయి తనని ప్రేమించట్లేదని... ఆ యువతిపై అత్యాచారం చేసి, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించి - ఒక చేతిలో పెట్రోల్ డబ్బానీ, మరో చేత్తో ఆ అమ్మాయి శవాన్నీ... పోలీస్ స్టేషన్‌దాకా ఈడ్చుకొస్తూ- బాటసారుల్ని భయభ్రాంతుల్ని చేస్తూ -

'ఇదిగో... ఈ అమ్మాయికి నేనిష్టం లేదట! నేనుత్త పనికిమాలినవాడ్నట! పెట్రోల్ పోసి తగలబెట్టడానిక్కూడా పనికిరానివాణ్నా? ఎంత ధైర్యముంటే ఆ పని చేయాలి! ఓహో... ఎలక్ట్రానిక్ మీడియా వాళ్ళా? రండి... రండి! మీ కోసమే చూస్తున్నాను! మా ఫ్రెండ్స్ ఎన్నెన్నో మంచి పనులుచేశారు... కానీ... వాళ్ళు ఎప్పుడైనా టీవీల్లో కనిపించారా? నన్ను చూడండి... ఒక్క చెడ్డపని చేశా... అంతే పైసా ఖర్చు లేకుండా... పబ్లిసిటీ పొంది, ఎలా చరిత్ర సృష్టించానో!? రేయ్ ఫ్రెండ్స్... చెప్పినట్టే నేను గెలిచాను

కదా... నన్ను సన్మానించేందుకు పూలదండల్తో రండి! ఒరేయ్ పోలీసులూ... దగ్గరికి రాకండ్రా... దగ్గరికి వస్తే మీ మీద కూడా పెట్రోల్ గుమ్మరిస్తాను! మీరు నన్ను దండించేదేమిట్రా? ఇదిగో... నామీద నేనే పెట్రోల్ గుమ్మరించుకుంటున్నాను... బాబోయ్ మంటలు... వామ్మో మంటలు...' మంటల్లో దగ్ధమవుతూ కనిపించాడు నరేష్.

ఫ్రెండ్స్ చేతుల్లోని దండలు కిందబడ్డాయి. ఘోరం చూడలేక కళ్ళు మూసుకున్నారు.

'ఇన్నాళ్ళూ మనతో కలిసి తిరిగిన నరేష్... సైకోనా? సైకోల ప్లాన్ ఇంత పకడ్బందీగా వుంటుందా?' ఆశ్చర్యపోతున్నారు మిత్రబృందం.

'అమ్మాయిలూ... సైకోల పట్ల అప్రమత్తంగా వుండండి. వాళ్ళనో కంట కనిపెట్టి మెదలండి!' ఆరోజంతా టీవీల్లో న్యూస్ రీడర్ల అనౌన్స్‌మెంట్.

'అన్ని చానల్స్‌లో అదే న్యూస్! ఎంతసేపు చూస్తార్రా... ఆ దృశ్యాల్ని? ఇవి చూసే ఆ సైకోలందరూ మరింత పెట్రేగిపోతున్నారు. వీటి ప్రభావంతో మరో సైకో మరో చరిత్ర సృష్టిస్తాడు! కట్టెయ్యండ్రా ఆ టీవీల్ని!' గద్దించారు తలిదండ్రులు.


*(అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా...)*

***'ధిక్కార' కథాసంకలనం నుండి***

***2014***

# ఆత్మీయ స్పర్శ





2014

'ఒరేయ్ రవీ! నాకూ ఓ జాంపండు ఇవ్వరా?'

'సారీ రా... గోపీ! నా దగ్గర ఇదొక్కటే వుంది!' జాంపండు కొరుకుతూ చెప్పాడు రవి.

'మరి నీవొక్కడివే తింటావా? నాకు వద్దా?' అంటూ గబుక్కున రవి చేతుల్లోంచి జాంపండు లాక్కుని తుర్రుమన్నాడు గోపి!

'రేయ్! ఏంటా దూకుడు? వాడి జాంపండు వాడికిచ్చేయ్!' అంది అమ్మమ్మ వాడి జబ్బ దొరకబుచ్చుకొని.

'నేనివ్వను అమ్మమ్మా!'

'ఇస్తావా లేవా?' రెట్టించింది.

'ఇవ్వను!'

'ఏరా నీకే చెప్పేది. ఇచ్చెయ్!'

'ఊహుఁ!'

'గోపీ! చెప్పింది విను! వాడి పండు వాడికిచ్చెయ్!'

'పోనీలే బామ్మా! వాడు నాకన్నా చిన్నవాడుకదా! పాపం వాడికి తినాలనివుందేమో - తిననీ!' అన్నాడు రవి.

'నువ్వూరుకోరా రవీ!' అంటూ రవిని గదమాయించి; గోపీ వంక తిరిగి - 'నీకెన్నిసార్లు చెప్పాను గోపీ... ఎంగిలి తినడం మంచిదికాదని...' గుడ్లురుముతూ అంది అమ్మమ్మ.

'మరి మొన్న రవి నీ ముందే నేను తింటోన్న ఐస్‌క్రీం లాక్కుని తిన్నాడు కదా! అది ఎంగిలికాదా? నా ఎంగిలి తిన్నప్పుడు వాడ్ని నువ్వేమీ అన్లేదెందుకు మరి?'

'వాడి విషయం వేరు... నీ విషయం వేరు గోపీ. వాడితో నీకేంటి పోలిక?'

'అవును... నాకేంటి పోలిక? వాడు ఎంతైనా నీ కొడుకు కొడుకు... నేను నీ కూతురి కొడుకుని... వాడు నాకన్నా గొప్పవాడు. అంతేకదా అమ్మమ్మా?'

చెర్నాకోలాతో కొట్టినట్టుగా ఫీలైంది అమ్మమ్మ.

'అదికాదురా... చిన్న పిల్లల ఎంగిలి పెద్దవాళ్ళు తింటే ఫర్వాలేదు! కానీ... పెద్దవాళ్ళ ఎంగిలి చిన్న పిల్లలు తినకూడదు!'

'అబద్ధం! మొన్న నువ్వు తింటోన్న పెరుగన్నం వాడికి తినిపించావు! నువ్వు వాడికన్నా పెద్దదానివే కదా... మరి నీ ఎంగిలి అన్నం వాడికెలా తినిపించావు?'

'అదికాదురా...'

'అమ్మమ్మా! నువ్వెన్నైనా చెప్పు - నువ్వు నాతో ఒకలా వుంటావు... రవితో మరోలా వుంటావు! మమ్మల్నిద్దర్నీ ఒకేలా చూడవు! పైగా వాడితో ప్రేమగా వుంటావు... చక్కగా గోరుముద్దలు పెడతావు... అందులోంచి ఓ ముద్ద నాకూ పెట్టమంటే - గుడ్లురుమి చూస్తావు. నువ్వు నాకెప్పుడైనా అలా గోరుముద్దలు పెట్టావా? పైగా నా అన్నం నన్నే తినమంటావు! ఎంతైనా నీకు పార్షియాల్టీ అమ్మమ్మా!'

హతాశురాలైంది అమ్మమ్మ.

'అదికాదురా... అసలు విషయం...'

'నాకు తెలుసు అమ్మమ్మా... మా మమ్మీ ఇక్కడుండదు - అమెరికాలో వుంటుందనేగా... నువ్వు నన్ను పట్టించుకోవట్లేదు... నేనిక్కడుండను! అమెరికా వెళ్ళిపోతాను! ఇప్పుడే మా మమ్మీకి ఫోన్ చేస్తా - నన్ను అమెరికా తీసుకెళ్ళమని...' విసురుగా ఫోన్ దగ్గరికి వెళ్ళబోతోన్న గోపీని వారిస్తూ -

'గోపీ! ఎవరి గ్లాసులు, ఎవరి ప్లేట్లు వారికే వుండాలని... ఒకరి ప్లేట్లో మరొకరు తినొద్దని ఆ మధ్య మీ మమ్మీనే ఫోన్ చేసి చెప్పిందిరా... అందుకే...' అబద్ధం చెప్తున్నానన్న గిల్టీనెస్ తన ముఖంలో కనిపించనీకుండా జాగ్రత్తపడుతూ చెప్పింది అమ్మమ్మ.

'నో... మా మమ్మీ అలా చెప్పివుండదు! నువ్వే మా మమ్మీ పేరు చెప్పి నన్ను రవితో కలువనీయట్లేదు! ఈ ఇంట్లో రవి తప్ప వేరే పిల్లలెవరూ లేరు. నేను ఎవరితో ఆడుకోవాలి? మనింటికి పక్కింటి పిల్లలు రారు! నువ్వేమో మమ్మల్ని ఎవరింటికీ వెళ్ళనీవు! ఎందుకిలా చేస్తున్నావు అమ్మమ్మా? నాకు నీ మీద కోపంగా వుంది'.

'నీకు తెలీదురా... మన చుట్టు పక్కల పిల్లలు బాగా డబ్బున్నవాళ్ళ పిల్లలు! మనం లేనోళ్ళం... వాళ్ళు మిమ్మల్ని చిన్నచూపు చూడొద్దని గోపీ...' తత్తరపడ్తూ అంది అమ్మమ్మ...

'అబద్ధం! మన పక్కింటి నానిగాడు వాళ్ళ డాబా మీంచి రోజూ నన్ను చూసి 'హాయ్...' అంటూ చెయ్యూపుతాడు! వాళ్ళు అలాంటివాళ్ళు కారు.' అన్నాడు గోపి.

'నిజమేరా... నానిగాడు పసివాడు... వాడు దేవుడితో సమానం! కానీ వాడ్ని మనింటికి రానీయకుండా పక్కింటి ఆంటీ పొద్దస్తమానం తన డేగ కళ్ళతో ఎలా పహారా కాస్తుందో నీకేం తెలుసు... నీదీ పసి మనసేగా?' అమ్మమ్మ మనసు బాధగా మూలిగింది. పైకి గోపీతో ఏమీ అనలేదు.

'ఈ ఇంట్లో... రవి తప్ప నాతో ఆడుకోవడానికి ఎవరున్నారు? కానీ - వాడితో నన్ను కలవనీవు! నాకేమైనా జబ్బు చేసిందా

అమ్మమ్మా - నువ్వెందుకిలా చేస్తున్నావు?' ఏడుపు లంకించుకు న్నాడు గోపి.

'నీకేం జబ్బు నాయనా! నువ్వు బంగారం!' అమ్మమ్మ నచ్చచెప్పబోయింది...

'నా ఫ్రెండ్సందరూ వాళ్ళ తమ్ముళ్ళతో, అన్నయ్యలతో, మమ్మీ లతో... సినిమాలకీ, పిక్నిక్కులకీ వెళ్తుంటారు! మా మమ్మీ ఇక్కడ లేదు... కనీసం నన్ను రవితోనైనా ఆడుకోనీవా అమ్మమ్మా?' గోపి కళ్ళలో నీళ్ళు...

అమ్మమ్మ విలవిల్లాడిపోయింది.

'నాకు ఇంట్లో బోర్ కొడ్తోంది... ఇక నేనిక్కడ వుండను! అమెరికా వెళ్ళిపోతాను! మా మమ్మీకిప్పుడే ఫోన్ చేస్తాను...' అంటూ విసురుగా ఫోన్ దగ్గరికి పరిగెత్తి టక టకా నెంబర్లు కలిపాడు.

అటునుండి నో రెస్పాన్స్! చేసీ చేసీ విసుగొచ్చి ఫోన్ రిసీవర్ గోడకి విసిరికొట్టి, కోపంగా వెళ్ళి బెడ్‌రూంలో దూరాడు గోపి.

★★★

'అమ్మా! నిన్న అర్ధరాత్రి - నువ్వు నిద్రపోయాక... గోపీ ఫోన్ చేసాడు. నువ్వు వాణ్ని రవితో కలిసి ఒకే రూంలో నిద్రపోనివ్వట్లే దనీ... కనీసం కలిసి ఆడుకోనివ్వట్లేదనీ... అలా... ఏవేవో... తన బాధలు చెప్పుకున్నాడు...' కూతుర్నుండి ఫోన్!

'చూడు బిడ్డా... విచ్చలవిడి తిరుగుళ్ళ ఫలితంగా చెట్టంత కొడుకూ, వాడి మూలంగా కోడలూ నా కళ్ళెదుటే పోయారు! ఒక్కగానొక్క వంశాంకురం రవి! పుట్టినప్పుడే తల్లి నుండి ఆ మాయదారి జబ్బు సంక్రమించి, వాడూ... ఇవాళో... రేపో... అన్నట్టున్నాడు. నువ్వు నీ వెంట అమెరికా తీసుకెళ్ళడం వీలుగాక... నీ కొడుకునిక్కడ ఇండియాలో వదిలి వెళ్ళిపోయావు! వాడు రవితో కలిసి పెరగడం వల్ల గోపీక్కూడా ఏమవుతుందోనని అనుక్షణం చస్తూ బతుకుతున్నాను తల్లీ!'

'అమ్మా! నువ్వింకేం మాట్లాడకు! రవి... హెచ్.ఐ.వీ. నాల్గోదశలో వున్నాడని మనిద్దరికీ తెలుసు! వాణ్ని ఎవరూ అదోలా

చూడొద్దనీ... వాడు బతికి వున్నన్నాళ్ళూ నవ్వుతూ తుళ్ళుతూ వుండాలని నేనాశిస్తే... నువ్విలా వివక్ష...'

'కానీ బిడ్డా...'

'ఇక నేనేం వినదలుచుకోలేదు! అమ్మా! రవి విషయం తెలిసి గోపీని ఎక్కడ నువ్వు నాతోపాటు అమెరికా తీసుకెళ్ళమంటావోనని... నాకిక్కడేదో పెద్ద ఉద్యోగం వచ్చిందనీ... సెలవులు దొరకట్లేదనీ... ఇన్నాళ్ళూ నీతో అబద్ధమాడుతూ వచ్చాను! అన్నయ్య రక్తం పంచుకు పుట్టిన రవి ఎవరి ఛీత్కారాలకీ గురికావద్దని... వాడికి తోడుగా గోపీ వుంటాడని... వాడ్ని ఉద్దేశపూర్వకంగా - ఇండియాలో నీ దగ్గర వదిలి పెట్టి వచ్చాను! కానీ... నువ్వేం చేసావు...?'

'అదికాదు బిడ్డా... రవి పరిస్థితి ఇవాళో రేపో.... అన్నట్టుగా వుంది. వాడు ఎలాగూ దక్కడు! కానీ వాడి జబ్బు వీడికి ఎక్కడ సోకుతుందో అన్నదే నా భయం. కనీసం నీ బిడ్డనైనా రక్షించుకోవాలన్నది నా తాపత్రయం తల్లీ... ఓ వైపు రవికి తన జబ్బేమిటో తెలీకుండా నేను జాగ్రత్త పడాలి... మరో వైపు వాడి జబ్బు సోకకుండా గోపీని కాపాడుకోవాలి... నా పరిస్థితి అడకత్తెరలో పోకలా... '

'అమ్మా...' గట్టిగా అరిచింది కూతురు.

'గోపీ నా బిడ్డ! నాకు లేని బాధ నీకెందుకు? అది అంటురోగం కాదు... కలిసి భోంచేయడాలూ, ఎంగిలి తినడాలూ, ఒకరి చేతులు మరొకరు పట్టుకోవడాలూ... ఒకరి జబ్బుని మరొకరికి అంటించేలా చేయవు...'

'చూడు బిడ్డా... గోపీ నీకు ఒక్కగానొక్క బిడ్డ... వాడికేదైనా అయితే...'

'ఏమీ కాదమ్మా! ఆ విషయంలో నువ్వు నిశ్చింతగా వుండు. అసలు నువ్వు ముందుగా రవి జబ్బు గురించి గోపీకి చెప్పాల్సింది. వాడిది చిన్న బుఱ్ఱ కదా... నీ భయం అర్థం చేసుకోలేక నీ మీద ఎన్నో అపోహలు పెంచుకున్నాడు. అందుకే... గోపీకి నిన్న రాత్రి అసలు విషయం చెప్పాను. రవి ఎక్కువ రోజులు బతకడన్న నిజం కూడా వాడికి చెప్పేసాను.'

తల్లి మనసు తేలికైంది!

'వాడు వెక్కి వెక్కి ఏడ్చాడు... రాత్రి ఎప్పుడు నిద్ర పోయాడో తెలీదు! కనీసం... ఈ రోజునుండైనా... ఇంట్లో రవితో కలసిమెలిసి తిరిగే వాతావరణం గోపీకి కల్పించు! నాకు తెలుసు... నీ మనసులోని భయం... కానీ ఈ దశలో రవికి దక్కాల్సింది ఓ ఆత్మీయ స్పర్శ... చల్లని పలకరింపు! అఫ్‌కోర్స్... అవి రవికి నువ్వు పుష్కలంగా అందిస్తున్నావు, కాదనను...'

తల్లి ఊపిరి పీల్చుకుంది!

'కానీ అమ్మా... రవికి అదొక్కటే చాలదు! తన తోటి పిల్లల కర స్పర్శలు కావాలి. వారితో ఆటపాటలు కావాలి! అవి వాడిలో జీవితేచ్ఛని కలిగిస్తాయి... లైఫ్‌స్పాన్‌ను పెంచుతాయి! నువ్వు గోపీకేం అవుతుందోనని ఆందోళన పడకు... వాడికేం కాదు... వాణ్ని రవితో ఆడుకోనీ... రవికీ సమయంలో గోపీ తోడు అవసరం. ఓ వారం రోజుల్లో... నేనూ ఇండియా వస్తున్నా... ఈ వయసులో నీక్కూడా నాతోడు అవసరం... సరేనా...? బై...' అంటూ ఫోన్ పెట్టేసింది కూతురు.

తల్లికి ఆ వార్త వెయ్యేనుగుల బలాన్నిచ్చింది!

***'ఆశాదీపం' కథాసంకలనం నుండి***

***మార్చి-2014***

# టెంప్టేషన్



**2013**



"రంగీ - తలుపులేసుకో - ఇల్లు జాగ్రత్త! అయ్యగారూ నేనూ కలిసి మా పుట్టింటికి వెళ్తున్నాం! ఇంటికి తాళం వేసి అక్కడికీ యిక్కడికీ వెళ్లేవ్! రోజులు బాలేవు! తాళాలను పగుల గొట్టి చేతికందింది తీసుకెళ్తున్నారు" పని మనిషికి అప్పగింతలు పెట్టి, జీప్‌లో ఎక్కి కూర్చుంది విజయ.

"పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఇంట్లో దొంగలు పడటమే! డామ్ ఇన్సల్ట్!" నవ్వుతూ జీప్ ఎక్కి - విజయ పక్కన కూర్చున్నాడు రవికాంత్.

రంగి సూట్‌కేస్ తెచ్చి - జీప్‌లో పెట్టింది. ఆ గతుకుల రోడ్డుమీద జీప్ కదిలి - మరో అయిదు నిముషాల్లో స్పీడందుకుంది!

"అబ్బ! ఏం రోడ్డు బాబూ! కార్పొరేషన్ అధికార్లను పనిగట్టుకుని ఇలాంటి చోట్ల సన్మానించాలి!" అంది విజయ జీప్ కుదుపులకి ఎగిరెగిరిపడ్తూ.

"ష్! ఈ కాలనీలో జీప్‌లో మాట్లాడకూడదు!" అన్నాడు రవికాంత్ రహస్యం చెప్తున్నవాడిలా.

ఎందుకన్నట్టు అయోమయంగా చూస్తోన్న విజయ నెత్తి మీద మొట్టికాయ వేస్తూ -

"మొద్దూ... ఈ కుదుపులో మాట్లాడ్తే... మన నాలుకలు మన నోట్లో వుండవ్! తెగి కింద పడిపోతాయి... అందుకూ!" అంటూ నవ్వాడు.

విజయ నవ్వింది.

ఆ బిజీ రోడ్డు మీద - ఏ దిక్కు నుండి మృత్యువు ఏ రూపంలో ఎదురవుతుందో అన్నట్టు - ఎక్కడికక్కడ - అలర్ట్‌గా, నేర్పుగా ఎదురయ్యే వాహనాలన్నింటినీ చాకచక్యంగా తప్పించుకుంటోన్న ఆయా వాహనాలను చూస్తూంటే - విజయకి 'ఖో' ఆట గుర్తుకు వచ్చింది!

బస్టాండ్‌లో - జీప్ డ్రైవర్ సామాన్లు తీసి బయట పెడ్తూంటే - ఎక్కడినుండో కానిస్టేబుల్ పరిగెత్తుకు వచ్చి..

"సార్... సార్! మిమ్మల్నీరోజు వూరికి వెళ్లొద్దన్నారు డీఎస్పీ సాబ్! రేపు ఉదయం ఆరు గంటలకే చార్మినార్ దగ్గర హోమ్ మినిస్టర్ ప్రోగ్రాం వుందట! బందో బస్త్ ఏర్పాట్లు చూసుకోమన్నారు!" అలుపు తీసుకుంటూ చెప్పాడు!

"ఓ రెండ్రోజులు సరదాగా భార్యతో తిరిగే ప్రాప్తమైనా లేదు! ఈ మంత్రులకేం పనీపాటా వుండదు, రోజుకో మంత్రి చొప్పున వస్తుంటారు మా ప్రాణాలు తీయడానికి!" మనసులోనే విసుక్కుంటూ -

"సరేలే నువ్వెళ్లు!" అంటూ కానిస్టేబుల్‌ని పంపించి -

"ఇప్పుడెలా విజ్జీ - నువ్వులేని మనింట్లో నాకు క్షణమైనా వుండాలనిపించదు! రాత్రి నిద్ర కూడా పట్టదు! నీకేమీ అన్పించడం లేదా?" అడిగాడు దిగులుగా చూస్తూ.

"ఒక రెండు రోజులేగా - మళ్లీ ఎల్లుండీపాటికి వచ్చేయనూ -

నాకు మాత్రం మిమ్మల్ని వదిలి వెళ్లాలని వుంటుందా? వాడి బర్త్‌డేకి నేను తన దగ్గర లేకపోతే - తమ్ముడు బాధపడ్తాడని కదా నేను వెళ్తోంది!"

"అవునవునూ... కానీ..."

అతడి మాటలు పూర్తికాకముందే ప్లాట్ ఫాం మీద విజయవాడ బస్ వచ్చి ఆగింది!

ఆమెని బస్ ఎక్కించి - కిటికీ దగ్గరకు వచ్చి -

"సరేగానీ - వెళ్ళగానే... గంటకోసారి ఫోన్ చేయాలి, లేకపోతే నేనూరుకోను!" చెప్పాడు రవికాంత్.

"ఏమిటీ - ఈ రెండు రోజులకే...? ఇంకానయం! నిమిషానికో ఫోన్, క్షణానికో ఫోన్ అన్లేదు!" వెక్కిరించింది విజయ.

ఆమె మాట్లాడ్తూనే వుందలా, బస్ కదిలిపోయింది!

రవికాంత్ జీప్ ఎక్కి ఇంటి ముఖంపట్టాడు.

టైమ్ చూసుకున్నాడు, రాత్రి పది అవుతోంది!

'తన పెళ్ళయి మూణ్ణెళ్లు అవుతోంది! పెళ్లయ్యాక ఇదే మొదటిసారి విజయ తనని ఒదిలి పుట్టింటికి వెళ్లడం! పాపం రాత్రిపూట ఒక్కత్తే ఎలా ప్రయాణం చేస్తోందో ఏమో?

అసలు తామిద్దరూ కలిసే విజయవాడ వెళ్లాలనుకుని రాత్రి బస్‌కి ఇద్దరికీ రిజర్వేషన్ చేయించాడు తను!

కానీ - తనిలా అనుకోకుండా ఆగిపోవలసి వచ్చింది!

ఇంత రాత్రి విజయవాడలో దిగి - ఎంత అవస్థ పడ్తుందో ఏమో! పోనీ రేప్పొద్దున వెళ్లమని చెప్దామనుకుంటే - విజయ వెళ్లి తలంటు పోస్తే గానీ - కొత్త బట్టలు వేసుకోడట ఆమె తమ్ముడు, అందుకని రాత్రి పూటే పంపించాల్సి వచ్చింది!'

రవికాంత్ ఆలోచిస్తూనే వున్నాడు! కొద్ది దూరం వెళ్లాక - ఉన్నట్టుండి జీప్ ఆగిపోయింది! డ్రైవర్ దిగి జీప్‌తో కుస్తీ పడ్తున్నాడు - పదినిముషాలు గడిచిపోయాయి! రవికాంత్‌కి విసుగు వచ్చింది.

"మై ఆటోమే చలేజాతూ!" అంటూ రవికాంత్ జీప్ దిగి - ఆటోల

కోసం రోడ్డుకి అటు పక్కా - ఇటు పక్కా చూశాడు.

ఒక్క ఆటో కూడా కన్పించలేదు! అయిదు నిముషాలు వెయిట్ చేశాడు - ఏ ఆటోనైనా వస్తుందేమోననీ! ఒక్కటీ రాలేదు! ఎదురుగా బార్ షాప్ కన్పించింది!

అప్రయత్నంగానే పెదవులు తడుపుకున్నాడు!

'అబ్బ, ఎన్నాళ్లయింది ఓ పెగ్గు విస్కీ తాగి?'

అదేమిటో - ఇంట్లో తన భార్య చేత్తో మధువునందిస్తూంటే, ఉమర్ ఖయ్యాంలా దాన్ని సేవిస్తూ, మెత్తటి తన భార్య పాదాల వద్ద మత్తుగా సోలి పోవాలనీ - కాలేజీ రోజుల నుండీ తనలో ఓ ప్రగాఢమైన కోరిక!

కాని ప్చ్... పెళ్లయిన కొత్తలో... ఆ హుషారులో - ఓ రోజు విస్కీ ఇంటికి తెచ్చుకుంటే విజయ విరుచుకుపడింది!

ఇలాంటివి తన ఇంటా వంటా లేదంది! నానా గొడవ చేసింది! ఇంకెప్పుడైనా అలాంటివి ఇంటికి తెస్తే - ఉరేసుకుంటానంది!

అందుకే తాగాలని కోరిక ఎంత వున్నా, ఎప్పుడో దొంగ చాటుగా ఏ క్యాంపుల్లోనో తప్ప - ఎప్పుడూ యింటికి తీసుకొచ్చే సాహసం చెయ్యలేదు తను!'

విస్కీ తలచుకోగానే... అరగంట క్రితం వున్న దిగులు ఎటు మాయమైందోగానీ... అతడి మనసిపుడు గాల్లో తేలిపోతోన్నంత హాయిగా వుంది! గబగబా బార్‌లోదూరి, విస్కీ బాటిల్స్, ఫ్రైడ్ ఛికెన్ ప్యాక్ చేయించి - ఎదురుగా వస్తోన్న ఆటో ఎక్కి అడ్రెస్ చెప్పాడు.

'అవునూ... భార్యలు... అప్పుడప్పుడు యిలా పుట్టింటికి వెళ్తే - ఎంత స్వేచ్ఛ - ఎంత ఆనందం!' అతడి ఆలోచనకి అంతరాయం కల్గిస్తూ ఆటో వెళ్లి ఇంటి ముందాగింది!

హుషారుగా ఈలవేస్తూ, మెట్లెక్కి- డోర్ ముందు నించుని కాలింగ్ బజర్ నొక్కాడు!

★★★

లోపల...

"ఈ మెత్తటి పరుపుల మీద తొంగుంటే ఎంత హాయిగా వుందే!? సినిమాల్లో సిరంజీవి తొంగుంటే సూట్టమేగానీ- ఒక్కసారైనా తొంగుని

ఎరుగం గందా! ఎంత సల్లగా వుందే ఈ గది లోపల గాలి - ఎక్కడో సెరువు గట్టున కూసున్నట్టు!? ఇదేందో ఏసో - గీసో పెట్టుకునీ - టేపు రికాడ్డు పాటలు వింటూ - యిలాంటి మెత్తటి పరుపుల మీద నీలాంటి సక్కని సుక్కతో దొర్లితే - ఈ జన్మకేం గావాలే? ఈ టేప్ రికాడ్డేమిటే - డొక్కుది - ఏ మీట నొక్కినా పాటలొచ్చి సావడంలేదు!" తన్మయత్వంగా చెప్పుకు పోతున్నాడు సాంబు.

"ఎవరో తలుపుకొడ్తున్నారు మావా!" లేవబోయింది రంగి!

"ఏహెఁ ఈ యేళప్పుడు యెవరొత్తారే - తొంగో!" మెత్తని ఫోమ్ పరుపు మీద మత్తుగా దొర్లుతూ రంగిని గుండెల మీదికి లాక్కుంటూ అన్నాడు సాంబు.

రవికాంత్‌కి అనుమానం వచ్చి అక్కడినుండి కదిలి - బెడ్‌రూం కిటికీ దగ్గరకు వెళ్లి - ఓరగా వేసి వున్న తలుపు సందుల గుండా లోపలికి చూశాడు!

ఆ డిమ్‌లైట్లో... తన ఫోమ్ బెడ్ మీద - రోజూ తనూ, విజయా పడుకునే చోట - దర్జాగా సాంబు, వాడి నల్లటి చేతుల్లో... గువ్వల్లే రంగి!

కళ్ళు విప్పార్చి చూశాడు!

సందేహం లేదు! వాళ్లిద్దరే! ఏమీ ఎరుగని వాడిలా - వెళ్ళి - మళ్లీ కాలింగ్ బజర్ నొక్కాడు.

"యె.. వదలహే! ఇక్కడికి రావద్దంటే యిన్నావు గాదు! ఆ ఇన్సుపెక్టరు బాబు మనసు మార్చుకొని యెనక్కి వచ్చేశారు గాబోలు - యిప్పుడెట్లా దేవుడోయి! ఈ యేళప్పుడు నిన్నిక్కడ ఆళ్లు సూత్తే యింకేమైనా వుందీ - అగ్గి మీద గుగ్గిలమైపోతారు! మెత్తటి పరుపుల మీద తొంగోవాలనే నీ సోకు నా పేనం మీదికి తెచ్చింది మావా!" రంగికి కాళ్లూచేతులూ ఆడటం లేదు.

రవికాంత్ కాలింగ్ బజర్ మీద నుండి చెయ్యి తీయకుండా - లాంగ్ బెల్ ఇస్తూనే వున్నాడు.

సాంబు మత్తు దిగిపోయింది!

"ఏవిటీ - నిజమే!? ఇన్స్‌పెక్టరు బాబు నిజంగానే వచ్చా డంటావా?" కంగారుగా లేచి కూర్చున్నాడు.

"నువ్విప్పుడెట్టా ఎళ్తావురా బయటకి? ఇంకో తలుపైనా లేదు!" రంగికి భయంతో ముచ్చెమటలు పోశాయి.

"ఏహే! ఏమవుద్దేటి? ఇట్టాగే వెళ్లి తలుపు తీద్దాం! మనకేవుటి భయం! ఎటొచ్చీ నువ్వు నా పెళ్లాంవీ, నేను నీకు మొగుణ్ణేగా!" అన్నాడు సాంబు మొండి ధైర్యం తెచ్చుకుంటూ.

"ఎర్రి సచ్చినోడా... 'ఇయ్యాళ అమ్మగోరూ, అయ్యగోరూ యింటికి నన్ను కాపలా పెట్టి, వాళ్ల వూరు వెళ్లిపోయారు. ఈ రేత్రి నేనింటికి రాన్రా నువ్వు వెళ్లిపో' అని సిలక్కి సెప్పినట్టు సెప్పినా - నువ్వు యినకపోతివి సరికదా నేనూ యిక్కడే తొంగుంటానని ఇంట్లోకి సొచ్చుకు వస్తివి, నువ్వసలే తాగుబోతు యెదవ్వని ఆ అమ్మకు తెలుసు! నీలాంటోణ్ణి ఇంట్లోకి రానిచ్చానని తెలిసి యిప్పుడు నన్ను పనిలోంచి పీకేయించినా పీకేయించగల్దు! అసలే ఆ యమ్మకి తాగుబోతులంటే మా సెడ్డ అసహ్యం! ఇప్పుడేటి సేసేది దేవుడో!" సన్నగా రాగం అందుకుంది రంగి.

"యెహె! యెర్రి మొహమా! తాగుబోతు యెదవనైతే మాత్రం మొగుణ్ణి కానేటి? అయ్యగోరి కంటబడకుండా నేను బయట పడ్తాగా - నువ్వేడ్చి గోలెట్టకు!" అంటూ రంగి చేయి పట్టుకుని తలుపు వద్దకు వచ్చాడు.

అదే క్షణంలో పవర్ పోయింది.

మరు క్షణం సాంబు తలుపులు తెరిచి - ఆ చీకట్లో పక్కకు తప్పుకున్నాడు.

★★★

"ఇంతసేపు ఏంచేస్తున్నావ్ రంగీ? పది నిముషాలనుండి బెల్ కొడ్తున్నాను!" అంటూ లోపలికి వచ్చాడు రవికాంత్.

సాంబు అలా బయటపడ్డాడో లేదో వెంటనే పవర్ వచ్చి లైట్లు వెలిగాయి.

రవికాంత్ తలుపులు మూసి లోపల అన్నీ గదులూ చూసొచ్చాడు. ఎక్కడా సాంబు కన్పించలేదు! లైట్లు పోయిన సమయంలోనే సాంబు తప్పించుకుని వుండి వుంటాడని గ్రహించాడు.

"అమ్మగోరు ఏరి ఇన్సు పెక్టరు బాబూ!?" అడిగింది రంగి ముఖాన వున్న చెమట తుడ్చుకుంటూ.

"విజయవాడ వెళ్లిపోయింది. నాకు పనుండి వెళ్లలేదు!" అంటూ బెడ్ రూంలోకి వెళ్లి - తనతో తెచ్చుకున్న విస్కీ బాటిల్స్ టీపాయ్ మీద పెట్టాడు.

"బాబూ, భోంచేస్తారా? నేను వడ్డించి - మా యింటికి వెళ్లి పోతాను!" అడిగింది రంగి.

టైమ్ చూసుకున్నాడు రవికాంత్.

పదకొండవుతోంది! ఇప్పుడేంటి భోజనమనుకుని తల అడ్డంగా ఆడించాడు.

అదే సమయంలో బయట నుండి 'రంగీ - రంగీ' సాంబు పిలుపులు విన్పించి - తలుపులు తెరిచాడు రవికాంత్.

"మీరొచ్చారు గందా! రంగిని తీసుకెళ్దామని వచ్చాను!" చెప్పాడు సాంబు రవికాంత్‌ని చూసి చేతులు జోడిస్తూ.

"చూడు సాంబూ! నేను మళ్లీ రాత్రి రెండింటికి స్పెషల్ డ్యూటీ మీద చార్‌మినార్ వెళ్లాలి! మీకు తెలుసుకదా- యింటికి తాళం వేయడం మీ అమ్మగారికిష్టముండదనీ! ఇప్పుడు ముంచుకు పోయిందేముంది? రంగి రేప్పొద్దున వస్తుంది! నువ్వెళ్లు!" చెప్పాడు రవికాంత్.

సాంబు ఆలోచన్లలో పడ్డాడు.

'ఇన్సు పెక్టరు బాబు రేత్రి రెండుగంటలకి మళ్లీ వెళ్లిపోతారన్నమాట! అందాక ఏ రెండో ఆట సినిమాలోనైనా కూర్చొని మళ్లీ వత్తే సరి - మళ్లీ ఆ పరుపుల మీద... తన కుందనపు బొమ్మలాంటి రంగితో... ఓహ్! ఎంత హాయి!

"అట్టాగే దొరా!" అంటూ చేతులు జోడించి - తీయటి కలల్లో తేలిపోతూ వెళ్లిపోయాడు సాంబు.

రవికాంత్ తలుపులు వేసి - లోపలికి వచ్చాడు.

లివింగ్ రూమ్‌లో కుర్చీలో కూర్చుని - ప్రక్కనే వున్న టీపాయ్‌ని దగ్గరకు లాక్కున్నాడు.

విస్కీ బాటిల్ మూత తీశాడు! ప్యాక్ చేసిన ఫ్రైడ్ చికెన్ ఓపెన్ చేశాడు. రంగిని పిలిచి అల్మారాలోంచి గాజు గ్లాసూ - ఫ్రిజ్‌లోంచి చల్లటి నీళ్లూ తెమ్మన్నాడు.

"ఎప్పుడో ఓ పూట - ఏ పార్టీలోనో మందు పుచ్చుకుంటే తప్పేముంది రంగీ? ఏదో సరదా పడ్డానని సరిపుచ్చుకోక- మీ అమ్మగోరు ఎంత యాగీ చేస్తారో తెలుసా? ప్చ్! బొత్తిగా స్వేచ్ఛలేని బ్రతుకైపోయింది నాకు!"

రవికాంత్‌ని అలాంటి స్థితిలో ఎప్పుడూ చూళ్లేదేమో - ఓ వైపు ఆశ్చర్యపోతూనే అతడు అడిగినవన్నీ తెచ్చిచ్చింది. విస్కీని గ్లాసులో పోస్తూ - తలెత్తి ఆమె ముఖంలోకి చూశాడు... రంగి ముఖం నిర్మలంగా వుంది.

"ఇదిగో మీ అమ్మగారు ఈ విస్కీని గ్లాసులో పోసి నాకందిస్తూంటే - తాగాలని నాకు తెగ షోకు రంగీ. కానీ - అదీజన్మలో తీరేలా లేదు!" అన్నాడు రవికాంత్.

ఆ మాటలకి సాంబు గుర్తొచ్చాడు రంగికి.

"వాడూ అంతే బాబూ! తాటి కల్లు తెచ్చుకుని, గిలాసలో పోసి వాడి నోటికందించాలని నన్ను రోజూ సతాయిత్తాడు. యేసబాసల్లో మార్పేగానీ మీ పెద్దోల్ల అలవాట్లూ, మా పేదోల్ల అలవాట్లూ అంతా ఇంతే, అన్నీ ఒకటేనన్నమాట!" నోరెల్లబెడుతూ అంది రంగి.

రవికాంత్ మనసులో... సన్నగా... ఏదో గిల్టీనెస్... విజయ గుర్తొచ్చేలా చేస్తోంది!

★★★

ఓ రోజు రాత్రి డిన్నర్ అయ్యాక - విజయకి పాత పాటలు యిష్టమని... ఎప్పట్లా పాత పాటల కోసం టీవీ అన్ చేశాడు తను!

అదేదో సినిమాలో - 'ఈ కనులు నీవే - ఈ కురులు నీవే - నా తనువులోని అణువణువూ నీదే - ఇలా వుండిపోనీ నీ దాసినై!' తాగుబోతైన భర్తని మార్చేందుక్కాబోలు - తనే తాగుబోతై... నటనలో జీవిస్తోంది సావిత్రి!

సావిత్రి అంటే పడి ఛస్తుంది విజయ.

ఆ సీన్ చూసి ఎలా రియాక్ట్ అవుతుందోనని ఆమెని ఓరగా చూసాడు తను.

"ఛ! సిగ్గులేక పోతే సరి! అలాంటి తాగుబోతు వెధవకి - దాసీలా వూడిగం చేస్తుందట ఈవిడ! ఏం లిరిక్సో ఏమో!?" కస్సుమంది విజయ.

"అప్పట్లో నీలాంటి ఫెమినిస్టుల్లేరేమో, కవి అలా చెలరేగి పోయాడు పాపం!" విజయని ఉడికించాలని అన్నాడు తను.

కానీ ప్రతిగా -

"అబ్బో! ఎంత సంబరమో! ఆ కవీశ్వరుడేమోగానీ - దీన్ని అడ్డం పెట్టుకుని మీరే చెలరేగిపోయేలాగున్నారే!" అంటూ తననే ఆటపట్టించింది విజయ.

విజయ బలహీనత తనకి తెలుసు.

సావిత్రి స్టిల్ చూపిస్తే చాలు... ఎంత చిరాగ్గా, ఎంత కోపంగా ఉన్నా... టక్కున ప్రసన్నంగా మారి - నవ్వేసే విజయని చూస్తే -

'విజయకి నాకన్నా సావిత్రే ఇష్టం' అని లోలోపల కుళ్లుకునేవాడు తను ఎన్నోసార్లు.

ఇప్పుడు సమయం చిక్కింది కదా అని...

"అవునూ, ఎప్పుడైనా నేను సరదా కోసం తాగుతానంటే - అంతెత్తున లేస్తావు కదా విజ్జీ - మరి మీ సావిత్రి సంగతేంటి? ఆమె తెగ తాగేదని విన్నాం! తాగుబోతుల్ని అసహ్యించుకునే నువ్వు- సావిత్రినెలా ఇష్టపడ్తున్నావ్?" రెచ్చకొట్టాడు తను.

విజయ బదులివ్వలేదు.

"అయినా నాకు తెలీకడుగుతున్నాను విజ్జీ... 'ఆలయాన వెలసిన ఆ దేవుని రీతీ... ఇల్లాలే ఈ జగతికి జీవన జ్యోతీ...' అంటూ తన అద్భుత నటనతో ప్రేక్షకుల్ని అలరించిన సావిత్రి... తను తాగుతోన్న క్షణాల్లో... తద్భిన్నంగా ప్రవర్తిస్తున్నానని ఎప్పుడూ అనుకోకపోయేదా?"

"ప్రేమని పంచే పతిదేవుడి విషయంలో... అది వర్తిస్తుంది! ప్రేమ రాహిత్యానికి గురైన స్త్రీ కాబట్టి - ఆ ఒంటరితనం ఆమెను బాధించిందేమో ఎవరికి తెలుసు?" చెప్పింది విజయ.

“అలాంటి బాధే కదా - దేవదాసుని కూడా తాగుబోతుని చేసింది. మరి దేవదాసు పాత్రని ఎందుకంత ద్వేషిస్తావ్? ఎంతైనా నువ్వు స్త్రీ పక్షపాతివి విజ్జీ!”

“నేను ద్వేషించేది మనుషుల్ని కాదు రవీ... వాళ్ళ బలహీన మనస్తత్వాల్ని! దానికి సావిత్రయినా, దేవదాసయినా, చివరకు మీరైనా ఎవరూ ఎక్సెప్షన్స్ కాదు! మరో విషయం... ఒకవేళ నేనే సావిత్రి పక్కన వుండివుంటే... ఆమెలో ఆశావాదాన్నో, ధైర్యాన్నో నూరిపోసేదాన్నిగాని... అలాంటి మహానటి తాగుడికి బానిసై తనను తాను శిక్షించుకుంటూంటే చూస్తూ కూర్చునేదాన్ని కాదు! అందుకే... సావిత్రిని ఎప్పుడు తలుచుకున్నా నాకెందుకో... మనసు వికలమైపోతుంది” విజయ కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

“పాపం! బాధ మరిచిపోవడానికి మరోమార్గం లేక అలా తాగుడికి బానిసైపోయిందేమో!” అన్నాడు తను సానుభూతిగా.

“కానీ - బాధలనేవి అందరికీ వుంటాయి! అవి భగ్న ప్రేమలే కావొచ్చు... ఆర్థిక బాధలేకావొచ్చు... మరింకేవో కావొచ్చు... బాధలున్నా యని మనమందరం తాగుబోతులమైపోదామా!?”

తను నిరుత్తరుడైపోయాడు.

“తాగుడికి బానిసైన ఆ దేవదాసుతోనే... ఓ కవీశ్వరుడు ‘బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్... ఆ ఎరుకే నిశ్చలానందమోయ్... బ్రహ్మానందమోయ్...’ అని పాడించాడు. అంతటి సత్యం తెలుసుకున్న దేవదాసు... మరి బాధే సౌఖ్యమంటూ గమ్మునుండక... తాగుడిని ఆశ్రయించడమేమిటి, అబ్సర్డ్!” అంది విజయ.

“యూ ఆర్ మిస్టేకెన్ విజ్జీ! అది ఓ నిర్వేదంలోంచి తెలిసొచ్చిన సత్యం - అంతేగాని... నిజంగా బాధని మరిచిపోయి కాదులే!” సమర్థించాడు తను.

“అబ్బో! వేదాలనూ, నిర్వేదాలనూ బాగానే ఔపోసన పట్టినట్టు న్నారే!” వెక్కిరించింది విజయ.

“అయినా విజ్జీ - నాకు తెలీక అడుగుతున్నాను! ‘వ్యక్తుల ప్రైవేటు బతుకు - వారి వారి సొంతం. పబ్లిక్‌లో నిలబడితే - ఏమైనా

అంటాం!' అన్నాడు కదా శ్రీశ్రీ! సావిత్రిలాంటి వారు పబ్లిక్ ఫిగర్స్ కదా! మరి వాళ్ళలా తాగొచ్చా?" రెచ్చగొట్టాడు తను.

"ఆ కొటేషన్ శ్రీశ్రీక్కూడా వర్తిస్తుంది కదా! మరెందుకు తాగేవాడట! నా ఉద్దేశ్యంలో... సావిత్రి తాగినా, శ్రీశ్రీ సిగరెట్లు కాల్చినా, డయానా ప్రేమాయణం సాగించినా... అది వాళ్ళ ప్రైవేట్ వ్యవహారం! అవి పబ్లిక్‌కి అనవసరం - వాళ్ళకి అవసరమయ్యే విషయాలు ఎన్నో వుంటాయి! అయినా... ఇలాంటి విషయాలు మాట్లాడుకోవడం, వాళ్ళపై కెమెరాలు ఎక్కుబెట్టడం, 'పాపరాజో'లను సంధించడం... ఒకరు స్నానం చేస్తూంటే దొంగతనంగా చూస్తున్నంత తప్పు నా దృష్టిలో..."

"కాని... వాళ్ళని ఉదాహరణగా తీసుకొని నాలాంటి వాళ్ళు మరింత పెట్రేగి... పీకల్దాకా తాగుతూ కూర్చుంటే... నువ్వు సమర్థిస్తావా మరి!" ఒకింత ఆశగా, మరింత ఉత్సాహంగా అడిగాడు తను.

"డబ్బులెక్కువై సరదాకో, జల్సాల పేరో... 'పబ్ కల్చర్'ని యువతకి అంటిస్తూ... మందు పార్టీల పేర జాతిని నిర్వీర్యం చేస్తోన్న మీలాంటి వాళ్ళకన్నా - నాలుగ్గోడల మధ్య... తన మానాన తను తాగి... తన ఆరోగ్యానికి తనే చేటు తెచ్చుకున్న సావిత్రి వెయ్యి రెట్లు నయం! ఆమెతో మీకేమిటి పోలిక?" కస్సుమంది విజయ.

★★★

'అలాంటి విజయ... ఇప్పుడు తననీ స్థితిలో చూసిందంటే... ఇంకేమన్నా వుందీ...' పరిసరాల స్పృహలోకొస్తూ అనుకున్నాడు రవికాంత్. అప్పటిదాకా ఉన్న ఉత్సాహం ఆవిరైపోయింది.

"రంగీ - మీ ఆయన తాగుతాడా?" అడిగాడు.

"అవును బాబూ!"

"మీ అమ్మగారికి నేనిలా తాగితే యిష్టముండదు! మరి మీ ఆయన సంగతేమిటి? వాడు తాగితే నీకేమీ అన్పించదా?"

"ఎందుకు అన్పించదూ? ఆడు తాగుతున్న తాటి కల్లు సీసా ఆడి నెత్తినేసి కొట్టి చంపాలనిపిస్తది కానీ...."

"ఊ - కానీ..."

"ఏదైనా - ఎవురైనా వాళ్లకి ఇష్టమైంది కాదంటే - దొంగతనంగానైనా దాన్ని పొందాలని చూత్తారు. ఒక తప్పు మాన్పించడానికి మరో తప్పు వాళ్లతో సేయించడం నాకిట్టముండదు!" చెప్పింది రంగి.

'అబ్బ! రంగి ఎంత మంచిది. మగవాళ్లని ఎంత బాగా అర్థం చేసుకుంది.'

అదే మాట పైకి అనేశాడు రవికాంత్.

"అలా అని - ఆ మొదటి తప్పు నేను లక్ష్యపెట్టనని కాదు బాబూ! 'తాగితే తాగు! కానీ నా ముందే తాగు! నాకు భయపడి దొంగలా సాటుమాటుగా తాగి మోసం సేయొద్దు' అన్నాను." మనసులోని మాట చెప్పింది రంగి.

రవికాంత్ తుళ్లి పడ్డాడు.

"మొదట్లో రోజుకి ఐదు సీసాలు తాగేవాడు. ఆ తర్వాత నాల్గూ - మూడూ - రెండూ - ఇప్పుడు... ఒక్క సీసాతో సరిపెట్టుకుంటున్నాడు, రేపోమాపో పూర్తిగా మానేస్తాడు! వాడి మీద నాకు నమ్మకముంది!"

చెంప ఛెళ్లుమన్నట్టుగా ఫీలయ్యాడు రవికాంత్.

విజయక్కూడా తన మీద ఎంత నమ్మకముంది! కానీ తనేం చేశాడు ఇప్పుడు!?

"నాకొకటి అర్థం కాదు రంగీ! ఆడవాళ్లందరూ వాళ్ళ వాళ్ళ భర్తల్ని నీలా అదుపులో పెట్టుకుంటే సరిపోతుంది కదా! సారాని నిషేధించమంటూ వీధుల్లో ఉద్యమాలు చేసే బదులు!" రంగి సమాధానం కోసం చెవులు రిక్కించాడు.

రంగి నవ్వింది.

"అందరికీ మా మావలా నిగ్రహం ఉండాలి గదా బాబుగోరూ! సారా వాసనొస్తే సాలు... లొట్టలేసే సన్నాసి వెధవలకి సారా కొట్టు కళ్ళెదుట కన్పిస్తే - ఊర్కుంటారా?"

చెర్నాకోలాతో కొట్టినట్టుగా ఫీలయ్యాడు... సిప్ చేయబోతోన్న విస్కీని... వెళ్ళి సింక్‌లో పారబోశాడు.

★★★

ఓ వారం రోజుల తర్వాత...

“ఎప్పుడొచ్చారమ్మా విజయవాడ నుంచి?” అంటూ ఇంట్లో అడుగెట్టింది రంగి.

“నిన్న రాత్రి వచ్చాను రంగీ! బావున్నావా?” అడిగింది విజయ.

“బావున్నాను. అదేంటమ్మా... బయట లారీ వుంది. మీకు ట్రాన్స్‌ఫరైందా - మీ మంచాన్నీ, పరుపుల్నీ లారీ మీద ఎక్కిస్తున్నారు?” అడిగింది రంగి దిగులుగా.

“లేదు రంగీ! వాటిని మీ ఇంటికి పంపించేస్తున్నాను.” అంది విజయ.

రంగి నోట మాట రాలేదు.

“టేప్‌రికార్డు వింటూ మీ సాంబు పొరపాటుగా ‘రికార్డు’ మీట నొక్కినట్టున్నాడు. మీ ఇద్దరి మాటలూ రికార్డ్ అయ్యాయి.” చెప్పింది విజయ.

రంగి ముఖం తెల్లగా పాలిపోయింది.

“నాకు తెలుసు... నువ్వెంత గగ్గోలు పెట్టింది. ఇందులో నీ తప్పేం లేదు!”

“కానీ... అమ్మగోరూ...”

“మాకు మాత్రమే పరిమితమైన బెడ్ ఎవరుపయోగించినా... నాకిష్టం వుండదు! పైగా... దాని మీద మీ సాంబు మోజు పడ్డాడు కదా! ఫర్లేదు... నువ్వు తెల్లబోకు! మేము మరోటి కొనుక్కుంటాం...”

రంగి కొయ్యబారిపోయింది.

“రవికాంత్ బాబు జరిగిందంతా చెప్పాడు. నువ్వు దూది ఉండతో కొట్టినట్టుగా... సుతిమెత్తగా... మాట్లాడిన తీరు... రవికాంత్ బాబుకే కాదు, నాకూ నచ్చింది!” అంది విజయ మెచ్చుకోలుగా రంగి భుజం తడుతూ.


రంగి ముఖం సంతోషంతో విప్పారింది!

**‘ఆంధ్రభూమి’ వీక్లీ - 7-11-2013**

# నా సరి నీవని....
# నీ సరి నేనని....



2013



**అ**మ్మ కడుపులో.... వెచ్చగా.... నిశ్చింతగా - తన ఆకృతి రూపుదిద్దుకుంటోన్న ఓ చిన్ని ఆకారం-

"ఛట్ ! మళ్ళీ ఆడపిల్లేనా ? ఒద్దు !" తండ్రి కసాయి మాటలకి ఉలిక్కి పడింది !

తూట్లు తూట్లు కానున్న తన చిరు దేహాన్ని తలచుకుని- చిగురుటాకులా కంపించి పోయింది. తనకిక **'ఉదర సమాధి'** తప్పదన్నమాట!' తప్పించుకునే తరుణోపాయం కోసం దిక్కులు చూసింది.

అంతలో మళ్ళీ ఏవో మాటలు. చెవులు రిక్కించింది.

"ఆడపిల్లైనా సరే ! నాకు కావాలి !" అమ్మ వేడుకోలు.

"ఎలా కంటావో చూస్తాను !" నాన్న బెదిరింపులు.

నాటు వైద్యం పనిచేయలేదు !

'బ్రతుకు జీవుడా !' అనుకుంటూ ఆ చిన్ని ఆకారం భూమ్మీద పడింది!

అలా అమ్మ గెలిచింది. నాన్న ఓడిపోయాడు.

కానీ ఆ తృప్తి ఎంతోసేపు నిలువలేదు !

'ఇది - నా గుండెలమీద కుంపటి ! నాకొద్దు !' తల్లి కళ్ళుగప్పి - విసురుగా దాన్ని మురిక్కాలువలో విసిరేసి చరచరా వెళ్ళిపోయాడు తండ్రి.

ఆ ఆకారానికి - భూమ్మీద ఇంకా నూకలున్నాయేమో - తన కొన ఊపిరితో- పిల్లల్లేని దంపతులకి చిక్కింది !

అలా చిక్కిన ఆ ఆకారానికి- పురాణాల్లో తనకిష్టమైన 'సత్యభామ' పేరెట్టుకుని - అల్లారు ముద్దుగా పెంచుకోవడం మొదలెట్టింది ఆ పెంపుడు తల్లి.

తర్వాత కొన్నాళ్ళకి ఆ దంపతులకి 'కొడుకు' పుట్టాడు. అది తమకి దేవుడిచ్చిన మరో ప్రసాదంగా తలపోసి - కొడుక్కి 'వరప్రసాద్' అని పేరెట్టుకున్నారు!

★★★

పిల్లలిద్దరికీ అప్పుడప్పుడే రెక్కలొస్తున్నాయి. ఒకరోజు ఇద్దర్నీ పిలిచి- ఇంట్లో చేయాల్సిన పనులు పంచింది వాళ్ళమ్మ.

డైనింగ్ టేబుల్ మీంచి ప్లేట్లు తీసి - టేబుల్ శుభ్రం చేసేపని కొడుకు ప్రసాద్‌దీ... ప్లేట్లు కడిగేపని కూతురు సత్యదీ... లేదంటే వైస్ వర్సా.

ఒకరోజు ఏమనుకున్నాడో -

"ఈ ఆడంగి పనులు నేనేం చేయను ! నేను మగమహారాజుని ! నువ్వే చేసుకో-ఫో!" అంటూ చల్లగా బయటికి జారుకున్నాడు కొడుకు.

రాత్రి భోజనాల దగ్గర -

డైనింగ్ టేబుల్ మీద కొడుక్కి- ప్లేటు బదులుగా న్యూస్‌పేపర్ పరిచింది వాళ్ళమ్మ.

"పొద్దున నువ్వు తిన్నప్లేట్ ఎండిపోయి - అదిగో ఆ సింక్‌లో పడి వుంది ! నీ ప్లేట్ నువ్వు తోముకుని వస్తే సరి ! లేదంటావా - ఇదిగో ఈ న్యూస్ పేపర్లో అన్నం పెడ్తా - తిను! ఇదైతే తోమే పనిలేకుండా - తిన్నాక - ఎంచక్కా డస్ట్‌బిన్‌లో వేయొచ్చు!" అంది తల్లి.

అంతే - కొడుకు కిక్కురుమనకుండా వెళ్ళి ప్లేటు కడుక్కొచ్చాడు!

ఆ రోజుకిక ఆ పాఠం చాలనుకుంది వాళ్ళమ్మ.

మర్నాడు.... లేస్తూనే కొడుకుని పిలిచి:

"ఏరా - నిన్న అక్కతో ఏమన్నావ్ ? ఏదీ మళ్ళీ చెప్పు !" అడిగింది.

"ఈ... ఆడంగి పనులు... నేనేం చేయను - నేను... మగమహారాజుని... అన్నాను" చెప్పాడు కొడుకు భయం భయంగా.

"అసలు నీకు 'ఆడంగి' అంటే అర్థం తెలుసా ?"

తెలీదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

"తెలీకుండా అలాంటి మాటలు వాడొచ్చా ? నువ్వలా వంట పనుల్లో, ఇంటి పనుల్లో షేర్ చేసుకుంటే నిన్ను 'ఆడంగి' అనరు ! నీ జాతి లక్షణాలకి విరుద్ధంగా నువ్వు ఆడపిల్లల్లా సిగ్గుపడ్తేనో... నడిస్తేనో...." అమ్మ చెప్తూనే వుంది...

"అమ్మా ! నాదో డౌట్ ?" ఆమె మాటలకి అడ్డొస్తూ అడిగాడు కొడుకు.

ఏమిటన్నట్టుగా చూసింది తల్లి.

"అక్కయ్య దేనికీ సిగ్గుపడదు ! అలాంటప్పుడు సిగ్గుపడటం ఆడపిల్లల లక్షణం ఎలా అవుతుందమ్మా ?" సందేహం వెలిబుచ్చాడు కొడుకు.

"చూడూ - ఏడ్వటం, సిగ్గుపడటం ఆడపిల్లలకి స్వభావరీత్యా పుట్టుకతో వచ్చిన సహజాతాలే అయినప్పటికినీ - అల్పవిషయాలకి ఏడ్వటం, అనవసరంగా సిగ్గుపడటం... తదితర లక్షణాలు.... దుర్బల మనస్తత్వానికి ప్రతీకలు ! అలాంటి వాటికి ఆడపిల్లలైనా - మగ పిల్లలైనా దూరంగా ఉండాలి. అయినా - **'సిగ్గుపడే పనులు' చేస్తే -**

**సిగ్గుపడాలి గానీ... 'పనులు చేయడానికి' సిగ్గుపడొద్దు ! పైగా - అవి ఆడపిల్లల పనులూ - మగ పిల్లల పనులూ అంటూ ఉండవు ! ప్రతి పనీ ఇద్దరూ షేర్ చేసుకోవాలి!"** విడమరిచింది తల్లి.

"అమ్మా- నాకొకటి అర్థం కాదు... పక్కింటి అంకుల్ ఎందుకలా ఇంట్లోనే కూర్చుంటాడు ? పొద్దస్తమానం టీవీ చూడ్డం తప్ప - బయట పనేం చేయడు ! స్కూటర్ వున్నా - బయటికి వెళ్ళి సరకులు తేడు! చివరికి చికెన్ షాపుక్కూడా ఆంటీనే పంపిస్తూ ఉంటాడు ! నాకు పాపం ఆంటీని చూస్తే జాలేస్తుందమ్మా! ఇంతకీ ఆయన జబ్బేమిటీ?" అడిగింది కూతురు.

"ఓ అదా !? అది **'మగ మహారాజు'**ల లక్షణం లేమ్మా!" అంది తల్లి నవ్వేస్తూ.

"అయ్యో! - 'మగ మహారాజు' అంటే ఇదా అర్థం !? ఛ ! నేనింకా అదేదో గొప్ప మాటనుకుని అక్కతో గర్వంగా పోట్లాడాను. అలాంటి చెడ్డమాట ఇంకోసారి అనను ! తప్పయింది ! లెంపలేసుకుంటు న్నాను" అంటూ రెండు గుంజీలు కూడా తీసేసి - బయటికి తుర్రుమన్నాడు కొడుకు.

★★★

సత్యా వరప్రసాదులు కాలేజీలో చేరారు.

ఒక రోజు....

"మా ఫ్రెండ్ మాధవి లేదూ - అదీ రోజు సూసైడ్ చేసుకుంది అన్నయ్యా!" బాధపడ్తూ చెప్పింది సత్య.

"అయ్యో ! ఏమైందమ్మా ?" అడిగాడు వరప్రసాద్.

"ఆ మధ్య కాలేజీ కారిడార్‌లో ఓ పోకిరీ కుర్రాడు అనూహ్యంగా పరిగెత్తుకొచ్చి - దాని బుగ్గ మీద ముద్దెట్టి - అది తేరుకునేలోపే - ఆ దృశ్యాన్ని తన ఫ్రెండ్ సెల్‌ఫోన్తో క్లిక్‌మనిపించాడు. అది చాలదని - అసభ్యకరమైన ఫోటోలేవో సంపాదించి - వాటి తలలకి దీని తలతో కంప్యూటర్లో మార్ఫింగ్ చేసి - దాన్ని తన ఫ్రెండ్సందరికీ యం.యం.యస్ చేస్తున్నాడు ! ఆ చిన్ని గుండె తట్టుకోలేక పోయింది!" చెప్పింది సత్య.

"ఛ! ఈ విషయంలో 'ఉపేక్ష' మంచిదికాదు సత్యా ! మీ ఆడపిల్ల లందరూ కెమెరా సెల్ ఫోన్లని నిషేధించాలని - టీవీ, ప్రెస్‌మీట్‌లు పెట్టి - మీ నిరసన తెలియజేయాలి !" సలహా ఇచ్చాడు వరప్రసాద్.

"అరే - వెర్రి అన్నయ్యా ! **ఆడపిల్లల బాత్‌రూం దృశ్యాల్ని పబ్లిగ్గా ప్రసారం చేస్తూ - టీవీ ఛానళ్లే... పరోక్షంగా 'ఈవ్‌టీజింగ్'కి పాల్పడ్తాంటే... మమ్మల్ని పోయి పోయి వాళ్ళకే మొరపెట్టుకోమంటావేమిటీ ?"** కస్సుమంది సత్య ఉక్రోషం - ఆక్రోశం ముప్పిరిగొని.

మరుక్షణం తల్లి మనసులో -

జనం బలహీనతల్ని సొమ్ముచేసుకుంటూ - 'అక్రమార్కుల పై కొరడా' ముసుగులో - 'జంధ్యాలేసుకున్న నక్కలు' మెదిలాయి!

'లావొక్కింతయు లేదు - ధైర్యం విలోలంబయ్యే'... అని గిజగిజ లాడ్తోన్న గజేంద్రుని కళ్ళకి - 'సుదర్శన చక్రం' కన్పించినట్టుగా - ఆమె కంటికి - నక్కల జంధ్యాన్ని తొలిగించి - న్యాయం చేకూర్చే ఆపన్న హస్తంలా - 'న్యాయదేవత' కన్పించింది.

**'ఫర్వాలేదు ! అన్నిదారులూ మూసుకుపోయినపుడు - ఆడపిల్లలకి న్యాయస్థానాలున్నాయి ! అధైర్యపడి ఆత్మహత్యలకి పాల్పడకూడదు!'** అనుకుంది.

అదే విషయం కూతురికీ చెప్పింది.

★★★

చదువులై పోయి - సత్యా, వరప్రసాదులు పెళ్ళీడుకొచ్చారు !

కొడుక్కి లక్షల కట్నం కుమ్మరిస్తామంటూ ముందుకొచ్చారు ఆడపిల్లల తలిదండ్రులు.

తండ్రి మొగ్గుజూపాడు !

**"విధిలేని పరిస్థితుల్లో ఆడపిల్లల తలిదండ్రులు 'విదిల్చే' బిచ్చమే - మగపిల్లల తలిదండ్రులు 'అడుక్కునే' కట్నం !** నాకది ఇష్టం లేదురా" అంది తల్లి.

"ఇప్పుడు చెప్పండి నాన్నా... జోలె పట్టుకోమంటారా నన్ను ?" అడిగాడు కొడుకు.

‘శభాష్!’ అనుకుంది తల్లి.

“మన అవయవాలన్నీ సరిగ్గానే ఉన్నాయి కదా ! మనం సంపాదించుకోలేమని అనుమానమా ?” కొడుకు పొడిగించాడు.

తండ్రి ముఖం ఎర్ర బారింది.

“ఒకరి కష్టార్జితాన్ని అప్పనంగా తీసుకోవాలనుకోవడం నామోషీ కాదా నాన్నా ?”

కొడుకు మాటలకి తల్లి పొంగిపోయింది, తండ్రి సిగ్గుపడ్డాడు.

అంతే ! వాళ్ళు కొడుక్కి కట్నం తీసుకోలేదు - కూతురుకీ ఇవ్వలేదు!

★★★

“మీకిది తెలుసా గోపాల్ ? నా ఫ్రెండ్ లలిత లేదూ - అది ప్రతినెలా తన సంపాదనంతా తెచ్చి భర్త చేతుల్లోపెట్టి - బొట్టు బిళ్ళలక్కూడా మొగుణ్ణి బిచ్చం అడుక్కుంటోంది!” చెప్పింది సత్య.

“ఉద్యోగం చేసే ఆడవాళ్ళు అలాంటి వాళ్ళకి బంగారు గుడ్లుపెట్టే బాతులు ! ఎంతకీ ఆ గుడ్లు ఆబగా తినేయాలన్న ధ్యాసే తప్ప - ఆ బాతులకీ ఆకలి వుంటుంది - వాటిక్కూడా మేత అవసరమన్న ఇంగితజ్ఞానం అలాంటి వాళ్ళకుండదు !” బాధ పడిపోయాడు గోపాల్.

“పైగా అతడెంత అనుమానప్పిశాచమంటే - పెళ్ళాం ఉద్యోగం చేయాలీ- కానీ మగాళ్లెవర్తో మాట్లాడొద్దు ! అవి చాలదని దాని వేరబౌట్స్ తెలుసుకోవడానికి ఓ సెల్ ఇచ్చాడు ! లంచ్ టైంలో ఫోన్లు చేస్తాడు ! టైం కి ఎత్తకపోతే ‘ఎవర్తో మాట్లాడ్తున్నావ్ ? ఫోన్ ఎత్తడం లేదు !’ అంటాడు! ఒకవేళ ఎత్తితే - ‘ఇంత తొందరగా ఫోన్ ఎత్తావ్! ఎవడనుకుని ఎత్తావ్?” అంటాడు” చెప్పింది సత్య.

గోపాల్ ఆశ్చర్యంగా వింటున్నాడు.

“ఇంకో సంగతి చెప్పనా ? అది ఆఫీసు నుంచి రాగానే - ఇది ఎవరికి ఫోన్ చేసిందో - ఎవరు దీనికి ఫోన్ చేసారో చూద్దామని - సెల్ లాక్కొని ‘రిసీవ్డ్ కాల్స్’, ‘డయల్డ్ కాల్స్’ చూస్తాడు ! అతడి విషయం తెలిసిన కొందరు - ఆమె సెల్‌కి - ఉత్తినే అతణ్ణి ఏడ్పించడానికి - కాయిన్ బాక్స్‌ల్లోంచి ‘మిస్‌డ్ కాల్స్’ ఇచ్చి వదిలేస్తారు! అది చూసి రెచ్చిపోయి - ఆ ఫోన్ నెంబర్స్ ఎవరివని

ఎంక్వైరీల్తో కాల్చుకు తింటాడు!" బాధపడ్తూ చెప్పింది సత్య.

"ఇంత అనుమానప్పిశాచులు మరి ఉద్యోగం మాన్పించవచ్చు కదా - ఇలా వేధించే బదులు ?" అన్నాడు గోపాల్.

"అబ్బే ! ఎలా మాన్పిస్తారు!? **అలాంటి వాళ్ళకి పెళ్ళాం కావాలీ - పెళ్ళాం సంపాదించే డబ్బూ కావాలీ - కానీ పెళ్ళాం మనసుతో, ఆమె వ్యక్తిత్వంతో పనిలేదు!"** చెప్పింది సత్య.

"మీ ఫ్రెండ్ చదువుకుందీ - ఉద్యోగం చేస్తోంది ! చదువూ - ఉద్యోగం లేని అమ్మాయిలే తిరగబడ్తున్నారు ! మీ ఫ్రెండ్ అతడికి 'గుడ్‌బై' కొట్టక ఎందుకు భరిస్తోంది !?" అడిగాడు గోపాల్.

"ఒకసారి విరక్తిపుట్టి అలాగే పుట్టింటికి వెళ్ళింది. లోకులకి జడిసి వాళ్ళ నాన్న దాన్ని తిట్టి - తిరిగి వెనక్కి పంపించాడు. అది అలుసుగా తీసుకుని అతడు మరింత పెట్రేగి పోయాడు. 'ఉద్యోగముందని డైవర్స్ తీసుకుందామనుకుంటున్నావేమో - నిన్ను చంపనైనా చంపుతాను గానీ చచ్చినా నీకు డైవర్స్ ఇవ్వను !' అని వేపుకు తింటున్నాడు!"

"అతడిచ్చేదేమిటి సత్యా !? మీ ఫ్రెండ్‌నే అతడికి విడాకుల నోటీస్ పంపించమను ! ప్రాణ భయం ఉందని పోలీస్ రిపోర్ట్ ఇస్తే తోక ముడుస్తాడు ! **కొన్ని కుక్కలంతే ! భయ'పడితే' - భయ'పెడ్తాయి' ! బెదిరించే కుక్కలని ఎదిరించాలే తప్ప- భయపడ్తూ కూర్చోకూడదు!** ఆమెకు మీరంతా పిరికి మందు నూరిపోయకండి! ధైర్యం చెప్పి ప్రతిఘటించడం నేర్పండి !" సలహా ఇచ్చాడు గోపాల్.

★★★

" అరుణా ! ఏమైంది డాళింగ్ ? ఎందుకలా దిగులుగా కూర్చున్నావ్?" అడిగాడు వరప్రసాద్ భార్య అరుణని.

భర్త మాటలకి ఆమె కళ్ళలో నీళ్ళు పెల్లుబికి వచ్చాయి !

"మా ఇంట్లో - నిన్ను ఎవరైనా - ఏమైనా అన్నారా ?"

"ఛఛ ! అదికాదు... అత్తయ్య గారి మంచితనం చూస్తూంటే నాకు మా అక్క గుర్తొచ్చి కన్నీళ్లొస్తున్నాయి!" అంది అరుణ కళ్ళు తుడ్చుకుంటూ.

"అసలేమైందో చెప్పు అరుణా?" అడిగాడు వరప్రసాద్ లాలనగా.

“మీ వాళ్ళు నా పెళ్ళికి కట్నం తీసుకోలేదు ! కానీ - మా నాన్న అప్పుచేసి కట్నమిచ్చి మా అక్కయ్య పెళ్ళిచేశాడు ! ఇంతచేసీ ఆమెకి - అత్తింట్లో ఆరళ్ళు తప్పట్లేవు.... అదే నా బాధ !”

“ఆరళ్ళా... అంటే !?” అడిగాడు వరప్రసాద్.

అంత బాధలోనూ భర్త అమాయకత్వానికి నవ్వొచ్చింది అరుణకి.

“మీరెప్పుడైనా ‘గృహ హింస’ అన్నపేరు విన్నారా ?”

ఏదో జీవహింస - జంతుహింస - చిత్రహింస తను ఈ పేర్లే విన్నాడు గానీ - ఈ గృహ హింస ఏమిటో.... వరప్రసాద్‌కి అర్థం కాలేదు.

అరుణని అడిగితే - ‘ఈ మాత్రం తెలీదా?’ అని తాటాకులు కడ్తుందేమో!? - వరప్రసాద్ ఆలోచిస్తున్నాడు.

అతడి మనుసులోని ఆలోచనలు పసిగట్టిందాన్లా చెప్పింది అరుణ:

“చూడండీ - నాకిక్కడ ఇంత స్వేచ్ఛవుందా ? మా అక్కయ్యని వాళ్ళత్తగారు మా ఇంటికి ఫోన్ చేయనీరు ! పోనీ వేము చేద్దామనుకుంటే - మాతో అది ఏమ్మాట్లాడ్తుందో విందామని... ఫోన్ మాట్లాడ్తున్నంతసేపూ - ఆవిడ దాని పక్కనే నించుంటారు ! అన్నింటికన్నా ఘోరం - వాళ్ళ ‘అత్తగారు ఇంట్లో లేరు’ అని అక్కతో మాకు ఫోన్ చేయించి - వాళ్ళ గురించి మేమేం మాట్లాడ్తామో వినాలనుకోవడం - విని, దాన్ని సాధించాలనుకోవడం !”

“ఉత్త శాడిస్టుల్లా వున్నారే...!” జాలిపడ్డాడు వరప్రసాద్.

“పోనీ దాన్ని పుట్టింటికి తీసుకొస్తేనైనా - కొన్నాళ్ళపాటు మా మధ్య నవ్వుతూ తుళ్ళుతూ ఉంటుందనుకుంటే - ఏడాదికోసారిగానీ పుట్టింటికి పంపించరు! పైగా పంపించేముందు - వాళ్ళ అత్తవారింటి గురించి పుట్టింట్లో ఏమీ చెప్పొద్దంటూ దాని మొగుడిమీద ఒట్టేయించు కొని మరీ పంపిస్తారు! వాళ్ళు గీచిన గీటు దాటదు అక్క!” చెప్పింది అరుణ.

“ఒట్టుకి కట్టుబడే వెర్రిబాగుల్ది కాబట్టి మీ అక్కనలా ఆడిస్తున్నట్టున్నారు అరుణా!” అన్నాడు వరప్రసాద్.

“ఇంటికి ఎవరొచ్చినా అక్కే కాఫీలూ - టిఫిన్లూ అందించాలి!

వాళ్ళతో నవ్వకూడదు ! మాట్లాడకూడదు ! పైగా వాళ్ళున్నంత సేపూ అది నిలబడే ఉండాలి ! ఒక్కమాటలో చెప్పాలంటే - **అత్తవారింట్లో ఆమె - జీతం భత్యం లేని పని మనిషి** - అంతే !"

"బొత్తిగా వెన్నెముకలేని మనిషమ్మా మీ బావ ! అలాంటి 'తల్లి కూచులు' పెళ్ళి చేసుకోకపోవడమే ఉత్తమం !" అంది అప్పుడే అటువేపు వచ్చిన వరప్రసాద్ తల్లి.

"అదేంటమ్మా ! నువ్వు తల్లివైవుండీ - తల్లి కూచులంటూ కొడుకుల్ని దుయ్యబడ్తూ కోడళ్ళ పక్షాన నించున్నావ్ ? రేపు ఒకవేళ నీకూ నీ కోడలికీ గొడవలొస్తే...!?" తల్లి చూడకుండా అరుణ వంక కన్నుగీటి - తల్లిని అడిగాడు వరప్రసాద్.

"అప్పుడు - నిన్ను నా కోడలి కొంగుచ్చుకోమంటాను ! అంతేగానీ పెళ్ళయ్యాక్కూడా - నువ్వు తల్లి చాటు బిడ్డవి కావటం నాకిష్టముండదురా! ఒకవేళ కోడలికీ నాకూ అంతగా పొసగక పోతే - మీరో ఇంట్లో... నేనోఇంట్లో వుంటాం- అంతే !" అంది తల్లి నవ్వుతూ.

"ఆ... నాకు తెలుసులేమ్మా ! ఆ వంకతో ఎంచక్కా నాన్నగారూ, మీరూ ఇద్దరే... చిలకాగోరింకల్లే... వుందామని మీ ఎత్తు !" అన్నాడు కొడుకు.

"బహుశా: ఆ ఎత్తు మీదై ఉంటుంది! అలాంటి ఆశలేవీ పెట్టుకోకండి! ఆ ఛాన్స్ నేను మీకిస్తే కదా అసలు!?" అంది అరుణ వరప్రసాద్‌ని ఆట పట్టిస్తూ.

"చూశావా ? మనిద్దరి ఎత్తుల్ని చిత్తుచేసే కోడలు నాకెలా దొరికిందో?" కోడల్ని చూస్తూ - మురిపెంగా చెప్పింది తల్లి కొడుకుతో.

★★★

"నా సరి నీవని - నీ సరి నేనని 'ఎపుడో' తెలిసెనులే".... కూని రాగం తీస్తూ ఇంట్లో అడుగెట్టాడు గోపాల్.

"ఏమిటో శ్రీవారు మాంచి హుషారులో వున్నారు ! పాట కూడా ఏదో పాడ్తున్నట్టున్నారు. ఏదీ మళ్ళీ పాడండి !" అడిగింది సత్య.

సత్య అడిగింది కదా అని రెండోసారి పాటెత్తుకున్నాడు గోపాల్ ఉత్సాహంగా.

"మీ సరి నేను కావొచ్చునేమోగానీ - నా సరి మీరేమిటీ.... చోద్యం కాకపోతే !?" ఆశ్చర్యం నటించింది సత్య.

"ఎందుకు ? నేను ఎందులో నీకు నీ 'సరి' కానో చెప్పు !?" ఉడుక్కున్నాడు గోపాల్.

"మీ ప్రశ్నకి సమాధానం నేను తర్వాత చెప్తాను గానీ - నేనోటి అడుగుతాను చెప్తారా ?" అడిగింది సత్య.

"అడుగు !" దిలాసాగా అన్నాడు గోపాల్.

"మనిద్దర్లో ఎవరికి ఎక్కువ బలం ఉందంటారూ ? మీకా - నాకా?" అడిగింది సత్య.

"ఇదేం ప్రశ్న సత్యా ? నిస్సందేహంగా నాకే !" హుషారుగా సమాధానం చెప్పాడు గోపాల్.

"ఇంకో ప్రశ్న అడగనా !?"

సత్యకేమైంది ఇవాళ - అన్నీ తిక్క ప్రశ్నలడుగుతోంది అనుకుంటూ: "వైనాట్ ? ష్యూర్ !" అన్నాడు గోపాల్

"మనిద్దర్లో ఇంతకీ ఎవరు సుకుమారులో చెప్పండి !"

గోపాల్ హుషారు ఆవిరైపోయింది.

"అదేమిటి సత్యా ? నీకెందుకు డౌట్ ? అయినా ఇదేం ప్రశ్న? చచ్చు ప్రశ్న !" అంటూ - తనెప్పుడైనా సత్యని మోటుగా ఉన్నావని అన్నాడా కొంపదీసి - ఆలోచిస్తున్నాడు గోపాల్.

"చెప్పరేం ?" రెట్టించింది.

"నువ్వే కదా సుకుమారివి! ఈ మాత్రం నాకు తెలీదా సత్యా ?" బదులిచ్చాడు గోపాల్ నీరసంగా.

"మీ రెండు సమాధానాలూ తప్పు !" తేల్చి చెప్పింది సత్య.

'అదెలా ?' తెల్లబోయాడు గోపాల్.

"బయటిపనీ - ఇంటిపనీ - రెంటినీ - ఒంటిచేత్తో - చేసుకునే - నేనేమిటీ 'సుకుమారి'ని ! బయటి పనే తప్ప - మరోపని ముట్టని- మీరేమిటీ 'బలశాలీ' - బడాయిగానీ....!" నవ్వింది సత్య.

గోపాల్‌కేమీ అర్థంగాక బుర్ర గోక్కున్నాడు.

"ఇప్పుడు చెప్పండి... నా 'సరి' నిజంగా మీరేనా ? పైగా.... ఇంకా... మీకది... **'ఎపుడో'** తెలిసిందా ?" ఉడికించింది సత్య.

"నిజమేనమ్మా ! **అర క్వింటాల్ బరువు అవలీలగా ఎత్తగలిగే ఈ మగధీరుడు - వంటింట్లో కాఫీ కప్పైనా కడుక్కోలేని సుకుమారుడు !** వాడెలా నీతో సరి తూగగలడు చెప్పు ? ఎంతైనా నీకు సరి నువ్వేనమ్మా!" తూచి చెప్పాడు మామ.

గోపాల్‌కేదో అర్థమైనట్టయింది.

ఆ మర్నాడు... ఆఫీస్‌నుండి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికొచ్చి అంట్ల గిన్నెలు ముందేసుకున్న సత్యకి - 'నీ అందాల చేతులు కందేను పాపం - ఎందుకు ఈ బెడదా? సాయం వలదా - ఓ చెయ్ వేసేదా ?' అంటూ అక్కినేని స్టైల్లో వేడి వేడి కాఫీ కప్పునందించాడు గోపాల్.

సంబరపడిపోయిన సత్య గోపాల్‌ని చూసి "నా సరి నీవని - నీ సరి నేనని - **'ఇపుడే'** తెలిసెనులే !" మురిపెంగా పాడుతూంటే - కోడలి గడుసుతనానికి ముసిముసిగా నవ్వుకుంది అత్త.

***'భూమిక' మంత్లీ***

***జనవరి-2013***

# .... పొదరిల్లూ మాది !



2005



అదో అందమైన భవంతి ! (అది... నాటి భారతదేశం!) అందులో ఎన్నెన్నో అందమైన గదులు! (అవి.... ఆనాటి రాజ్యాలు!) ఒక్కోగదిదీ ఒక్కో ప్రత్యేకత - ఒక్కో అందం !

ఎంతో కష్టపడి కట్టుకున్నారు కాబట్టి, పిల్లలు ఎవరి కిష్టమైన గదిని వాళ్ళు ఎంపికచేసుకున్నారు ! అంతపెద్ద భవంతికి, సొంతదారి అయిన అమ్మని పట్టుకుని: 'మేడంటే మేడా కాదు- గూడంటే గూడూ కాదు - పదిలంగా అల్లూకున్నా పొదరిల్లూ మాది' అంటూ కేరింతలు కొట్టారు - గంతులేసారు ఆ ఇంటి పిల్లలు !

పక్కింటి పిల్లలకి (పొరుగున వున్న విదేశీయులకి) ఈ కేరింతలు విన్పించాయి! 'వీళ్లింత ఆనందంగా ఉన్నారు కదా ! వీళ్ల ఆనందానికి కారణం ఏమైవుంటుందా?' అన్న కుతూహలంతో - తమ ఇంటి కిటికీలోంచి బయటికి తొంగిచూసారు! ఎదురిల్లు అందంగా - 'పచ్చ'గా కన్పించింది.

'అబ్బ !... ఆ ఇల్లు ఎంత బావుందో !' అనుకున్నారు.

'ఎప్పుడూ ఈ పాత ఇల్లేనా ? పొరుగింట్లో కొంత కాలం వుందాం!'

అనుకున్నారు.

అనుకున్నదే తడవుగా పొరుగింటికి బయల్దేరారు ! తలుపు తట్టారు!

'ఎవరా' అని తలుపుతీసిన పిల్లలు... చెప్పాపెట్టకుండా లోపలికి బిలబిలా వచ్చిన ఎదురింటి పిల్లల్ని చూసి షాక్ తిన్నారు !

ఒక్కక్షణం వాళ్ళ కండలు చూసి భయపడిపోయారు !

తామేమో పసి కూనలు !

ఎదుటి వాళ్ళు బలిష్టులు!

అప్పటికీ వాళ్ళలో బలమున్నవాళ్ళు... వాళ్ళని ఎదిరించారు ! బలం సరిపోని వాళ్ళు... చేష్టలుడిగి నించుండి పోయారు.

వచ్చిన వాళ్ళని అమ్మ చూసింది !

తన పిల్లలకి ఇంకా రెక్కలు రాలేదనుకుందో - వచ్చిన వాళ్ళు వెళ్లక పోతారా అనుకుందో - 'పోనీ, పక్కింటి పిల్లలే కదా !' అనుకుందో - అమ్మ ఆదరించిందీ, అన్నం పెట్టింది!

అమ్మ ఆదరణ మరిచి పోలేకో - ఈ ఇల్లు నచ్చో, వచ్చిన పిల్లలకి తిరిగి తమ ఇంటికి వెళ్ళాలనిపించలేదు సరికదా... 'అమ్మా! మీ పిల్లలతో పాటు మేమూ ఇక్కడే ఉండిపోతాం -' అన్నారు!

అమ్మది - విశాల హృదయం !

''సరే ఉండండి ! మిమ్మల్ని 'పెంపుడు కొడుకులు' అనుకుంటాను'' అంది !

అంతపెద్ద భవంతిలో ఎవరికిష్టమైన గదుల్లో వాళ్లుండి పోయారు!

ఆ పిల్లలూ - ఈ పిల్లలూ 'ఒక్కింటి పిల్లల్లా' కలిసి పోయారు !

అలా కొన్నాళ్లు గడిచాయి....

' బెలూన్సోయ్... బెలూన్స్! - రంగు రంగుల బెలూన్స్! చూడముచ్చటైన బెలూన్స్! కొనుక్కుంటారా ?' అంటూ వచ్చారు ఇరుగింటి 'తెల్ల పిల్లలు.' (ఆంగ్లేయులు)

బెలూన్స్‌ని చూడగానే పిల్లలు ఎగిరి గంతేశారు !

'పిల్లలు ముచ్చట పడ్తున్నారు కదా !' అని - అమ్మ - బెలూన్స్

అమ్మతోన్న పిల్లల్ని లోపలికి పిలిచింది. కొడుకులందరికీ - స్వ పర భేదాల్లేకుండా బెలూన్స్ కొనిచ్చింది.

మర్నాడు 'మిల్లు బట్టలు' తెచ్చారు ! అందాకా - ముతక బట్టలు కట్టుకున్న పిల్లలు మిల్లు బట్టల మీద మోజు పడ్డారు! అవీ కొనిచ్చింది అమ్మ.

రోజుకో కొత్త వస్తువు చూపించడం మొదలెట్టారు తెల్ల పిల్లలు! ఒక రోజు ఉప్పూ, మరో రోజు చక్కెరా - ఇంకో రోజు గాజులూ.

గాజులు చూసి అమ్మ ముచ్చట పడింది !

ఇంట్లోకి రానిచ్చి చాప పరిచింది !

అమ్మ మంచితనం, అమాయకత్వం ఆసరా చేసుకుని - అదే అదనుగా అప్పటిదాకా చాపమీద కూర్చున్న తెల్ల పిల్లలు లేచి, అమ్మగదిలోకి తొంగిచూసారు.

అన్ని గదులకూ తాళాలు వేసి - అమ్మ ఆదమరిచి నిద్రపోతోన్న సమయం చూసుకుని- అమ్మ బొడ్లో దోపుకున్న తాళంచెవి గుత్తిని సంగ్రహించి - ఉక్కుదుటున ఇంట్లోకి చొచ్చుకువచ్చారు తెల్ల పిల్లలు!

అదేమీ తెలీని అమ్మ హాయిగా... నిశ్చింతగా... నిద్రపోతూనే వుంది!

ఒక్కో గదినీ తెరిచారు తెల్లపిల్లలు. కిర్రుమన్నాయి తలుపులు! ఉలిక్కిపడిలేచారు ఆ ఇంటి పిల్లలు. ఆ పిల్లలింకా కళ్ళు నులుముకోకముందే... మెరుపు వేగంతో... పిస్టల్స్ తీసారు. బిక్కుబిక్కుమని చూస్తోన్న పిరిగ్గొడ్డుల్ని భయపెట్టారు! ప్రతిఘటించిన వాళ్ళని మట్టుపెట్టారు ! అయోమయంలో ఉన్నవారిని మచ్చిక చేసుకున్నారు ! ఎలాగైతేనేం... అన్ని గదుల మీదా పట్టు సాధించి, అందర్నీ లొంగదీసుకున్నారు!

కొద్దికాలం గడిచింది. తెల్లపిల్లల అరాచకాలు మొదలయ్యాయి. తమ అడగులకి మడుగులొత్తాలని తెల్లపిల్లలు శాసించినపుడు గానీ- తాము పోగొట్టుకుందేమిటో ఈ ఇంటి పిల్లలకి తెలిసి రాలేదు!

క్రమేణా... తెల్లపిల్లల పట్ల వ్యతిరేకత ప్రబలింది ! తమ ఇంట్లో

పరాయి పిల్లల అజమాయిషీ ఏమిటనుకున్నారు ! ముఖ్యంగా 'తూర్పుగది'లో ఉన్న బెంగాలీ పిల్లల్లో చైతన్యం మొదలైంది ! ఆలోచనలు రేకెత్తించే అంశాలతో ఆర్టికల్స్ రాయడం మొదలెట్టారు!

తెల్లపిల్లలు అది పసిగట్టేసారు ! ఈ నిరసన ధోరణి ఉధృతం కాకముందే - దాన్ని అణిచి వేయాలనుకున్నారు ! ఆ నిరసన జ్వాలల్ని ఎలా ఆర్పాలా - ఆ పచ్చని ఇంట్లో ఎలా చిచ్చు పెట్టాలా అని పథకాలు వేసారు !

ఏ గదిలో కన్న కొడుకులున్నారో - ఏ గదిలో పెంపుడు కొడుకులున్నారో ఆరా తీశారు ! ఏ గదులు 'కలిపి'తే - ఏ గదుల మధ్య 'అడ్డుగోడలు కడ్తే' - ఏ పిల్లలు మైనార్టీలో పడ్తారో లెక్కలేసారు!

అందుకు తూర్పుగదే అనువైనదిగా ఎంచుకున్నారు !

అనుకున్న వెంటనే.... 'ఆ గదిలో అడ్డుగోడ కడ్తాం!' అన్నారు తెల్లపిల్లలు.

'ఒద్దు' అన్నారు ఈ పిల్లలు !

అయినా తెల్ల పిల్లలు విన్పించుకోలేదు ! ఆ గది విభజనకి హుకుం జారీచేశారు!

అంతే - ఆ తెల్ల పిల్లల కుతంత్రాలకి రగిలి, ఈ పిల్లలంతా ఏకమయ్యారు!

అమ్మని తలచుకున్నారు! అంతకు ముందెప్పుడో - ముప్పైఏళ్ళకిందట - బంకిం చంద్ర చటర్జీ రాసిన 'వందేమాతరం'ని పల్లవిగా చేసుకుని - 'వందేమాతరం' అంటూ ఉద్యమించారు! అందరూ ఒకటై - 'మనకీ విదేశీ వస్తువులొద్దు - 'స్వదేశీ' వస్తువులనే వాడుదాం' అంటూ.... అన్నాళ్లూ తెల్ల పిల్లలు తమకిచ్చిన వస్తువులన్నీ గుట్టలు గుట్టలుగా పోసి నిప్పంటించారు!


అలా జాతి ఒకటైంది ! వందేమాతరం ఉద్యమం... ఇలా జాతీయోద్యమానికి బీజం వేసింది.

*(29-8-2005 రోజు నిజామాబాద్‌లో జరిగిన 'వందేమాతరం' వందేళ్ళ శతజయంత్యుత్సవాల సందర్భంగా... ప్రసంగ పాఠం)*





2004



'ఆ తోటలోనొకటి ఆరాధనాలయం... ఆ ఆలయంలోని అందగాడెవరే!' అంటూ - ఈ తోటలోనున్న అందగాడిమీద మనసు పారేసుకున్న ఒకానొక దేశపు చిన్నది - చివరకు - ఆ అందగాడిని మనువాడి - కోటి కోరికలతో ఈ దేశంలో అడుగెట్టింది!

కొత్తకోడలికి హారతులతో స్వాగతం పలికారు అత్తగారు. తోటి కోడళ్లు మాత్రం... 'వచ్చింది తమ బంధువుల పిల్లకాదు - పరాయి పిల్ల!' అని మూతి విరిచారు!

'పరాయి పిల్లయితేనేం ? ఇంట్లో పనులన్నీ ఎంచక్కా చక్కబెడు తోంది! మంచి పనిమంతురాలు!' అని మురిసిపోయారు ఆడ పడుచులు!

అందర్తో కలవిడిగా తలలో నాలుకలా మసులుకున్న ఆమె రాన్రానూ అత్తగారి మనసూ, ఆడపడుచుల మనసూ చూరగొంది! ఇద్దరు పిల్లలకి తల్లి కూడా అయింది!

కొన్నాళ్ళు గడిచాయి!

ఏమరిపాటున ఉన్న వాళ్ళ అత్తగారు పనివాళ్ళ చేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారు! ఆడపడచులందరూ కలిసి - కోడలు వద్దని వారిస్తున్నా వినకుండా - బలవంతంగా ఆ ఇంటి 'తాళంచెవి'ని కొడుక్కి అప్పగించారు!

ఎంతో అన్యోన్యంగా సాగిన వారి సంసారంలో - ఊహించని సంఘటన చోటు చేసుకుంది! తల్లిలాగే - మరో ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు కొడుకు!

అలా వెన్వెంటనే జరిగిన రెండు అకాల మరణాలకి తట్టుకోలేక 'ఆ తాళం చెవి' ఈసారి కోడలికి ఇవ్వాలని తీర్మానించుకున్నారు ఆడపడుచులు!

అప్పుడు మొదలయింది అసలు గొడవ!

'నువ్వా 'పక్కింటి' దానివి!- మేమా 'ఒక్కింటి' వాళ్ళం! పరాయి దానివి.... నిన్ను నమ్మి - మా ఇంటి తాళంచెవి నీకెలా ఇచ్చేది?' పేచీ పెట్టారు తోటికోడళ్ళు.

'చట్ట ప్రకారంగా ఆమె ఈ ఇంటికోడలై - మా ఇద్దరికీ జన్మనిచ్చి - ముప్ఫై ఏళ్ళుగా ఈ ఇంట్లోనే ఉంటోంది! - ఇంకా ఆమె పరాయి మనిషేమిటి- అబ్సర్డ్!' విస్తుపోయారు కన్న పిల్లలు.

'అదంతే! రేపు ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోతుందేమో!? మన ఇంటి తాళం చెవిని ఆమెకి అప్పగిస్తే - వెళ్తూ వెళ్తూ మన ఇనప్పెట్టెలోని డబ్బూ, దస్కం ఎత్తుకుపోతుందేమో?' అనుమానం వెలిబుచ్చారు తోటి కోడళ్ళు.

'అదేమిటి? - ఎంత అన్యాయం? - ఈ ఇంట్లో మా అమ్మ

స్థానం- కేవలం పిల్లల్ని కని పారెయ్యడానికి మాత్రమే- పనికొచ్చే యంత్రమా మీ దృష్టిలో? ఆమెకో వ్యక్తిత్వం లేదా ? ఆమె ఈ ఇంట్లో 'ఊడిగం' చేయడానికే తప్ప అధికారం చెలాయించడానికి 'అర్హత' లేని మనిషా?' పిల్లల మనసు కుతకుతా ఉడికిపోతోంది!

'ఆ రోజు మీ నాన్నకి చిలక్కి చెప్పినట్టు చెప్పాం ! ఈ సంబంధం వొద్దురా అంటే విన్నాడు కాదు! ప్రేమా ప్రేమంటూ పక్కింటి పిల్లని పెళ్ళాడాడు! వాడు మేనరికం చేసుకునివుంటే - ఇప్పుడు మీకీ కష్టాలు వచ్చేవా?' సానుభూతి నటించారు... ఆ పిల్లల పిన్నమ్మలు.

'అసలు ఇలాంటి అనుమానప్పిశాచులు - విదేశీ మహిళల్ని పెళ్ళి చేసుకోవద్దనే 'కట్టడీ' చేసుకుని - అన్నీ మేనరికాలే చేసుకుంటే సరిపోయేదిగా - ఇలా పరాయి గడ్డమీది ఆడపిల్లల ఉసురుపోసు కునే బదులు!' చీదరించుకున్నారు జరుగుతోన్న తంతంతా వింతగా చూస్తోన్న ఇరుగు పొరుగు వాళ్ళు.

'అబ్బో ఇంటి తాళం చెవి మీ అమ్మకి అప్పగిస్తే ఇంకేమన్నా ఉందా? ఇంటి రహస్యాలు ఆమె తన పుట్టింటికి చేరవేస్తుంది! వాళ్ళ పుట్టింటి వాళ్ళు - మనింటి మీదికొస్తే - మన కొంప కొల్లేరవుతుంది!' గుండెలు బాదుకున్నారు తోటికోడళ్ళు!

'ఛ! నమ్మకంలేని చోట - తప్పించుకోలేని సేవలేమిటి... తనవి?' ఈటెల్లా తగుల్తోన్న మాటలు వింటూ పేలవంగా నవ్వుకుంది ఆమె.

జరుగుతోన్న పరిణామాలపట్ల నిశ్చేష్టులై నిలబడిపోయిన ఆడ పడచుల గుండెలు అవిసిపోయాయి! కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పట్టుదల పెరిగింది. తాళం చెవి ఆమెకే ఇవ్వాలని తీర్మానించుకు న్నారు.

'ఇంతదాకా వచ్చి - మీరిప్పుడు తప్పుకుంటే - అది మీ ఆత్మ గౌరవానికి భంగం కాదా?' ఆడపడుచుల మనసు ఆక్రోశించింది.

'మా ఇంటి గౌరవం కన్నా - ఆమె 'ఆత్మగౌరవం' అంత ముఖ్యమైందేం కాదు!' అంటూ ఇంటి వంశ ప్రతిష్ఠల చిట్టా విప్పారు తోటికోడళ్ళు.

పిల్లల పిడికిళ్ళు బిగిసుకున్నాయి!

'అసలు... ఆ తాళం చెవి కొరకు ఏడుస్తోందెవరు ? మా అమ్మకి

కావలసింది... ఈ అధికారాలూ - పెత్తనాలూ కాదు! మాతో, మా నాన్న జ్ఞాపకాలతో ఈ ఇంట్లో ప్రశాంతంగా గడపడం! మాకు ఏ అధికారాలూ వద్దు' అంటూ మేనత్తల చేతుల్లో ఉన్న తాళంచెవి లాక్కుని - విసిరివేయడానికి చెయ్యెత్తారు పిల్లలు!

ఆమె తన పిల్లలని వారించి - ఆ తాళం చెవిని కళ్లకద్దుకుని- ఎవరూ ఊహించని రీతిలో - అందరి సమక్షంలో - దాన్ని తన మరిది చేతుల్లో పెట్టి - రంగం నుండి తప్పుకుంది... ఎంతో హుందాగా.

అప్పటిదాకా 'ఆమె తాళం చెవి ఇవ్వదు గాక ఇవ్వదు' అని ఆ విషయంలో పందాలు వేసుకుని - గగ్గోలు సృష్టించి, నానా హంగామా చేసి - హింసిద్దామని  కాచుక్కూర్చున్న వాళ్ళకి .. సమస్య అంత 'సులువు'గా పరిష్కారం కావడం - ఆశాభంగం కలిగించింది!

ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని పొడవందే - కరవందే పొద్దుపోని మనుషులు కదా కొందరు! దెబ్బ తగిలిన వాళ్ళు... ఆ గాయాలతో విలవిల్లాడుతూ - గిలగిలా కొట్టుకుంటూంటే - గలగలా నవ్వుకునే పైశాచిక  ప్రవృత్తి కదా మనుషులది!

అందుకే - ఈసారి కొత్త అస్త్రాలు సంధించేందుకు సిద్ధమయ్యారు!

'అబ్బో! తాళం చెవి ఇచ్చినట్టే ఇచ్చి - మరిది చాటున మళ్ళీ తానే అధికారం చెలాయించవచ్చని ఆశ! అబ్బ - ఏం ఎత్తు - ఏం ఎత్తూ!?'.... అంటూ కుళ్ళబొడిచారు!

'త్యాగం ముసుగులో... ఎంత తెలివీ! ఏం తెలివీ!'... అంటూ పీక్కుతిన్నారు!

అలా కోడిగుడ్డుకు ఈకలు పీకే కార్యక్రమాన్ని - అమితోత్సాహంగా- భుజాలకెత్తుకున్నారు!

★★★

అవునూ.... మనకి హింస... చిత్రహింస.... గృహహింస... ఇవన్నీ తెలుసు కదా-

మరి  -

పుట్టిన దేశం వదిలి - నచ్చినవాడ్ని కట్టుకుని - కట్టుబట్టల్తో పర

దేశంలో కాలెట్టిన విదేశీ మహిళ పట్ల -

ఆమెకి పౌరసత్వం వచ్చాక కూడా ఇంకా - 'ఆమె... స్వదేశీ కాదు విదేశీ' అంటూ చూపించే వివక్ష....

విదేశీ  కోడళ్ళపై - స్వదేశీ వేధింపులు...

నిజానికి ఏ హింస కిందికి వస్తాయో... దీనికి ఎవర్ని శిక్షించాలో - బాధితుల్ని ఎలా రక్షించాలో... ఆలోచించకపోవడమే విడ్డూరం!

గ్లోబలైజేషన్‌లో ప్రపంచమే ఓ కుగ్రామమై పోతోన్న ఈ రోజుల్లో..... వసుధైక కుటుంబంలో - ఓ వనితను అనుక్షణం అనుమానించడం- అవమానించడం, అవహేళన చేయడం... బాధితుల పట్ల... క్షమార్హంగాని మన 'ఉపేక్ష'కి ఓ సంకేతం!

***2004- మే***

# నేను సైతం"



1992



ఆదివారం ! స్కూల్‌లేదు ! మమ్మీ 'లయనెస్ క్లబ్' మీటింగ్‌కి వెళ్ళింది ! డాడీకేదో సెమినారట ! కాలేజీకి వెళ్ళారు ! నాకేమీ తోచక కిటికీలోంచి రోడ్డు మీద వచ్చేపోయే జనాన్ని చూస్తున్నాను.

ఎక్కడినుండో లంబాడీ పాట విన్పిస్తోంది. చెవులు రిక్కించాను.

నేను 'స్కూల్ డే' కి లంబాడీ డాన్స్ చేసినప్పటి నుండీ - లంబాడీ డ్రెస్సన్నా - వాళ్ల పాటన్నా నాకేమిటో ఓ క్రేజ్! రానురానూ పాట దగ్గరైంది ! లంబాడీ వాళ్ళంతా ఎడ్లబండ్లపై వస్తూ - పాట పాడుకుంటున్నారు.

ఇంకో క్షణం గడిస్తే - వాళ్ళు నాకిక కన్పించకుండా పోతారు !

ఎలా ?

ఒక్కుదుటున కిటికీ వదిలి - గబగబా గదిలోంచి బయటికి వచ్చి గుమ్మం ముందు నించున్నాను.

అమ్మయ్య ! లంబాడీ వాళ్ళు మా ఇంటి ముందే బండ్లు ఆపుకున్నారు ! ఫర్వాలేదు... వాళ్ళను నేను ఇంకాసేపు చూడొచ్చు! అవేవో వంట సామాన్లు బండిలోంచి ఒక్కొక్కటే తీస్తున్నారు ! ఒకావిడ ఎక్కడికో వెళ్ళి, మూడు రాళ్ళు తెచ్చి 'పొయ్యి'లా పేర్చింది! మరో ఆవిడ బిందె తీసుకుని మా ఇంటి వేపే వస్తోంది ! ఆమెని గేట్ కీపర్ లోపలికి రానీయట్లేదు ! నీళ్ళు కావాలేమో....!? నీళ్ళు ఇవ్వకపోతే ఇంకో చోటుకి వెళ్ళి పోతారేమో !?

" సలీం ! పాపం వాళ్ళకి నీళ్ళివ్వు !' బతిమాలాను.

" వాళ్ళను లోపలికి రానిస్తే - లాన్ అంతా ఖరాబు చేస్తారమ్మా!" సలీం అడ్డుకున్నాడు.

" పోనీ - నువ్వే మన బిందెతో నీళ్లు తెచ్చి - వాళ్ళ బిందెలో పొయ్యి ! సలీం, ప్లీజ్ సలీం !"

మమ్మీ కోప్పడ్తుందని సలీంకో భయం ! ఏ కళనున్నాడోగానీ అతడు సణుక్కుంటూ - గొణుక్కుంటూ వెళ్ళి నీళ్ళు తెచ్చిచ్చాడు.

ఆ లంబాడీ ఆమె నీళ్ళు తీసుకొని వెళ్ళి - వంట మొదలెట్టింది! అదేం పిండో తెలీదు ! మస్టర్డ్ కలర్ పిండి ! దాంతో రొట్టెలు చేస్తోంది ! వాళ్ళాయన కాబోలు కట్టెపుల్లలు ఏరుకొచ్చాడు!

మరో ఆవిడ - ఎర్రటి కారం - తమ వెంట తెచ్చుకున్న రోట్లో రుబ్బుతోంది ! ఇంకో ముసలావిడ వంకాయలు తరిగి - కూర వండేసింది !

అంతదాకా ఎక్కడున్నారోగానీ - చిన్న చిన్న పిల్లలు - బండిలోంచి బిలబిలా దిగారు!

పెద్ద పిల్ల - నా వయస్సుందేమో !? ఆమెకో తమ్ముడూ -

చెల్లాయి ! ఇప్పుడిప్పుడే పాకుతోంది ! అరే - ఛీ - అదేమిటీ మట్టి తింటోంది ! వాళ్ళు ఎవరూ ఆ పాపని పట్టించుకోరేం ?

మా సైన్స్ మాస్టారు చెప్తారుగా - మట్టి తింటే కడుపులో - అవేవో పాములు పెరుగుతాయనీ !

ఆ పాప కడుపులో ఎన్ని పాములున్నాయో ఏమో !?

ఆ పెద్ద పిల్ల ఎంత తెల్లగా వుందీ !? పాపం... బట్టలే మురిగ్గా ఉన్నాయి ! అవునూ... ఫ్రాకులంటే గుర్తొచ్చిందీ - నాకు పొట్టి అయిపోయాయని మమ్మీ బీరువాలో కొన్ని ఫ్రాకులు కుక్కేసింది! అవి వీళ్ళకి ఇచ్చేస్తే సరి!

అవునూ.... మనకున్నదాంట్లో - ఎంతో కొంత - ఇతరులకి దానం చెయ్యాలని మా తెలుగు టీచర్ చెప్తారుగా ! నాకంటూ ఉంది... నా పాత ఫ్రాకులే కదా ! అయినా... అవి పాతవన్న పేరేగానీ... ఎంత కొత్తగా ఉంటాయనీ !

ఆ లంబాడీ పిల్ల అవి వేసుకోవాలేగాని - ఆ డ్రెస్సులో నాకన్నా అందంగా ఉంటుంది !

గబగబా లోపలికి పరిగెత్తాను ! కీ బోర్డ్ దగ్గరికి వెళ్ళి - కీ తీసుకుని పాత బీరువా తెరిచాను ! స్టూల్ వేసుకొని ఎక్కి - బీరువాలోని ఫ్రాకులన్నీ చిందరవందర చేసి - నేను ఇవ్వాలనుకున్న ఫ్రాక్స్ చేజిక్కించుకుని - బీరువాకి తాళం వేసి - వరండాలోకి వచ్చాను.

లంబాడీ వాళ్ళ వంటయి పోయింది ! ఆకల్తో ఉన్నారేమో.... పిల్లలంతా ఆవురావురుమంటూ కంచాల ముందు కూర్చున్నారు !

వీళ్ళు ఎంత అదృష్టవంతులు!? ఎంచక్కా రోజూ పిక్నిక్‌లా - రోజుకో ఊర్లో తినొచ్చు !

ఎక్కడ్నుంచో గాలి చల్లగా వీస్తోంది ! - ఏదో మట్టి వాసన ! ఈ వాసన మమ్మీకి ఇష్టం ! ఇలాంటి వాసనొచ్చినప్పుడల్లా మమ్మీ అంటుంది: “ దగ్గర్లో ఎక్కడో వర్షం పడ్తోంది ! ఇక మనక్కూడా వర్షం పడ్తుంది ” అని !

అరెరె.... నిజంగానే టపటప మని చినుకులు వచ్చేస్తున్నాయే ! అయ్యయ్యో ! లంబాడీ పిల్లలంతా చిందర వందరై ‘కీ-కా’ అని అరిచేస్తున్నారు !

పాపం ! వాళ్ళు రొట్టెలు తినడానికి అలా కూర్చున్నారో లేదో - ఇటు వర్షం వచ్చేసింది! పాడు వాన ! ఇప్పుడే రావాలా !? - వాళ్ళు ఎలా తింటారిప్పుడు ?

అయ్యో - వర్షం అంతకంతకీ పెద్దదైపోతోందే - ఎలా ? - ఆ లంబాడీ ముసల్ది- ఆ పిల్లల్ని తీసుకుని బండి కింద నక్కింది !

ఆ గాలికి, నాకూ వణుకు వచ్చేస్తోంది! వెళ్ళి స్వెటర్ తెచ్చివేసుకున్నాను.

అరె - వాకిట్లో తెల్లగా - టప టపా... ఐస్ ముక్కలు పడ్తున్నాయ్! మమ్మీచెప్పే వడగళ్ళ వాన అంటే ఇదేనేమో ! ఆ లంబాడీ పిల్లల తల్లి - ఆ రాళ్ళు తన పిల్లలకి తగలకుండా - వంటగిన్నెలని వాళ్ళ తలల మీద కప్పుతోంది! అయినా అవి చాలట్లేదు! ఏ మూలనించో రివ్వురివ్వున... ఐస్ ముక్కలొచ్చి వాళ్ళకి తగుల్తున్నాయి!

నా కెందుకో ఆ ఐస్ ముక్కలు తగిల్తే.... ఎంత నొప్పెడ్తుందో చూడాలనిపించి- వాకిట్లో నించున్నాను! బాబోయ్ !.... చుర్రుచుర్రున తగుల్తున్నాయ్ ! పాపం ఆ లంబాడీ పిల్లలు ఎలా తట్టుకుంటున్నారో ఏమో ?

పోనీ వాళ్ళని వాన తగ్గేదాకా లోపలికి రమ్మని పిలిస్తే...!?

ప్చ్ ! ఈ సలీం రానిస్తాడా ? ఒకసారి ట్రై చేసి చూస్తే తప్పే ముంది?

"సలీం ! వాళ్ళని లోపలికి రానీ ! వర్షం తగ్గేదాకా ఈ సిటౌట్లో కూర్చుని వెళ్ళిపోతారు!" వరండాలోంచి సలీంకి వినిపించేలా అరిచాను.

" వద్దమ్మా ! ఈ బురద కాళ్ళతో - గోడల్నీ - ఫ్లోరింగ్‌నీ పాడు చేస్తారు ! అమ్మగారు వచ్చారంటే నన్ను కోప్పడ్తారు !"

సలీం చెప్పింది నిజమే ! నేను ఏ ఫ్రెండ్స్‌ని తీసుకొచ్చినా - మమ్మీ మమ్మల్నో కంట కనిపెడ్తూనే ఉంటుంది ! కాళ్ళు వెనక్కి మడిచి - గోడలకి కాలు ఆన్చి నించోవద్దనీ - స్వీట్లూ హాట్లూ తిని - న్యాప్‌కిన్‌కి తుడుచుకోకుండా - ఆ చేతుల్తో గోడల్నీ - సోఫాల్నీ ముట్టుకోవద్దనీ - ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూ ఉంటుంది ! ఇల్లు ఎప్పుడూ అద్దంలా తళతళా మెరవాలంటుంది !

" బాబోయ్ ! మీ ఇంటికి రావాలంటే మాకు భయం !"

అంటారు తన ఫ్రెండ్స్! అలాంటిది... ఇప్పుడు ఈ లంబాడీ వాళ్ళని సలీం చెప్పినట్లు బురద కాళ్ళతో రానిస్తే- ఇంకేమన్నా ఉందా ?

వర్షం ఇంకా పెద్దదైంది ! దానికి తోడు గాలి ! చెట్లు విరిగి పడిపోతున్నాయి ! వాళ్ళ వంట సామాన్లు కూడా గాలికి కొట్టుకుపోతున్నాయి. బండికి కట్టిన ఎద్దులు తాళ్ళు తెంచుకోవడానికి కుమ్ముకుంటున్నాయి ! లంబాడీ వాళ్ళు సలీం దగ్గరకు వచ్చి లోపలికి వస్తామన్నట్టు బతిమాల్తున్నారు ! దణ్ణాలు పెడ్తున్నారు ! సలీం రానీయట్లేదు !

" సలీం ! వాళ్ళని లోపలికి రానీ !"

" వీల్లేదమ్మా ! నా ఉద్యోగం పోతుంది !"

" సలీం - నువ్వు వాళ్ళని లోపలికి రానీకపోతే - నేను కూడా ఈ వర్షంలోనే ఈ గేట్ దగ్గరే నించుంటా ? గొంతు చించుకు పోయేలా ఏడుస్తా ! నీ ఇష్టం ! ఆ తర్వాత నాకేమైనా జ్వరం వస్తే - నీ వల్లే వచ్చిందని మమ్మీకి చెప్తా !"

సలీం చేసేదేం లేక - వాళ్ళని లోపలికి రానిచ్చాడు !

బీరువాలోంచి తీసిన ఫ్రాక్స్ ఆ పిల్లలకిచ్చాను ! వాళ్ళమ్మ కళ్ళు మెరిసాయి ! ఆమె ఎంతో సంతోషంతో - తన పిల్లల తడిబట్టలు విప్పి - పిండేసి - నేనిచ్చిన బట్టల్ని తొడిగింది.

సిటౌట్ లోని ఫ్లోరంతా బురదగా తయారైంది. ఆ లంబాడీ పిల్లల తండ్రి కాబోలు- ఎంచక్కా చుట్ట నోట్లో పెట్టుకొని దర్జాగా కాల్చేస్తున్నాడు ! ఏమిటో వెగటు వాసన!

" ఇదిగో - నీ పేరేమిటోగానీ - ఇక్కడ చుట్ట కాల్చకూడదు !" అదేమిటో ఇప్పుడు నేను మమ్మీలా శాసిస్తున్నాను !

లంబాడీ పిల్లోడు పాకుతూ వెళ్ళి మూలన ఉన్న టీపాయ్ లాగేసాడు ! ఇంకో నిముషం నేను ఆలస్యంచేసి ఉంటే - దాని మీద ఉన్న పూలకుండీ కిందపడి పగిలిపోయేది ! ఆ పూల మొక్క ఖరీదు వంద రూపాయలు! థాంక్ గాడ్ ! దాన్ని పగలనీకుండా జాగ్రత్త పడ్డాను ! ఆ లంబాడీ ఆవిడ - ఆ పాపని తన ఒళ్ళోకి తీసుకుంది.

ఇంతలో గేట్ముందు కారు హారన్ విన్పించింది.

సలీం, నేనూ ఒక్కసారిగా తుళ్ళిపడ్డాం. సలీం పరుగున వెళ్ళి

గేట్ తీశాడు.

బాబోయ్ ! మమ్మీ !

కారుడోర్ తెరుస్తూనే నా వంకా- లంబాడీ వాళ్ళ వంకా- ఫ్లోర్‌కి అంటిన బురద వంకా - మార్చి మార్చి చూసింది మమ్మీ !

" మమ్మీ ! వర్షం బాగా పడ్తోంది కదా ! వాళ్ళకి ఇల్లులేదు ! ఈ పాపాయి చూడూ! ఎంత చిన్నపిల్లో ? తడిసిపోయి... వణుకుతూంటే నేనే పిలిచాను ! పాపం... వాళ్ళ రొట్టెలు కూడా తడిసి పోయాయి! కావాలంటే ఈ ఫ్లోర్ నేను తుడుస్తా! వాళ్ళనేమీ అనకు మమ్మీ - ప్లీజ్ !" నుదుట మీద పట్టిన చెమట తుడుచుకుంటూ- గబగబా పాఠం అప్పజెప్పేసాను!

అదేమిటో - మమ్మీ ఏమీ అన్లేదు ! తుఫాను వచ్చేముందు ప్రశాంతత అని మా మాష్టారు అంటారే ! అది ఇదేనా ?

" సలీం - కార్లో బిస్కట్లూ - అరటి పళ్ళూ ఉన్నాయి ! అవి తెచ్చి, ఆ పిల్లలకి ఇవ్వు - వీళ్ళందరికీ మన అవుట్ హౌజ్ చూపించు!" మమ్మీ చెప్పింది.

నా కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి !

" మమ్మీ... మరి మొన్న నువ్వు నా క్లాస్‌మేట్ కిరణ్ బురద కాళ్ళతో వస్తే....."

నా మాటలు పూర్తి కానేలేదు !

" పిచ్చి మొద్దూ ! నీలాంటి వాళ్ళూ... కిరణ్ లాంటి వాళ్ళూ..... నాగరికత తెలిసిన పేరెంట్స్ పిల్లలు ! అయినా... మీ బుద్ధులూ... అలవాట్లూ ఇంకా అనాగరికంగానే ఉన్నాయనిపిస్తే... నేను మధ్య మధ్య మీకు గుర్తు చేస్తూ ఉంటాను! గోడలు పాడయితే... మళ్ళీ బాగు చేసుకుంటాం ! కాని సమయం గడిచిపోతే... వాళ్ళకి సాయం చేయగలిగే వాళ్ళమా? ఇంత గాలీ వర్షంలో వాళ్ళనలా గాలికి వదిలేస్తే... అది నాగరికత అన్పించుకుంటుందా ?"

ఏమిటో - హిస్టరీ మాష్టారు అస్తమానం సింధూ నాగరికత, మెసపొటేమియా నాగరికత అంటూ - ఆ రోజుల్లో వాళ్ళు ఉపయోగించిన పాత్రలూ - జీవిత విధానం... ఏమిటేమిటో చెప్తారు.

ఆనాడు మాష్టారు చెప్పిన నాగరికత ఏమిటో అర్థం కాలేదుగానీ...

మమ్మీ చెప్పిన నాగరికత ఏమిటో మాత్రం - బాగా అర్థమైందిప్పుడు!

ఎక్కడి నుండో 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చా....' పాట విన్పిస్తోంది !

అది శ్రీశ్రీ రాశారట !

దాని అర్థం ఏమిటో రేపు తెలుగు మాష్టార్ని అడగాలి !

*'ఆంధ్రభూమి' సచిత్ర వార పత్రిక,*

***తేదీ : 3-12-1992***







**1989**

"అటెండెన్స్ ప్లీజ్ !"

అంతవరకూ రణగొణ ధ్వనుల్తో అల్లకల్లోలంగా వున్న క్లాస్‌రూం చీమ చిటుక్కుమన్నా విన్పించేంత నిశ్శబ్దంగా మారిపోయింది.

"అమ్మా - మీ క్లాసులో బీసీ, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు ఎంతమంది వున్నారో ఈ లిస్ట్‌మీద రాసి పంపమన్నారు ప్రిన్సిపాల్‌గారు !"

అటెండర్ లిస్ట్ అందించాడు.

క్లాసులో రణగొణ మొదలైంది.

'సైలెన్స్ ప్లీజ్ ! సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ వాళ్ళు ఏవో స్కాలర్‌షిప్స్ ఇస్తార్ట! వాళ్ళకి మీ వివరాలు కావాలి ! మీ క్లాస్‌కి నేను కొత్త కాబట్టి, చెప్పండమ్మా మీలో ఎంత మంది ఎస్సీలో - మీవి ఏయే కులాలో ?'' అడిగింది అరుణ.

క్లాసులో కొంతమంది లేచారు ! అరుణ పేర్లు రాసుకుంది ! ఎస్టీ, ఎస్సీ, బీసీ- ఎవరి లిస్ట్ వారికి సెపరేట్‌గా తయారుచేసి- బాల్‌పెన్ నొక్కి బ్యాగులో పడేసింది!

''మేడమ్ ! కిరణ్ బీసీ ! కాని ఆవిషయం చెప్పడంలేదు !'' విమల చెప్పింది.

''ఏమ్మా కిరణ్ ! విమల చెప్తోంది... నిజమేనా ?'' అడగడానికి ఇబ్బందిగా ఫీలవుతూనే అడిగింది అరుణ.

''నిజమే మేడమ్ ! కానీ కులాలపేర నాకు స్కాలర్ షిప్స్ రావడం యిష్టం లేదు! నాకది ఇష్టంలేదు ! అందుకే నేచెప్పలేదు !'' మనసు విప్పింది కిరణ్.

సంభ్రమంగా చూశారు ఓసీ విద్యార్థినులు.

''అబ్బో.... వచ్చిందమ్మో.... దివి నుండి భువికి... పెద్ద ఆదర్శవాది!'' కిసుక్కుమన్నారు కొంతమంది బీసీ విద్యార్థినులు !

అరుణ ఒక నిముషం మౌనంగా ఉండి పోయింది. !

''చూడు కిరణ్ ! నీ కులం రాసుకుంటే నీకెంతో భవిష్యత్తుంది ! నీకు దొరికిన బంగారు అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకుంటున్నావేమో - ఆ తర్వాత బాధపడాల్సి వస్తుంది. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రా !'' హిమ హితబోధ చేసింది !

కిరణ్ నవ్వి పూర్కుంది !

అరుణ పాఠం చెప్పడానికి లేచి నించుంది.

''మేడమ్ ! నాదో డౌట్,'' కిరణ్ అడిగింది.

''చెప్పమ్మా!''

“మన దేశంలో కుల మత భాషా భేదాలుండకూడదనీ.... అన్ని కులాలూ, మతాలూ సమానమని- పాఠాలు చెప్పే మీలాంటి లెక్చరర్స్.... పని గట్టుకుని... మా కులాల్ని గుర్తు చేస్తారెందుకూ ?” కిరణ్ ప్రశ్నకి అరుణ కాసేపు తడబడింది.

“మనుషులంతా ఒకటేనని పాఠాలు చెప్తూవుంటారు ! జాతీయ భావం పెంపొందించుకోవాలనీ... టీవీల్లో, రేడియోల్లో, పాఠాల్లో, పత్రికల్లో ఎలుగెత్తి చెప్తూ వుంటారు! మరి మీరిలా... మా కులాల్ని అడిగి గుర్తు తెస్తూన్నంత కాలం... మా కులాల్నీ, మతాల్నీ మరిచి.... మేమంతా ఒక్కటే అన్నభావం... మాలో ఎలా కల్గుతుంది మేడమ్?”

“నువ్వన్నదీ నిజమే కిరణ్ ! కాని కులాల పేర రిజర్వేషన్లు కల్పించారు కాబట్టి... ఎవరి కులం ఏమిటో మేము విధిగా - మాకిష్టం ఉన్నా లేకున్నా... అడిగి రాసుకోవాల్సి వస్తోంది ! విధి నిర్వహణలో మాకది తప్పట్లేదు !” చెప్పింది అరుణ.

“కానీ... ఇంత మందిలో మమ్మల్ని మా కులాలు అడిగితే - అదేం సభ్యతగా లేదు!” గయ్‌న లేచింది గంగా భవాని.

“కులాల పేర రిజర్వేషన్లు పొందితే తప్పులేదు గానీ - కులం చెప్పమంటే తప్పొచ్చిందా ?” విస్మయంగా అడిగింది వినీల.

“అయినా మాలో మాకే కుల సంఘర్షణలను రేకెత్తించే ఈ రిజర్వేషన్లు ఎందుకు? ఇలా ఇంకెన్నాళ్ళు మమ్మల్ని విభజింపజూస్తారు మేడమ్ ?” ఓ ఓసీ అమ్మాయి లేచి అడిగింది.

“చూడమ్మా.... స్వాతంత్ర్యం వచ్చిన కొత్త లో వెనుకబడ్డ కులాల వాళ్లలో చాలా మంది... సాంఘికంగా, ఆర్థికంగా ఎంతో వెనుకబడి వుండేవాళ్ళు ! అందుకోసం... రాజ్యాంగంలో వాళ్ళని అగ్రకులాల స్థాయికి తీసుకురావాలన్న సదుద్దేశంతో - కొన్ని సంవత్సరాలపాటు - రిజర్వేషన్లు కల్పించడం జరిగింది! అయితే - రాజకీయ నాయకులు - వాళ్ళ ఓట్లకోసం, తమ లబ్ధికోసం ఆ గడువుని ఎప్పటికప్పుడూ పెంచుతూ వచ్చారు!”

“సాంఘికంగా వెనుకబడి వుండటం అంటే ఏమిటి మేడమ్ ?”

“అగ్రకులాల వాళ్ళు - ఇతర కులాల వాళ్ళని తమతో సమానంగా

అంగీకరించక పోవడం - వాళ్ళని తనతో సమానంగా పరిగణించక పోవడం!

"అది స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో వుండేదేమో నాకు తెలీదుగానీ - ఇప్పుడు నేను ఎక్కడ ఏ మీటింగ్‌కి, ఏ పెళ్లికి వెళ్లినా... అగ్రకులాల వాళ్లంతా నన్ను వాళ్ళతో సమానంగా ట్రీట్ చేస్తున్నారు ! నన్నెక్కడా వెలివేయలేదు ! అలాంటప్పుడు... మేమింకా... సాంఘికంగా వెనుకబడి వున్నామని చెప్పుకోవడం ఆత్మవంచన కాదా- మేడమ్?" అడిగింది కిరణ్.

"వెనుకబడ్డ కులాల వాళ్ల రిజర్వేషన్లకి కారణం.... వాళ్ళు సాంఘికంగా వెనుకబడి వుండటం ఒక్కటే కాదు కిరణ్ ! ఆర్థికంగా వెనుకబడి వుండటం కూడా మరో కారణం !" చెప్పింది అరుణ.

"మేడమ్.... మా క్లాసులో వుండే రమా వాళ్ళకి చిల్లిగవ్వ ఆస్తి కూడా లేదు ! మరి... ఆమె అగ్రకులానికి చెందింది ! మా క్లాసులోనే వున్న సుజాత వాళ్ళనాన్న గారికి మూడు ఫ్యాక్టరీలు వున్నాయి ! ఆమె వెనుకబడ్డ కులానికి చెందింది ! అలాంటప్పుడు ఆర్థికంగా వెనుకబడివుండటానికి కులం ఎలా ప్రాతిపదిక అవుతుంది ? అన్ని కులాల్లోనూ ఆర్థికంగా వెనుకబడ్డవాళ్ళు వున్నారుగా !"

కిరణ్ ప్రశ్నకి - తన వద్దలేని సమాధానాన్ని ఎలా చెప్పాలో అర్థం కాలేదు అరుణకి.

"మేడమ్ ! పావుగంట నుంచీ కిరణ్ ఉపన్యాసం వింటున్నాం ! మాకిక వినే ఓపికలేదు గానీ - మేము చెప్పేదికూడా విన్పించుకోండి! తరతరాలుగా ఓసీవాళ్లు బీసీ వాళ్లని అణగదొక్కుతూ వచ్చారు ! వీళ్ల శ్రమదోపిడీ చేసి - వాళ్లు మేడలూ, మిద్దెలూ కట్టారు ! అన్నాళ్లూ వీళ్లు కిమ్మనకుండా వుండలేదా? - ఇప్పుడు రిజర్వేషన్లుంటే - వీళ్లకి ఏడ్పుదేనికి ?" ఉక్రోషంగా అడిగింది ఉష.

"అదికాదు మేడమ్ ! ఎప్పుడో మాతాత ముత్తాతలు వీళ్లని అణగదొక్కారని మా తరానికీ శిక్ష విధిస్తారా ? బీసీలు స్థాపించిన ఫ్యాక్టరీల్లో ఎంతమంది ఓసీలు కార్మికులుగా పనిచేయడం లేదు ? ఓ వైపు సాంఘిక, రాజకీయ సమానత్వమని ఘోషిస్తూ - మరోవైపు

మాపట్ల ఈ వివక్షత ఏమిటీ?'' మండిపడింది మంజుల.

"మేడమ్ ! - ఇదిగో - ఈపేపర్ చూడండి! జనాభాని బట్టి బీసీ, ఎస్సీ, ఎస్టీ వాళ్లకి రిజర్వేషన్లు కల్పిస్తార్ట ! ఇలా జనాభాని బట్టి రిజర్వేషన్లు పెంచుతూ పోతే - ఆ రిజర్వేషన్ల వల్ల లాభం వున్న కులాల వాళ్లంతా తమ తమ జనాభాని పెంచుకోవడానికే ప్రయత్నిస్తారు కదా ! వాళ్లతో పోటీగా - ఓసీలు కూడా తమ జనాభాని పెంచుకుంటూ పోతే - ఇప్పటికే ఈసురోమంటోన్న ఈ దేశం ఏమైపోతుంది ?' అడిగింది గిరిజ.

"అసలు నన్నడిగితే కులాంతర వివాహాలు ప్రోత్సహించడమే దీనికి పరిష్కార మంటాను !'' తాపీగా సమాధానం చెప్పింది తార.

"ఏం కులాంతర వివాహాలో ఏమో - మా అన్నయ్య బీసీ - మా వదిన ఓసీ - వాళ్ళిద్దర్దీ లవ్ మ్యారేజీ ! మా వదినకి ఈ మధ్యే వుద్యోగం దొరికింది ! మా అన్నయ్య ఇప్పుడేమంటున్నాడో తెలుసా? 'నీ కులం నీకు తిండి పెట్టదని తెలిసి- నువ్వు నన్ను కట్టుకున్నావ్ ! నా కులం వల్లే నీకా వుద్యోగం దొరికింది ! ఏదో... నీకూ - నీ పిల్లలకీ ఇంత తిండి దొరుకుతోంది ! సంతోషించు!' అంటూ వెక్కిరిస్తు న్నాడు'' చెప్పింది వసుధ.

"ఇన్నాళ్లూ.... ఓసీల పెత్తనం ! - ఇప్పుడు బీసీల పెత్తనం ! వారెవా.... ఎవరిదో ఒకరి పెత్తనం లేకపోతే మనకి సమస్యలు ఎక్కడ్నుంచి పుట్టుకొస్తాయ్ !'' నవ్వింది సునంద.

"మేడమ్... మొన్నేం జరిగిందో చెప్పమంటారా ? మా పక్కింటి రామారావుకి ఇద్దరు ఆడపిల్లల తర్వాత - కొడుకు పుట్టాడు! కొడుకు పుట్టాడు కదా - సంతోషంగా వున్నాడేమో అని మా అన్నయ్య కంగ్రాట్స్ చెప్పడానికి వెళ్తే - ఆయన పుట్టెడు దిగుల్తో కూర్చున్నాట్ట ! ఏమైందని అడిగితే - ' ఏం చెప్పన్రా ? నా ఇద్దరు ఆడపిల్లల్ని వాళ్ళ కులం మారితేనన్నా రిజర్వేషన్లతో వుద్యోగాలు దొరకుతాయని - బీసీల కిచ్చి పెళ్ళి చేద్దామనుకున్నాను ! కాని ఈ మగపిల్లవాడు నా గుండెల మీద కుంపటై పోయాడు! నేనే అత్తెసరు మార్కులవాణ్ణి ! నీకు తెలుసుకదా ! నా తెలివితేటలే అంతంత మాత్రం.... ఇక నా రక్తం పంచుకుపుట్టిన నా సుపుత్రుడికి అంతకన్నా మంచి తెలివి తేటలు

ఎలా ఆశించమంటావ్ ? వీడు పెరిగి పెద్దవాడయితే - వీడికి వుద్యోగం సంపాదించడానికి - అటు తెలివీ - ఇటు డబ్బూ, మరో వైపు కులం... ఏదీ లేని దురదృష్టవంతుణ్ణి ! అందుకని డబ్బులేని ఓసీల్లో - తెలివిలేని మగ పిల్లవాడుగా పుట్టడంకన్నా అడవిలో మానై పుట్టడం మేలు!' అని అన్నాడట" చెప్పింది విజయ.

"అబ్బ ! ఇన్నాళ్ళకయినా... 'మగ పిల్లల కన్నా - ఆడపిల్లలే నయం' అనుకున్న మగ మహారాజుల కథ విన్నందుకు ఆనందంగా వుంది!" అంది సునంద.

క్లాసు గొల్లుమంది.

"మేడమ్ ! పిట్టకథలన్నీ వినడానికి బాగానే వున్నాయిగానీ - ఓసీ వాళ్లందర్నీ ఆస్తులు ఒదులుకోమని చెప్పండి - మేము రిజర్వేషన్లు ఒదులుకుంటాం !" అంతవరకూ నిశ్శబ్దంగా వున్న గీత గొంతు విప్పింది !

"అదికాదు మేడమ్.... ఆస్తులనేవి ఒక్క అగ్రకులాల వాళ్ళకే వున్నట్టూ.... బీసీ వాళ్ళెవరికీ ఆస్తులే లేనట్టూ - ఈ వితండవాద మేమిటి ? అగ్ర కులాల వాళ్ళంతా ఆస్తులున్నవారు కారు ! వెనుకబడ్డ కులాల వాళ్ళంతా ఆస్తుల్లేని వాళ్ళూ కారు ! అలాంటప్పుడు ఆస్తులు వొదులుకునేదాకా మేము రిజర్వేషన్లు వొదులుకోమంటే - మధ్యలో 'ఆస్తుల్లేని అగ్రకులాల' వాళ్ళంతా ఏం గావాలీ ?"

అడిగింది కిరణ్

"కిరణ్ చెప్పింది నిజం మేడమ్ ! ఓసీల్లో, బీసీల్లోకూడా డబ్బులేని వాళ్ళున్నారు! ఈ రిజర్వేషన్లు అనేవి కుల ప్రాతిపదికపై కాకుండా ఆర్థిక ప్రాతిపదికపై అమలు జరిపితే బావుంటుంది ! అందరికీ న్యాయం చేసినట్టువుతుంది !" అంది సుగుణ.

"అంతకన్నా - ప్రైవేట్ ఆస్తులుండకుండా- ఈ ఆస్తులన్నీ జాతీయం చేస్తే - ఈ గొడవలేవీ వుండవు కదా మేడమ్ !" సునంద సూచించింది !

"ఆస్తులు జాతీయం చేయడం అన్నది సోషలిస్ట్ దేశాల్లో తప్ప, మనదేశంలో ఇప్పట్లో సాధ్యం కాదమ్మా !" చెప్పింది అరుణ.

"మనది కూడా సోషలిస్ట్ దేశమే కదా మేడమ్ ! మన రాజ్యాంగ పీఠికలో కూడా ఆ విషయం ప్రత్యేకించి పేర్కొన్నారు కదా !" సందేహం వెలిబుచ్చింది సునంద.

అరుణ చిన్నగా నవ్వి అంది : "చూడమ్మా సోషలిస్ట్ దేశాలు రెండు రకాలు ! చైనా సంపూర్ణ సోషలిస్ట్ దేశం ! మనది ప్రజాస్వామ్య సోషలిస్ట్ దేశం !"

"రెండింటికీ భేదం ఏమిటి మేడమ్?"

"సంపూర్ణ సోషలిస్ట్ దేశంలో ప్రజల ప్రైవేట్ ఆస్తులన్నీ ఒకేసారి జాతీయం చేయబడి - ఒకేరోజు దేశమంతా ఆర్థిక సమసమాజం ఏర్పడ్తుంది ! కాని ప్రజాస్వామ్య సోషలిస్ట్ దేశంలో ప్రభుత్వం దేన్ని జాతీయం చేయాలని తలపెట్టినా - అన్ని వర్గాల ప్రజల్ని మెప్పించీ - ఒప్పించీ - ప్రజాస్వామ్య పద్ధతుల్లో శాసనాలు చేయాలి ! కొన్నిసార్లు ఆ శాసనాలు నచ్చని వాళ్ళు తమకున్న ప్రాథమిక హక్కుల ద్వారా కోర్టుకి వెళ్తూ ఉంటారు ! ఆ కోర్టు తీర్పు తమకి అనుకూలంగా వుంటే ఆ ప్రభుత్వం... ఒక అడుగు ముందుకువేయడమో... ప్రతికూలంగా ఉంటే నాలుగు అడుగులు వెనక్కివేయడమో... జరుగుతూ ఉంటుంది! ప్రతిపక్షాల నిరసనల మధ్య ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తూ - ఒక్కటొక్కటే జాతీయం చేస్తూ - నత్త నడకలతో - తన అంతిమ లక్ష్యమైన ఆర్థిక సమసమాజాన్ని సాధిస్తుంది." చెప్పింది అరుణ.

"అందరి ఆమోదంతో ఆర్థిక సమసమాజం ఏర్పడాలంటే - ఎన్నో ఏళ్ళు పడ్తాయి కదా ! అప్పటిదాకా - మన ప్రజాస్వామ్య సోషలిజంలో సోషలిజం అనేది నేతి బీర కాయలో నెయ్యిలాంటిదే కదా మేడమ్?"

"కరెక్ట్‌గా వూహించావ్ ! చైనాలో లాగా మన రాజ్యాంగ నిర్మాతలు సంపూర్ణ సోషలిజం ఎన్నుకొని వుంటే... మనదేశంలో ఎప్పుడో ఆర్థిక సమసమాజం ఏర్పడి వుండేది ! కాని మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజాస్వామ్య సోషలిజాన్నిష్టపడ్డారు!"

"మనకన్నా ఒక సంవత్సరం వెనుక స్వాతంత్ర్యంపొంది, మనకన్నా

ఎక్కువ జనాభా వున్న చైనా - సంపూర్ణ సోషలిజాన్ని ఎన్నుకుని అభివృద్ధి పథంలో పురోగమిస్తూంటే- మనమెందుకు ప్రజాస్వామ్య సోషలిజాన్ని పట్టుకుని వేళ్లాడుతున్నాం మేడమ్ ?'' అడిగింది సునంద.

''స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఇష్టపడే వాళ్ళూ, ప్రజాస్వామ్య సిద్ధాంతాల్లో విశ్వాసమున్న వాళ్ళూ ప్రజాస్వామ్య సోషలిజాన్ని ఇష్టపడ్తారు ! స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అక్కర్లేదనుకునే వాళ్లు - కొన్ని వర్గాల్ని నిర్మూలించైనా ఆర్థిక సమసమాజం ఏర్పాడాలనుకునేవాళ్లూ - సంపూర్ణసోషలిజాన్ని ఇష్టపడ్తారు !''

''అన్నట్టు - వర్గ నిర్మూలన అంటే గుర్తొచ్చింది మేడమ్ ! మనదేశంలో నక్సలైట్ల పాత్ర ఏమిటి ? ఏ పేపర్ చూసినా - ఫలాన భూస్వామిని హత్యచేశారు ! గొడ్డళ్ళతో కాళ్లూ చేతులూ నరికారు అని రాస్తూ వుంటారు కదా ! మరి వాళ్ళు ఏం కోరుతున్నారు ?'' అడిగింది కిరణ్.

''బహుశః వాళ్ళు చైనాలో వున్నటువంటి ఆర్థిక సమసమాజాన్ని కోరుతున్నారేమో? - అందుకే వాళ్ల శత్రువర్గానికి చెందిన భూస్వాముల్ని హతమారుస్తున్నారేమోనని నా వుద్దేశ్యం !''

''మరి ప్రజాస్వామ్య సోషలిజంలో ప్రజల ఆస్తిపాస్తులనేవి శాసనాల ద్వారా ప్రభుత్వం జాతీయం చేసుకోవాలి కదా మేడమ్ ! మరి నక్సలైట్స్... ప్రజాస్వామ్య సోషలిస్ట్ వ్యవస్థని మార్చకుండానే సంపూర్ణ సోషలిస్టు దేశాల్లోలాగా - ఆర్థిక సమ సమాజ స్థాపన కోసం దౌర్జన్య పద్ధతులకు ఎందుకు పూనుకుంటున్నారు ?'

''బహుశ ఆర్థిక సమసమాజాన్ని ఈ ప్రజాస్వామ్య సోషలిజం ద్వారా ఇప్పట్లో సాధించలేమన్న నిస్పృహ ఆవరించి - హింసాత్మక చర్యల్తోనైనా - తమ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారేమో ?'' చెప్పింది అరుణ.

''అసలు ఎవరికీ సొంత ఆస్తులు వుండని సంపూర్ణ సోషలిజాన్ని నక్సలైట్లే దేశమంతటా ఒకేరోజు అమల్లోకి తీసుకొని రాగలిగితే - అప్పుడు హింసతో పనిలేకుండా - ప్రజలే స్వచ్ఛందంగా తమ ఆస్తిపాస్తుల్ని వాళ్లకి అప్పగిస్తారు కదా! అలాంటి ప్రయత్నాలేవీ

చేయకుండా - తమకి తోచిన కొందర్ని చంపడం.... బస్సుల్నీ, బ్యాంకుల్నీ దగ్ధం చేయడం.... ఆ తర్వాత ఏ అడవుల్లోనో దాక్కోవడం... ఇలా ఎంతకాలం ?" అడిగింది కిరణ్.

"బహుశా: దేశమంతటా విస్తరించి - తమ కార్యకలాపాల్ని ఉధృతంచేసే శక్తిలేక - కొన్ని ప్రాంతాల్లో తమ పట్టు సాధించాక- మిగతా ప్రాంతాలకి విస్తరించాలని వాళ్ళ ధ్యేయమై వుంటుంది ! - నయాన చెప్తే ప్రజలు వినరనీ- కొంతమంది భూస్వాముల్ని హతమార్చి - దేశంలో భయోత్పాతం కల్గిస్తే ఉన్న వాళ్లంతా లేని వాళ్ళకి తమ ఆస్తుల్ని వదిలి పారిపోతే తప్ప, ఆర్థిక సమసమాజం ఏర్పడదనీ - వాళ్ళ అభిప్రాయమై వుంటుంది !"

"అదికాదు మేడమ్ ! ఆస్తి సంపాదించడానికి స్వేచ్ఛ వున్న వ్యవస్థలో - ప్రతి వాడూ సంపాదించడానికే ప్రయత్నిస్తాడు! కొందరి సంపాదనలో శ్రమశక్తి కూడా వుండవచ్చు కదా! అసలు ఆస్తి సంపాదనకే అవకాశం లేని ఆర్థిక సమసమాజమే వాళ్ళలక్ష్యమైతే - వాళ్ళు అజ్ఞాతంగా వుండకుండా - ప్రజల మధ్యకి రావాలి ! తమ సిద్ధాంతాల్నీ, లక్ష్యాలనూ ప్రచారం చేయాలి ! తమ 'పార్టీ నొకటి ఏర్పాటుచేసి - తమ మానిఫెస్టో ప్రకటించి - మన ఓటర్లని మెప్పించి - ఎన్నికల్లో గెలిచి - సంపూర్ణ సోషలిజాన్ని స్థాపించాలి ! రాచమార్గం వుండగా - వాళ్ళు కోరి, ఈ ముళ్ల దారిన ఎందుకు వెళ్తున్నట్టు.. నాకేం అర్థం కావడం లేదు!"

"బహుశ: ఎన్నికల్లో అన్ని వర్గాలను ఆకట్టుకోవడం సులభం కాదనీ - అందర్నీ కన్విన్స్ చేయడం కష్టమనీ - ఆ పనుల వల్ల ఆర్థిక సమ సమాజస్థాపన యింకా ఆలస్యమవుతుందనీ వాళ్ళ అభిప్రాయమై వుంటుంది ?" చెప్పింది అరుణ.

"ఆ మాట నేనొప్పుకోను మేడమ్ ! ఓటు వేసే వాళ్లలో వుండేది మెజార్టీ పేద ప్రజలే ! బీదా బిక్కీ అధిక సంఖ్యలో ఉన్న మన దేశంలో - తమ సిద్ధాంతాల్తో ఓటర్లని కన్విన్స్ చేయడం నక్సలైట్స్‌కి తలుచుకుంటే అసాధ్యమేమీ కాదు ! ఓటర్ల అభిప్రాయాలు రిజిడ్‌వే అయితే - వాళ్ళు కాంగ్రెస్‌ని కాదని జనతాకీ, జనతాని కాదని కాంగ్రెస్‌కీ

- కాంగ్రెస్‌ని కాదని తెలుగుదేశంకీ - తెలుగుదేశాన్ని కాదని కాంగ్రెస్‌కీ పట్టంగట్టేవాళ్ళు కాదు ! మెజార్టీ ప్రజలు నిరక్షరాస్యులైనా ఓటు విలువ తెలిసినవాళ్ళు ! ఓటు ద్వారా తమకి నచ్చని ప్రభుత్వాలను మట్టి కరిపిస్తున్నవాళ్ళు!''

''ఆ - అన్నట్టు ఓటు వేయడం అంటే గుర్తొచ్చింది మేడమ్ ! కొంతమంది నక్సలైట్లు - ఎన్నికలని బహిష్కరించాలనీ - ఓటు వేస్తే చెయ్యి నరికేస్తామనీ కరపత్రాలు పంచుతున్నారు ! ప్రజాస్వామ్య సోషలిస్ట్ వ్యవస్థలో - ప్రజలందరికీ ఓటు హక్కు వుందికదా ! ఏదో ఒక ప్రాంతంలో కొంత మంది వాళ్ళకి జడిసి - ఓట్లేయనంతమాత్రాన - జరిగే ఎన్నికలు జరగకుండా పోతాయా ? ఆ మాత్రానికి - ఈ వ్యవస్థని మార్చడానికి వాళ్లు ప్రయత్నించకుండానే - నక్సలైట్లు ప్రజల్ని తమ హక్కుల్ని వినియోగించుకోవద్దని బెదిరించడం ఎంతవరకు సమంజసం?'' అడిగింది కిరణ్.

''అంతేకాదు కిరణ్ ! ఈ నక్సలైట్లంతా పేదాగొప్పా భేదాలుండని ఆర్థిక సమసమాజాన్ని కోరుతున్నామని చెప్తూ వుంటారు కదా ! మరి కొండపల్లి సీతారామయ్య హాస్పిటల్ నుండి తప్పించుకునే ప్రయత్నంలో - పాపం కూటికోసం పనిచేసే ఒక పోలీస్ జవాన్ని చంపడం నైతికంగా ఎంతవరకు సమర్థనీయం అంటావ్ ?'' అడిగింది సునంద.

''చూడండి మేడమ్ ! మీరు.... కిరణ్, సునందలు అడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పకుండా దాటేస్తూ పరోక్షంగా వాళ్లమాటల్ని సపోర్టు చేస్తున్నారు ! నక్సలైట్లని విమర్శించేంత ధైర్యం వచ్చిందా వాళ్లకి ? తను నమ్మిన సిద్ధాంతం కోసం - అండర్‌గ్రౌండ్‌లో వుంటూ వర్గభేదాలుండని ఆర్థికసమాజం కోసం పాటు పడ్తోన్న మహోన్నత వ్యక్తి కొండపల్లి సీతారామయ్య! ఆయన నేతృత్వంలో వుంటూ - ఆయన అనుచరులే ఆయన కన్న కలల్ని నిజం చేయాలని - ఆయన్ని హాస్పిటల్ నుండి తప్పించారు. అధిక సంఖ్యాకులైన ప్రజలకి మేలు జరిగే కార్యకలాపాలు చేపట్టినప్పుడు అందులో కొందరు అమాయకులు బలి అయినా బాధ పడక్కర్లేదు!'' అంది కవిత.

''ఆ మాట నేనొప్పుకోను మేడమ్ ! తీవ్రవాద సిద్ధాంతాల్ని

నరనరాన జీర్ణించుకున్న నక్సలైట్లు తమ లక్ష్యసాధనలో బలి కావచ్చుగానీ - ఆ సిద్ధాంతాలపట్ల ఏమాత్రం అవగాహనలేని అమాయకులు బలైతే అంతకన్నా ఘోరం మరోటిలేదు! సీతారామయ్య లక్ష్యం పేద ప్రజల ఉద్ధరణే అయితే ఆ రోజు తను తప్పించు కోవడానికి, తనకి కాపలావున్న జవాన్ని పనిగట్టుకొని చంపనక్కర్లేదు ! ఏ కాల్జేతులో కట్టేసి తప్పించుకోవచ్చు !'' అంది కిరణ్.

''అయినా... శ్రమశక్తిని నిర్వీర్యం చేసి- సోమరితనాన్నిపెంచే సోషలిజం వల్ల తమ దేశాల్లో అభివృద్ధి ఎంతగా కుంటుబడిందో గమనించి - రష్యాలాంటి సోషలిస్ట్ దేశాలన్నీ ఒక్కటొక్కటే - సోషలిజానికి గుడ్ బై చెప్పి - ప్రజాస్వామ్యానికి స్వాగతం పలుకుతూంటే - మన నక్సలైట్ సోదరులు అవసాన దశలోవున్న కమ్యూనిజానికి అమృతం పోయాలని హైరాన పడటం - అత్యాశ కాదా?'' అడిగింది సునంద.

''పైగా దేశంలో - భయోత్పాతం కల్పిస్తే - ఏ ప్రభుత్వమైనా చూస్తూ వూర్కోదు కదా! ప్రజల ప్రాణ రక్షణకి పోలీసుల్ని పంపిస్తుంది! ఆ తర్వాత మనం చూసేది కూటి కోసం వుద్యోగం చేసే పోలేసులకీ - నక్సలైట్లకీ మధ్య జరిగే పోరాటాలూ... ఎన్‌కౌంటర్లు! మధ్యలో బలి అయ్యేదెవరు ? లక్ష్య సాధనలో నక్సలైట్లు ! విధి నిర్వహణలో పోలీసులు! దోపిడీ వ్యవస్థ మాత్రం నిరాటంకంగా వర్ధిల్లుతూనే వుంటుంది !'' అంది విమల.

''పాపం ! నాకు నక్సలైట్ల విషయాల్లో- కులమత సంఘర్షణ సమయాల్లో - పోలీసుల్ని చూస్తే జాలేస్తుంది ! కరవమంటే కప్పకు కోపం ! విడువమంటే పాముకి కోపం అన్నట్టు - నక్సలైట్లని పట్టు కోకపోతే - ప్రభుత్వాన్నుండి అక్షింతలు ! పట్టుకుంటే ప్రాణాల మీద ఆశ ఒదులుకోవడం! ఉరుమురిమి మంగలం మీద పడ్డట్టు- ఏ చిన్న కారణానికో - ఏ ప్రాంతాలల్లోనైనా శాంతి భద్రతలకు భంగం వాటిల్లినా, అక్కడ వెంటనే మామూలు పరిస్థితులు పునరుద్ధ రించబడకపోయినా - అటు ప్రభుత్వము;- శాంతి భద్రతలు నెలకొల్పడంలో ఆలస్యం అయితే... ఇటు ప్రతిపక్షాల వాళ్ళూ;

అందులో సఫలమైతే నక్సలైట్లూ; విరుచుకుపడేదీ - విమర్శించేదీ వాళ్లనే ! వాళ్ళ ఉద్యోగమే ఓ కత్తిమీద సాము !'' అంది సునంద.

''ఏమిటోయ్ సునందా ! పోలీసోల్లని తెగ సైడ్ చేస్తున్నావ్ ! లాకప్ మరణాలు- పోలీసులు చేసే మానభంగాలూ పేపర్లలో చదవడం లేదా ?''

''పాపం ! ఆవిడకి పేపర్ చదవడం అలవాటు లేనట్టుంది !'' ఎగతాళిగా అంది ఎలిజబెత్.

''పోలీసుల్లో కొందరు దుర్మార్గులున్నంత మాత్రాన, అందరూ అలాంటి వాళ్ళేనా? ఏదైనా కాలేజీలో ఎవరైనా రేప్ చేయబడ్డారూ అంటే, అన్ని కాలేజీల్లోనూ అలాగే జరుగుతోందనా ? పోలీస్‌స్టేషన్లో మానభంగం లాంటి జోకులు నా దృష్టిలో వెకిలివీ - ప్రెజుడిస్ పెంచేవీ - అంతే!'' అంది సునంద.

''అది కాదోయ్ ! ఈ మధ్య తగ్గింది గానీ నాకీ పౌర హక్కుల సంఘాల తీరు తెన్నులు తమాషాగా వుంటాయ్ ! పోలీసులు నక్సలైట్లని చంపితే - పోలోమని బయల్దేరే వీళ్ళు - నక్సలైట్లు పోలీసుల్ని చంపితే కిక్కురుమనరెందుకూ ?''

''పాపం ! వాళ్ళ దృష్టిలో - నక్సలైట్లే పౌరులుగానీ - పోలీసులు కాదేమో లేవే!''

''అయినా ప్రాథమిక హక్కులకి విలువ ఇవ్వని నక్సలైట్లని పౌరహక్కుల పేరుతో వీళ్ళు రక్షించాలనుకోవడం హిపోక్రసీ కాదా?''

''ఇంకో సంగతి మరిచావ్ ! పోలీసులకీ - నక్సలైట్లకీ మధ్య నలిగిపోయే సామాన్య ప్రజానీకం ! వాళ్ళ పరిస్థితి మరీ హారిబుల్ గా వుంది గ్రామాల్లో !'' గుర్తు చేసింది సునంద.

''అవును మేడమ్ ! ఆ నక్సలైట్ల ఆచూకీ తెలుసుకోవడం పోలీసుల బాధ్యతగాబట్టి - వాళ్ళు తమకి అనుమానం వున్న వాళ్ళందర్నీ బెదిరిస్తారు ! హింసిస్తారు ! వాళ్ళ దెబ్బలకి తట్టుకోలేకో - వాళ్ళ పద్ధతులు నచ్చకో వాళ్ళ ఆచూకీని చెప్పే సామాన్య జనాన్ని - నక్సలైట్లు చిత్రవధ చేస్తారు. అసలు అన్నింటికన్నా విచిత్రమైన విషయం ఏమిటంటే - పోలీసులూ - నక్సలైట్ల మధ్య నలిగిపోయే అమాయక

ప్రజలపై బోల్డు సానుభూతి కురిపించే రాతలో, గద్దె మీదున్న ప్రభుత్వాల్ని ఇరకాటంలో పెట్టడమో తప్ప - పత్రికా స్వాతంత్ర్యం అంటూ గొంతు చించుకునే పత్రికాధిపతులు ఈ విషయంలో స్వేచ్ఛగా ఎందుకు తమ నోరు విప్పరు?'' అడిగింది కిరణ్.

''పాపం ! వాళ్లకి కావల్సిన స్వేచ్ఛంతా ప్రభుత్వాన్నో, రాజకీయ నాయకుల్నో, ఆఫీసర్లనో - బ్యాంక్‌నో - కాలేజీనో - విమర్శించడానికే అయివుంటుంది!'' అంది సునంద.

''అంతే మరీ ! లేకపోతే - ఎక్కడ ఎవరు ఎవర్ని చంపారో ఆ న్యూస్ వేసి - ప్రజల్ని హడలగొట్టడం తప్ప - ఈ సమస్యకు పరిష్కారమేమిటో - ఈ విషయంలో ప్రజాభిప్రాయమేమిటో - బ్యాంకుల్ని, బస్సుల్నీ, ఆఫీసుల్నీ దగ్ధం చేయడం ద్వారా - సామాన్య ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురవుతున్నారో తమ ఎడిటోరియల్స్ ద్వారా ప్రజల్ని ఎందుకు ఎజుకేట్ చేయరు ?'' అంది విజయ.

''సరి సరి ! రామాయణంలో పిడకల వేటలా - ఇప్పుడు పత్రికల వాళ్ల గొడవెందుగ్గానీ - మాది మరో డౌట్ మేడమ్ ! సంపూర్ణ సోషలిస్ట్ దేశాల్లో అందరికీ తిండీ బట్టా ఉద్యోగం దొరికి - ఆర్థిక సమసమాజం ఏర్పడ్తుంది కదా ! మరి మన రాజ్యాంగ నిర్మాతలు ఎందుకు దాన్ని ఒదులుకుని ఈ ప్రజాస్వామ్య సోషలిజం వైపు ఆకర్షితులయ్యారు?'' అడిగింది కిరణ్.

''సంపూర్ణ సోషలిస్ట్ దేశాల్లో తిండీ బట్టా దొరుకుతుందే తప్ప - ప్రజలకి ప్రభుత్వంపై తమ అసంతృప్తిని ప్రకటించుకునే స్వేచ్ఛ వుండదు ! దాదాపు రెండొందల సంవత్సరాల పాటు బ్రిటిష్ వాళ్ళ పాలనని ఎండగట్టగలిగిన మనం- స్వాతంత్ర్యం వచ్చాక - మనమెన్నుకున్న ప్రతినిధులని ఎండగట్టే స్వేచ్ఛని- ఒక్కసారిగా త్యాగం చేయడం ఇష్టంలేక అయివుంటుంది !'' చెప్పింది అరుణ.

క్లాసు గొల్లుమంది.

''అయితే - మన వాళ్లు స్వేచ్ఛలేని ఆర్థిక సమానత్వంకన్నా ఆర్థిక సమానత్వం లేని స్వేచ్ఛని ఇష్టపడ్డారంటారు ! అలాంటప్పుడు

మనదేశంలో ఆర్థిక సమానత్వం- ఇక ఎప్పటికీ రాదన్నమాట!" దిగులుగా ముఖం పెట్టింది దీప్తి.

"చూడమ్మా - ఆర్థిక సమానత్వం అనేది ఒక అందమైన భవనం! సంపూర్ణ సోషలిజం ఎన్నుకుని చైనావాళ్లు ఆ బిల్డింగ్‌ని ఒక్క రోజులో కట్టుకుంటే - ప్రజాస్వామ్య సోషలిజాన్ని ఎన్నుకుని ఈ నలభై సంవత్సరాల్లో కేవలం బిల్డింగ్ బ్లూ ప్రింట్‌ని మాత్రమే మనం తయారు చేసుకున్నాం ! నిర్మాణం ఇప్పుడిప్పుడే మొదలౌతోంది ! ఈ భవనం పూర్తిచేయడానికి కులమతాల నిర్మూలన పునాది! ఆస్తులు వొదులుకోవడం అన్నది పై కప్పు ! పునాదే మొదలెట్టని వ్యవస్థలో - పై కప్పుగురించి మాట్లాడం- ఉట్టికి ఎగరలేనమ్మ తాటిచెట్టుకి ఎగిరినట్టు కాదా? దేశం ఒకవైపు కుల, మత, భాషా, ప్రాంతీయ సంఘర్షణల్తో, స్త్రీ పురుష అసమానతల్తో అట్టుడికి పోతూ - సాంఘిక సమానత్వమే సాధించలేకుండా ఉంటే - ఆర్థిక సమానత్వం గురించి మాట్లాడ్డం అసందర్భమే అవుతుంది!" వివరించింది అరుణ.

"అంటే - మీరు రిజర్వేషన్లు వ్యతిరేకిస్తున్నారన్న మాటే కదా ! చూడబోతే మీరు నవ సంఘర్షణ సమితి వాళ్ళకు మద్దతిస్తున్నట్టు న్నారు ! మీరు అనవసరంగా మా ఉద్యమాల్లో తలదూర్చకండి !" ఆవేశంతో ముక్కుపుటాలు ఎగిరెగిరిపడ్తున్నాయి అరుంధతికి.

"ఆవిడని - స్టూడెంట్స్‌గా - మాకున్న డౌట్స్ అడుగుతున్నాం ! ఆవిడకి తెలిసిన సమాధానాలేవో చెప్తున్నారు ! అంతే ! ఇందులో ఎవరూ ఎవర్నీ బెదిరించాల్సిన అవసరంలేదు !" కస్సుమంది కరుణ.

"అయితే మేడమ్ ! సమ సంగ్రామ పరిషత్ తరపున మాదో ప్రశ్న ! ఈ ఓసీ వాళ్లలో  మెరిట్ లేని వాళ్ళంతా డొనేషన్లతో సీట్లు సంపాదించుకుంటే లేని తప్పు... బీసీ వాళ్ళలో మెరిట్‌లేని వాళ్ళంతా రిజర్వేషన్లతో సీట్ సంపాదించుకుంటే తప్పొచ్చిందా ? దీనికి సమాధానం చెప్పండి !" అడిగింది కమల.

"చూడు కమలా ! మెరిట్  లేని వాళ్లు డోనేషన్లతో సీటు సంపాదించడం ఎంత తప్పో - రిజర్వేషన్లతో సీటు సంపాదించడం కూడా అంతే తప్పు నా దృష్టిలో ! ఒక తప్పుని ఉదాహరణగా తీసుకుని

- ఇంకో తప్పుని సమర్థించుకోవడం సమంజసం కాదు కదా ! విజ్ఞులైన వాళ్లు ఆ తప్పునీ ఖండించాలి ! ఈ తప్పునీ ఖండించాలి ! మెరిట్‌కే పట్టం కట్టాలి ! అప్పుడే తన మేధస్సు పెంచుకోవడానికి శ్రమిస్తుంది యువతరం ! దేశం బాగుపడ్తుంది !'' చెప్పింది అరుణ.

''మేడమ్... అగ్రకులాల వాళ్లలో - అందరూ పెద్ద తెలివైనవాళ్లే ఉన్నట్లూ - నిన్నంతా రాగిణి మా అన్నయ్యని 'రిజర్వేషన్ల డాక్టర్ - రిజర్వేషన్ల డాక్టర్' అని ఒకటే ఎద్దేవా చేసింది ! అది తప్పుకాదా ?'' కమల అందుకుంది.

''అమ్మయ్య ! అలా రా దారికి ! మేడమ్, వాళ్ళన్నయ్యేదో మెరిట్‌లో సీట్ సంపాదించినట్టు - మా అక్కయ్యని 'డొనేషన్ల డాక్టర్' అని కమల నన్ను వెక్కిరిస్తే- నేను వాళ్లన్నయ్యని 'రిజర్వేషన్ల డాక్టర్' అని వెక్కిరించాను. ఇందులో తప్పేం వుందీ?' అంటూ రాగం తీసింది రాగిణి.

''చూడమ్మా ! ఆ మధ్య మన రాష్ట్ర ప్రభుత్వం డొనేషన్లు రద్దుచేసింది ! అప్పుడు ఎవరూ ఆందోళన చేయలేదు! ఎందుకూ? అది ఏరకంగా చూసినా నైతికంగా సమర్థనీయం ఎలా కాదో - కులం చెప్పుకుని సంపాదించే సీట్లుకూడా నైతికంగా అంతే సమర్థనీయం కాదు! డొనేషన్లు రద్దుచేయడం న్యాయమైనపుడు, రిజర్వేషన్లు రద్దు చేయడం అన్యాయమెలా అవుతుంది. పళ్లూడగొట్టుకోవడానికి ఏ రాయి అయితేనేం ? ఒకడు డబ్బుతో అర్హత సంపాదిస్తాడు ! రెండోవాడు కులంతో అర్హత సంపాదిస్తాడు! అంతే ! అందుకని డొనేషన్లని ఎలా రద్దు చేశారో - రిజర్వేషన్లనీ అలాగే రద్దు చేయాలని నా వ్యక్తిగత అభిప్రాయం !'' చెప్పింది అరుణ.

''అవునవునూ - అలాగే చేయాలి ! లేకపోతే కులంతో సీట్లు దొరికే అవకాశం కొన్ని కులాలకి కల్గించినపుడు - డబ్బుతో సీట్లు దొరికే అవకాశాన్ని మాత్రం ఎవరైనా ఎందుకు హరించాలి ? మన రాజ్యాంగం ప్రకారంగా పౌరులందరికీ 'సమానావకాశాలు' కల్పించ బడాలి కదా !'' అంది కమల వ్యంగ్యంగా...

గంట కొట్టారు ! పీరియడ్ అయిపోయింది ! అరుణ టేబుల్

మీదున్న బుక్స్ సర్దుకుంది !

"మేడమ్ ! చివరగా మాదో ప్రశ్న ! స్వాతంత్ర్యం రాకముందు మనదేశం ఎలా వుందో - ఇప్పటికీ అలాగే వుందనీ - ఏ ప్రగతీ సాధించలేదనీ విమర్శిస్తూ వుంటారు కదా ! మీరు ఆ రోజులూ చూశారు - ఈ రోజులూ చూస్తున్నారు ? అలాంటి విమర్శల పట్ల మీ వుద్దేశ్యం ఏమిటి ?"

అరుణ నవ్వి అంది : "అప్పట్లో సిటీల్లో, పట్టణాల్లో తప్ప... కరెంట్ వుండేది కాదు! ఇప్పుడు ప్రతి పల్లెటూరికీ ఆ సౌకర్యం వుంది! రోడ్లమీద ఒకటీ అరా వాహనాలు కన్పించేవి ! సైకిల్ మోటర్స్ వున్నవాళ్ళు అందరి దృష్టిలో పెద్ద హీరోలు! ఫోన్, సినిమాల్లో తప్ప ఎవరూ చేసేవాళ్ళు కారు! ఒక్కరైలు మార్గాలు తప్ప, మిగతా రవాణా సౌకర్యాలు ఎంతో అభివృద్ధి చెందాయి! పోచంపాడ్, నాగార్జున సాగర్, తదితర ప్రాజెక్టులవల్ల కరీంనగర్‌లాంటి జిల్లాలో ఎన్నో బంజరుభూములు పంట పొలాలుగా మారిపోయాయి ! తాలూకా హెడ్ క్వార్టర్స్‌లో తప్ప హైస్కూల్ వుండేది కాదు! కాని ఇప్పుడు ఎన్నో పల్లెటూళ్ళకీ హైస్కూల్స్ వున్నాయి ! మధ్య తరగతి జీవన ప్రమాణం పెరిగింది ! వాళ్ళలో చాలామంది టీవీలు, ఫ్రిజ్‌లూ, స్కూటర్లూ, కార్లూ కొనుక్కోగలుగుతున్నారు. లోన్స్‌తో సొంతిళ్లు కట్టుకుంటున్నారు! అభివృద్ధి లేకేం - బ్రహ్మాండమైన అభివృద్ధి వుంది! ఎటొచ్చీ - ఇంత అభివృద్ధినీ అంతకంతకీ పెరిగిపోతోన్న జనాభా ఎప్పటికప్పుడూ మింగేస్తోంది !"

"అంటే - మన దేశంలో ఇప్పుడు సమస్యలేవీ లేవనా మీ వుద్దేశ్యం?"

"దేశం అభివృద్ధి సాధించింది అన్నానే గానీ - దేశంలో సమస్యల్లేవని నేను అన్లేదే! స్వాతంత్ర్యం రాకముందు మన దేశంలో ఏ సమస్యలున్నాయో - ఇప్పటికీ అవే వున్నాయి ! అప్పటికీ - ఇప్పటికీ కార్చిచ్చులా రగుల్తోన్న సమస్య - మత సంఘర్షణలు ! ఇప్పటి కొత్త సమస్యలు - టెర్రరిజం, వేర్పాటువాదం - కుల సంఘర్షణలు!"

“అయితే ఈ పరిస్థితులు ఇలా కొనసాగాల్సిందేనా మేడమ్ ?”

“చూడమ్మా - స్వాతంత్ర్యం వచ్చాక - ఈ నలభైయేళ్ళ మనదేశ చరిత్ర గమనిస్తే- మనకి పార్లమెంటరీ ప్రభుత్వం పనికిరాదని స్పష్టమవుతోంది! ప్రజాస్వామ్యాన్ని అంటిపెట్టుకుని ప్రయోగాత్మకంగా అమెరికాలోలా - అధ్యక్ష తరహా పాలనకి స్వాగతం పలకడమో... వర్తమాన కాల పరిస్థితుల కనుగుణంగా రాజ్యాంగాన్ని సమూలంగా మార్చుకోవడమో.... ఏదో ఒకటి చేసే సమయం ఆసన్నమైంది ! అన్నిటికన్నా ముందు మనదేశంలో ఎవరిది ఏకులమో - ఏ మతమో తెలీని పరిస్థితులు ఏర్పడాలి ! మీ యువత నడుం బిగించి - ఏకతాటిపై నడిస్తే తప్ప, పరిస్థితులు చక్కబడవ్! టైమ్ అయి పోయింది! బయట హిస్టరీ లెక్చరర్ వెయిట్ చేస్తున్నట్టున్నారు! నేను ఇన్నాళ్ళూ పనిచేసిన కాలేజీలోని అమ్మాయిలంతా ఎప్పుడూ చీరెలూ... నగలూ.. సినిమాలూ... సీరియల్ నవలలూ... ఫ్యాషన్లూ తప్ప రాజకీయాల గురించి చర్చించడం నేనెప్పుడూ విన్లేదు. మీలో కన్పిస్తోన్న రాజకీయ పరిజ్ఞానం... నాకు ఆశ్చర్యాన్నీ... ఆనందాన్నీ కల్గిస్తోంది! మీ క్లాస్ నాకు కొత్తయినా... మీతో చర్చ... నాకు ఓ నూతనోత్తేజాన్నీ, స్ఫూర్తినీ కల్గిస్తోంది.” అంటూ క్లాసురూంలోంచి బయటకి వెళ్ళిపోయింది అరుణ.

ఆ తర్వాత వారం రోజుల్లో అరుణకి వరుసగా అయిదు లేఖలు అందాయి !

“ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠాలు చెప్తున్నందుకు ఎందుకు సంజాయిషీ ఇచ్చుకోకూడదో చెప్పాలి”అంటూ ప్రభుత్వ అధికారుల నుండి మెమో!

“నక్సలైట్ల భావాలని అరుణ విద్యార్థినుల్లో ప్రచారం చేస్తోంది - దానిపై సమగ్ర విచారాణ జరపాలి” అని ఏ.బీ.వీ.పీ ఆరోపణ.

‘నీ ఉద్యోగమేదో నువ్వు చేసుకోకుండా- రిజర్వేషన్లకి వ్యతిరేకంగా విద్యార్థినులకు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నావని తెలిసింది - ఇక నోరు విప్పితే నోట్లో నాలుక ఉండదు” అని... బీసీల తాఖీదు!

“మన రాష్ట్రంలో ఇప్పటికీ డొనేషన్లు రద్దు చేశారు ! నీ

ఉపన్యాసాల హోరుతో పక్క రాష్ట్రాల్లో కూడా ఈ డొనేషన్లు రద్దు చేయించేలా వున్నావ్ ! ఒళ్లు దగ్గర పెట్టుకో!'' అని డబ్బున్న ఓసీల వార్నింగ్!

"నాల్గోడల మధ్య పాఠాలు చెప్పడం తప్ప, బయట ప్రపంచం చూడని నువ్వు- ఎండనకా - వాననకా - రాళ్ళల్లో, రప్పల్లో పేద ప్రజల కోసం పాటుపడే మా గురించి చర్చించి విద్యార్థి సంఘనాయకులైన కిరణ్‌తో మాకు నీతులు చెప్పించే సాహసం చేస్తావా - చూడూ నీకేం గతి పడ్తుందో?'' అని నక్సలైట్ల నుండి బెదిరింపు!

అరుణ నవ్వుకుంది !

ఆ మర్నాడు....

మహిళా కళాశాల పొలిటికల్ సైన్స్ లెక్చరర్ అరుణ దారుణ హత్యకి గురైందనీ- పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారనీ - పట్టణంలో భీతావాహం నెలకొందనీ - పేపర్లో ఓ సంచలన వార్త!

అన్ని గ్రూపుల్లోని విద్యార్థినులు ఒకర్నొకరు అనుమానంగా చూసుకున్నారు !

సంతాప సభలో...

మొక్కుబడిగా కొందరు...

భక్తిగా కొందరు...

భయంగా కొందరు...

అరుణని ప్రశంసిస్తూ ప్రసంగించారు!

కాని - దేశ సమకాలీన పరిస్థితులపై అరుణ చేసిన విశ్లేషణకి - స్పందించిన కొందరు విద్యార్థినులు మాత్రం - సంతాప సభలో - ఏమీ మాట్లాడకుండా అన్యమనస్కంగా వున్నారు ! ఎవరి మాటలూ పట్టించుకోకుండా తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

అవునూ - ఆ రోజు అరుణ మేడమ్ - మనది 'ప్రజాస్వామిక సోషలిజం' అంటే 'సమానత్వంలేని స్వేచ్ఛ' అన్నారు. కానీ తన మనసులోని భావాలు స్వేచ్ఛగా వెల్లడించినందుకే ఆవిడ

హత్యచేయబడ్డారూ అంటే... మనదేశంలో వున్నది నిజానికి 'సమానత్వం లేని స్వేచ్ఛ కాదు! స్వేచ్ఛలేని - సమానత్వంలేని - అరాచకత్వం ! స్వేచ్ఛపేర జనించిన విశృంఖలత్వం !' అసలు ఈ అరాచకత్వం మనదేశంలో ఇలా కొనసాగుతున్నంత కాలం... తాము ఏ స్వేచ్ఛనీ- ఏ సమానత్వాన్నీ అనుభవించలేరు!

వాళ్లు ఆలోచిస్తూనే ఉన్నారు ! కొన్ని గంటల తర్వాత ఒక నిర్ణయానికి వచ్చారు!

మరుక్షణం - ఏబీవీపీ - పీడియస్యూ - రాడికల్స్ - నవ సంఘర్షణ సమితి - సమ సంగ్రామ పరిషత్, ఎన్నెస్యూఐ, తెలుగు యువత - తదితర విద్యార్థి సంఘాలు... తమ సభ్యత్వానికి మూకుమ్మడిగా రాజీనామాలు సమర్పించారు.

ఆ రోజు క్లాస్‌లోంచి బయటకు వెళ్తూ... అరుణ మేడమ్ చెప్పిన హితవు గుర్తొచ్చి- ఆ లక్ష్య సాధనకై... ఉడతా భక్తిగా తమ వంతు కర్తవ్యం నెరవేర్చుకోవడానికి - ఒక 'సంఘటిత శక్తి'గా రూపుదిద్దుకోవడానికి !

★★★


**'ఆంధ్రభూమి' మంత్లీ**

**19-10-1989**

# ఇదో రకం ముష్టి !



1987



"ఏ భాషనైనాసరే నేను ఇరవైనాల్గంటల్లో నేర్చుకుంటాను."

బస్సు ప్రయాణం చేస్తోన్న నేను.... - నా ముందు సీట్లోంచి విన్పిస్తోన్న మాటలకి... నాలో నేనే నవ్వుకున్నాను !

" నాకు ఆరు భాషలూ అనర్గళంగా .... మాట్లాడటం, రాయడం, చదవడం వచ్చు!"

" అలాగా !?!"

" నా పేరు సుభాష్! నాకో వైన్‌షాప్ వుంది! ఎక్సైజ్ కాంట్రాక్టర్‌ని"

" ఓహో...!?"

శ్రోత పొడిపొడిగా సమాధానం చెప్తున్నాడు.

“ రోజుకో భాష నేర్చుకునే సత్తా వున్న నీకు... నీ ముప్పయేళ్ళ జీవితంలో కనీసం ఒక ఇరవయ్యేళ్ల కాలాన్ని లెక్కలోకి తీసుకున్నా - ఈ పాటికి ఓ ఏడువేల భాషలైనా వచ్చి వుండాలే! ఆరు భాషలంటే.... అదో క్రెడిటా... షేమ్ కాకపోతే !?” నా పక్కసీట్లో కూర్చున్న కాలేజీ అమ్మాయి తన ఫ్రెండ్‌తో కామెంట్ చేసింది.

“ చూడండీ, నాకు యద్దనపూడి సులోచనారాణి, దాశరథి రంగాచార్య, యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది ఒకరేమిటీ... పేరుమోసిన రచయితలందరూ తెలుసు! ఎన్నో సాహితీ సంస్థలను స్థాపించాను! లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్‌ని! ఇంకా చెప్పాలంటే.... ఫ్రీలాన్స్ జర్నలిస్టుని. మావూరి దేవాలయ కమిటీకి సెక్రటరీని. అయ్యో, చెప్పడం మరిచిపోయా....! యన్నార్కే పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకుణ్ణి! ఒకరకంగా.... నేను రింగ్ లీడర్ని అని చెప్పుకోవచ్చు....! ఏమండీ... వింటున్నారా?”

శ్రోత మొహం మరోవేపుకి తిప్పుకున్నాడు.

“ ఇదిగో - ఇది... నేను మొన్న ఢిల్లీ వెళ్ళినప్పుడు రాజీవ్‌గాంధీ, సోనియా గాంధీలతో తీసుకున్నఫోటో! సోనియాగాంధీ నేను ఢిల్లీ వెళ్ళినప్పుడు ఫోన్‌చేస్తే చాలు.... నేనెక్కడున్నా కారు పంపి.... నన్ను వాళ్ళింటికి పిలిచి, రాజకీయ విషయాలు మాట్లాడ్తుంది. ఎంతైనా పత్రికావిలేకర్ని కదా...! మాకు చాలా ప్రిఫరెన్స్ ఇస్తారు ! వాజ్‌పాయ్, ఉపేంద్ర కూడా అంతే.... నాకు ఎంత రెస్పాన్స్ ఇస్తారో చెప్పలేను!”

నాకెందుకో అతడి మాటల్ని వింటోన్న శ్రోతని చూడాలనిపించింది!

పాపం... ఆయన... అదేపనిగా కణతలు రుద్దుకుంటున్నాడు.

ఏదో స్టేషన్‌లో బస్సాగింది ! అందర్నీ తోసుకుంటూ ఒక ముష్టివాడు బస్సెక్కాడు. ఒక్కొక్కర్నే అడుక్కుంటూ.... వచ్చి, సుభాష్ రెండు కాళ్ళూ పట్టుకున్నాడు.

“అయ్యా... అన్నం తినక ఇరవై నాల్గంటలైంది ! ఆకల్తో కడుపు నకనకలాడ్తోంది! కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి, ఒక పావలా ధర్మం

చేయండి బాబూ... మీకు పుణ్యం వుంటుంది!"

కాళ్ళు వదలకుండా అదేపనిగా బతిమాలుతున్నాడు....

సుభాష్ చీదరగా ముఖంపెట్టి, శ్రోతతో చెప్తున్నాడు: " నాకీ ముష్టెత్తుకునే వాళ్ళంటే... ఎంత అసహ్యమో చెప్పలేను! దున్న పోతల్లే ఎలా వున్నాడో చూడండీ! వీడికి కాళ్ళు వంకరా... కన్ను వంకరా...? ఏదైనా పని చేసుకొని బతకొచ్చుకదా ! అబ్బే, పనిచేయడానికి బద్ధకం - సోమరితనం! ఈ యాచకవృత్తిని నిషేధించాలంటూ ఒక అర్టికల్ రాస్తున్నాను. అది వచ్చే ఆదివారం 'ఈనాడు' పేపర్లో రాబోతోంది. మీరు అది చదివి ఎలావుందో నాకు రాయండి.... ఏమండీ వింటున్నారా?"

శ్రోత మాట్లాడకుండా ఆవలింతలు మొదలుపెట్టాడు...

"నేను ఇరవైనాల్గంటల్లో ఎవర్నైనాసరే సస్పెండ్ చేయించగలను. మీక్కూడా ఏమైనా ప్రాబ్లెమ్స్ వుంటే చెప్పండి! మన ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు కూడా నాకు బాగా తెలుసు ! ఆయన అల్లుడు చంద్రబాబు నాయుడు నా క్లాస్‌మేట్ - నిముషాల్లో మీపని పూర్తి చేయిస్తాను !"

"మీ కెందుకండీ శ్రమ !": శ్రోత గొంతులో వ్యంగ్యం.

"శ్రమేముందండీ.... 'పరోపకారార్థ మిదం శరీరం' అన్నారు... ఇలా నల్గురికీ సాయపడటమే నా లక్ష్యం ! ఇదిగో నా అడ్రస్! మీకే పని కావాలన్నా ఈ అడ్రస్‌కి ఒక ఉత్తరమ్ముక్క రాయండి చాలు !"

ఇంతలో బస్సు ఆగింది ! సుభాష్ అనబడే వ్యక్తి దిగిపోయాడు.... ఓ సంచీ నిండా కాగితాల్ని మోసుకుంటూ.

అతడలా దిగాడోలేదో - అంతవరకూ అతడి మాటల్ని ఓపిగ్గా విన్న ఆ పెద్దమనిషి సర్దుక్కూర్చుని: "అమ్మయ్య ! వడగళ్ళ వానపడి వెలిసినట్టుగా ఉంది! మొహమాటానికి పోయి వెధవ బోర్‌ని భరించాను... రెండు గంటల్నుండీ ! ఇరవై నాల్గంటల్లో ట్రాన్స్‌ఫర్ చేయిస్తాడట... ట్రాన్స్‌ఫర్ ! వీడికి నా పక్కనే సీట్ దొరకాలా - నా ఖర్మకాకపోతే!? జోరీగలా ఒకటే రొద !" అంటూ తన పక్క సీటాయన్తో

చెప్తున్నాడు....

నవ్వుకుంటూ కిటికీలోంచి బయటికి చూశాను.

నేను కూర్చున్న కిటికీ దగ్గర నించొని సుభాష్.... మళ్ళీ ఎవర్తోనో మాట్లాడ్తున్నాడు: "నా పేరు సుభాష్ ! నేను ఏ భాషనైనా సరే ఇరవైనాల్గంటల్లో నేర్చుకుంటాను...."

వడగళ్ల వాన మళ్ళీ మొదలు ! ఈసారి కర్ణకఠోరంగా... అరిగిపోయిన గ్రామ్ ఫోన్ రికార్డ్లల్లే.

వెంటనే విండోగ్లాస్ దించి కూర్చున్నాను.

ఇదే బస్సులోంచి దిగాడేమో... ఇందాకటి ముష్టివాడు... అందర్నీ అడుక్కుంటూ.... సుభాష్ మాట్లాడ్తోన్నాయన పక్కన... ప్రత్యక్ష మయ్యాడు:

"అయ్యా, అన్నం తినక ఇరవై నాల్గంటలైంది. ఆకల్తో కడుపు నకనకలాడ్తోంది. ఓ పావలా దానం చేయండి బాబూ, మీకు పుణ్యముంటుంది." ఒక్కొక్కరి దగ్గరికి వెళ్ళి చెప్పిన మాటల్నే చెప్పుకుంటూ, వాళ్ళ దూషణచీత్కారాల్ని లెక్క చేయకుండా... డబ్బు అడుక్కుంటున్నాడు!

నేనెందుకో సుభాష్నీ... ఆ ముష్టివాణ్ణీ మార్చి మార్చి చూశాను....

సుభాష్ దృష్టిలో అది సోమరితనాన్ని పెంచే... ముష్టి !

అయితే తనకి ఎదురైనవాళ్ళందర్తో - అసలు తన మాటలు వాళ్లకి ఆసక్తికరంగా వున్నాయోలేవో కూడా గమనించకుండా... తన గొప్పలు చెప్పిందే చెప్పుకుంటూ.... ఎదుటి వాళ్ళ నుండి తన కొక 'గుర్తింపు' ను అడుక్కుంటున్నాడు.... సుభాష్ !

**మరి అతడిది.... ఏ రకం ముష్టి !?**

*-'కేకలు', వీక్లీ*

**నవంబర్, 1987**

# స్పందన





**1985**

"ఆంటీ..... అమ్మ ఇప్పుడు మీతో షాపింగ్‌కి లానంటున్నాలు ! లాజంపేట్ నుండి మా బాబాయి వచ్చాలని మీకు చెప్పమన్నాలు."

వచ్చీరాని మాటలతో ముద్దు ముద్దుగా మాట్లాడ్తోన్న చిన్నీ... మాధవికి మరీ ముద్దొచ్చింది.

యాపిల్ పళ్ళలాంటి బుగ్గలూ... చిన్ని చిన్ని చేతులూ... బుల్లినోరూ... తెల్లటిఒళ్ళూ... ఒత్తయిన జుత్తూ !

"ఏయ్ చిన్నీ - ఇలారా !" అంటూ చిన్నీని దగ్గరకు తీసుకుని గుండెకు హత్తుకుని... బుగ్గలనిండా ముద్దులు కురిపించి... తనివి తీరక.... కుడి బుగ్గను అప్రయత్నంగానే కొరికింది.

చిన్నీ కెవ్వుమంది.

"అదేమిటే ! ఆ పసిదాని బుగ్గలపై... ఎంగిలీ... నువ్వూ !"అంటూ మందలించింది అప్పుడే ఆ గదిలోకి అడుగెట్టిన బామ్మ.

"మరి... ఆ బుగ్గలలా... వూరించేలా... అంతంత లావుగా... యాపిల్ పళ్ళలా ఎందుకుండాలీ ?" అంటూ నవ్వేసింది మాధవి.

పక్క పోర్షన్‌లో తల దువ్వుకుంటోన్న చిన్నీ వాళ్ళ బాబాయ్ రవికి - వెంటిలేటర్లోంచి మాధవి మాటలు విన్పించి.... అప్రయత్నంగానే తన బుగ్గలు తడముకున్నాడు.

'ఫర్వాలేదు....! తన బుగ్గలు కూడా - చిన్నీ బుగ్గలకి మల్లే.... యాపిల్ పళ్ళలా.... అమ్మాయిలని వూరించేలా వుంటాయ్!' తన

ఊహకి తనే నవ్వుకున్నాడు రవి.

'అన్నట్టు బామ్మా ! అరుణగారు ఈ రోజు షాపింగ్‌కి రారని కబురుచేశారు. రేపు నా బర్త్‌డేకి చీర ఎలా ? నాకేమో సెలెక్షన్ తెలీదు. కనీసం... ఈసారయినా... ఆవిడ సెలెక్షన్‌తో....చీర కొనుక్కోవచ్చని సంబరపడ్డాను... కాని... ప్చ్.... ఎవరో- చిన్నీ బాబాయిట.... పనేం లేనట్టు ఇప్పుడే దిగాడు.!"

"ష్ ! వాళ్ళకి విన్పిస్తుంది ! కాస్త నెమ్మదిగా మాట్లాడు !" బామ్మ మందలించింది.

"నువ్విప్పుడు కాలేజీకి వెళ్ళమ్మా!. సాయంత్రంలోగా... ఆమెని.... ఎలాగోలా బ్రతిమాలి... ఆమె సెలెక్షన్‌తోనే చీర కొనిపెడ్తాను.... సరేనా?" బామ్మ నచ్చచెప్తోంది.

'ఓహో... ఆ అమ్మాయికి వదిన సెలెక్షన్ ఇష్టమట ! వదినకి తనే చీరలు సెలెక్టు చేసిపెడ్తాడని తెలీదు పాపం! పక్కింటి అమ్మాయి మాధవి చాలా బుద్ధిమంతురాలనీ... తను వచ్చినప్పుడల్లా వదిన చెప్తూంటే వినడమేగానీ తను ఆమెని ఎప్పుడూ చూళ్ళేదు'... ఆలోచిస్తోన్న రవికి - ఎందుకో ఒకసారి ఆ అమ్మాయిని చూడాలని పించింది.

ఆమె ఇంతకీ ఎలా వుంటుంది? సన్నగా నాజుగ్గా... బాపూ బొమ్మలా ఉంటుందా? బొద్దుగా... పొందిగ్గా వడ్డాది పాపయ్య బొమ్మలా ఉంటుందా ?

రవి ఆలోచిస్తూనే ఉన్నాడు.

"బామ్మా.... నేను కాలేజీకి వెళ్తున్నాను! తలుపులు వేసుకో"! అంటూ బయటకు వచ్చి ఎదురింట్లో ఆమెకోసం ఎదురు చూస్తోన్న ఆమె క్లాస్‌మేట్‌ని 'హాయ్ నిమ్మీ' అంటూ పలకరించింది మాధవి.

ఆమెని చూడాలని ఆత్రంగా బయటికి వచ్చిన రవి - మరి కళ్ళు తిప్పుకోలేక పోయాడు !

'రవివర్మకే అందనీ ఒకే ఒకా అందానివో ?..... ఏ కవి రాశాడోగానీ ఈమె పట్ల అది అక్షరాలా నిజం !' అనుకున్నాడు.

అతడి మనసులో.... అతడికే తెలీని... ఏదో అలజడి.... తీయటి బాధ... అతడి నరనరానా పాకింది.

బామ్మ చెప్పిందేమో.... మధ్యాహ్నం అరుణ బజారుకి వెళ్తూ అలవాటు ప్రకారంగా తనతోపాటు... సెలెక్షన్‌కోసం... వెంట రవిని రమ్మంది.

రవి..... నేవీబ్లూకి..... కాపర్‌సల్ఫేట్ బోర్డరున్న గద్వాల్ చీర సెలెక్టుచేశాడు. ఆ సాయంత్రం అరుణ ఆ చీర తీసుకెళ్ళి.... మాధవికి ఇచ్చి వచ్చింది. మాధవికి చాలా చాలా నచ్చిందని చెప్తే తృప్తిగా ఫీలయ్యాడు.

తెల్లవారితే మాధవి పుట్టిన్రోజు.... ఆమెకెలాగైనా.... తన శుభాకాంక్షలు అందించాలి... ఎలా చెప్పాలీ.... ఏమని చెప్పాలీ... ఏం చెప్తే.... అది... తన మనసులో మెదిలే భావాలకి అద్దం పడ్తుందీ!?

బ్రీఫ్ కేసులోంచి లెటర్‌పాడ్ తీశాడు!... నీలి కాగితాలపై... ముత్యాల్లాంటి అక్షరాలను పేర్చి - కూర్చి.... శుభాకాంక్షల మాల తయారు చేశాడు.

ఆ మర్నాడు - మాధవి ఆ చీర కట్టుకుంటుందని తెలిసి - చిన్నీ చేతిలో ఆ నీలికవరు పెట్టి దాన్ని మాధవికి ఇచ్చి రమ్మన్నాడు.

ఫ్రెండ్సెవరో పంపించి ఉంటారనుకుని నిదానంగా కవర్ విప్పిన మాధవి గుండె ఝల్లుమంది.

**నా.... నీకు,**

ఎంత దూరంగా ఉండి.... ఎన్ని పోజులు కొడ్తేమాత్రం... ఒక పూటంతా నా గుండెలపై పెట్టుకుని పంపించిన ఆ చీర... నీ పుట్టిన్రోజునాడు.... నిన్నంటి పెట్టుకుని... నీ ఒళ్ళంతా... తడిమి తడిమి - గిలిగింతలు పెడ్తూంటే... మైడియర్... ఏం చేస్తావ్ ? నా స్మృతులనుండి ఎలా తప్పించుకుంటావ్ ?

జన్మదిన శుభాకాంక్షలతో...

'నీ'

కావాలనుకునే... నేను.

ఎవరూ చూడకుండా - చిన్నీని పిలిచి - అది ఎవరు రాశారో అడిగి తెలుసుకుంది మాధవి.

క్షణాలు గడిచేకొద్దీ.... ఆ ఉత్తరం చూడగానే ఆమెకి వచ్చినకోపం... క్రమేణా- కరిగిపోవడం మొదలెట్టింది.

పదే... పదే... ఆ ఉత్తరంలోని వాక్యాలు గుర్తొస్తూ - అతడిపట్ల - ఆమెలో - ఆమెకే తెలీని అవ్యక్తాభిమానం వెల్లువలా పొంగి ఆమెని ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

ఆ ఉత్తరం ఎన్నిసార్లు చదువుకుందో లెక్కేలేదు. ఎంత కమనీయ భావన! - నిజంగా అతడు తన కాంక్షలూ... ఆకాంక్షలూ... శుభాకాంక్షలూ... ఆ లేఖలో ఎంత అందంగా వెలిబుచ్చాడు !? నిజానికి అతడు ఎలా ఉంటాడో కూడా తనకి తెలీదు!

అరుణ వాళ్ళ మరిది పేరు రవి అనీ - బుద్ధిమంతుడనీ - తప్ప - అతణ్ణి కనీసం - తను చూడనైనాలేదు !

కాని... అతడు తనని అభిమానిస్తున్నాడని తెలీగానే - తనలో ఇంత అలజడి ఏమిటీ... తన ముఖం చూపించకుండానే అతడు తనను ఇంత కదిలిస్తున్నాడే.... ఆ మనిషి సాహచర్యం ఇంకెంత మధురంగా ఉంటుందో!?

కాలేజీలో తనపేర ఎన్నో లవ్ లెటర్స్ వస్తుంటాయి ! కానీ... ఆ వుత్తరాలన్నీ జుగుప్స కలిగేలా, లవ్‌లెటర్స్ అంటేనే అసహ్యించుకునేలా చేసేవి !

అలాంటిది - తనలో ఈ వుత్తరం చదవగానే అంతఃక్రితం ఎప్పుడూ లేనిదీ... అతణ్ణి చూడాలన్న - ఈ తహతహ ఏమిటీ ?

అతడు పక్కింట్లోనే వుంటున్నాడనీ... ఆ ఇంటికీ ఈ ఇంటికీ మధ్య ఒక గోడే అడ్డం - ఆ గోడవతలే - ఆ గోడనానుకుని వున్న కుర్చీలో అతడు కూర్చుని వుండి వుంటాడేమో అన్న ఊహరాగానే... ఆ గోడని - ఆప్యాయంగా నిమిరింది.

అయితే రవికి మాత్రం ఆ వుత్తరం రాశాక - బయటికి వచ్చే ధైర్యం లేకపోయింది.

మాధవి 'ఆ విషయం' వాళ్ళ బామ్మతో చెప్పి అల్లరి చేస్తుందేమో - లేకపోతే వదినకి చెప్పి చీవాట్లు పెట్టిస్తుందేమో...

ఆలోచిస్తోన్న అతడికి గంటలు గడిచే కొద్దీ - తను ఊహించిన ఉత్పాతం ఏదీ జరక్కపోయేసరికి - అంతవరకూ వున్న భయం - సంకోచం, టెన్షన్ తగ్గి క్రమేణా ఉత్కంఠ మొదలైంది!

మాధవి రెస్పాన్స్ ఎలా వుందో తెలుసుకోవాలన్న కుతూహలం

అధికమైంది.

ధైర్యం కూడ తీసుకుని  పనున్నట్టు బజార్‌కి వెళ్ళి - వస్తూనో వెళ్తూనో - ఆమెనోసారి చూడాలనుకున్నాడు !

సాయంత్రం కిటికీ దగ్గర కుర్చీ వేసుక్కూర్చున్న మాధవికి పక్కింటి తలుపులు తెరుచుకున్న శబ్ధం వినిపించి చెవులు రిక్కించింది !

కిటికీ తలుపులు రెండూ దగ్గరగా వేసి - ఆ రెండింటి తలుపుల సందుల గుండా తను ఇతరులకి కన్పించకుండా - కళ్ళు విప్పార్చి బయటకి చూసింది.

రవి బజారుకి వెళ్తూ, వెనక్కి తిరిగి ఒక క్షణం మాధవి ఇంటి వేపు ఆమె కన్పిస్తుందేమోనని చూశాడు.

కానీ మూసి వున్న కిటికీ తలుపులు అతడి ఉత్సాహం పొంగుమీద చన్నీళ్ళు కుమ్మరించినట్టు చేశాయ్.

అయితే తన ఉత్తరం ఆమెకి కోపం తెప్పించిందన్న మాట ! అతడి మనసులో.... ఏవో మబ్బులు అలుముకున్నాయి.

పచ్చటి శరీరం.... కండలు తిరిగిన ఒళ్ళూ, గిరిజాల జుట్టూ, నున్నగా గీసుకున్న గెడ్డం- పచ్చగా కన్పిస్తూ - అతడి ముఖం 'పచ్చని ఆకుల మధ్య చిక్కుకున్న గులాబీ'ని గుర్తుకు తెచ్చింది.... 'అతడిది ముద్దొచ్చే ఆడపిల్లల మొహం' అనుకుంది మాధవి రవిని చూస్తూ.

బజార్లో ఓ గంట అసహనంగా అటూ ఇటూ తిరిగి - ఏమీ తోచక ఎక్కడా వుండలేక  మళ్ళీ ఇంటి ముఖం పట్టాడు రవి. మాధవి వాళ్ళ ఇంటి తలుపులు ఇంకా మూసేవున్నాయి.

గుమ్మంలో చిన్నీ కన్పించింది. ! మధ్య మధ్య మూసిన తలుపుల వంక  చూస్తూ- చిన్నీతో ఆడుకుంటున్నట్టు ప్రిటెండ్ చేస్తూ వీధిలోనే నించున్నాడు.

ఆమెను అతడు చూసిన క్షణం అతడికి లోకమంతా పచ్చగా... ఉల్లాసంగా కన్పించింది! ఆమె నుండి రెస్పాన్స్ రాని క్షణాలు - అతడికి దుర్భరంగా, దిగులు దిగులుగా.... భారంగా గడుస్తున్నాయి.

ఓ పావుగంట తర్వాత - అతడి తపస్సుకి  మెచ్చి వరమిచ్చినట్టు కిలకిలా నవ్వుకుంటూ మాధవీ - మాధవి ఫ్రెండ్ నిర్మలా - తలుపులు తెరుచుకుని బయటకి వచ్చారు.

"గుడ్ నైట్ మధూ!" అంటూ వెళ్ళిపోతూన్న నిర్మలని చూస్తూ, 'గుడ్‌నైట్' చెప్పి తలుపులు వేసుకోబోతోన్న మాధవికి ఎదురుగా - కళ్ళు విప్పార్చి తనవంకే తదేకంగా చూస్తోన్న 'అతడు' కన్పించాడు.

ఆమె ఇబ్బందీ, కంగారూ - తొట్రుపాటూ - సిగ్గూ - అంతవరకూ అతడిలో వున్న దిగులును పోగొట్టి, అతడికి ఆమె మనస్సేమిటో పట్టిచ్చేలా చేశాయి !

తలుపులు వేయబోతూ - మరోసారి అతణ్ణి చూసిన మాధవిని వెనక నుండి శ్రావ్యంగా - "కొలనువంటి కన్నులలోనా తళుకులీను చూపుల చేపలు - వలపు వలను వేశానంటే ఎగిరి మనసులో పడ్తాయి - అందమంటే నువ్వే ! ఆనందమంటే నువ్వే!" రవి పాట వెంటాడింది.

★★★

వారం రోజులు గడిచాయి.

"ఒరేయ్ రవీ, నువ్వదృష్టవంతుడివిరా... చక్కగా కోరుకున్న భార్య! నువ్వు చెప్పినట్టు వింటుంది మాధవి ! అయాం జెలసాఫ్ యూ" అన్నాడు శ్రీనివాస్, స్కూటర్ స్టార్ట్ చేస్తోన్న రవిని చూస్తూ.

"అదేంటన్నయ్యా !? వింతగా మాట్లాడ్తున్నారు ! వదినకు మాత్రం ఏం లోపమనీ? ఇద్దరూ ఒకర్నొకరు ఇష్టపడి పెళ్ళి చేసుకున్నారు - అందులోనూ 'కాలేజీ బ్యూటీ' అని పేరు తెచ్చుకున్న - వదిన"! రవి ఆశ్చర్యపోతున్నాడు.

" ఆ అందమే నన్ను మోసం చేసిందిరా! ఎంత అందముండీ ఏం లాభం !? నేను చెయ్యి వేస్తే చాలు మండిపడ్తుంది. భగ్గుమంటుంది! పెళ్ళయి అయిదేళ్ళయి నట్టేగానీ - ఏ ఒక్క రోజూ నేను ఆమెతో సుఖపళ్ళేదు ! ఎప్పుడూ ఏవో ఆలోచన్లూ... ఆవిడా ! అదో లోకంలో వుంటుంది."

రవికి వినాలనిపించలేదు.

"రొటీన్ లైఫ్ మీకు విసుగు తెప్పించినట్టుంది. నేనిప్పుడు ఏర్‌పోర్ట్‌కి వెళ్తున్నాను. ఈ బెంగుళూరు ఫ్లయిట్‌కి మాధవికీ నాకూ టికెట్స్ బుక్ చేద్దామనీ ! మాతోపాటూ, మీ ఇద్దరికీ బుక్ చేస్తాను! బెంగుళూరు నుండి మైసూరు, ఊటీకూడా ! కొన్నాళ్లు సరదాగా అలా తిరిగి వస్తే కాస్త మార్పుగా వుంటుంది కదా ! చిన్నీని బామ్మగారి

దగ్గర వదిలివెళ్దాం! వదినకి చెప్పండి." అంటూ శ్రీనివాస్ సమాధానం కోసం ఎదురు చూడకుండానే స్కూటర్ స్టార్ట్‌చేశాడు రవి.

ఆ రాత్రి - ఎనిమిది గంటల ఫ్లయిట్‌లో బయల్దేరి తొమ్మిదీ పదినిముషాలకి బెంగుళూరు ఏర్‌పోర్ట్‌లో దిగారు. బెంగుళూరు ఇంటర్నేషనల్ హోటల్లో బస! పక్క పక్కనే రూమ్స్ తీసుకున్నారు.

★★★

**ఆ గదిలో....**

"థాంక్స్ చెప్పుకోవాలి" అంది మాధవి రవి గుండెలమీద తల పెట్టుకుని అతడి గుండె చప్పుళ్ళని వింటూ.

"ఎందుకో?"

"హనీమూన్ అంటే ఎంత భయపడ్డానో తెలుసా ? ఎక్కడ బస్సుల్లో, రైళ్ళల్లో ప్రయాణం చేయాల్సివస్తుందో అనీ ! ఇంతదూరం అలా అలసి... సొలసి, వడలి- వాడిపోయివచ్చేకన్నా - అక్కడే ఎంచక్కా మనరూంలో నాలుగ్గోడల మధ్యే ఎంతో ఎంజాయ్ చేయవచ్చు కదా అనీ ! కానీ హనీమూన్ ఎంజాయ్ చేయాలంటే ఫ్లయిట్ ప్రయాణం ఎంత అవసరమో తెలిసి వచ్చింది!".

"అఫ్‌కోర్స్, ఫ్లయిట్‌లో ప్రయాణం చేసే స్తోమత మనకులేదు కానీ... ఎట్‌లిస్ట్ 'వన్స్ ఇనే బ్లూ మూన్' ఊటీ చలిలో నాచెలి నులి వెచ్చని కౌగిలి ఎలా వుంటుందో రుచి చూడాలనీ...." మాట్లాడ్తోన్న రవి పెదవుల్ని మాధవి పెదవులు మూసేశాయి.

**ఈ గదిలో...**

"ఏం ప్రయాణమో ఏమో ? మనిద్దరికీ కలిసి హైదరాబాద్ నుండి బెంగుళూర్‌కి ఫ్లయిట్ చార్జెస్ వెయ్యి రూపాయలు! ప్చ్.... ట్రెయిన్లో అయితే వంద రూపాయలకే వచ్చేవాళ్ళం! డబ్బు అనవసరంగా తగలేశాం కదా !" గుండెలపై పడుకున్న అరుణతో శ్రీనివాస్ చెప్తున్నాడు.

అతడి కంటికి తను ఫ్లయిట్‌కి తగలేసిన డబ్బూ, తద్వారా తను మిస్సయిన గుర్రప్పందాలే కన్పిస్తున్నాయి.

అరుణ చెయ్యి అతడి నడుంమీద పడింది.

'అవునూ... మేరీ - ఈరోజు టాంక్ బండ్‌కి వస్తానని

కబురుచేసింది! అనుకోకుండా తను బెంగుళూరు వచ్చేశాడు! అక్కడ తనకోసం వెయిట్ చేసీ చేసీ, ఏం అవస్త పడ్తుందో ఏమో!' శ్రీనివాస్ ఆలోచిస్తున్నాడు.

కళ్ళనిండా - మనసునిండా - మేరీని - నింపుకుని - అన్యమనస్కంగా అరుణని తనవేపు తిప్పుకుని ఆమె గుండెలపై తల ఆన్చాడు: 'సరిగ్గా ఇదే ప్లేస్‌లో అరుణ బదులు మేరీ అయితే ఎంతబావుండేదీ?' అనుకున్నాడు.

అతడి చేతులు, యాంత్రికంగా తమ పని చేసుకుంటూ పోతున్నాయి !

అప్పటికే మేరీ తలపులతో ఉత్తేజితుడై కోరిక తీరిన శ్రీనివాస్ కంటికి - అతణ్ణి లతల్లే పెనవేసుకుని తన హృదయానికి గట్టిగా హత్తుకుంటోన్న అరుణ కన్పించలేదు.

అప్పుడప్పుడే తీయటి క్షణాల్లో అడుగెట్టబోతోన్న అరుణనీ, ఆమె అనుభూతులనీ - చిందర వందర చేసి ఆమెని పక్కకు తోసి - లేచి బాల్కనీ లోకి వెళ్ళి - తాపీగా సిగరెట్ ముట్టించాడు.

ఆ మర్నాడు ఉదయం టాక్సీ తీసుకుని - బెంగుళూరులో చూడవలసినవన్నీ చూసేశారు.

'బెంగుళూరు నిజంగా ఎంత ప్లాన్డ్ సిటీ ! ఇళ్ళన్నీ ఒకదానికొకటి ఎడంగా - ఒక ఇంటికీ మరో ఇంటికీ మధ్య గాలీ వెలుతురూ ధారాళంగా రావడానికి వీలుగా - ఖాళీ స్థలం! ప్రతి ఇంటి ముందూ పచ్చటి చెట్లూ ! ఏ వీధి చూసినా అన్నీ ఒకే రకంగా నీట్‌గా, పొందిగ్గా! రియల్లీ ఇట్స్ మార్వలస్ సిటీ !' అరుణ ఆలోచిస్తోంది.

ఆ మర్నాడు టాక్సీ తీసుకొని మైసూరు బయల్దేరారు. మైసూరు మహారాజా ప్యాలస్, బృందావన్ గార్డెన్స్, చూడవలసిన ప్రదేశాలన్నీ చూసి - ఆ రాత్రి మైసూరు లో రెస్ట్ తీసుకున్నారు.

★★★

**రూమ్‌నెంబర్ నైన్‌లో...**

ఆరోజంతా తిరగడంవల్లేమో మాధవి అలసిపోయింది. రూమ్‌లోకి వెళ్తూనే బెడ్ మీద వాలిపోయింది.

'నిన్నటికీ ఇప్పటికీ ఒక్కరోజుకే ఎంత తేడా? నిన్నంత తాజాగా

- ఫ్రెష్‌గా - అప్పుడే అరవిరిసిన పువ్వులా వున్న మాధవి ఈ ఒక్క రోజుకే - అదీ... ఇంత చిన్న ఎండదెబ్బకే- ఎలా వాడిపోయింది ? నిజంగా ఈ ఆడవాళ్లు ఎంత సుకుమారులు!' అనుకుంటూ: "మధూ" అని పిలిచాడు రవి.

"ఊఁ"

"ఇటు తిరుగూ"

"ప్లీజ్... ఈరోజు నన్నొదిలి పెట్టండి ! నిద్రొస్తోంది" అంటూనే అటుతిరిగి పడుకుంది.

మంచానికి అడ్డంగా పడుకుని, ఆమె పాదాలను తన గుండెలపై పెట్టుకుని ఆ పాదాలను తన చేత్తో నిమురుతూ "తనువా....హరి చందనమే.... పలుకా... ఊ హుఁ.... అది మకరందమే ! కుసుమాలు తాకగనే.... నలిగేను కాదా నీమేను!" పాట పూర్తిచేసి డిమ్‌లైట్‌లో తళతళా మెరిసిపోతోన్న ఆపాదాలపై ముద్దెట్టుకున్నాడు.

మాధవి అలసట ఎటుపోయిందో.... నవ్వుతూ కళ్ళువిప్పి "దొంగా... ఇదిగో... ఇలాంటి పాటల్తోనే.... నా మతి పోగొట్టి, నన్ను నీ వశం చేసుకున్నావ్!" అంటూ చేతులు సాచి అతన్ని తన గుండెలకు హత్తుకుంది.

**రూమ్‌నెంబర్ టెన్‌లో....**

"అబ్బ టాక్సీలో వెళ్ళినట్టేగానీ.... మహారాజా ప్యాలస్.... బృందావన్ గార్డెన్స్ అవీ - తిరిగేసరికి కాళ్ళు పీకుతున్నాయ్! అరుణా.... ఎంతసేపూ బాత్రూమ్‌లో ? ఇలా వచ్చి నా కాళ్ళుపట్టూ!" శ్రీనివాస్ పిలిచాడు.

బాత్రూం నుండి తెల్లచీరలో మల్లెపువ్వులా బయటికి వచ్చిన అరుణ- మంచంమీద కూర్చుని, మట్టికొట్టుకుపోయిన అతడి కాళ్ళను తన ఒళ్ళోకి తీసుకుంది !

పావు గంట గడిచింది. అతడిలో సన్నటి గుర్రు మొదలైంది.

"శ్రీనూ.... అప్పుడే నిద్ర పోతున్నావా?" అతడి గుండెలమీద తలపెట్టి అడిగింది అరుణ.

"అబ్బ! పడుకో అరుణా!" నిద్రలోనే విసుక్కున్నాడు. తన ఒళ్ళోంచి అతడి కాళ్ళను తీసి పక్కన పెట్టి అటువైపు తిరిగి అశాంతిగా కళ్ళుమూసుకుంది.

శ్రీనివాస్ ఎప్పుడో తెల్లవారు ఝామున హడావిడిగా ఎవరో తరుముకొస్తున్నట్లు అరుణని లేపి తనమీదకు లాక్కున్నాడు!

అప్పుడప్పుడే నిద్ర పట్టిందేమో... ఆమె ఉలిక్కిపడి కళ్ళు విప్పింది.

కొండంత కోరికతో శ్రీనివాస్! అరుణ నిర్లిప్తంగా కళ్ళుమూసుకుంది.

శ్రీనివాస్‌కి కోపం వచ్చింది.

"ఏయ్, నిన్నే! ఇటు జరుగూ"

"నాకిప్పుడు ఓపికలేదు"

"రాత్రంతా రెస్ట్ తీసుకున్నావ్‌గా - ఓపిక లేకపోవడమేమిటీ ?" అంటూ ఆమెని తన వైపు బలవంతంగా తిప్పుకున్నాడు.

శ్రీనివాస్ ఆలోచిస్తున్నాడు.

తనక్కావలసింది - పక్కలోకి - ఎప్పుడు రమ్మంటే అప్పుడు వచ్చే భార్య!

కానీ.... ఈ అరుణ అలా కాదే! ఈవిడకు కొన్ని అభిప్రాయాలూ... అభిరుచులూ... మూడ్‌లూ ! ఈవిడకు మూడ్ తెప్పించేసరికి.... తన మూడ్ కాస్తా పోతుందే !

శ్రీనివాస్ కొన్ని నిమిషాలు - గత స్మృతుల్లోకి జారిపోయాడు.

**ఫస్ట్ నైట్**:

ఆమె బాధతో విలవిల్లాడిపోతూంటే... 'ఫర్వాలేదు అనాఘ్రాత పుష్పం' అనుకుని సంతోషించాడు.

**సెకండ్ నైట్**:

ఏ బాధాలేక ఆమె సహకరించింది. ఆ రాత్రి ఆమెతో అనుభవం తనకెంతో ఆనందాన్ని కలిగించింది. అదే విషయాన్ని ఆమెతో చెప్తే ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఆమె ముఖంలో ఏదో తెలీని అసంతృప్తి కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

"ఏం.... నీకు నచ్చలేదా ?"

"ఉహుఁ"

"ఎందుకనీ?" తను రెట్టించాడు

"సరిగ్గా ఆ క్షణాలలో నా అనుభూతిని రసాభాస చేశారు...."

ఆమె ప్లెయిన్‌గా చెప్పింది.

తన అహం దెబ్బతింది. తన అందం చూసి వెర్రిగా వెంటపడ్డ ఆడవాళ్ళను ఎంతో మందిని తను అనుభవించాడు. వాళ్ళలో ప్రతీ ఒక్కరూ తన పొందు లభించడమే భాగ్యంగా మురిసిపోయారు! అలాంటిది అరుణ కళ్ళల్లో.... ఆ అసంతృప్తి ఏమిటీ?

అయినా... తనను... ఎన్నో రకాలుగా కవ్వించీ.... కదిలించే ఆడవాళ్ళెంతో మంది వున్నప్పుడు - పనిగట్టుకొని ఈవిడకు తను ఇన్స్‌పిరేషన్ ఎందుకు కల్గించాలి ?

అదో టైమ్‌వేస్ట్ - తనకంత ఓపిక కూడా లేదు ! అంత అవసరమైతే ఆవిడే చొరవ తీసుకుంటుంది ! తనక్కావలసింది కూడా అదే! తను శ్రమ పడక్కర్లేకుండానే తన కోరిక తీరుతుంది.

**థర్డ్ నైట్**:

తను వూహించినట్టుగానే అరుణ చొరవతీసుకొని తనని మురిపించిందీ ! ఒకానొక క్షణంలో ఆ ఆనందం పట్ట లేక తను అనుకున్నాడు 'అబ్బ అరుణా ! స్వర్గమంతా ఇక్కడే నీ పొందులోనే వుందీ!'... అని !

ఆ క్షణం గడిచాక తను, కావాలనే -

ఛీ- ఏమ్మనిషివో ? సెక్సంటే ఎందుకలా గిజగిజలాడిపోతావ్ ? నిన్ను సైక్రియాట్రిస్ట్‌కి చూపించాలి" అన్నాడు కసిగా.

అరుణ ముఖం చిన్నబోయింది.

'అవునూ - ఆమెని రోజూ ఇలాగే అనాలి!

అరుణ అదే నిజం కాబోలనుకుని నోర్మూసుకుంటుంది! తన తిరుగుళ్ళకి అడ్డు చెప్పే సాహసం కూడా చేయదు! అంతే!' అతడికా ఆలోచన వచ్చిందే తడవుగా ఆరోజు నుండి ఆచరణలో పెట్టేశాడు.

"శ్రీనూ... ఈ ఒక్కరోజుకి నన్ను వదిలెయ్"!

శ్రీనివాస్ ఆలోచనల్లోంచి తేరుకున్నాడు ! అరుణ బేలగా చూస్తోంది ! ఆమె కళ్ళలో అలసట, నిద్రలేమి !

అదేమిటో ఆమెకి నిస్సత్తువున్నప్పుడు - తనకు కోరిక మరీ విజృంభిస్తుంది ! ఆమెకోసం తను - తన కోరికను చంపుకోలేడు కదా !

అనుకున్నదే తడవు అతడు ఆమె శరీరంతో తను బొమ్మలా ఆడుకున్నాడు!

మర్నాడు - వాళ్ళంతా మైసూరు నుండి టాక్సీ తీసుకుని ఊటీ బయల్దేరారు. మైసూరు నుండి మరో ఆరుగంటల ప్రయాణం. టాక్సీ వెనుక సీట్లో రవీ, మాధవీ కూర్చున్నారు.

శ్రీనివాస్ ముందు సీట్లో డ్రైవర్ పక్కన కూర్చుంటూ 'ఇక్కడి నుండి ఊటీ మరో ఆరు గంటలంటే.... బాప్‌రే, టాక్సీలో కాళ్ళు పట్టేస్తాయి. అసలే నిన్నంతా అలసి పోయాను. నాకీరోజు రిలాక్సేషన్ కావాలి!'' అంటూ రిలాక్స్‌డ్‌గా.... కారు కిటికీ దగ్గర సర్దుకున్నాడు.

అరుణకి ఎక్కడ కూర్చోవాలో తెలీక సంకోచంగా బయటే నించుండిపోయింది.

శ్రీనివాస్ ప్రవర్తనకి మాధవికి కోపం వచ్చింది. ఆమె ఏదో అందామనుకునేలోగా -

''వదినా ! మీరిక్కడ వెనుక సీట్లో మాధవి పక్కన కూర్చోండి'' అని పిలిచాడు రవి.

అభిమానం - సిగ్గూ.... సంకోచం.... దుఃఖం... కలగాపులగమై.... అరుణ ముఖం జేవురించుకుపోయింది.

మాట్లాడకుండా వెళ్ళి వెనుకసీట్లో కూర్చుంది. టాక్సీ కదిలింది.

తన ఉనికి వాళ్ళకి ఇబ్బందని తెలిసీ - కొత్త దంపతుల పక్కన కూర్చోవలసి రావడం అరుణకి డెలికేట్‌గా అన్పించింది.

అరుణకి ఎన్నాళ్ళనుండో ఊటీ అంద చందాలు చూడాలనివున్నా - తను మెలకువగా వుందని తెలిస్తే - రవీ వాళ్ళు ఎక్కడ ముళ్ళ మీదున్నట్టు ఫీలవుతారో అనే సంకోచంతో దారి పొడవునా నిద్ర నటించింది.

ఊటీ సమీపిస్తున్నప్పుడు... విపరీతమైన చలి మొదలయింది. ఊటీ ఘాట్స్ ఎక్కే కొద్దీ... చలి ఉధృతం ఇంకా అధికమైంది. ఆ చలికి తట్టుకోలేక బాస్కెట్‌లో పెట్టిన షాల్‌ని తీసుకోవడానికి.... కళ్ళు... మూసుకునే, కాళ్లతో తన కాళ్ళదగ్గర తడిమింది. అది ఎక్కడా తన కాళ్ళకి తగలక పోవడంతో కళ్ళు విప్పి - రెండు వైపులా చూసింది.

మాధవీ రవీ... ఇద్దరి మధ్యా అరంగుళమైనా ఎడంలేదు. ఒకరి

కౌగిట్లో మరొకరు ఒదిగి గాఢనిద్రలో వున్నారు. ఇద్దరి ముఖాల్లోనూ కొండంత సంతృప్తి !

వెంటనే దృష్టి మరల్చుకుని శ్రీనివాస్‌ని చూసింది. టాక్సీ శబ్దంలో కూడా పెద్దగా... శ్రీనివాస్ గురక విన్పిస్తూనే వుంది.

ఊటీ చేరేసరికి మధ్యాహ్నం రెండయింది. హోటల్లో భోంచేసి ఊటీలో చూడవలసిన ప్రదేశాలన్నీ చూసేశారు. సాయంత్రం మూడు గంటలకి ఊటీలో అన్నింటికన్నా ఎత్తయిన ప్రాంతానికి వెళ్ళారు.

గుండెల్లోంచి వణుకు పుట్టిస్తోంది చలి!

ఎటు చూసినా... చుట్టూ దూది పింజల్లా ఎగురుతోన్న మేఘాలు! తెల్ల తెల్లనివీ! నల్ల నల్లనివీ! అరుణ తన దృష్టిని మరల్చు కోలేకపోతోంది ! దారంతా కార్లో ఇలాంటి ఇంకెన్ని అందమైన దృశ్యాల్ని చూడకుండా తను మిస్ చేసుకుందో అని బాధపడింది.

"ఓహ్... ఎన్నెన్ని మేఘాలో, అరే... ఇదిగో... ఈ మబ్బు నా చేతిలోకే వచ్చేస్తోంది" మాధవి సంబరపడుతోంది... గుప్పిట్లో మేఘాల్ని పట్టుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తూ.

"మరే... కొంగున కట్టేసుకో... నాతో పాటూ అదీ వుంటుంది!" నవ్వాడు రవి.

ఎముకలు కొరికే చలికి - పది నిముషాల కన్నా అక్కడ ఎక్కువసేపు వుండలేక పోయారు.

అక్కడినుండి ఊటికి తిరిగి వచ్చేస్తూంటే: "బాప్‌రే ! ఎంత ఎత్తయిన ప్రదేశంలో వున్నాం మనం! ఇప్పుడీ కారు దొర్లితే ఇంకేమయినా వుందీ?" కర్వ్స్ వచ్చినప్పుడల్లా శ్రీనివాస్ గుండెలు దడదడలాడిపోతున్నాయి.

చుట్టూ లోయలు! ప్రమాదంతో కూడిన హేర్ పిన్ బెండ్స్! యూకలిప్టస్ చెట్లు! కొండ వాలుల్లో టీ తోటలు! అక్కడక్కడా రెండు కొండల మధ్యా చిక్కుకుపోయి బయటపడలేక పోతున్న మేఘాలు!

'తనూ శ్రీనివాస్ చెట్టాపట్టా లేసుకుని ఈ కొండల్లో - కోనల్లో - ఈ యూకలిప్టస్ చెట్ల కింద - లేడి పిల్లల్లా పరిగెత్తీ.... పరిగెత్తీ.... అలసిసొలసి, ఎక్కడో ఓచోట అతడి బలిష్టమైన ఎదలో... గువ్వల్లే తను ఇమిడి'... అరుణ అందమైన వూహల్ని అల్లుకుంటోంది.

ఆ రాత్రి పడుకోబోతూ యధాలాపంగా అడిగాడు రవి. "ఏరా అన్నయ్యా ఎలా వుంది ట్రిప్?"

"ప్చ ! రామేశ్వరం వెళ్లినా శనీశ్వరం తప్పదన్నట్టు ఊటీకి వచ్చినా, ఆమెలో ఏ మార్పూలేదు ! ఉత్త జడపదార్థం!" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు శ్రీనివాస్.

★★★

"నా ఉత్తరంచూసి నీకేమనిపించింది. మధూ!" మాధవి ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు రవి.

మాధవి నవ్వింది.

"ప్లీజ్ చెప్పవా?"

"నా మనసు తెలుసుకోకుండా ఏమిటీ ధైర్యం - అని మొదట కోపంవచ్చింది! తర్వాత..."

"ఊఁ తర్వాత?"

"నా నీకు... అని రాసిన నీ అక్షరాలపై నేను మళ్ళీ మళ్ళీ దిద్దాను! ఎందుకో చెప్పుకో చూద్దాం?" అతడి గుండెలమీద చేత్తో అతడి పేరు రాస్తూ అడిగింది.

"ఎందుకబ్బా?"

"మొద్దూ - ఏయే డైరెక్షన్స్‌లో నీ చెయ్యి తిరుగుతూ ఆ రాత రాసిందో అవే డైరెక్షన్స్ లో నాచెయ్యి కదిలి నిన్ను ముట్టుకున్న అనుభూతికి లోనవుతాననీ...."

రవిలో ఏవో తెలీని.... భావావేశం ఉవ్వెత్తున కడలి తరంగంలా పైకి లేచింది!

అతడి పెదాలు ఆమె నుదుటినీ, కనురెప్పల్నీ, బుగ్గల్నీ, పెదవుల్నీ తడుముతున్నాయి ! తడిపేస్తున్నాయి! అతడి ఊపిరి ఆమెకి వేడిగా... వాడిగా... తగుల్తూ ఆమెని ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది.

అతడి ఉధృతానికి ఆమె చిగురుటాకులా కంపిస్తోంది.

"అబ్బ... రవీ... ప్లీజ్"

అతడు రెండు చేతుల్తో ఆమె ముఖాన్ని తనవైపుకు తిప్పుకుని ఆమె చెవుల్ని గాఢంగా చుంబించాడు.

“మధూ ! మధూ మై డాళింగ్!” ఆమె చెవుల్లో కువకువలాడాడు! ఎగిసెగిసి పడుతోన్న ఆమె గుండెలపై తల ఆన్చి - ఆమె నడుంపై చెయ్యేసి కొనగోటితో ఆమె వీపు నిమిరాడు.

“ఎంత గాయకుడివైతే మాత్రం... నువ్విలా నా శరీరంమీద ప్రతీచోటా సరిగమలు పలికిస్తూ ఉంటే - ఎలా రవీ ?” మాధవి గొంతులో తన్మయత్వం తొంగి చూస్తోంది.

★★★

ఎదురుగా గోడమీద - ఏదో అందమైన చిత్రపటం ! దగ్గరిగా వెళ్ళి చూసింది అరుణ. గాలిబ్ గీతాలకి దాశరథి చేసిన అనువాదం-

‘ఏల కాళ్ళు నొచ్చె బాలామణికి-

రాత్రి ఎవని స్వప్నసీమకేగివచ్చె?’

ఓహ్! ఎంత కమనీయ భావన!

‘చిత్రకారుడెవరోగానీ - అద్భుతమైన భావానికి అందమైన చిత్రాన్ని గీసాడు. ఉర్దూ భావుకత - తెలుగుమాటల్లో - కర్ణాటక హోటల్లో! వారెవా ! హోటల్ యజమాని ఎవరోగానీ - అతడి టేస్ట్‌కి హ్యాట్సాఫ్!’ అనుకుంది.

అరుణలో ఏదో భావావేశం ముప్పిరిగొని దృష్టి మరల్చుకుంది.

శ్రీనివాస్ నిద్రపోతున్నాడు !

‘నిద్రలోకూడా ఎంతందంగా ఉన్నాడో.... ముఖ్యంగా అతడి పెదవులు’.... చూస్తోన్న కొద్దీ అవి ఆమెని మరీ మరీ కవ్వించాయి. పెదవుల నిండా ముద్దుల వర్షం కురిపించింది.

శ్రీనివాస్‌కి మెలకువ వచ్చింది.

“ఇంకా నిద్రపోలేదా అరుణా!” అంటూ ఆమెని తనపైపు లాక్కుని...

“రేపు పొద్దున్నే కదా మన ప్రయాణం ! చెప్పడం మరిచాను! మొన్న మా ఆఫీసర్ వాళ్లావిడకు - నీ సెలెక్షన్‌తో ఏదైనా చీరకొని తీసుకుని రమ్మని చెప్పాడు! ఊటీ నుండి తీసుకొచ్చామంటే గొప్పగా ఉంటుందికదా - రేపు గుర్తు చెయ్యి” అంటూ ఏదో డ్యూటీలాగా - తన కార్యక్రమం ప్రారంభించాడు.

అరుణలో అసంతృప్తి మేఘాలు కమ్ముకున్నాయి!

అప్పటికీ - అతడి తలను తన గుండెల్లో దాచుకుంది.

శ్రీనివాస్ ఇంకా అదే మూడ్‌లో వున్నాడు: "మన ప్రయాణంలో ఇప్పటికి నాల్గు వేలు ఖర్చయ్యాయి. ఇంటికి వెళ్ళేసరికి.. ఎంత లేదన్నా - ఇంకో రెండు వేలైనా వదిలేట్టున్నాయి."

అరుణ...లోలోపల... కుతకుతా ఉడికిపోతోంది.

అప్పటికీ - అతడి గిరజాల జుట్టుతో ఆటాడుకుంటోంది.

శ్రీనివాస్ ధోరణి మారలేదు.

"మనం మూడు రోజులైందా వచ్చి ? చిన్నీ ఎలా ఉందో ఏమో?"

అరుణ.... తలపై కడివెడు చన్నీళ్లు కుమ్మరించినట్టు తుళ్ళి పడింది.

దిగ్గున లేచి మంచంమీద కూర్చుంది.

"ఏమైంది అరుణా ? ఉన్నట్టుండి అలా లేచావ్ ?"

"ఏమీలేదు... తలనొప్పి !"

"ఎప్పుడూ ఏదో ఒకటి...! నీకది ఎప్పుడూ ఉండేదేగా ? నువ్వు నాతో సహకరించింది ఎప్పుడనీ ? - ఇలారా !"

అరుణ ముఖంలోంచి.... చెంపల్లోంచి... ఆవిర్లు పెల్లుబికాయి !

"షటప్!" అంటూ దిండు తీసుకొని - ఆ రూమ్ తలుపులు తెరుచుకుని - బయట నుండి గొళ్ళెం పెట్టుకుని - బాల్కనీలో పడుకుంది.

'ఎటుచూసినా నువ్వే... విన్పించే నీ నవ్వే! మోహాలతో నన్ను మంత్రించకూ- కన్నుల్లో మిసమిసలు కనిపించనీ...!' పక్క గదిలోంచి గాలిలో.... తెరలు తెరలుగా రవి గొంతు మధురంగా విన్పిస్తోంది !

సుళ్ళు తిరుగుతోన్న కన్నీళ్ళను రెప్పల కింద అదిమిపట్టింది అరుణ.

*'మయూరి' సచిత్ర వార పత్రిక, తేదీ: 25-10-1985*

# కాలని తెప్ప



1982



రాజేష్ నోట్లో నీళ్ళూరాయి... రెండు బొట్లు జారి ప్యాంట్‌మీద పడ్డాయి.... అప్రయత్నంగానే కారు స్లోచేశాడు.

ఎదురుగా ఈత చాపొకటి చుట్టి, దాన్ని నెత్తిమీద పెట్టుకుని - నడుంకి పిల్లాడ్ని కట్టుకుని - ఒక రొమ్ము వాడి నోటికప్పగించి - రెండుచేతుల్తో చకచకా ఈతాకుల చాపనల్లుతూ - నిర్వ్యిచారంగా నడిచి

వస్తోంది లచ్చి.

'పిటపిటలాడ్తూన్న తెల్లటిఒళ్ళూ.... తైల సంస్కారం లేకున్నా వంకీలు తిరిగి ఓ వింత సోయగాల్నిస్తోన్న జుత్తూ.... ఓహ్... బిచ్చగాళ్ళలో కూడా ఇంత అందమైన మనుషులుంటారా...' ఆలోచిస్తూ... ఆశ్చర్యపోతున్నాడు రాజేష్.

తను చూసిన బ్లూ ఫిల్మ్‌లూ, - ఫారిన్ నుంచి తెప్పించుకుని తను రోజూ దొంగతనంగా చూసే ఆడవాళ్ళ నగ్న చిత్రాల అల్బమ్స్.... అన్నీ కళ్ళముందు మెదిలాయి.

క్షణం గడిచిపోతే కళ్ళ ముందున్న కమనీయ దృశ్యం కరిగి పోయేలా వుంది. ఏదో వంకతో ఆగి - తనివి తీరా ఆ సౌందర్య రాశిని చూస్తే...

ఒక జెర్క్ ఇచ్చి కారు ఆగిపోయింది.

" ఏమైందండీ ?" అంటూ కళ్ళు తెరిచింది - అంతవరకూ అతడి భుజమ్మీదానుకుని నిద్రపోతూన్న అతడి అర్థాంగి విమల.

"కారు ట్రబులిచ్చింది."

"ఇప్పుడెలా ?" విసుగ్గా అడిగింది.

"అసలు మిమ్మల్ని ముందే ఒకసారి కారు సర్వీసింగ్‌కి ఇవ్వమన్నాను. విన్నారా? అసలే ఇది ఇంటీరియర్ రూట్. కనుచూపు మేరలో ఎక్కడా కనీసం చెట్లయినాలేవు కూర్చోవడానికి - ఇంత ఉక్కబోస్తూంటే ఈ కార్లో ఎలా కూర్చునేదీ?"

" నన్నేం చేయమంటావ్ విమలా ? ఆ వెధవ డ్రైవర్‌గాడు కారు కండిషన్లోనే వుందన్నాడు. అయినా వుత్తినే ఎందుకలా గాభరా పెడ్తావ్? పెద్ద ట్రబులేమీ వుండకపోవచ్చు ! ఎవరైనా కాస్త ముందుకు తోస్తే నడుస్తుందేమో చూద్దాం."

కార్లో గాలి ఆడక - ఆమె ఒళ్ళో నిద్రిస్తోన్న బాబు కేర్‌మన్నాడు! మిల్క్ ఫీడర్ వాడి నోటికందించింది.

"ఏయ్, ఇలారా" తన కారు దాటి వెళ్ళిపోతూన్న లచ్చిని వెనక్కి పిలిచాడు రాజేష్.

"ఏంది దొరా !" అంటూ వచ్చి నించుంది లచ్చి.

"నీ పేరు....?"

చెప్పింది.

"చూడు లచ్చీ, మా కారు పాడయింది. కదలడం లేదు. కాస్త

తోస్తావా...?"

నోరు ఆమెతో మాట్లాడ్తోంది... కళ్ళు ఆమె అంగాంగాల్నీ పరిశీలిస్తున్నాయి.

"అదేం బాగ్గెం దొరా ! తోత్తా !" అంటూ ముందుకు వచ్చింది. తన గుండెలకంటుకుని పాలు తాగుతోన్న పసివాణ్ణి చేతుల్లోకి తీసుకుంది.

అంతే !

ఆచ్ఛాదన లేని ఆమె అందం అతడి కళ్ళకు మిరుమిట్లు గొల్పింది. తీయటిషాక్ శరీరమంతా జరజరా పాకింది. నరాలు జివ్వుమన్నాయి. రాజేష్ కళ్ళప్పగించి అలాగే చూస్తూండిపోయాడు. విమల ముఖం చిటపటలాడిస్తూ కళ్ళు తిప్పుకుంది. వాళ్ళ మనోభావాలు చదవడం రాని లచ్చి మాత్రం కళ్ళ ముందే తీరిగ్గా రవికను దగ్గరకు లాక్కుని ముడేసుకుంది.

రాజేష్ అప్పటికి తేరుకుని: "విమలా నువ్వుకూడా దిగి, ఒక చెయ్యి వెయ్యి పాపం! ఒకత్తే ఎలా తోస్తుంది ?" ఆజ్ఞాపించాడు. విమల కార్లోవుంటే రియర్ వ్యూలోంచి లచ్చి అందాల్ని చూడటం పడదుమరి!

రుసరుసలాడ్తూ కిందకి దిగింది విమల.

''నా సంటోణ్ని యాడ పడుకోబెట్టను దొరా, కింద పడుకోబెడ్దామంటే...యాడా ఓ సెట్టయినా లేదు - ఓ పక్క ఎండేమో మండిపోతున్నాది - కారు బాగయ్యేదాకా కార్లో పడుకోబెట్టనేటి ?" లచ్చి అడుగుతోంది.

ఒక నిమిషం, విమల - ముందుసీట్లో పడుకుని పాలు తాగుతూన్న తన పిల్లాడి వేపూ - లచ్చి చేతుల్లోవున్న ఆమెకొడుకు వంకా మార్చి మార్చి చూసింది. లచ్చి కొడుకు వొంటిమీద అక్కడక్కడా గజ్జి! కంపరమెత్తింది. ఒద్దంటే కారు తోయకుండా వెళ్ళి పోతుందేమో?

రెండు నిముషాలాలోచించి 'సరే' అంటూ డిక్కీలోంచి కారు తుడిచే పొడుగాటి గుడ్డనొకటి తెచ్చి, దాన్ని వెనుక సీట్లో పరిచి, దాన్లో లచ్చికొడుకుని పడుకోబెట్టమన్నట్టు సైగచేసింది.

కార్లో తన కొడుకుని పడుకోబెట్టాక - వాణ్ణి చూసి మహా సంబరపడిపోతూ - 'ఇయాల సంటోడు కార్లో మారాజుకి మల్లే ఎంత దర్జాగా పడుకున్నాడో - మావతో సెప్పాల' - అనుకుంటూ మురిసిపోయింది లచ్చి.

"ఏయ్ లచ్చీ ! ఎంతసేపూ అక్కడ - త్వరగా రా" పిలిచింది

విమల, కారు వెనుక నుంచి -

లచ్చి వెళ్ళింది కారు తోయడానికి ! చీరని బిగించి - గోచీకట్టింది! తెల్లటి తొడలు బయటపడ్డాయి. విమలకి ఒళ్ళుమండింది.

లచ్చిని తన దగ్గరికి రమ్మని పిలిచి, రాజేష్‌కు వినబడకుండా అంది విమల: 'ఆ గోచీ ఎందుకూ ? గోచీ లేకుండా నేను తోయట్లేదా? అయినా సిగ్గూ లజ్జా లేకుండా, రవికను తీసేసి మగాళ్ళందరి ముందూ పాలిస్తూ రోడ్డుమీద నడవడమేమిటి అసహ్యంగా ? ఎక్కడైనా ఒకచోట కాసేపు కూర్చుని పాలివ్వకూడదూ?"

'రోడ్డుమీద ఎల్తూ పాలీకూడదా ? అదేమైనా సెయ్యకూడని పనేటి సాటు మాటుగా యీటానికి ? అయినా ఓ సోటే పాలిత్తూ కూసుంటే - పనులెట్టా జరుగుతాయి? తను ఇల్లిల్లూ తిరిగి బువ్వెట్టా అడుక్కుంటుంది ? ఏటో - ఈ పెద్దోల్ల బతుకులూ - యీల్ల యవ్వారాలూ సిత్రంగుంటయ్....' అనుకుంది.

"ఇదిగో చూడూ - రవికని ముడేసుకున్నావ్ బాగానే వుందిగానీ - ఆ పైటనెందుకలా నడుంకి అడ్డంగా కట్టుకుంటావ్ ? అది వుందెం దుకూ? దాన్ని తీసి - ఏదీ ఇలా నాలా కప్పుకో !"

లచ్చికి నవ్వొచ్చింది.

"ఏం ఎందుకలా నవ్వుతావ్ ?" ముఖం చిట్లించింది విమల.

"కాకపోతే యేంటి దొర్సానీ - యాడాది కొక్క కోక తెత్తాడు మా మావ - దాన్ని రెండుగా సింపుకుని నేనోటీ - ఆడి సెల్లెలోటీ సుట్టుకుంటాం..." నవ్వుతూనే చెప్తోంది లచ్చి.

"సరి సరి ! నీకు తోడు,నీలాంటి వాళ్ళు ఇంకానా ? హారిబుల్!" గొణుక్కుంది విమల.

"ఏదో తవరు సెప్తున్నారని తవరి కోసం ఇప్పుడు యేసుకుంటుం డాను సూడండీ" అంటూ నడుంకి దోపుకున్న చీర కొంగు లాగి, దాన్ని తీసి గుండెలమీద కప్పుకోవడానికి విఫల ప్రయత్నం చేసింది.

జానెడు కూడా లేని ఆ కొంగు, ఎటూ చాలక, ఏ అందాన్నీ కప్పి పుచ్చలేక పోయింది!

ఇక చేసేదిలేక దాన్ని ఎప్పట్లానే బొడ్డుదగ్గర మళ్ళీ దోపి: "చమించడమ్మా - ఈ సీర సాల్దు ! తమరిది పాతసీర ఓటిత్తే తవరు సెప్పినట్టే కట్టుకంటాను!" అంది లచ్చి ఆశగా.

"నాకే పెట్టావ్ ఎసరూ ?" అనుకుంటూ, "నేను... పెళ్ళికి

వెళ్తున్నాను. అన్నీ పట్టు చీరలు... ఇక్కడెక్కడివీ పాతచీరలు !" అంటూ నసిగింది.

ఇంకా ఏమ్మాట్లాడ్తే..., మళ్ళీ ఏం అడుగుతుందో అనుకుని, "ఏమండీ తొయ్యమంటారా?" అడిగింది భర్తని.

"ఊఁ" అన్నాడు రాజేష్ పరధ్యానంగా.

ఇద్దరూ కలిసి నెట్టారు. రెండడుగులు ముందుకి వెళ్ళి ఆగిపోయింది కారు.

కారు తోయడానికి లచ్చి వంగినప్పుడల్లా, ఆమె రవికలోంచి తొంగి చూస్తోన్న అందం అతణ్ణి పిచ్చివాణ్ణి చేస్తోంది.

అరుదుగా లభించే ఈ కంట్రీబ్యూటీని అనుభవించని జన్మ మియర్ వేస్ట్ - విమలని వెంటేసుకుని పెళ్ళికి వచ్చినందుకు తనను తాను తిట్టుకున్నాడు.

ఈ అందాన్ని కనీసం ఒక్కసారయినా అనుభవించి తీరాలి. ఇప్పుడెలా - ఏం చేయాలీ ? ఏదో చేయాలి ! ఏది చేసైనాసరే - ఎంత కష్టమైనా సరే ఈ రోజు లచ్చిని తన స్వంతం చేసుకోవాలి... రాజేష్ ఆలోచిస్తున్నాడు.

మెరుపు లాంటి ఆలోచన తట్టింది. 'విమలని గమ్యస్థానం చేర్చి. ఒంటరిగా మళ్ళీ ఇదే కార్లో వెనక్కి వచ్చి ఒకసారి ట్రయ్ చేసి చూస్తే.... అవును... ఈ ఐడియా బావుంది.'

అతడి ముఖం వెలిగి పోయింది.

అంతే! ఎవరూ తోయకుండానే రయ్యిన కారు స్టార్టయింది.

"విమలా ! కమాన్, క్విక్! కారు బాగయింది! త్వరగా ఎక్కు, వెళ్దాం - అవతల పెళ్ళికి టైమై పోతోంది." తొందర పెట్టాడు.

కారు పాడయిందనే వంకతో - కారు బాగుచేయకుండా లచ్చిని చూస్తూ ఎన్ని గంటలు గడుపుతాడో ఖర్మ అని భయపడ్తోన్న విమలకి అతడి ప్రవర్తన ఆశ్చర్యం కల్గించింది.

తన మొగుడు ఒక్క సారిగా అంత బుద్ధిమంతుడైపోయినందుకు సంతోషమూ కల్గింది.

అందుకే క్షణం ఆలస్యం చేయకుండా - వెంటనే వెళ్ళి ముందు సీట్లో కూర్చుని, తన కొడుకుని ఒళ్ళోకి తీసుకుంది.

లచ్చివెళ్ళి - వెనుక సీట్లో పడుకున్న తన కొడుకుని ఎత్తుకుని

వాణ్ణి తన గుండెలకు పొదివిపట్టుకుని "దండాలు దొరా !" అంటూ చేతులు జోడించింది రాజేష్‌ని చూస్తూ.

రాజేష్ మాట్లాడకుండా విలాసంగా సిగరెట్ వెలిగించాడు.

"జాగర్తగా ఎల్లండమ్మా ! మున్ముందు రోడ్డసలే బాగోలేదు" చెప్పింది లచ్చి.

లచ్చితో యిక మాట్లాడాలనిపించలేదు విమలకి, "ఏమిటండీ యింకా ఆలస్యం! అవతల పెళ్ళికి టైమైపోతుంటేనూ..." రాజేష్‌ని తొందరపెట్టింది.

రాజేష్ కారు ముందుకు పోనిచ్చాడు - వెనుక సీట్లో అంతదాకా లచ్చి కొడుకు పడుకున్న కారు తుడిచే గుడ్డని - ఓ కాగితంతో పట్టి పైకి తీసి - కిటికీలోంచి బయటకి విసిరి కొట్టింది విమల !

అది గాల్లో ఎగిరి వెళ్ళి లచ్చి ముఖాన్ని ముద్దెట్టుకుంది.

క్రమేణా లచ్చి రూపం కనుమరుగై పోయింది ! విమల గుండెలు కుదుట పడ్డాయి. రాజేష్ భుజమ్మీద సుతారంగా తల ఆనించి పడుకుంది.

రాజేష్ అదేమీ పట్టించుకునే స్థితిలో లేడు. అతడి మనస్సంతా లచ్చి చుట్టే పరిభ్రమిస్తోంది. పెళ్ళి పందిట్లో విమలని దించి ఓ పదినిమిషాలు అక్కడుండి - విమలకు చెప్పకుండా కారేసుకొని ఎప్పుడెప్పుడు వెనక్కివచ్చి లచ్చిని కలుసు కోవాలా అని అతని మనసు వేగిరపడ్తోంది.

రోడ్డు పక్కనే వున్న రాయిని చూసాడు. ఇంకా పది కిలోమీటర్లుంది. పది నిమిషాల్లో వెళ్ళొచ్చు.... అక్కడో పది నిమిషాలు.... తిరిగిరావడానికి మరో పది నిమిషాలు వెరసి అరగంట... కాదూ కూడదంటే ముప్పావు గంటలో తను లచ్చిని కలుసుకోవచ్చు... అతని మనస్సు గాల్లో తేలిపోతోంది. స్పీడ్ పెంచాడు.

విమల లచ్చిని మరిచిపోలేకపోతోంది.

పాలిస్తే అందం పోతుందని మొగుడు అదే పనిగా పోరితే, పిల్లాడు పుట్టిన నెలకే పాలు మాన్పించి - రోజూ విటమినైజ్డు ఫుడ్స్ తీసుకుంటోంది ! అయినా- తను రోజు రోజుకీ తను ఎండి పోతుందే తప్ప - ఏ గుణమూ కన్పించట్లేదు.

ఏడాది పొడుగునా కొడుక్కి పాలిస్తున్నా, లేశమైనా లచ్చి అందం ఎందుకు సడలిపోలేదో, అడుక్కుతింటూ గొడ్డుకారం వేసుకుని తినే

లచ్చి - అంత పుష్టిగా ఎలావుందో విమలకి అర్థం కాలేదు.

ఆమె ఆలోచనలకు అంతరాయం కల్గిస్తూ, కారు పెళ్ళి వాళ్ళింటిముందు ఆగింది! విమలని అక్కడ దించి ఆమెకే సాకో చెప్పి వెనక్కి వచ్చిన రాజేష్‌కి - మూడు లీటర్ల పెట్రోల్ దండుగైందే తప్ప, ఎక్కడా లచ్చి కన్పించనే లేదు.

పెళ్ళయ్యాక మర్నాడు ఉదయం అదే కారులో తిరుగు ముఖం పట్టారు రాజేష్ దంపతులు ! తిరిగి వస్తూంటే దారంతా ఆ క్రితం రోజు జరిగిన సంఘటనే గుర్తొస్తోంది రాజేష్‌కి ! విమలకీ అలాగే వుంది!

'మళ్ళీ ఎక్కడైనా లచ్చి ఎదురైతే బావుణ్ణు!' అని రాజేష్...

'ఎక్కడా కనిపించకపోతే బావుణ్ణు !' అని విమల - ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

అసలు లచ్చి కన్పిస్తుందేమోనన్న ఆశతోనే - కావాలనే పెళ్ళి వాళ్ళ కార్లూ, స్కూటర్లూ తదితర వాహనాలన్నీ పోనిచ్చి, తీరిగ్గా భార్యామణితో బయల్దేరాడు రాజేష్.

మిట్ట మధ్యాహ్నం - సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. వడగాల్పులు కొరడాల్ని ఝుళిపిస్తున్నాయి. కనుచూపు మేరలో చెట్టూ చేమా ఏమీ కన్పించట్లేదు. అప్పటికే అరగంట నుంచీ ప్రయాణం చేస్తున్నారు. వాళ్ళ ఊరు చేరుకోవాలంటే ఇంకా ఎంత లేదన్నా రెండు గంటలు పడ్తుంది.

మాటి మాటికీ ఎండిపోతోన్న పెదవుల్ని నాలుకతో తడుపుకుంటూ డ్రైవ్ చేస్తున్నాడు రాజేష్. ఉన్నట్టుండి కారు ఇంజన్ శబ్దంలో మార్పు వచ్చింది. ఒక ఫర్లాంగు దూరం వెళ్ళి కారు ఆగిపోయింది. ఆ క్రితం రోజు లచ్చి కోసం ఆదరా బాదరాగా వెనక్కి వస్తూ, ఆ కంకర రోడ్డుమీద రఫ్‌గా డ్రైవ్ చేసినందుకు ఫలితం అనుకున్నాడు రాజేష్.

"నేను పొద్దుటే అనుకున్నాను. ఇలాంటిదేదో మళ్ళీ జరుగుతుందనీ" అంది విమల మూతి మూడు వంకర్లు తిప్పుతూ.

"చాల్లే... నోర్మూయ్ ! నేనేమైనా కావాలని చేస్తున్నానా ?" కస్సుమన్నాడు రాజేష్.

బానెట్ తీశాడు. అది తిప్పాడు. ఇది తిప్పాడు. ఏదీ తిప్పినా కారు కదలనని మొండికేస్తోంది.

"వెధవ కారు అమ్మి పారేయాలి ! మహారాణికి మల్లే అలా కార్లో

దర్జాగా కూర్చోక పోతే - కాస్త దిగి - ఆ పట్టకారు అందిస్తే తప్పా?" అతడిలో అంతకంతకీ విసుగెక్కువై పోతోంది.

అంత కోపంలోనూ ఆమెకి నవ్వొచ్చింది.

"ఇకిలిస్తుంది చూడూ, ఇకిలిస్తుంది!" ఆమె నవ్వు అతడి అరికాలి మంట నెత్తికెక్కించింది.

"అది కాదండీ - నిన్నా, ఈరోజూ కారు ఒక్కలాగే ట్రబులిచ్చింది కదా - నిన్న ఉన్న శాంతం, సహనం... ఈరోజు ఎక్కడికి మాయమయ్యాయా అని నవ్వొస్తోంది... తప్పా ?" అంటూ మళ్ళీ నవ్వింది.

"అసలు మీకెలా తోస్తే అలా చెయ్యడమే గానీ కాస్తయినా ఆలోచించరు ! నిన్న కారు ట్రబుల్ ఇచ్చిందని తెలుసుకదా ! కాస్త ముందే బయల్దేరితే ఏం పోయేది?- ఇప్పుడు పెళ్ళివారంతా వెళ్ళిపోయారు. మన వెనకాల ఏ వెహికిల్స్ వచ్చే అవకాశం కూడా లేదు ! కనీసం బస్సులైనా ఈ రూట్లో నడవ్వు... మనం ఎలా వెళ్ళేది?" విమలకి పుట్టెడు దిగులు పుట్టుకొచ్చింది.

అప్పటికే రెండు గంటల నుంచి రిపేర్ చేస్తున్నాడేమో రాజేష్‌కి వొళ్ళంతా చెమట పట్టింది. దాహంతో నోరెండిపోతోంది - దానికి తోడు బాబుకూడా లేచి - రాగం అందుకున్నాడు.

"మధ్యలో వీడొహడు ! అసలే ఏం చెయ్యాలో తోచక ఛస్తూంటే, వెధవ ఏడ్పూ, వీడూను ! వాడలా గుక్కపట్టి ఏడుస్తూ వుంటే చూస్తూ కూర్చుంటావేం ? పాలు పట్టమని కూడా చెప్పాలా ?" గద్దించాడు.

విమల లేచి - అమూల్ పొడిని గ్లాస్‌లో పోసింది. వేణ్ణీళ్ళ కోసం ఫ్లాస్క్ మూత తీసి- దాంట్లో వున్న నీళ్ళు గ్లాసులోకి ఒంపింది. ఏదో గళ గళ శబ్దం. చూస్తే గ్లాసులో గాజు ముక్కలు కన్పించాయి.

"అయ్యో ! ఫ్లాస్క్ పగిలిపోయిందండీ ! ఇప్పుడెలా ?" అంటూ గ్లాసులోవున్న నీళ్ళని పారబోసింది.

బాబు రాగం ఆగే సూచనలు ఎక్కడా కన్పించడంలేదు. ఏడ్చి ఏడ్చి వాడి గొంతు బొంగురు పోయింది. ఎక్కడ వాడి గొంతెండి పోయి, ఏమై పోతాడో అనే భయం పట్టుకుంది విమలకి.

రాజేష్ చుట్టుపక్కలంతా వెదికి వచ్చాడు. ఎక్కడా నీటి చుక్కేలేదు.

ఎంత ఎత్తుకున్నా, తిప్పినా ఏం చేసినా వాడు ఏడుపు మానడం లేదు. కార్లో కూర్చుంటే ఉక్క - బయటికి వస్తే ఎండ ! రోడ్డు పక్కన

చెట్లుండటం ఎంత అవసరమో తెలిసివచ్చింది.

బాబు మరీ ఆకలయినప్పుడు....ఇహ ఏడ్వడానిక్కూడా ఓపిక లేక - పెదవులు చప్పరిస్తూ వెక్కుతున్నాడు.

ఆరు నెలల పసికందు - తల్లి సమక్షంలో ఆకలితో అలమటిస్తూంటే - తల్లిగా తనేమీ చేయలేక నిస్సహాయంగా దిక్కులు చూస్తూ వుండవలసిన సమయమే వస్తే - అంతకన్నా ఘోరం మరేం ఉంటుంది. విమల కళ్ళలో నీళ్ళు ఉబికి వచ్చాయి. వాడికి తను పాలు మాన్పించినందుకు మొదటి సారిగా తనను తానే అసహ్యించుకుంది.

అదే క్షణంలో.... ఆపద్బాంధవిలా దర్శనమిచ్చింది లచ్చి. ఆమెని చూడగానే- అప్పటి వరకూ వున్న విసుగు చప్పున మాయమై - రాజేష్ ముఖంలో ప్రసన్నత తొంగి చూసింది.

ముందుకు వెళ్ళిపోతోందల్లా... లచ్చి విమలని చూసి గుర్తుపట్టి, వెనక్కు వచ్చి:

"ఎవరూ ? వో - తవఁరా అమ్మ గోరూ? మళ్ళా కారు పాడయిందేటీ? అరెరె... మీసంటోడలా గుక్కపట్టి ఏడుత్తావుంటే - సూత్తూ కూసున్నారేంటీ పాలీయకుండా...?" అడిగింది ఆశ్చర్యంగా.

విమల తల దించుకుంది.

"ఇక్కడ మొగాల్లెవల్లూ లేరు గదమ్మా సిగ్గుపట్టానికి ? ఉన్నది మీరొక్కరే గందా?"

"అది కాదు లచ్చీ !" అంటూ జరిగిందంతా చెప్పింది విమల.

"అయితే తవఁరికిప్పుడు తవఁసంటోడి పాలకోసం నీళ్ళు కావాలన్నమాట - కానీ ఇటు రెండు కోసులూ - అటు రెండు కోసుల్దాకా అసలు నీటి సుక్కయినా పుట్టదే ! ఇప్పుడెట్లా ?" లచ్చి కంఠంలో విచారం ధ్వనించింది.

ఇంతలో లచ్చి కొడుకు లేచి విమల కొడుక్కు వంతగా రాగం అందుకున్నాడు.

"ఉరె ఉరె... పాలు తాగి గంటైనా కాలేదు గందా ? అప్పుడే ఆకలవుతున్నాదా? ఎప్పుడూ పాలధ్యాసే గందా పిచ్చి సన్నాసికి!" అంటూ కారు పక్కన చతికిల బడి, రవిక ముడివిప్పి వాణ్ణి దగ్గరకు లాక్కుంది.

కుడిచేత్తో తన జోలెలో వున్న మట్టి ముంత తీసి, అందులో వున్న గంజి తాగుతూ ఎడమ చేత్తో ఆవకాయ నంజుకుంటూ - "అయినా

దొర్సానీ మన పిచ్చిగానీ - ఈ ఎండలకి మన గొంతులే తడారిపోతాంటే - సంటోల్ల పేనాలెంతయ్యనీ!" చెప్పుకుపోతోంది లచ్చి.

ఏదో పెన్నిధి దొరికినవాడిలా - లచ్చి కొడుకు ఆవురావురుమని పాలు తాగుతూంటే విమల మనసు చివుక్కుమంది.

అంతలో ఆమెకి మెరుపులాంటి ఆలోచన తట్టి "లచ్చీ !" అంటూ తన కొడుకు నెత్తుకొని ఆమె దగ్గరకు వెళ్ళి నించుంది.

"అయ్యో - నా మతిమండా ! నేను అడిగానే గాదు ! మీ బాబుకి పాలీమంటా రేంటండీ ?" అడిగింది లచ్చి మహా బాధపడిపోతూ.

విమల అవునన్నట్టుగా తలూపింది. అంతే - లచ్చి కొడుకు స్థానంలో విమల కొడుకు పడుకోబెట్టడానికి అర క్షణం కూడా ఆలస్యం జరగలేదు.

అంతవరకూ లచ్చి రొమ్ముల్ని తడిమిన గజ్జి చేతులూ, లచ్చి వేసుకున్న మురికి బట్టలూ, లచ్చి రొమ్ములకి లచ్చి కొడుకంటించిన చీమిడీ - ఝుమ్మని వాలుతున్న ఈగలూ... ఏవీ విమల కంటికిపుడు కన్పించడంలేదు - తన బాబు.... గొంతు తడుపుకుంటున్నాడు! పునర్జన్మ ఎత్తుతున్నాడు... అదే... అదొక్కటే కన్పిస్తోంది.

అయితే - విమల సంతోషం క్షణం కూడా నిలువలేదు - విమల కొడుకు ముఖం పక్కకి పెట్టి మళ్ళీ ఏడుపు లంకించుకున్నాడు.

ఉన్నటుండి లచ్చి - అప్పుడే ఏదో జ్ఞాపకం వచ్చిందాన్లా - తన రొమ్ముల్ని పిండి చూసి: "అయ్యో - ఒక పాల సుక్కైనా రావడం లేదమ్మగారూ - పాలన్నీ ఇందాక నా సంటోడే తాగేసాడు గామాలు - మీ అబ్బాయిగోరికి పాలు రావడం లేదు. ఏం సెయ్యను సెప్పమ్మా - ఇయ్యాల ఏ పున్నాత్మురాలూ గుప్పెడు మెతుకులు పెట్టింది కాదాయే! పొద్దుణ్ణించి అన్నం తినకపోతే - పాలెట్టా వత్తాయి..." అంది.

విమల లచ్చిమాటలు విన్పించుకునే దశలోలేదు. తన బాబు... లేక లేక పుట్టిన తన బంగారు కొండ... తన కళ్ళముందే తనక్కాకుండా పోతాడేమో... భయంతో ఆమెకు ముచ్చెమటలు పడ్తున్నాయి.

విమల అవస్థ కనిపెట్టిన లచ్చి, సందేహిస్తూనే అడిగింది "అమ్మగోరూ - మీరేటీ అనుకోకపోతే - ఇంద ఈ ముంతలో నేను అడుక్కు తెచ్చుకున్న గంజివుంది! అది తీసుకుని తాగించండి."

విమల ఒకసారి ఆ గంజి వంక చూసింది. ఒకటి రెండు ఈగలు చచ్చి పడున్నా యి అందులో !

లచ్చి తాగగా మిగిలిన గంజి... అదీ ఎవర్నో ముష్టెత్తుకుని

సంపాదించిన గంజి... - ముప్పైలక్షలకు యజమానురాలు తాను - ఒక ముష్టిదాన్ని ముష్టెత్తడమా ?

అహం - అవసరం... రెండింటి మధ్యా మరో పదినిమిషాల పాటు సంఘర్షణ! అవసరం జయించింది !

ఆ ముంతలో వున్న గంజిని తన దగ్గరున్న ఫ్లాస్క్ మూతలో పోసుకొని, స్పూన్‌తో ఒక్కొక్క చుక్కే వాడి గొంతులో పోసింది.

ఓ పది నిమిషాల పాటు ఆ గంజిని చివరి బొట్టుదాకా తాగీ తాగీ - ఇక తాగడానికేం లేక - అలసి సొలసి నిద్రపోయాడు విమల కొడుకు.

"నీ ఋణం తీర్చుకోలేను లచ్చీ" విమల కళ్ళలో నీళ్ళు నిలిచాయి.

"ఆ - ఏవుంది లేమ్మా. ఇందులో !" అంది లచ్చి తేలిగ్గా.

ఓ పక్క రాజేష్ సీరియస్‌గా కారుతో కుస్తీ పడ్తూనే వున్నాడు.

మధ్య మధ్య అతడి మనసు లచ్చి డైవర్ట్ చేయకుండా వుండి వుంటే... అదీ పాటికి బాగయిపోయేదే!

"నేనిక వెళ్ళొస్తానమ్మగోరూ ! సీకటయి పోతుండాది !" అంటూ లేచింది లచ్చి.

"నీకు పుణ్యం వుంటుంది లచ్చీ - కారు బాగయిందాకా మాకు తోడుండు! అదెప్పుడు బాగవుతుందో - అసలు బాగవుతుందో లేదో తెలియదు ! నువ్విప్పుడు వెళ్ళిపోతే - బాబులేచి పాల కోసం మళ్ళీ ఏడిస్తే -" ఆపైన ఆమెకు మాటలు పెగల్లేదు - కంఠం పూడుకు పోయింది. విమల కళ్ళలోంచి రెండు నీటి బొట్లు టపటపా రాలాయి.

లచ్చి మనస్సు వెన్నముద్దలా కరిగి పోయింది.

"అట్టాగేలేమ్మా! ఉంటాను !" అంటూ మళ్ళీ చతికిలబడింది. విమల మనస్సు కుదుటబడింది.

తర్వాత ఎప్పుడో రాత్రి ఏడు గంటల ప్రాంతాన కారు బాగయింది.

"నీ మేలు మరిచిపోలేను లచ్చీ - ఇంద ఈ పది రూపాయలు తీసుకో!" అంటూ పర్సు తెరిచింది విమల.

"డబ్బులెందుకమ్మా ! ఒద్దు! మీకిష్టమైతే మీ గుర్తుగా మీ సీరోటివ్వండి సాలు! ఓసారి నిండుగా కొంగేసుకుని సీర కట్టుకుంటే... ఎట్టాగుంటానో సూడాలని కోరిగ్గావుంది." సిగ్గుపడ్తూ అడిగింది లచ్చి.

"చీరా... ?" విమలకి తన సూట్‌కేసులో ఉన్న చీరల ఖరీదు జ్ఞాపకం వచ్చింది! ఒక్కటి కూడా ఐదువందలకి తగ్గదు ! ఇవ్వడానికి

మనస్సొప్పలేదు.

"నా దగ్గర నీకిప్పుడు ఇవ్వదగ్గ చీరలేమీ లేవు లచ్చీ. ఈసారి ఎప్పుడైనా ఇటువేపు వస్తే నీకోసం తప్పకుండా ఓ పాత చీర తీసుకొస్తాను - సరేనా ?" అంటూ డబ్బు పర్సులో పడేసి జిప్ లాగింది.

"విమలా, కారెక్కు ! వెళ్దాం" అన్నాడు రాజేష్.

అతడికి మందుకొట్టే సమయమైంది.

విమల కారెక్కి "వెళ్ళొస్తాం లచ్చీ - ఇక నువ్వు వెళ్ళు. ఏమండీ, ఇక వెళ్దాం పదండీ" అంటూ డోర్ వేసేసింది.

లచ్చి కంగారుగా కారు దగ్గరకు పరుగెత్తు కొని వచ్చి: "అదేంటమ్మా అలా ఎళ్ళిపోతుండారు ? మీకోసమేగందా నాకింత ఆలిసమైంది, ఈ కార్లో ఇంకో రెండు కోసులు ఎనక్కొచ్చి సిరిరాంపురంలో మా మావకాడ నన్ను దింపెల్లిపొండి. పెందరాల పోకపోతే మా మాఁవ బెంబేలెత్తి పోతాడు. లేకలేక పుట్టిన బిడ్డడేమో ఆడికి ఈడంటే ఆరోపేనం ! రాత్రి పూట మమ్మల్ని ఎక్కడికీ ఎల్లనీడు" చెప్తూనే వుంది.

విమల గుండెల్లో రాయి పడింది. "ఇప్పుడు మళ్ళీ వెనక్కా ? దీని దుంపతెగ- దీనికి కార్లో కూర్చోవాలని ఎంత షోకో !" అనుకుంది - పైకి మాత్రం:

"రెండు కోసులంటే ఎంత దూరం లచ్చీ, దగ్గరేగా! ఐనా నీకిలా నడిచివెళ్ళడం కొత్త కాదుగదా ! నీకోసం మళ్ళీ వెనక్కి వస్తే, కారు దార్లో మళ్ళీ పాడైపోతుందేమోనని భయంగా వుంది. అంతే " నసిగింది విమల.

రాజేష్ తన ధోరణిలో ఆలోచిస్తున్నాడు!

అవునూ... ఇప్పుడు వెనక్కివెళ్ళి లచ్చిని దించి వస్తే ఏమిటి లాభం? పక్కన విమల ఉన్నంత కాలం తను లచ్చితో సరసాలాడటానికి వీలుండదు. తన శ్రమ, పెట్రోల్ వేస్ట్ తప్ప తన కొరిగేదేమీ ఉండదు.

సిరిరాంపురం ! అంటే శ్రీరాంపురం అన్నమాట ! ఓహ్ పిట్ట అడ్రస్ దొరికింది! ఈ సారి కారేసుకొని ఒంటరిగా వచ్చి - ఆపై...

మత్తెక్కించే ఆలోచనలతో వేగి పోయాడు రాజేష్.

"దొరా, నువ్వయినా సెప్పు దొరా ! నన్ను మా ఇంటికాడ దింపకపోతేమానే - నన్నొంటరిగా వొదిలి ఎల్లకండి దొరా !" లచ్చి బతిమాలుతోంది.

"అయితే మమ్మల్నిప్పుడేం చేయమంటావ్ ?" రాజేష్ ముఖం

చిట్లించుకున్నాడు.

"మీరట్టా కోపం తెచ్చుకుంటే యెట్టా దొరా? ఆ కనిపించే గుట్టల్లోంచి సీకటేల తోడేల్లొత్తాయంటారు ! అందునా నా నెప్పుడూ సీకటేల పెయినం సెయ్యలేదు బాబూ ! కావాలంటే ఈ రేత్రి అందరం కలసి యిక్కడే ఈ కార్లో కునుకుదీసి రేప్పొద్దున యెవరిదార్నాల్లం ఎల్లిపోదాం... కాదనకండి దొరా!"

కారు హెడ్‌లైట్స్ కాంతిలో లచ్చి కళ్ళు... భయంతో లేడి కళ్ళకి మల్లే బెదిరిపోతున్నాయ్.

రాజేష్ ఆలోచిస్తున్నాడు.

పోనీ లచ్చి చెప్పినట్టు - ఈ రాత్రి ఇక్కడే ఉండి, రేపు తెల్లవారి వెళ్తే.... ఊహూఁ లచ్చి అందాల్ని కళ్ళారా చూసి - ఇప్పటికే పిచ్చెక్కిపోయిన తను - లచ్చినీ, విమలనీ పక్కనే పెట్టుకుని- ఇద్దర్లో ఏ ఒక్కర్నీ పొందకుండా - ఈరాత్రి నిద్రపోగలడా అసలు ? ఇంపాసిబుల్ !

తనకు ఉన్న ఫళాన ఇప్పుడు మందు కావాలి - అంతకన్నా ఒక ఆడది కావాలి తనలోని ఈ కోరికలవేడి చల్లారకముందే తనిల్లు చేరుకోవాలి. అందినట్టే అంది... అందకుండా పోయిన లచ్చిని తలుచుకుంటూ - ఎప్పుడో ఒకప్పుడు తను అందుకోబోయే లచ్చి సౌందర్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ.... అందుబాటులో ఎవరుంటే వాళ్ళతో... ఎవరూ దొరక్కపోతే.... క... నీ...స...ం తన భార్య విమలతో... తనీ రాత్రి గడపాలి!

రాజేష్ పిడికిలి బిగిసుకొంది. విమల చేయి అతడిచేతిలో పచ్చడయిపోతోంది.

"సారీ లచ్చీ ! ఏమీ అనుకోకు ! అవతల నాకర్జంటు పనులున్నాయి! అయినా నువ్వు భయపడాల్సిన పనేం లేదు - మీ మాఁవకి నువ్వంటే ప్రాణం అన్నావ్‌గా - ఈ పాటికి నిన్ను వెదుక్కుంటూ వాడు బయల్దేరే వుంటాడు. ఇంద, ఇది తీసుకో!" అంటూ ఓ పది రూపాయల కాగితం ఆమె చేతిలో కుక్కి, చెయ్యి'నొక్కి' స్టార్ట్ చేశాడు.

కారు కదిలింది - అక్కడ అంతరాత్రి, ఆ నిర్జన ప్రదేశంలో ఆ తల్లీ బిడ్డల్ని అలా నిర్దాక్షిణ్యంగా వదిలి.

లచ్చి గుండెలు అవిసిపోయాయి. వంగి చీకట్లో దేనికోసమో తడిమింది.

మరుక్షణం కారు వెనుక అద్దాలు భళ్ళుమన్నాయి !

స్టీరింగ్ వశం తప్పింది. కీచుమంటూ వెళ్ళి రోడ్డు పక్కనే వున్న గొయ్యిలో ఇరుక్కుపోయింది కారు.


లచ్చి వెనక్కి చూడకుండా పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ చీకట్లో - నిర్భయంగా శ్రీరాంపూర్ దారి పట్టింది.

*'ఆంధ్రజ్యోతి', వార పత్రిక, తేదీ: 12-2-1982.*

# స్వీట్ నాన్సెన్స్



1979



నేషనల్ హైవే మీద ఫియట్ మెత్తగా జారిపోతోంది. రోడ్డు కిరుపక్కలా విరగ బూసిన మోదుగపూలని చూస్తున్నాను... చెట్టుకు ఒక్క ఆకును కూడా మిగలనీకుండా చెట్టంతా ఆక్రమించేసుకుని - ఆ చెట్టుకి అంతకు ముందులేని అందాన్నిచ్చే ఆ పూలంటే నాకు చిన్నప్పట్నుంచీ ఎంతో ఇష్టం!

ఉన్నట్టుండి కారు స్లో కావడంతో నా దృష్టి మరల్చుకున్నాను. రోడ్డుమీద ఎవరో యువతి. ఎడమ చేతిలో బాబునెత్తుకొని రోడ్డు మధ్యగా నించుని కారాపమన్నట్టుగా కుడిచెయ్యి వూపుతోంది. డ్రైవర్ సందేహంగా నావంక చూశాడు. కళ్ళతో ఆపమన్నట్టుగా సైగ చేసాను.

కారాగింది. డ్రైవర్ దిగి బ్యాక్ డోర్ తెరిచాడు.

ఆమె తన భుజాన వున్న ఏర్‌బ్యాగ్‌ని తీసి కారులో పెట్టింది. తర్వాత బాబుని కూర్చో బెట్టి, ఆ తర్వాత తనూ ఎక్కి కూర్చుంది "థ్యాంక్స్" చెప్తూ.

కారు కదిలింది.

“ఎక్కడికి వెళ్తున్నారు ?” అడిగాను.

“హైదరాబాద్ - మీరు ?” అడిగింది.

“హైదరాబాద్ కే”

“రక్షించారు! ప్రొద్దుట్నుంచీ చూస్తున్నాను! ఒక్క బస్సయినా ఆపడంలేదిక్కడ. పోనీ ప్రయాణం మానుకుందామంటే అవతల ఈ రోజే ఇంటర్వ్యూ వుంది. ఐదింటి కల్లా నేనక్కడుండాలి. అసలు ఇంటర్వ్యూ కాల్ రావడమే గగన కుసుమంగా వున్న ఈ రోజుల్లో.... ఈ అవకాశాన్ని జార విడుచుకుంటే.... మళ్ళీ ఇప్పట్లో వొస్తుందన్న నమ్మకంలేదు” అంది ఆమె నుదుట మీద పట్టిన చెమటని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ.

అప్పుడామె వంక పరిశీలనగా చూశాను. ఆ అమ్మాయి అతి సామాన్యంగా వుంది. కట్టింది చౌకబారు నూలు చీరయినా నీటుగా వుంది. బోసిమెడ, గాజుల్లేని చేతులూ, బొట్టులేని నుదురూ ఆమె పరిస్థితిని చాటుతున్నాయి !

“ఏం ఇంటర్వ్యూ ?” అడిగాను.

“వనితా మహా విద్యాలయంలో జూనియర్ లెక్చరర్ పోస్ట్‌కి.”

“మీరు పోస్ట్‌గ్రాడ్యుయేటా ?”

నా ప్రశ్నలో నాకు తెలీకుండానే ధ్వనించిన ఆశ్చర్యానికి... ఆ తర్వాత సిగ్గుపడ్డాను.

“అవును... కెమిస్ట్రీతో ఎమ్మెస్సీ పాసయ్యాను. ఫస్ట్‌క్లాస్ వచ్చింది.”

“ఐసీ... మరి ఇన్నాళ్ళుగా ఉద్యోగం కోసం ఎందుకు ప్రయత్నించలేదు ?” డ్రైవర్‌కి అర్థం కాకుండా వుండాలనే ఉద్దేశ్యంతో సంభాషణ ఇంగ్లీష్‌లో ప్రారంభించాను.

“ ఆ అవసరం నాకప్పుడు కన్పించలేదు! ఉన్నట్టుండి వ్యాపారంలో నష్టం వచ్చి, హార్ట్‌ఎటాక్‌తో మా ఆయన పోవడంతో నాకిప్పుడు ఉద్యోగం అనివార్యమైపోయింది. తీరా ఉద్యోగ ప్రయత్నాలు మొదలెట్టేసరికి..... ఎక్కడా ఖాళీల్లేవు ! గత నాల్గయిదు సంవత్సరాలుగా ఉద్యోగం కోసం చెయ్యని ప్రయత్నం లేదు. తిరగని వూరూ లేదు. వెళ్ళిన ప్రతిచోటా చుక్కెదురే అయింది. ఇప్పుడైనా

ఉద్యోగం దొరుకుతుందన్న నమ్మకం లేదు. కాని ఏదో ప్రయత్న లోపముండకూడదని... అదీగాక ఈ సంవత్సరంతో నాకు ముప్పైఐదు నిండబోతున్నాయి.... ఆ తర్వాత లెక్చరర్ పోస్ట్‌క్కూడా పనికి రాకుండా పోతాను.'' అంటూ ఇంగ్లీషులోనే సమాధానం చెప్పింది.

చక్కటి ఉచ్ఛారణ ! ఆ వాయిస్, యాక్సెంట్, ప్రొనన్సియేషన్ వింటూంటే ఏవో స్మృతులు !

అవును! సరిగ్గా.... ఇదే కంఠం ! ఇదే స్టయిల్లో... ఇంగ్లీష్ మాట్లాడ్తూంటే సంభ్రమాశ్చర్యాలతో నేను నోరెళ్ళ పెట్టుకుని వింటూండి పోయిన దృశ్యాలు గుర్తొచ్చాయి.

అలా అయితే...

ఈమె.... నా చిన్ననాట... నాలో అంతకు ముందులేని పట్టుదలనీ, నాగరికతనీ కల్గించి... నేనింత దాన్నయ్యేందుకు మూలకారకురాలైన కుంతీ కాదు కదా!?

నిర్ధారణ చేసుకొనే ఉద్దేశ్యంతో ఆమె ముఖం వంక పరిశీలనగా చూశాను.

ఉంగరాల జుట్టు ! కనుబొమ్మల మధ్య... సందేహంలేదు. ఈమె కుంతే!

"నీ పేరు కుంతి కదూ ?'' అడిగాను నాలోని సంతోషాన్ని కప్పి పుచ్చుకుంటూ.

" అవును ! మీకెలా తెలుసు ?'' ఆశ్చర్యంగా అడిగింది.

అంతలోనే ఏదో గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నదాన్లా ముఖం పెట్టి, "మీరు...'' అంటూ ఆగిపోయింది.

'సీతని! మా నాన్నగారు మోర్తాడ్ లో మీ నాన్నగారి దగ్గర గుమాస్తాగా ఉండేవారు'' గుర్తుచేశాను.

"అవునవును ! గుర్తొస్తోంది ! అబ్బ, ఎన్నాళ్ళకి కలిశాం ! పాతికేళ్ళయి పోయింది కదూ ! - నువ్వెంత మారిపోయావు సీతా! కాస్త ఒళ్ళొచ్చింది! ఇంతకీ ఇప్పుడు ఎక్కడ వుంటున్నావు?'' అంటూ చనువుగా ప్రశ్నల వర్షం కురిపించింది.

"ఆదిలాబాద్‌లో'' అన్నాను.

" ఏదైనా ఉద్యోగం చేస్తున్నావా ?"అడిగింది.

"ఊ(."

"ఏం ఉద్యోగం ?"

"కలెక్టర్ !" నవ్వుతూ చెప్పాను.

కుంతి ఉలిక్కిపడింది.

మరుక్షణం...

"నిజంగానా ? నా చిన్ననాటి ఫ్రెండ్ కలెక్టరయిందంటే - నాకు చాలా సంతోషంగా వుంది సీతా!" అంది ఎంతో సంబరంగా....

" అమ్మా నాన్నా బావున్నారా ? వాళ్ళిప్పుడు ఎక్కడ వున్నారు?" అడిగింది.

"నాన్న బాగానే వున్నారు. అమ్మ పోయి పదిహేనేళ్ళయింది. ప్రస్తుతం నాన్న నాతోనే ఆదిలాబాద్‌లోనే వుంటున్నారు. ఈ రోజు ఆఫీస్ పనిమీద హైద్రాబాద్ వెళ్తున్నాను. నాన్న వచ్చి ఉంటే బావుండేది, నిన్ను చూసేవారు." అన్నాను.

ఇంతలో రామాయంపేట్ వచ్చేసింది.

"డ్రైవర్, కారాపు ! కూల్‌డ్రింక్స్ తీసుకుందాం !" అన్నాను. డ్రైవర్ కారాపి, వెళ్ళి- కూల్‌డ్రింక్స్ పట్టుకొచ్చాడు. మొహమాటపడ్తూనే తాగింది కుంతి. బాబు కోసం బ్రెడ్డూ, అరటిపళ్ళూ తెప్పించాను.

"మీకు వీడు ఒక్కడేనా ?" అడిగాను.

అవును అన్నట్టుగా తలూపింది. కారు కదిలింది. అప్పటి వరకూ వున్న నీరసమంతా ఏమైందో బాబు లేచి కూర్చుని అవురావురు మంటూ తినడం మొదలెట్టాడు బ్రెడ్‌ని.

ఉన్నట్టుండి నా మనసు గతంలోకి పరుగులుతీసింది.

మొదటి సారిగా నేను బ్రెడ్‌ని చూసింది కుంతీ చేతుల్లోనే, ఆమె బ్రెడ్‌కి వెన్న రాసుకుని తింటున్నప్పుడల్లా నా నోట్లో నీళ్ళూరేవి! దాని రుచి ఎలా వుంటుందో చూడాలన్న తాపత్రయం నన్ను నిలువ నిచ్చేది కాదు ! అలాగే అరటిపళ్ళు - ఆ పల్లెటూళ్లో ఇవేవీ దొరికేవి కావు ! అసలు కుంతి దగ్గర తప్ప - అవి అంతకు క్రితం ఎప్పుడూ

చూసిన పాపాన పోలేదు !

ఒక్క నాకే కాదు, ఆ పల్లెటూళ్ళో నా ఈడు ఉన్న పిల్లలందరికీ అవి అపురూపమే! ఎప్పుడైనా కుంతి ఏ అరటిపండో, నారింజ పండో ఇస్తే ఎంతో అపురూపంగా దాచుకుని దాచుకుని తినేవాళ్ళం. వాటి తొక్కల్ని సైతం పారేయడానికి మనస్సొప్పేది కాదు!.

కుంతీ వాళ్ళనాన్న లక్షాధికారి. ఆ పల్లెటూళ్ళో బీడీల కార్ఖానా పెట్టాడు. బీడీ కార్మికులకు ఆకులు వేయడానికి, పొగాకు ఇవ్వడానికి, తిరిగి తయారుచేసిన బీడీలను తీసుకోవడానికి ఒక మనిషి కావలసివచ్చి, మా నాన్నను గుమాస్తాగా నియమించు కున్నాడు. ఆయన ఎప్పుడూ హైద్రాబాద్‌లోనే వుండేవాడు. అప్పుడప్పుడూ వచ్చి, తన వ్యాపారం చూసుకుని వెళ్తూండేవాడు. ఆ వూరు కుంతీ వాళ్ళ నాన్నమ్మ వాళ్ళవూరు. ఎండాకాలం సెలవుల్లో కుంతీ వస్తూండేది ఆ ఊరికి. వాళ్ళకి ఒక్కగానొక్క కూతురేమో కుంతిని అతిగారాబంగా పెంచేవాళ్ళు.

ఆమె దగ్గర లేని వస్తువంటూ లేదు. రక రకాల బొమ్మలూ, ఆట వస్తువులూ కీ యిస్తే తిరిగే ట్రెయిన్, విమానం - ఒకటేమిటీ? ఎన్నో !

ఇక బొమ్మలైతే సరే సరి... ఒక్కొక్కటీ చిన్నసైజ్ పాపాయంత పెద్దవి కూడా వుండేవి. అందులో ఒక బొమ్మ అంటే నేనెంత యిష్టపడేదాన్నో చెప్పలేను !

దాన్ని పడుకోబెడ్తే, కళ్ళుమూసుకొనేది ! కూర్చోబెడితే కళ్ళు తెరుచుకునేది! -

ఇప్పుడంటే అలాంటి బొమ్మలు అన్ని చోట్లా కన్పిస్తున్నాయి ! కానీ అప్పుడెక్కడివీ ?

అందులోనూ ఎప్పుడూ బస్తీ మొఖం ఎరుగని నాలాంటి దానికి అలాంటి బొమ్మలన్నీ ఆకర్షణీయంగా వుండేవి.

ఒకసారి వ్యామోహం చంపుకోలేక అలాంటి బొమ్మ కొనియ్యమంటూ నాన్న గారి దగ్గర రెండు రోజులు ఏకధాటిగా ఏడ్చాను.

కానీ... మా నాన్నకు అంత స్తోమత ఎక్కడిది? వచ్చే జీతం పాతిక

రూపాయలు! దానితో సంసారం నడపాలా - నా గొంతెమ్మ కోరికలే తీర్చాలా ? అందుకే ఎప్పటికప్పుడు ఏవేవో మాయమాటలు చెప్పి, నా మనసు జోకొట్టేవాడు.

కుంతీ వాళ్ళ ఇల్లు చాలా పెద్దది ! వాళ్ళింట్లోనే ఒక చివర రెండు రూముల్లో మేం వుండేవాళ్ళం ! ఉండేది ఒక్కింట్లోనే కాబట్టి అప్పుడప్పుడూ కుంతీ మా ఇంట్లోక్కూడా వొస్తూ వుండేది ! మా అమ్మ చేసే జొన్న రొట్టెలూ, జొన్న పిండితో చేసే అంబలీ, మొక్కజొన్న రవ్వతో చేసే గట్క వంక కుతూహలంగా చూస్తూ ఇవేమిటని అడిగేది! అమ్మ ఓపిగ్గా సమాధానాలు చెప్పేది!

"నాకు పెట్టవా ?" అంటూ ఆశగా చూసేది.

"అమ్మో ! నువ్వు ఇది తింటే మీ అమ్మ వాళ్ళూరుకుంటారా ? పైగా మేమిచ్చామని తెలిస్తే మమ్మల్ని కేకలేస్తారు" అనేది అమ్మ.

అయినా కుంతీ ఊరుకునేది కాదు ! అవి ఇచ్చేదాకా అక్కడే తిష్ఠవేసేది ! అంబలి బావుందంటూ మెచ్చుకునేది ! మొక్కజొన్న రవ్వతో చేసే గట్కలో పెరుగూ, పాలూ పోసుకొని తింటే - ఆ రుచి మరి దేనికీ రాదనేది. జొన్నరొట్టె, వంకాయకూరల కాంబినేషన్ బావుంటుందనేది. వాళ్ళింట్లో తయారుచేసే వేపుళ్ళూ, వాళ్ళు పట్నం నుంచి తెచ్చే పళ్ళూ - మిగిలితే నాకు తెచ్చిచ్చేది.

అంబలి తాగడానికి, రొట్టెల్ని తినడానికి 'రోజూ ఇవ్వేనా' అంటూ విసుక్కునే నేను... కుంతి వాటినే పంచభక్ష్య పరమాన్నాలుగా ఎంతో ఇష్టంగా తింటూంటే ఆశ్చర్యపోయేదాన్ని.

అది పల్లెటూరే అయినప్పటికీ ఎలిమెంటరీ పాఠశాల ఉండేది. నేను ఆ సంవత్సరం నాల్గో తరగతి పరీక్షలు రాసాను. ఎప్పట్లానే కుంతి వేసవి సెలవుల్లో ఆ వూరు వచ్చింది. తను కూడా ఆ ఏడు నాల్గోతరగతి పరీక్షలు రాసొచ్చానని చెప్పింది.

అయితే ఆమె చదివింది హైద్రాబాద్‌లో ఏదో కాన్వెంట్‌లో ఇంగ్లీష్ మీడియంతో కాబట్టి, వాళ్ళనాన్నతో అస్తమానం ఇంగ్లీష్‌లోనే మాట్లాడుతూ వుండేది. అలవాటు చొప్పున నాతో కూడా అప్పుడప్పుడూ ఇంగ్లీష్‌లో మాట్లాడేది. నేనేమో ఆమె మాట్లాడ్తోంది అర్థంకాక -

వెర్రిముఖం వేసుకొని చూస్తూ ఉండేపోయేదాన్ని. నేను ఎప్పటికైనా కుంతిలా అంత ధారాళంగా ఇంగ్లీష్ మాట్లాడగలనా అన్పించేది.

కుంతి ఆటపాటల్లోపడి ఎక్కడ చదువు మరిచిపోతుందోనని ఆ సెలవుల్లో కూడా ఆ వూళ్ళో ట్యూషన్ మాస్టారిని కుదిర్చేవాడు కుంతీ వాళ్ళ నాన్న. నాకు ఏమీ తోచక వెళ్ళి మాస్టారు దగ్గర కూర్చునేదాన్ని.

మాస్టారు ఏమనుకునేవాడో ఏమో నాక్కూడా తెలీనివి చెప్తూ ఉండేవాడు. ఇంగ్లీష్‌లో, సైన్స్ లో కుంతి ఫస్ట్ వచ్చేది. లెక్కల్లో మిగతా అన్ని సబ్జెక్ట్స్‌లో నాకు ఫస్ట్ మార్క్స్ వచ్చేవి.

మీడియం వేరయినా "నువ్వు జీనియస్‌వమ్మా ! ఒక్క ఇంగ్లీష్ బాగా నేర్చుకుంటే మున్ముందు ఏ డాక్టర్‌వో, కలెక్టర్‌వో అయి పోతావు!" అని ప్రోత్సహించేవాడు ట్యూషన్ మాస్టర్.

అది చూసి ఉడుక్కునేది కుంతి.

"బోడి ! సీతకి ఇంగ్లీష్ కొంచెం కూడా మాట్లాడరాదు గాని కలెక్టరవుతుందంటా! కలెక్టర్ !" అంటూ ఎగతాళి చేసేది. అది నాలో మరింత పట్టుదలని కల్గించేది.

ఎలా చేసైనా సరే - ఇంగ్లీష్ మీడియంలో చేరి బోల్డంత ఇంగ్లీష్ నేర్చుకొని, కుంతి కన్నా చక్కగా మాట్లాడాలన్న కోరిక సరిగ్గా నాలో ఆరోజుల్లోనే మొలకెత్తింది.

ఒకసారి ఎప్పట్లా వేసవి సెలవులకి కాకుండా దసరా సెలవులక్కూడా ఆ పల్లెటూరికి వచ్చింది కుంతి.

ఆ సెలవుల్లోనే కుంతీ పుట్టిన్రోజు జరిగింది. ఏమనుకున్నారో ఏమో గానీ, కుంతీ వాళ్ళ నాన్నగారు కుంతీతో పాటు నాక్కూడా కొత్తబట్టలు కొనిచ్చారు.

ఇద్దరం కొత్తబట్టలేసుకున్నాం. కేక్ కటింగ్, క్యాండిల్, పాటలూ... ఆటలూ... ఓహ్ చాలా అట్టహాసంగా జరిగింది. కుంతి కేక్ కట్‌చేస్తున్నప్పుడు నన్ను తన పక్కనే నిల్చోబెట్టుకుంది. ఒక కేక్ ముక్క నాకూ, మరొకటి వాళ్ళనాన్నకీ ఇచ్చింది. ఆ వూళ్ళోని మిగతా పిల్లల కళ్ళన్నీ నావంక ఈర్ష్యగా చూస్తుండటం నేను గమనించకపోలేదు.

పెద్దవాళ్ళెవరూ లేకుండా చూసి, వారిలో ఎవరో ఒకరిద్దరు, “అసలు కొత్త బట్టల్లో కుంతీ కన్నా సీతే అందంగా వుంది. కుంతికి డబ్బుందే గానీ ముఖం ఏం బావుంటుంది - కోతిలా” అని రెచ్చగొట్టారు.

అంతే- కుంతి అహం దెబ్బతింది... ఎలాగో పార్టీ అయిందని పించింది. తన గదిలో కెళ్ళి ముసుగుదన్ని పడుకుంది. ఆ తర్వాత ఎందరు బతిమాలినా భోంచేయలేదు. జరిగిన సంఘటనకు నేనెంత మాత్రమూ బాధ్యురాల్ని కాకపోయినప్పటికీ నాకేమిటో గిల్టీగా అనిపించింది.

నేను కుంతీ వాళ్ళ నాన్న గారిచ్చిన బట్టలు విప్పేసి, కుంతి పడుకున్న మంచం మీద పెట్టేసి వచ్చేశాను.

అప్పట్నుండీ కుంతి మారిపోయింది. నా పట్ల ఆమె ప్రవర్తనలో మార్పు కొట్టొచ్చినట్లుగా కన్పించింది. దేనికీ నన్ను పిలిచేది కాదు.

“ఎంతయినా నేను నీ అంత అందంగా వున్నానా?” అనో -

“నీ అంత బాగా చదువొస్తుందా ?” అనో - దెప్పిపొడిచేది.

కుంతి బర్త్‌డేకి చాలామంది వాళ్ళ బంధువులొచ్చారు. వాళ్ళలో మా ఈడు పిల్లలు కనీసం అయిదారుగురన్నా ఉన్నారు. వాళ్ళు ఉన్నన్ని రోజులూ కుంతీ వాళ్ళతోనే ఆడుకుంటూ నన్ను నిర్లక్ష్యం చేసింది.

కుంతీ వాళ్ళ నాన్నగారు అప్పుడప్పుడూ అ పల్లెటూరికి కారు తీసుకొస్తూ వుండేవాడు. అది ఎప్పుడూ కొత్తగా నిగనిగలాడ్తూ వుండేది. దానిమీద ఏ మాత్రం దుమ్ము ఉండేది కాదు ! దాన్ని అస్తమానం డ్రైవర్ తుడుస్తూ ఉండేవాడు. తళతళా మెరిసే ఆ కారు విండోస్ మీద ఎన్నిసార్లు నా ప్రతిబింబాన్ని చూసుకొని మురిసిపోయేదాన్నో.

ఆ కారులో... ఆ మెత్తటిసీట్ మీద కూర్చుంటే ఎంత బావుంటుందో అన్పించేది!

కారులో ఒక్కసారైనా ఎక్కిచూడాలని, ప్రయాణం చేయాలని నాకుందని కుంతికి తెలుసు ! కానీ ఆ సంఘటన తర్వాత ఆమె నాతో మామూలుగా ఉండటం లేదు కాబట్టి, నా కోరిక తీరుస్తుందన్న నమ్మకం లేకుండా పోయింది.

అయితే ఆరోజు ఏమనుకుందో, ఏ కళనుందోగానీ నా దగ్గరికి వచ్చి "సీతా ! మా బంధువుల పిల్లలూ, నేనూ మా తోటకి పిక్నిక్‌కి వెళ్తున్నాం మా కార్లో ! నువ్వూ వస్తావా ?" అడిగింది కుంతి.

కారు అనగానే నా మనసు ఎగిరి గంతేసింది !

కానీ... మరుక్షణం కుంతి ఇన్నాళ్ళూ నాపట్ల చూపించిన నిర్లక్ష్యం గుర్తొచ్చి, ఆ సంతోషం నాలో ఎక్కువసేపు నిలువలేదు.

అయినా అది నేను ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తోన్న అవకాశం... అభిమానానికి పోయి ఒదులుకోవాలనిపించలేదు - అందుకే వొస్తానన్నట్లుగా తలాడించాను.

"నువ్వు ముందువెళ్ళి ఆ గురువయ్య కొట్లో వుండు ! ఈ అర్ధ రూపాయితో పిప్పెర్‌మెంట్స్ కొనివుంచు. మేము కార్లో వచ్చి నిన్ను పికప్ చేసుకొంటాం !" అంది.

నేను సరేనన్నాను. అమ్మతో చెప్పి గురవయ్య కొట్టుకేసి తుర్రుమన్నాను. ఆ తర్వాత దాదాపు అరగంట తర్వాతేమో కారు హారన్ వినిపించింది. గబగబా కొట్టు మెట్లు దిగి నిలబడ్డాను !

కారు దగ్గరికి వచ్చేసింది.

కుంతి కారు కిటికీలోంచి బయటకి తల పెట్టి:

"అబ్బ ! అమ్మాయిగారికి కారెక్కాలని ఎంత ఆశో ? ఆశ - దోశ - అప్పడం- వడ! బాగయిందిప్పుడు" అంది.

మిగతా పిల్లలు నాలుకలు బయటపెట్టి వెక్కిరిస్తూ, చప్పట్లు కొడుతూ "డౌన్! డౌన్" అంటూంటే - కారు ఆగకుండానే వెళ్ళిపోయింది, నా కళ్ళలో దుమ్ము కొడ్తూ.

అప్పుడు చూడాలి నా అవస్థ ! నా ముఖం అవమానంతో క్రుంగి నయా పైసంత అయింది !

ఆ తర్వాత కుంతీతో మాట్లాడ్డానికి ఎప్పుడూ ఇష్టపడలేదు ! కుంతి - వాళ్ళ బంధువుల పిల్లలు వెళ్ళిపోయాక ఏమీ తోచక - మళ్ళీ నా దగ్గరికి వచ్చి, ఒకటి రెండుసార్లు నన్ను మాట్లాడించడానికి ప్రయత్నం చేసింది గానీ, నా ముభావం ఆమెని అల్లంత దూరాన వుంచేసింది!

ఆ తర్వాత కొన్ని రోజులకు - వాళ్ళ నాన్న ఆ పల్లెటూళ్ళోవున్న ఇల్లూ, భూములవీ అమ్ముకుని హైద్రాబాద్‌లోనే సెటిల్ కావడంతో - కుంతి ఆ తర్వాత ఆ వూరికి రావడం తటస్థించలేదు.

కుంతీవాళ్ళనాన్న అలా ఆ వూళ్ళో వున్న బిజినెస్ మానేసి వెళ్ళిపోవడంతో - నాన్న వుద్యోగం కూడా వూడిపోయింది.

నా పోరు పడలేక - నాన్న హైదరాబాద్ వచ్చి, అక్కడే ఓ బట్టల కొట్లో గుమాస్తా ఉద్యోగం సంపాదించారు. ఓ పూట తినీ, ఓ పూట తినకా, ఎలాగైతేనేం మెట్రిక్ పూర్తి చేశాను. మెట్రిక్‌లో ఫస్ట్ క్లాస్ రావడంతో మెరిట్ స్కాలర్‌షిప్ సాయంతో బి.ఏ, ఆ తర్వాత ఐ.ఎ.ఎస్ పరీక్ష పాసై చివరకు నేను అనుకున్న లక్ష్యాన్ని సాధించగలిగాను.

నేనిప్పుడిలా జిల్లా కలెక్టర్‌ని కాగలిగానంటే దానికి నా కృషి ఒక్కటే కాదు కారణం, నాన్న శ్రమా, కుంతి చేసిన అవమానం!

బాబు ఏడుపుతో నా ఆలోచనలకు అంతరాయం కల్గింది ! కుంతి వాణ్ణి వూర్కోబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. వాడు దేనికో మారాం చేస్తున్నవాడిలా కన్పించాడు.

"ఎందుకేడుస్తున్నాడు ?" అడిగాను.

"ఏమీలేదు ! కార్లో ముందుసీట్లో కూర్చుంటానని పేచీ పెడ్తున్నాడు. పడిపోతావు - వద్దంటున్నాను" అంది కుంతి సిగ్గుపడ్తూ.

"నిజమే, కుదుపులొస్తే పడిపోతావ్ ! కాస్త పెద్దయ్యాక కూర్చుందువ్‌గాన్లేరా." అన్నాను నవ్వుతూ.

సిటీ పొలిమేరల్లోకి వచ్చేసరికి సాయంత్రం మూడయింది. నాకు సెక్రటేరియట్ లో అరగంట పనివుంది. ఆ పని పూర్తయ్యాక మళ్ళీ తిరుగు ప్రయాణం తప్ప హైద్రాబాద్‌లో ఇంకేం పనిలేదు.

"కుంతీ, నువ్వీ రోజు వచ్చేస్తావా ? లేక ఇక్కడే ఉండిపోదాం అనుకుంటున్నావా?" అడిగాను.

"లేదు. వెళ్ళిపోదామనే అనుకుంటున్నా ను. ఇక్కడుండాలంటే మళ్ళీ అకామ్‌డేషన్‌కి యిబ్బంది పడాల్సి వస్తుంది!"చెప్పి ంది.

"అదేమిటీ ? మీకీ వూళ్ళో ఇల్లుందిగా" అడిగాను.

"ఇంకెక్కడిల్లు సీతా ! తన అంతస్తుకి మించిన సంబంధం

తేవాలని... అవన్నీ అమ్మి నన్నో యింటిదాన్ని చేశారు నాన్న. వ్యాపారంలో నష్టం వచ్చి ఆ షాక్కి తట్టుకోలేక గుండె పగిలిపోయారు మామా - అల్లుళ్ళు ! ఇటు పుట్టింట్లో గానీ, అటు మెట్టినింట్లో గానీ నాకు ఎర్ర ఏగానీ ఆస్తిలేదిప్పుడు! పూట గడవడమే కష్టంగా వుంది."

"మరి అమ్మ....?"

"అమ్మ నాతో పాటే బిక్నూర్ లో వుంటోంది. అక్కడే ఓ ప్రైవేట్ స్కూల్లో నెలకి రెండొందల రూపాయల జీతంమీద ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నాను. అవి ఏ మూలకీ సరిపోవడం లేదు".

బండ్లు ఓడలు - ఓడలు బండ్లవుతాయని ఇందుకే అన్నారేమో! ఒకప్పుడు ఎలా బ్రతికిన కుంతి ఎలా బతుకుతూందో చూస్తూంటే ఏమిటో ఏదో తెలీని... ఇదీ... అని చెప్పలేని బాధ!

మళ్ళీ మామూలు వాతావరణంలోకి కుంతి రావాలనే ఉద్దేశ్యంతో సంభాషణ మార్చాను.

"నీ ఇంటర్వ్యూ ఆరుగంటలకల్లా అయిపోతుందనుకుంటా ! నువ్వు ఇంటర్వ్యూ అయ్యాక ఎక్కడికీ వెళ్ళకుండా అక్కడే వున్నావంటే నేను పికప్ చేసుకుంటాను. నేనీరోజే తిరిగి ఆదిలాబాద్ వెళ్ళిపోతున్నాను - ఏమంటావ్?" అడిగాను.

సరేనంది కుంతి. వనితా మహావిద్యాలయం వచ్చేసింది. కుంతి దిగింది.

"నన్ను టైంకి నా గమ్యస్థానం చేర్చావ్. నీకెలా థ్యాంక్స్ చెప్పుకోవాలో అర్థం కావట్లేదు!" అంది కుంతి.

ఆమె కళ్లలో సుళ్ళు తిరుగుతోన్న నీళ్ళు ! బహుశః చిన్నప్పటి కారు ఇన్సిడెంట్ గుర్తొచ్చిందేమో !

సీత మాటల్ని పట్టించుకోకుండా "ఇక వెళ్ళొస్తా ! నేను వచ్చేదాకా ఇక్కడే వుండు!". అంటూ కార్లో కూర్చున్నాను.

కారు కదిలింది.

ఆ తర్వాత ఆరున్నర గంటల ప్రాంతంలో వనితా మహావిద్యాలయంలో అడుగెట్టాను.

చిన్నప్పటి సంఘటన గుర్తుంచుకుని నేను తనను ఎక్కడ

అలాంటి అవమానం చేస్తానోఅనే ఉద్దేశ్యంతో కుంతి అక్కడ వుండకుండా వెళ్ళిపోతుందేమో అనే అనుమానం వచ్చింది.

కానీ కుంతీ ఎటూ వెళ్ళలేదు. బాబుని ఎత్తుకొని నాకోసం నిరీక్షిస్తూ కన్పించింది. నామీద కుంతీకి వున్న నమ్మకానికి నాకెంతో సంతోషం కలిగింది.

కుంతీని పికప్ చేసుకుని ఆదిలాబాద్ తిరుగు ప్రయాణం కట్టాను. వెళ్తూ వెళ్తూ ఫ్రూట్స్, నాన్నకోసం బిర్యానీ, బ్రెడ్ అవీ ప్యాక్ చేయించాను. పుల్లారెడ్డిలో స్వీట్స్ తీసుకున్నాను.

"ఇంటర్వ్యూ ఎలా జరిగింది ?" అడిగాను.

"వాళ్ళు అడిగిన వాటికల్లా సమాధానాలు చెప్పాను. మెరిట్ మాత్రమే చూస్తే ఉద్యోగం నాకే రావాలి" అంది కుంతి.

బిక్నూరు వెళ్ళే సరికి రాత్రి ఎనిమిదయింది.

కారు వూళ్ళోకి వెళ్తోంటే వింతగా చూసే పిల్లల్లేరుగానీ ఎవరింటికి వెళ్తుందా అని కుతుహలంగా చూసే పిల్లలు మాత్రం అక్కడక్కడా కనిపిస్తున్నారు.

కార్లోంచి కుంతీ వాళ్ల బాబు - ఆ పిల్లల్ని చూస్తూ "ఒరే రామూ, అరే గోపీ" అరుస్తూ తన ఉనికిని చాటుకుంటున్నాడు.

కుంతీ నేనూ అనుకోకుండానే ఒకరి ముఖాలొకరం చూసుకుని నవ్వుకున్నాం.

"ఇక్కడే ఆపు!" అంటూ ఓ ఇంటి ముందు కారాపమంది కుంతి.

కుంతీ కారులోంచి దిగుతూంటే చుట్టుపక్కలవాళ్ళు వింతగా, విడ్డూరంగా చూస్తున్నారు.

కుంతి వెనకాలే నేనూ, బాబూ దిగాం.

కుంతి తలుపు తట్టింది. మరి కాసేపట్లో తలుపులు తెరుచుకున్నాయి.

కుంతీ వాళ్ళమ్మకి"నమస్తే" చెప్పాను.

ఆమె నన్ను గుర్తుపట్టలేదు !

లోపలికి వెళ్ళాక కుంతి పరిచయం చేసింది. ఎన్నో ఏళ్ళ తర్వాత

ఎవరో ఆప్తుల్ని చూసినంత సంబరపడింది వాళ్ళమ్మ.

నేను తెచ్చిన పళ్ళబుట్టా, స్వీట్స్ ప్యాకెట్స్ వగైరా తీసుకొచ్చి లోపల పెట్టాడు డ్రైవర్.

"అమ్మా ! సీత ఈ రోజిక్కడే భోంచేస్తుంది ! త్వరగా ఏదైనా స్పెషల్ చెయ్యి !" అంది కుంతి.

"మనం తెచ్చినవి చాలవా ? ఇంకా స్పెషల్స్ ఎందుకు కుంతీ? నీకు ఉద్యోగం దొరికాక మంచి విందు ఇద్దువుగాన్లే ! ఇప్పుడు ఉన్నదేదో తిందాం ! పైగా ఇప్పుడు అమ్మ వంటా తంటా అంటూ పెట్టుక్కూర్చుంటే, అది పూర్తి కావడానికి ఇంకెంత లేదన్నా మరో గంట పడ్తుంది, అది తినేసరికి ఇంకో గంట, నా ప్రయాణం మరో ఐదు గంటలు - వెరసి ఏడు గంటలు ! ఆ లెక్కన ఆదిలాబాద్ చేరేసరికి రాత్రి ఏ రెండో, మూడో అవుతుంది. అవతల నాన్న కంగారుపడ్తారు. ఉన్నదేదో తిందాం చాలు!" అంటూ వాళ్ళని హడావిడి చేశాను.

డ్రైవర్‌కి డబ్బులిచ్చి అక్కడే వున్న ఏదైనా హోటల్లో భోంచెయ్యమని చెప్పి పంపించాను.

కుంతి వాళ్ళమ్మకిక ఒప్పుకోక తప్పింది కాదు. అసంతృప్తిగానే విస్తళ్లు వేసి వడ్డించింది.

ఇంట్లో వండిన అన్నం మా నల్గురికీ అంటే నాకూ, అమ్మకీ, కుంతికీ, బాబుకీ సరిపోయేలా లేదేమో అమ్మ ముందు మమ్మల్ని తినమని, తర్వాత తను తింటానంది.

"అందరం కలిసే వున్నదేదో తిందాం. తక్కువపడ్తే స్వీట్స్ వున్నాయి!" అని నేను అనడంతో అమ్మ కూడా భోజనానికి మాతో పాటే కూర్చుంది.

నాకూ, బాబుకీ అన్నం వడ్డించి, తనకీ, కుంతికీ మొక్కజొన్న రవ్వతో చేసిన గట్క వడ్డించుకొంది అమ్మ.

గట్క చూడగానే నా ప్రాణం లేచొచ్చింది. అబ్బ, ఎన్నాళ్ళ తర్వాత చూసాను. పదిహేనేళ్ళ తర్వాత ! అమ్మ పోయాక దాదాపు గట్క, అంబలీ, రొట్టెలు తినడం జరగనే లేదు, చేసుకుందామంటే అవి ఎలా చేస్తారో నాకు తెలీదు.

రోజూ ఈ పళ్ళూ, బిస్కట్లూ, అన్నం, పులిహోరలతో విసుగెత్తి పోతున్నాను. చిన్నప్పుడంటే వాటిని అంత వెర్రిగా ఇష్టపడే దాన్ని గానీ, ఇప్పుడు నాకు వాటిలో ఏ రుచీ కన్పించట్లేదు. గట్కలో పాలు పోసుకొని తింటే ఎంత బావుంటుంది.... బహుశః కుంతి అందుకే వాటిని అంతగా ఇష్టపడేదేమో !?

"ప్లీజ్ కుంతీ ! నీ విస్తట్లోని గట్క నా కిచ్చేద్దూ ! రోజూ ఈ అన్నం తినీ తినీ విసుగెత్తిపోతున్నాను." అంటూ చొరవగా నా విస్తరిని ఆమె ముందుకు జరిపి, కుంతి విస్తరిని లాక్కున్నాను.

"నువ్వు గట్క తినడమేమిటి సీతా ?" కుంతీ వాళ్ళమ్మ నొచ్చుకుంది.

"దీని రుచి నీకేం తెలుసమ్మా ? కుంతీ నడగండి... చెప్తుంది ! చిన్నప్పుడు దీనికోసం మా అమ్మని ఎంత వేధించుకు తినేదో ?" అన్నాను నవ్వుతూ.

ఆవిడ ఆశ్చర్యంగా చూస్తూ "మరి ఎప్పుడూ ఈ వెధవ గట్కా అంబలేనా - ఈరోజు కాస్త అన్నం వండమ్మా అంటుందే !" అంది.

"నిజమా ?" అన్నట్టు చూశాను... కుంతి వేపు !

కుంతీ నవ్వి వూరుకుంది.

ఆ నవ్వులో నాకంతకు క్రితం తెలీని విషయమేదో అంతుబట్టినట్లయి, నాన్నకోసం ప్యాక్ చేయించిన బిర్యానీ ప్యాకెట్ని డ్రైవర్‌చేత కార్లోంచి అప్పటికప్పుడు తెప్పించాను.

కుంతీ, వాళ్ళమ్మా ఆ బిర్యానీని... నేనేమో వాళ్ళుపెట్టిన గట్కా, రొట్టెల్నీ... అవురావురుమంటూ తింటూంటే మా వంక ఆశ్చర్యంగా చూస్తూ బయటకి వెళ్ళి పోయాడు డ్రైవర్.

***'ఆంధ్రజ్యోతి' వారపత్రిక***

***తేదీ: 13-4-1979***



# అంతుబట్టని అంతర్యాలు



1975

"ఆంటీ, వెనార్యు గోయింగ్ టు వరంగల్ ?"

పక్కింటి బాబిగాడు అవసరార్థం పొద్దున తీసుకెళ్ళిన పెన్ తిరిగి ఇచ్చేస్తూ అడిగాడు.

"వై ఆర్యూ సోమచ్ ఇంటరెస్టెడ్ ? డు యు వాంట్ టు కమ్ ?" అడిగాను నవ్వుతూ.

"నోనో ఆంటీ, సింప్లీ ఆస్కింగ్, దట్సాల్!" అంటూ జారిపోతూన్న నిక్కరు ఎగ లాక్కుంటూ పరిగెత్తాడు.

కాన్వెంట్‌లో చదువుతోన్న బాబిగాడు ఇలా ఇంగ్లీష్‌లో ఫ్లూయింట్‌గా మాట్లాడినప్పుడల్లా అన్నయ్య తన అశక్తతని తలచుకుని బాధపడుతూవుంటాడు!

తన చిన్న నాట తనను బాబిగాడిలా ఏ కాన్వెంటులోనో చదివిస్తే తనకిప్పుడీ సమస్యే వుండకపోయేదని బాధపడ్తూ వుంటాడు! ఎస్సెల్సీ వరకు వాడు చదివింది తెలుగు మీడియం కాబట్టి వాడికి ఇంగ్లీష్ అంతగా ఒంటబట్టలేదు. పీ.యూ.సీలో జాయినయ్యాక గాని వాడికి ఇంగ్లీష్ ప్రాముఖ్యత తెలిసి రాలేదు. కొత్తలో లెక్చరర్ ఏం చెప్తోందీ అర్థంగాక, తన తోటివాళ్ళలాగే ప్రతి ఏడూ కాపీకొడ్తూ బియ్యే పూర్తయిందనిపించుకున్నాడు! ఎవరైనా అడిగినపుడు మాత్రం - తను గ్రాడ్యుయేట్ అని చెప్పుకోటానికి సిగ్గుపడి మెట్రిక్యులేట్ అని మాత్రమే చెప్పుకునేవాడు. చివరకు ఉద్యోగంలో కూడా బి.ఏ.డిగ్రీ నుపయోగించుకోవడానికి అభిమానపడి, ఎస్సెల్సీ సర్టిఫికెట్‌తోనే ఓ గుమాస్తా ఉద్యోగం సంపాదించి స్థిరపడ్డాడు.

ఆ తర్వాత నాన్న రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి మినిస్టరయినా తన పలుకుబడిని ఉపయోగించి వాడి ఉద్యోగం విషయంలో ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు.

అమ్మ ఎప్పుడా ప్రస్తావన తీసుకువచ్చినా "వాడి స్టాండర్డ్‌కా ఉద్యోగం చాల్లే" అని కొట్టి పారేసేవాడు. నాన్న మాటకి వంత పాడే వాడు అన్నయ్య.

అన్నయ్య గురించి ఆలోచిస్తోన్న నేను- "అరే. ఇంకా రెడీ కాకుండా అలాగే కూర్చున్నావా ? అవతల ట్రెయిన్‌కి టైమవుతోంది. గెట్ రెడీ ఊఁ క్విక్!" అన్నయ్య మాటలకు ఉలిక్కిపడి నీళ్ళపంపు వేపు పరుగుతీశాను.

ఆ రోజు రాత్రే అన్నయ్య ప్రాణ స్నేహితుడు సారథి పెళ్ళి. ముహూర్త స్థలం వరంగల్.

"నేను రాను మొర్రో"-అంటోన్నా విన్పించుకోకుండా -

"అలా అంటే ఎలా హేమా ? నువ్వు గౌను వేసుకున్నరోజుల్లో 'చెల్లాయ్... చెల్లాయ్' అంటూ నిన్నెంత ప్రేమగా చూసుకున్నాడో తెలుసా ? తన పెళ్ళికి నిన్ను తీసుకుని రాకుండా వెళ్తే గుమ్మం కూడా తొక్కనీనని రాశాడు. నా క్లోజ్ ఫ్రెండ్ పెళ్ళి నన్ను చూడనీకపోతే ఆ పాపం నీకు చుట్టుకుంటుంది మరి! ఆ పైన నీ ఇష్టం!" అంటూ బెదిరిస్తూ.... భయపెడ్తూ, బతిమాల్తూ చివరకు ఎలాగైతేనేం నాతో

'ఊఁ' అన్పించాడు.

"నా కక్కడ తెలిసిన వాళ్ళెవరూలేరు! మీ మగపురుగుల మధ్య నేనెలా వూపిరి తీసుకోన్రా చిట్టితండ్రీ, తలుచుకుంటేనే బెంగగా, భయంగావుంది. నేను రాను ! నువ్వే వెళ్ళు!" తప్పించుకోవడానికి చివరి అస్త్రాన్ని ప్రయోగిస్తూ అన్నాను.

"నీకా భయం అక్కర్లేదు హేమా ! నా ఫ్రెండ్ మనోహర్ అని చెప్తుంటాను చూడూ, వాడు - తన భార్యతో సహా వస్తున్నాడీ పెళ్ళికి, వాడి మిసెస్ చాలా కలుపుగోలు మనిషని విన్నాను. పరిచయం చేస్తానుగానీ త్వరగా తయారవు", అంటూ సూట్ కేస్ సర్దుకోసాగేడు.

ఇక చెప్పడానికి ఏ సాకూ దొరక్క అమ్మకు వెళ్తున్నామని చెప్పి రిక్షాలో ఎక్కి స్టేషన్‌కి బయల్దేరాం. ట్రెయిన్ మాత్రం టైమ్‌కి వచ్చి మమ్మల్ని రక్షించింది. భువనగిరి స్టేషన్ వచ్చేదాకా అన్నయ్య ట్రెయిన్లో వసపిట్టలా వాగుతూనే వున్నాడు. ఆ వాగుడంతా తన స్నేహితుడు మనోహర్ గురించే. అతడు ఎమ్మెస్సీ ఫస్ట్‌క్లాసులో పాసయ్యేట్ట! ఇంగ్లీష్ సాహిత్యమంతా కాచి వడబోసి ఆకళింపు చేసుకున్న ఇంటలిజెంట్ ఫెలోట! మంచి సంస్కారీ, బుద్ధిమంతుడనీ అబ్బ - ఒకటేమిటీ - నేను ఆవులిస్తూ కనిపించకపోతే బహుశా వరంగల్ వచ్చేదాకా అతడి గుణగణాల గురించి లెక్చరిస్తూ వుండేవాడేమో ?

వరంగల్ చేరేసరికి అప్పుడప్పుడే చీకటి పడ్తోంది. పెళ్ళి కూతుర్దీ, పెళ్ళి కొడుకుదీ అదే వూరు ! పైగా ముహూర్తం వేళ సమీపించింది కాబట్టి రిక్షాలో నేరుగా - పెళ్ళి కూతురు వాళ్ళింటికి వెళ్ళాల్సి వచ్చింది. నన్ను చూడగానే పెళ్ళికొడుకు సారథి కళ్ళు ఆనందంతో మెరిసినట్టయ్యాయి.

"వచ్చావా చెల్లాయ్ ! నువ్వు ఎంతకీ రాకపోయేసరికి ఇక రావేమో అని ఒకటే ఫీలవుతున్నాను. ఏమైతేనేం వచ్చావు! అంతేచాలు!" అంటూ తెగ సంబరపడి పోయాడు.

పిచ్చి సారథీ ! పిచ్చిప్రేమ ! నిజానికి అతడెవరో - నేనెవరో - కాని అతడికి నాపట్ల ఎందుకీ ప్రేమాభిమానాలు! ఎప్పుడో నా చిన్ననాట తన చేతుల్లో పెరిగానట! చాక్‌లెట్స్ కొనివ్వకపోతే, కొనిచ్చేదాకా సతాయించేదాన్నట! అతడొక్క రోజు ఇంటికి రాకపోతే

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి నిద్ర పోయేదాన్నట!

ఆ స్మృతులన్నీ నాకిప్పుడంతగా గుర్తు లేకున్నా అమ్మా వాళ్ళు చెప్తూంటే మాత్రం తమాషాగా అన్పించేది.

పెళ్ళి పందిట్లో సారథి మధ్య మధ్య పెళ్ళి కూతురికేసి ఓరగా చూస్తూ ఏవేవో చెణుకులు విసుర్తున్నాడు. ఆమె చిరునవ్వులు చిందిస్తూ అతడి మాటలకు అప్పుడప్పుడు సిగ్గుపడ్తోంది. వాళ్ళిద్దరి జంట చూడ ముచ్చటగా వుంది.

అదే సంగతి అన్నయ్యతో చెప్తే.. "నేనింత కన్నా అందమైన అమ్మాయిని పెళ్ళి చేసుకోకపోతే నేన్నీ అన్నయ్యనే కాదు," అని ఓ భీషణ ప్రతిజ్ఞ చేశాడు.

"మరి కండలు తిరిగిన నీ పర్సనాల్టీని చూసి మా కాలేజీ అమ్మాయిలు మనింటి ముందే కదూ క్యూలో నించుంటున్నారు. అ స్వయంవరంలో - నీకో జగదేక సుందరే లభిస్తుందిగానీ.... ఇంత చిన్న విషయాలకే అంత పెద్ద ప్రతిజ్ఞలు చేయక్కర్లేదురా" అన్నాను పెద్ద గాలివీస్తే కొట్టుకుపోయేలా వుండే అన్నయ్యను చూస్తూ వెక్కిరింతగా.

"నాలాంటి బక్క పల్చటివాడూ, చీపురు పుల్లలాంటివాడే నీ జీవిత భాగస్వామి అవుగాక!" అంటూ చెల్లాయినన్న కనికరమైనా లేకుండా శపిస్తూ - "హలో... మనోహర్" అంటూ దూరాన గేట్లోంచి లోపలికి వస్తోన్న ఓ జంటవేపు దూసుకెళ్ళాడు.

ఇద్దరూ ఏదేదో చెప్పుకుంటూ అమితోత్సాహంగా నా వేపు రావడం గమనించాను. వాళ్ళిద్దరి పక్కన మరో చిన్నది, బహుశః ఈ మనోహరుడి మనోహరి కాబోలు నెమ్మదిగా నడిచి వస్తోంది.

"ఈవిడ నా శ్రీమతి అరుణ!" అని వస్తూనే పరిచయం చేశాడు మనోహర్.

"నమస్తే" చెప్పాను నవ్వుతూ...

ఆవిడ వేషధారణ అతి మామూలుగా వుంది. అతడు మాత్రం బెల్ బాటం, డార్క్ పూలున్న చొక్కాతో అణువణువునా ఏదో తెచ్చిపెట్టుకున్న స్టయిల్ ఒలకబోస్తూ, సాధ్యమైనంత ఎక్కువగా

ఇంగ్లీష్ పదాలనే ఉపయోగిస్తున్నాడు.

అతడి ఉచ్చారణ మృదుమధురంగా, రూపం కూడా పేరుకు తగ్గట్టే అతి మనోహరంగా, ఆడపిల్లలు ఒకసారి చూస్తే మరోసారి చూడాలన్పించేలా వుండటంతో అన్నయ్య చెప్పిందాన్లో అతిశయోక్తి లేదనిపించింది.

అతడికి ఏదో ఫ్యాక్టరీలో నెలకో అయిదారొందలొచ్చే ఉద్యోగమట! అన్ని విధాలా అలాంటి యోగ్యుడు లభించిన అరుణ అదృష్టవంతురాలనిపించింది.

అరుణా, నేనూ ఎలాంటి బిడియం లేకుండా తొందరగానే కలిసిపోయాం.

తమ ఆడంబర ప్రదర్శన కోసం అంత ఉక్క లోనూ పట్టుచీర కట్టి గాలి రాక చెమట పట్టిన శరీరాల్తో నానా అవస్థపడ్తోన్న ఆడవాళ్ళమీదా - పెళ్ళి పేరుతో వచ్చి, ఆ పెళ్ళి సంగతే మరిచి పేకాడుతున్న పురుషపుంగవులమీదా - అమ్మెక్కడుందో తెలియక అరున్నొక్కరాగాలు ఆలాపిస్తోన్న చిన్నపిల్లలమీదా - నిద్రపోతోన్న పసిపాపల కాళ్ళు పొరపాట్లో తొక్కి వాళ్లు కీచుమనగానే దొంగలా అటూ ఇటూ ఓ సారి చూసి జారుకుంటోన్న పెద్దమనుషులమీదా- - పెళ్ళికి వచ్చి చెప్పులు పోగొట్టుకుని కన్పించిన వాళ్ళనందర్నీ వాటి గుర్తులు చెప్పి జాడ అడుగుతున్న కాలేజీ కుర్రాళ్ళ మీదా - రకరకాలుగా జోక్స్ వేసుకుంటూ ఆ రాత్రంతా నిద్రేపోలేదు.

ఆ మర్నాడు ఉదయం మనోహర్ -

"నిన్న రాత్రంతా మీ చెల్లాయికి నిద్రలేనట్టుందిరా జగన్ ! ఈ రోజు పెళ్ళి కూతురు సారధి వాళ్ళింటికి వెళ్తుంది. అక్కడా మళ్ళీ విందు భోజనమంటూ ఇల్లంతా సందడిగా వుంటుంది.. సో, మీరిద్దరూ ఈ రోజు మా ఇంటికి వచ్చి అక్కడే విశ్రాంతి తీసుకోండి. సారధి కూడా మీకీరోజు మా ఇంట్లోనే ఆతిథ్యమేర్పాటు చేయమని చెప్పాడు" అంటూ అన్నయ్యనీ, నన్నూ వాళ్ళింటికి తీసుకెళ్ళాడు.

ఇల్లు అధునాతనంగా వుంది. కాని ఇంట్లో మనుషుల తీరే బాగాలేదు. మనోహర్‌కి నల్గురు తమ్ముళ్ళున్నారట. ఎవరి రూం వారికే, ఆడపిల్లలసలేలేరు కాబట్టి నాలాంటి ఆడపిల్లలు వెళ్ళినప్పుడు

ఇబ్బంది పడాల్సి వస్తుంది.

ఇంటికి వచ్చిన వాళ్ళతో సభ్యత కోసమైనా మాట్లాడాలన్న ఇంగిత జ్ఞానం లేని అతడి తమ్ముళ్ళని చూస్తూ అదోలా అన్పించింది. ఒకే ఇంట్లో వుంటూ ఒకర్తో మరొకరికి సంబంధం లేనట్లుగా ఎలా వుంటారో అర్థంకాలేదు నాకు. ఆ మధ్యాహ్నం ఏమీ తోచట్లేదని మాట్నీషోకి ప్రోగ్రాం వేశారు.

అన్నయ్యని సారధి అర్జంట్‌గా రమ్మని కబురంపాడు కాబట్టి, వాడు వెళ్ళి పోయాడు. నేనూ, అరుణా, మనోహర్, అతడి తమ్ముడూ వెళ్ళాం పిక్చర్‌కి.

మనోహర్ ప్రక్కన అరుణ, ఆమె ప్రక్కన నేనూ కూర్చున్నాం. మనోహర్ తమ్ముడికి - నా పక్కసీటే మిగిలిందికాబట్టి, కూర్చోడానికి సంశయిస్తూ నించున్నాడు.

''ఫర్వాలేదు కూర్చోండి'' అన్నాను అలాంటివి అంతగా పట్టించుకోని నేను.

అతడు కూర్చున్నాడు. పిక్చర్ మొదలైంది, మామూలు ప్రేమకథే, హీరోహీరోయిన్స్ మొదటి చూపులోనే డ్యూయెట్ పాడుకుంటున్నారు.

మనోహర్ తమ్ముడు ఆ పాటకి రిథమిక్‌గా తన కాళ్ళతో తాళం వేస్తున్నట్టున్నాడు. మధ్యలో ఒక రెండు సార్లు అతడి కాళ్ళు నా పాదాలకి తగిలింది. పొరపాట్లో తగిలిందేమోనని సరిపెట్టుకుని పిక్చర్ చూస్తున్నాను.

నానుండి ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడంతో అతడి చేష్టలకి నేను సుముఖంగానే వున్నాననుకున్నాడేమో ఈ సారి తన ఎడం చేతిని నా కుర్చీ వెనకాలనుండి పోనిస్తూ నా భుజాలని తాకించడం మొదలెట్టాడు.

''ఎజుకేటెడ్ బ్రూట్ ! ఛీ'' అతడికి మాత్రమే వినబడేలా తిట్టి, కొంచెం ముందుకి జరిగి కూర్చున్నాను.

తన తమ్ముడు వేసే వేషాలు ముందే తెలుసేమో నా బాధ నర్థం చేసుకున్న వాడిలా, ''మీకు అక్కడ కన్వీనెంట్‌గా లేదల్లేవుంది. మీరిక్కడ కూర్చోండి హేమా'', అంటూ తన సీట్ నాకిస్తూ, నా సీట్లో మనోహర్ వచ్చి కూర్చున్నాడు.

అన్నదమ్ములిద్దర్లో ఎంతో వ్యత్యాసముందనిపించింది.

కొంతమంది మనుషులు ఏ మాత్రం సంకోచం లేకుండా కనీసం ఎదుటివారి అభిప్రాయం అయినా తెలుసుకోకుండా అంత అసభ్యంగా ఎలా ప్రవర్తిస్తారబ్బా అన్పించింది.

పిక్చరయిపోయి హాల్లోంచి బయటికి రాగానే మనోహర్ తమ్ముడు "హలో మోహినీ" అంటూ మాకు కొంచెం దూరంలో - ఎవర్తోనో మాట్లాడుతోన్న ఓ అమ్మాయి వేపు దూసుకెళ్ళాడు.

"వీడెప్పుడూ ఇంతే హేమా ! చిల్లరమల్లర ఆడవాళ్ళతో తిరుగుతూ ఆడవాళ్ళందరూ అలాంటివాళ్ళే అనుకొని వెంటబడ్తూ - చెప్పుదెబ్బలు తింటూ వుంటాడు. వాడి తరఫున నేను క్షమాపణలు చెప్పుకుంటున్నాను. వాడు చదువుతోంది ఓ పేరున్న కాలేజీ అన్నమాటేగానీ బుద్ధులన్నీ పాడు బుద్ధులే ! ఆ కాలేజీలో వీడొక్కడే కాదు చాలామంది అలాంటివాళ్ళే ! ఇంగ్లీష్ మీడియంలో మొదట్నుంచీ చదువుతారు కాబట్టి ఫ్లూయంట్‌గా ఇంగ్లీష్ మాట్లాడగల్గుతారే తప్ప, వాళ్ళకి సబ్జెక్ట్ నాలెడ్జ్ చెప్పుకోదగ్గంత వుండదు! పైగా అలాంటి పేరున్న కాలేజీల్లో పరీక్ష రేపుందనగా తమ ఇన్సిట్యూషన్స్‌కి మంచిపేరు రావాలనే ఉద్దేశ్యంతో చాలా రహస్యంగా పేపర్సవుట్ చేస్తూవుంటారు! పిల్లల్లో యూనిటీ వుంటుంది కాబట్టి ఆ విషయం ఎక్కడా పొక్కదు!"

అలా మనోహర్ నాకు తెలియని విషయాలెన్నో ఆసక్తిదాయకంగా చెప్తూంటే ఆశ్చర్యంగా విన్నాను. ఇంటికి వచ్చేసరికి చీకటి పడింది.

ఆ రాత్రి అరుణ వంటచేస్తూంటే నాకేమి తోచక - అదే వూళ్ళోవున్న నా ఫ్రెండ్‌కి లెటర్రాసి పోస్ట్ చేయమంటూ మనోహర్‌కి చ్చాను.

ఎన్వలప్ మీదున్న అడ్రస్ వంక పరీక్షగా చూసి "మీ రైటింగ్ చూస్తే... అది మైండ్ మెచూర్ కాని మనిషి దస్తూరీలా... అనిపిస్తుందండీ." అన్నాడు నవ్వుతూ.

"దస్తూరీని చూసి ఆ మనిషి స్వభావం ఎలాంటిదో తను కనుక్కోగలనని ఎంత గర్వమనుకున్నావ్ మా ఆయనకు ? నా దస్తూరీ చూసి నువ్వొత్త మొండిదానివని ఏడ్పిస్తూ వుంటారు" అంది తడి

చేతులు నాప్‌కిన్‌కు తుడుచుకుంటూ అప్పుడే వంట ముగించి ఆ గదిలో అడుగు పెట్టిన అరుణ.

భోంచేశాక - బాల్కనీలో కుర్చీలు వేసి మళ్ళీ బాతాఖానీ మొదలెట్టాం. ఎనిమిది గంటల ప్రాంతంలో అన్నయ్య వచ్చి జాయినయ్యాడు. అసలే ఆ కిందటి రాత్రి నిద్రలేదేమో నా కళ్ళు ఒకటే మూతలు పడ్తున్నాయి, నిద్ర నాపుకోనడానికి అష్ట కష్టాలు పడ్తున్నాను.

నా అవస్థ కనిపెట్టినవాడల్లే అన్నాడు మనోహర్: ''హేమకు నిద్రొస్తున్నట్టుంది అరుణా ! మీరిద్దరూ ఇక్కడ పడుకుంటారా ? మన బెడ్ రూం లోనా?''

అతిథులకంటూ వేరే రూం లేదు కాబట్టి ఇంటికి ఎవరు వచ్చినా మొదట ఇబ్బందికి గురయ్యేది వీళ్ళద్దరే కాబోలని ఒక క్షణం జాలేసింది.

''అందరం కలిసి ఇక్కడే బాల్కనీలో కింద పరుపులు వేసుకుని పడుకుందామండీ. ఆ రూంలో అంత వుక్కబోస్తూంటే అక్కడ ఎవరు మాత్రం పడుకోగలరనీ ?''అంది అరుణ.

ఆ దంపతులిద్దరూ లోపలికి వెళ్ళి మూడు పరుపులు తీసుకొచ్చి బాల్కనీలో వేశారు.

ఒక పరుపైన అటు చివర అన్నయ్యా - రెండో పరుపుపై మనోహర్. మూడో పరుపుపై అరుణా - పక్కనే అదే పరుపుపై ఇటు చివర నేనూ - పడుకున్నాం.

మనోహర్ ఇంగ్లీష్ నావెల్స్ గురించి యింకా ఏదేదో చెప్తూనే వున్నాడు ! అప్పటికే అరుణా, అన్నయ్యా మాంచి నిద్రలో వున్నారు.

మనోహర్ మాటలకి లోలోపల విసుక్కుంటూనే - ఎప్పుడూ నిద్రపోయానో గానీ హఠాత్తుగా అరుణ కాలు నా మీద పడేసరికి ఉలిక్కపడి కళ్ళు తెరిచాను.

అరుణ పూర్తిగా నా వేపు తిరిగి పడుకుంది. ఆ నిద్ర మత్తులో అలవాటు ప్రకారంగా అరుణ నన్ను 'మనోహర్' అనుకుని అంత క్లోజ్‌గా పడుకుందేమో అని నవ్వొచ్చింది!

ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడు నిద్ర పట్టిందో గానీ ఈసారి అరుణ తన చేత్తో నా ముఖాన్నీ, పెదిమలనీ తడమడంతో - నాకు చిరాకు పుట్టి, ఆ చెయ్యిని మరి కదలనీకుండా గట్టిగా పట్టుకుని మెడపై పెట్టుకున్నాను.

మళ్ళీ అరుణ నా పట్టు విడిపించుకుని తన చేత్తో నా బుగ్గలనీ, మెడనీ - రాస్తూంటే నాకు పూర్తిగా మెలుకువచ్చేసింది!

ఆ చెయ్యి పక్కకినెట్టి, ఆమెని తట్టి: "అరుణా, నేను హేమని, నీ మనోహరుడిని కాదు!" అని లేపి ఆట పట్టిద్దామని లేచి కూర్చున్నాను.

ఆశ్చర్యం ! అంత వరకూ నన్ను తడుముతోంది అరుణచెయ్యి కాదు! అరుణ పక్కనే ఆ రెండోవైపు పడుకున్న మనోహర్‌ది!

ఆమె మీదుగా చెయ్యేసి నన్ను తాకాడనే ఆలోచన రాగానే ఒక్కసారిగా శరీరం జలదరించింది! పైగా అతడి చేతినే నేను నా మెడపై పెట్టుకున్నాననేది తలపుకి వచ్చి - తేళ్ళూ. జెర్రులూ పాకినట్టన్పించింది! ఇది కలా నిజమా ? ఏమిటీ విచిత్రం అన్పించింది.

ఛ! ఛ! మనోహర్ అలాంటి నీచుడు కాదన్పించింది! బహుశః అతడు నిద్ర మత్తులో అరుణపై చెయ్యేశాను అనుకుని - నా ఒంటిపై వేశాడేమో అని సరిపెట్టుకుని, నిద్రపోవడానికి విశ్వప్రయత్నం చేశాను.

అంతలో అరుణ పూర్తిగా అతడివైపు తిరిగింది! మనోహర్ ఆమెని తన చేత్తో వాటేసుకుని తన గుండెలకదుముకుని పడుకున్నాడు! అలాంటి దృశ్యాలు సినిమాల్లో చూడ్డం, కథల్లో చదవడమేగానీ ఏనాడూ ప్రత్యక్షంగా చూడలేదు- కాబట్టి సిగ్గుపడ్డాను.

రెండు కళ్ళూ గట్టిగా మూసుకుని పడుకున్నాను. ఎంత సేపటికీ నిద్ర రాలా. మనసులో ఇందాకటి దృశ్యమే మెదుల్తోంది.

అంతగా... ఒక్క రోజు కూడా వాళ్ళిద్దరూ ఒకర్నొకరు విడిచి వుండలేనప్పుడు... ఆ రూంలోనే పడుకోవచ్చుకదా, ఇలా పబ్లిగ్గా సరసాలాడ్తూ ఎదుటివాళ్ళ ప్రాణాలు తీయకపోతే... అన్పించింది.

ఆలోచిస్తూన్న నాపై మళ్ళీ మనోహర్ చెయ్యిపడి వులిక్కిపడ్డాను!

అరుణ నా వైపు తిరిగి పడుకున్నప్పుడు... అతడి చెయ్యి నాపై యాక్సిడెంటల్‌గా పడిందేమో అని అనుకున్నాను గానీ - అరుణ పూర్తిగా అతిడి వేపు తిరిగాక్కూడా అతడి చెయ్యి నాపై పడిందంటే - అతడు ఇదంతా ఉద్దేశ పూర్వకంగానే చేస్తున్నాడన్పించి, మనసు వికలమై ఆ పరుపు వదిలి - దూరంగా నేలపై పడుకున్నాను.

తన తమ్ముడి అసభ్య ప్రవర్తనకు క్షమాపణలు చెప్పుకున్న మనోహర్... ఎంతో సంస్కార పురుషుడిలా కన్పించే మనోహర్... నిజ స్వరూపం ఇలాంటిదా ? పక్కలో భార్యను పెట్టుకుని పరాయి స్త్రీ మీద దొంగచాటుగా చెయ్యేసే యిలాంటి నీచులు పక్కా వ్యభిచారుల కన్నా హీనులు అన్పించింది.

రకరకాల ఆలోచనలతో నేనా రాత్రి నిద్రపోలేదు. ఇదేమీ తెలీని అన్నయ్య ఎంచక్కా హాయిగా నిద్రపోతున్నాడు.

"పూర్ అన్నయ్య ! నల్లనివన్నీ నీళ్ళూ, తెల్లనివన్నీ పాలనుకునే అమాయకుడు! ఎలా బతుకుతాడో ?" అన్పించింది.

ఆ మర్నాడు అందరికన్నా ముందే లేచి గబగబా స్నానం చేసి ఇక హైదరాబాద్ వెళ్ళిపోదామని అన్నయ్యతో గొడవపెట్టాను.

"అబ్బ ! అప్పుడే ఎందుకులెద్దూ. ఈ రోజుండి రేపు వెళ్ళిపోదాం. రామప్పా, పాకాలా అవీ చూడొద్దూ" అన్నాడు వాడు ముసుగు తీయకుండానే.

"రామప్పా వద్దూ, గీమప్పా వద్దు, నీకంతగా చూడాలని వుంటే అవన్నీ చూసి తీరిగ్గా రా! కానీ - నన్ను మాత్రం పంపించు తండ్రీ నీకు పుణ్యముంటుంది!" అంటూ వాడి దుప్పటి లాగేశాను.

"అయ్యబాబో, నిన్నొంటరిగా పంపడమే? ఇంకేమన్నా వుందీ ? అమ్మ నా డొక్కచీల్చి డోలుకడ్తుంది! సరే నీ యిష్టం! అలాగే వెళ్దాం. కాస్త కడుపులో వేడి వేడి కాఫీ అయితే పడనీ!" అంటూ అయిష్టంగానే లేచాడు.

ఇద్దరం తయారై కాఫీలు తాగాక, మెల్లగా అరుణతో చెప్పాను- "ఇక వెళ్తున్నామండీ" అని.

ఆవిడ ఆశ్చర్యపోతూ "అదేమిటీ ? ఇంత హఠాత్తుగా" అడిగింది.

నాకు నవ్వొచ్చింది! ఆ కిందటి రాత్రి మనోహర్ నాపై అలా చెయ్యేశాడన్న సంగతి ఏమాత్రం పసిగట్టినా తనీమాట ఛస్తే అని వుండకపోయేదనీ.

"అదేమిటండీ! ఈ వూళ్ళో చూడదగ్గ ప్రదేశాలు బోలెడు వున్నాయి. అవన్నీ చూడకుండానే వెళ్తామంటారా ? ఇట్స్ టూ బాడ్. ఓ రెండ్రోజులయ్యాక వెళ్దురుగానీ అప్పుడే ఏం తొందరా?" అన్నాడు మనోహర్.

"ఈలోగా ఇంకెన్ని వేషాలువేయడానికి నాయనా..." అనుకుని పైకి మాత్రం: "అబ్బే వీలుపడదండీ! రేపు మా కజిన్ పెళ్ళి వుంది.... వెళ్ళక తప్పదు ! మరోసారి ఎప్పుడైనా తప్పక వస్తాం" అన్నాను.

రిక్షాల్లో కూర్చున్నాక అన్నాడు అన్నయ్య: "హేమా ! మరే - ఇందాక నువ్వు చెప్పినట్టే నేను విన్నానా ? ఇప్పుడు ఛాయిస్ నాది! సో, ఇప్పుడు చెప్పడం నావంతు, వినడం నీ వంతు ! ఏమంటావ్ ?"

"ఏమిట్రా వినేదీ.... నీ తలకాయ !" అన్నా ను చిరాగ్గా - మళ్ళీ ఏ తంటా తెచ్చి పెడ్తాడో అన్న భయంతో.

'ఆ - ఏమీలేదు ! వెళ్ళేటప్పుడు సారథి నిన్నో మారు కలువమన్నాడు. అయినా వాడి పెళ్ళికివచ్చి, వాణ్ణి కలువకుండా వెళ్తే అది బావుంటుందా ? మానర్స్ అన్పించుకుంటుందా?" అన్నాడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తూ.

"సరేలే - నీ యిష్టం ! పద" అన్నాను నీరసంగా.

మరో పదినిమిషాల్లో రిక్షా - సారిథి వాళ్ళింటి ముందాగింది! పెళ్ళికి వచ్చిన వాళ్ళలో చాలామంది లోకల్ ఫ్రెండ్స్ కాబట్టి ఇంట్లో బంధువుల సందడి నేనూహించుకున్నంతగా లేదు.

అన్నయ్యా నేనూ యింటి వరండా మెట్లు ఎక్కుతూంటే లోపలి నుంచి బిగ్గరగా మాటలు వినొస్తున్నాయి.

"ఒరేయ్ సారథీ ! ఎంతకీ నీ పట్టే నీది కానీ నా మాట వినిపించుకోవేంరా ? ఆ పిల్లేమైనా నీ తోడబుట్టిన చెల్లెలా ? ఎందుకురా అన్ని వందలు తగలేసి ఆ బట్టలు తెచ్చావ్ హేమకు? మింగమెతుకు లేకున్నా మీసాలకు సంపెంగ నూనెలా ఎందుకురా

ఈ ఆర్భాటాలూ'' సారథి తల్లి కాబోలు బాధగా అంటోంది.

''ష్‌ మెల్లిగా మాట్లాడమ్మా ! నువ్వెప్పుడూ ఒకే కోణంనుంచి ఆలోచిస్తావ్‌గానీ రెండో వైపు ఆలోచించవెందుకమ్మా ? ఆ హేమ మీద ప్రేమ కారిపోయి తెచ్చాననుకున్నావా ఈ బట్టలు ? వాళ్ళనాన్న ఎవరనుకున్నావ్? మినిస్టరమ్మా మినిస్టర్ ! ఆ అమ్మాయిని ఈ రకంగా సంతృప్తి పెట్టి పంపిస్తే.... రేపు వాళ్ళ నాన్నకి రికమెండ్ చేసి నాకో మంచి జాబ్ వచ్చేట్లు చూస్తుందమ్మా ! అప్పుడు 'వొద్దు మొర్రో' అంటున్నా విన్పించుకోకుండా పెళ్ళి సెటిల్ చేశావు. ఇప్పుడు సరియైన ఉద్యోగం లేకుండా నా భార్యని ఎలా పోషించాలో చెప్పు? అయినా నీకీ విషయాలన్నీ ఆ తర్వాత చెప్తానుగానీ - నలుగురిలో కాస్త నవ్వుతూ తిరగవమ్మా- నీకు పుణ్యముంటుంది!'' బతిమాల్తున్నాడు సారథి.

అన్నయ్యా, నేనూ ఒకరి ముఖాలు మరొకరం చూసుకుని, చరచరా ఎక్కిన మెట్లుదిగి, వచ్చిన దారే పట్టాం.

ట్రెయిన్లో హైదరాబాద్ వచ్చేంత వరకూ - అన్నయ్యా నేనూ ఒక్క మాటైనా మాట్లాడుకోలేదు - అన్నయ్యలో మొన్నటికీ - ఇప్పటికీ ఎంతమార్పు ?

మొన్న అంత హుషారుగా తన ఫ్రెండ్స్ గురించి కబుర్లు చెప్పిన అన్నయ్య, కేవలం ఒకే ఒక సంఘటనతో ఎంత డీలా అయి పోయాడు?

మరి నా కెదురైన ఆ రెండో సంఘటన కూడా చెప్తే - అమ్మో! ఇంకేమైనా వుందీ? స్నేహితులందరూ ఇంతేనేమో అనే వైరాగ్యం జనించదూ వాడిలో ?

ఏదో స్టేషన్‌లో ఎవరో అబ్బాయి మా కంపార్ట్‌మెంట్ ఎక్కాడు.

అతడు మా ముందు సీట్లో కూర్చున్న అబ్బాయికేసి పలకరింపుగా నవ్వి అడిగాడు: ''ఏరా ఆనంద్ ! ఎక్కడికి వెళ్తున్నావ్?''

''ఇంకెక్కడికీ, హైద్రాబాద్‌కి!''

''ఏం పని? ఇంటర్వ్యూ కేనా ?''

''అవును ! నీకెలా తెలుసు ?''

"నీ చేతిలోవున్న సర్టిఫికెట్స్ చెప్తున్నాయిలే - అయినా నీ ఓపికకి మెచ్చుకోవాలి బ్రదర్. అయిదేళ్ళుగా హైదరాబాద్ చుట్టూ వుద్యోగం కోసం తిరుగుతూనే వున్నావు - విసుగు చెందని విక్రమార్కుడిలా ప్రయత్నం మాత్రం మానడం లేదు."

"మరేం చేయమన్నావురా ? ఇంట్లో నాపై ఆధారపడ్డవాళ్ళు అయిదుగురున్నారు. వాళ్ళు కష్టపడి నాకు చదువు చెప్పించినందుకైనా నేను బ్రతక్క తప్పదు. అక్కడికీ రాత్రుళ్ళు రిక్షా తొక్కుతూ, అంతో యింతో సంపాదిస్తున్నాను. కాని అది ఏమూలకి? ఉద్యోగానికి ఎక్కడికి వెళ్ళినా వాళ్ళు అడుగుతోంది మెరిట్‌కాదు. లంచం - లేదా- రెకమెండేషన్! రెండూ కావాలీ అనుకుంటే ఆ రెండోదాన్ని సంపాదించడానికి కూడా మళ్ళీ లంచం ! పూటకే గతిలేని నాకు ఈ రెండు రకాల లంచాలూ ఎలా ఇచ్చుకోను?"

"ఈజిట్ ? రికమెండేషన్లు కూడా లంచాలిస్తే ఇస్తున్నారా ? నాకెందుకో ఇది నమ్మశక్యం కావడం లేదు."

"అవును ! మొదట్లో నాకూ అలాగే అన్పించింది, కాని... ఎవరో ఎందుకూ ? జగన్నాథం మంత్రిలేడూ... అదే మన సాంఘిక సంక్షేమ మంత్రి. గత రెండేళ్ళుగా జరుపుతోన్న తంతు ఇదేనని మొన్నేదో ఇంటర్వ్యూలో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు కాండిడేట్స్."

క్షణం నివ్వెరపోయాను ! నా తల తిరిగి పోయింది. వాళ్ళ సంభాషణలో విన్పించిన మంత్రి ఎవరో కాదు... మానాన్న !

ఎంతో నిజాయితీపరుడిలా కన్పించే నాన్న, స్వపర భేదాల్లేకుండా అన్నయ్యకి కేవలం గుమాస్తా ఉద్యోగాన్నే ఇప్పించిన నాన్న ఆంతర్యంలో... ఇదా దాగుంది!?

రైలుకన్నా వేగంగా పరిగెడుతోంది నా మనసు. ఆవేశంతో నా మనసు కుతకుతా ఉడికిపోతోంది. త్వరగా ఇంటికి వెళ్ళాలి! వెళ్ళీ వెళ్ళగానే నాన్నను నిలదీసి ఈ అన్యాయమేమిటో అడగాలి !

ఎందుకో అప్రయత్నంగానే సారథి గుర్తొచ్చాడు ! అదేమిటో ఇప్పుడు నేను సారథిని క్షమించగలిగే దశకు చేరుకున్నానన్పించింది!

ఆలోచిస్తూంటే అప్పటివరకూ తట్టని ఓ ఊహ నాలో చటుక్కున మెరిసింది. 'అవునూ, అన్నయ్య... తన సొంత కొడుకు కాదు, తన

తమ్ముడు కొడుకు కాబట్టి, తనకు తమ్ముడంటే వున్న కక్షను నాన్న ఇలా తీర్చుకున్నాడు - అదే తన తమ్ముడు బ్రతికే వుంటే తనకు ఆశ్రిత పక్షపాతం లేదన్న పేరుకోసం తన తమ్ముడి కొడుక్కింత అన్యాయం తలపెట్టేవాడా నాన్న !?'

నాలో అంతకంతకూ అధికమవుతోన్న ఆవేశం గుండెల్ని ఎగిసెగిసి పడేలా చేస్తోంది.

"పిచ్చి హేమా ! - నువ్వు చూసిన ప్రపంచం ఇంకా తక్కువే. ఈ లోకంలో జరుగుతోన్న అన్యాయాలూ, మోసాలు, దౌర్జన్యాలను అర్థం చేసుకోవడానికైనా - నువ్విలా మధ్య మధ్య మామూలు మనషుల్లోకి వస్తూవుండాలి!" అన్నాడు అన్నయ్య నా భావాలని అర్థం చేసుకున్న వాడిలా.

అప్పుడన్పించింది నాకు... ఈ లోకంలో అంతుబట్టనిదంటూ వుంటే అది కేవలం మనిషి ఆంతర్యమనీ - అది ఆద్యంతం ప్రేమ, స్వార్థం, మోహం, కామం, జుగుప్సలతో నిండి వుంటుందనీ - ఏదీ ఎప్పుడు ఎందుకు ఎవరిపట్ల ఎలా కల్గుతుందో - ఎవరికీ అంతు పట్టదనీ!

*ఆంధ్రజ్యోతి వార పత్రిక. తేదీ: 7-3-1975.*



**1973**




"**మా** సుజ్జీ వచ్చిందండోయ్ !"

బసంత్ గుమ్మంలో అడుగెట్టాడో లేదో పరుగున వెళ్ళి. అతడి భుజాలు పట్టుకుని ఊపుతూ - పొంగి వస్తోన్న సంతోషాన్ని అదుపులో పెట్టుకుంటూ చెప్పాను.

"సుజ్జీనా, - ఎవరబ్బా ఆమె ?" ఆలోచిస్తున్నట్టుగా పెట్టిన అతడి ముఖం చూడగానే నిజం చెప్పొద్దూ, పీకల్దాకా కోపం వచ్చింది.

అతణ్ణి దూరంగా నెట్టేసి "నిజంగా - ఎంత దుర్మార్గులండీ మీరు! ప్రతి రోజూ పదిసార్లైనా మా సుజ్జీ, నా బంగారు ఫ్రెండంటూ గుర్తు

చేస్తానా ? అప్పుడే మరిచి పోయారు..... ఏమ్మనుషులు బాబూ?" అంటూ వెనక్కి తిరిగాను విసురుగా.

నా జడ పట్టుకుని తనవేపు లాక్కుంటూ, "పిచ్చిపిల్లా ! ఏదొచ్చినా పట్టలేవని నిన్నిందుకే అంటాను! ఏదో ఉడికించడానికి అలా తెలీనట్టు ముఖం పెట్టాను గానీ, నాకు సుజాత తెలీకపోవడం ఏమిటీ ?... అదృరేగానీ నీ సంబరం చూడబోతే మీ ఫ్రెండ్ గొడవలోపడి నా ఉనికినే మరిచి పోయేలా కన్పిస్తున్నావు! కనీసం అప్పుడప్పుడు ముద్దు భాగ్యానికైనా నోచుకోనిస్తావా - లేక... " పక్క రూంలోంచి సుజాత వింటోందో ఏమోనని అనుమానం వచ్చి నాలిక కర్చుకున్నాడు బసంత్.

చిన్నగా నవ్వి. "ఫర్వాలేదు. తను బాత్రూంలో వుంది" అని అభయహస్త మిచ్చాను.

మరుక్షణం నా చుట్టూచేతులు వేసి తన దగ్గరకు లాక్కుని "అయితే ఈ రాత్రి నిండుచంద్రుడి పండువెన్నెల్లో - వీడు ఒంటరిగా పడుకోక తప్పదన్నమాట! ప్చ్-ప్చ్ ! రాక రాక - చక్కటివెన్నెల చూసుకుని మరీ వచ్చింది మీ నేస్తం!" అన్నాడు బసంత్ మహా ఇదై పోతూ.

బాగయిందని నాలికతో వెక్కిరిస్తూ వంటింట్లోకి పరుగుతీశాను. డ్రెస్ మార్చుకుని మళ్ళీ నా వెనకాలే వచ్చాడు బసంత్! పీట వాల్చుకుని, నేను తరుగుతూన్న వంకాయలు తానే తరుగుతానంటూ అందుకున్నాడు.

"హయ్యో రాత ! మీకు నామీదబోల్డంత ప్రేముందన్న సంగతి సుజ్జీకీ తెలుసుగాని మీరు అలా చూస్తూ కూర్చోండి ! ఎవరూ లేనప్పుడు చేస్తే బావుంటుందిగాని సుజ్జీచూస్తే ఏమనుకుంటుందీ?" నెత్తికొట్టుకుంటూ అన్నాను.

"ఏమంటుందేమిటీ ? నిర్మల ఎంత అదృష్టవంతురాలూ - ఎంచక్కా మొగుడు వంటచేసి పెడ్తాడూ అనుకుంటుంది !"

"సర్లే సంతోషించాంగానీ ఇక దయచేయండి స్వామీ !" వస్తోన్న నవ్వు నాపుకుంటూ అట్లకాడతో బెదిరించాను.

"ప్చ్ ! ఈ రోజు కనీసం నిన్ను చూస్తూ కబుర్లు చెప్పే ప్రాప్తమైనా నాకు లేదన్నమాట ! హూ౯ ఏం చేస్తాం" - వెనక్కి తిరిగి చూస్తూ,

వెళ్ళలేక వెళ్ళాడు బసంత్.

మరో అయిదు నిమిషాలకు స్నానం చేసి వంటింట్లోకి వచ్చింది సుజ్జీ.

"ఆఫీస్ నుండి ఎన్ని గంటలకి వస్తారేమిటి... మీ ఆయన ? ఇంకా వచ్చినట్టు లేరు!" అంటూ నా చేతిలోంచి కత్తిపీట తీసుకుని కూరగాయలు తరగడం మొదలెట్టింది.

"ఇందాకే వచ్చేశారు. డ్రాయింగ్ రూంలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నారు. ఈ కూర అవనీ, తీరిగ్గా పరిచయం చేస్తాను." అంటూ కూర వండటంలో నిమగ్నమయ్యేను.

దాదాపు పదిహేనేళ్లుగా సుజ్జీ నేనూ పక్కపక్క ఇళ్లల్లోవుండి, ఒకటో క్లాసు నుండి పీ.యూ.సీ. దాకా కలిసి చదువుకున్నాం.

ఆ తర్వాత దాని పెళ్ళవడం, అది కాపురానికి విజయవాడ వెళ్ళడంతో ఇంచు మించు మేమిద్దరం మళ్ళీ కలుసుకోవడం పళ్లేదు. అయితే అడపాదడపా లెటర్స్ లో మాత్రం ఒకరి క్షేమ సమాచారాలు, ఒకరి కష్టసుఖాలు మరొకరం విచారించుకునేవాళ్ళం. నేను బి.ఏ. పాసయి రెండేళ్ళు ఇంట్లో కూర్చున్నాక - ఈ మధ్యే పెళ్ళవడంతో శ్రీవారి ఉద్యోగరీత్యా వరంగల్ నుండి నా మకాం హైదరాబాద్ మారింది. నా పెళ్ళీ - సుజ్జీ వాళ్ళ ఆడబిడ్డ పెళ్ళీ - ఒకేరోజు ఉండడంతో సుజ్జీ నా పెళ్ళికి రాలేకపోయింది.

నాకిప్పుడు అయిదో నెలని తెలిసీ అభినందనలు తెలుపుతూ - 'ఆడవాళ్ళీ సమయంలో కొత్త అందాలతో వెలిగిపోతారంటారు. మరి నువ్విప్పుడెలా వున్నావో, ఎలా నడుస్తున్నావో నాకు చూడాలని మహా ఇదిగా వుందే' అంటూ రాసింది.

అప్పటికే దాన్ని నేను చూడక ఏడేళ్ళపైనే అయింది. పైగా దాన్ని చూడాలని ఎంతో బెంగగా వుంది. అందుకని కనీసం మాకొత్త సంసారం చూసిపోవడానికైనా హైదరాబాద్ రమ్మని ఓ అర డజన్‌కి పైగా లెటర్స్ రాస్తే - ఇన్నాళ్లకి నాపై కనికరించి మా ఇంటికి వచ్చింది సుజ్జీ.

"ఈవిడ సుజాత - నా ప్రాణం !" అంటూ సుజ్జీని బసంత్‌కీ, బసంత్‌ను సుజ్జీకీ పరస్పరం పరిచయం చేశాను.

ముగ్గురం కలిసి అరగంటసేపు సరదాగా ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకున్నాం - ఎంతకీ నేనూ, బసంతే తప్ప - సుజ్జీ ఎక్కువగా మాట్లాడకపోవడం చూసి - "అదేమిటే ! వసపోసిన పిట్టల్లే వాగే నువ్వేనా ఇంత గంభీరంగా వుండటం నేర్చుకుందీ? నీ నోటి ముత్యాలను నేనేం ఏరుకోనుగానీ కాస్త మాట్లాడమ్మా" అని దాన్ని బలవంతాన మా సంభాషణలోకి లాక్కొస్తూంటే - అదేమిటో దాని పెదాలపై చిత్రమైన నవ్వొకటి లాస్యం చేయడం గమనించాను.

భోజనాలయ్యాక - కాసేపు చిన్ననాటి కబుర్లూ, సినిమా ముచ్చట్లూ అవీ ఇవీ మాట్లాడుకున్నాం ! బసంత్ ఆవలింతలు చూసి...." నిద్రొస్తోన్నట్టుంది ! పద పడుకుందాం !" అంటూ సుజ్జీని తీసుకొని గెస్ట్ రూంలో అడుగెట్టాను !

సుజాత నాకేసి ఆశ్చర్యంగా చూసి "అదేమిటి.... నువ్విక్కడ ? బావుంది. అతడు నన్ను తిట్టుకోడానికా ? వెళ్ళు - వెళ్ళు - నువ్వక్కడే పడుకో " అంటూ నిండా దుప్పటి కప్పుకుని పడుకుంది సుజ్జీ.

"మీ ఇంటికి నేనొచ్చినప్పుడు... నువ్విలాగే మీ ఆయన గదిలోకే వెళ్దువుగానీ, నన్ను మాత్రం వెళ్ళమనకే తల్లీ!" అంటూ అల్లరిగా దుప్పటి లాగేసాను. సుజ్జీ నవ్వింది!

సుజ్జీ నవ్వితే ఎంతఅందంగా వుంటుందో, అది పీయూసీ చదివే రోజుల్లో - దాని నవ్వుకోసం కాలేజీ అబ్బాయిలెంత పడిచచ్చే వాళ్ళో నాకు తెలీనిదేంకాదు.

అయితే ఈ నవ్వు ఆ నవ్వులా లేదు! ఆ నవ్వు హృదయానికి గిలిగింతలు పెట్టినట్టుగా వుంటే - ఈ నవ్వేమిటో హృదయాన్ని పిండేస్తోంది.

తన పరిస్థితుల్లో దాని బదులుగా ఇంకెవరైనా వుంటే ఈ పాటికి చచ్చి వూరుకునేవాళ్ళు !

ఏదో అదిగాబట్టి.... ఉత్తమొండి మనిషి కాబట్టి... సుజాత గురించి ఆలోచిస్తూ దాని పక్కలో దూరాను.

"ఇంతకీ శివరావు ఆరోగ్యం యిప్పుడెలా వుందో చెప్పనేలేదు ! మనిషి మీద ఏమైనా హోప్స్ వున్నాయా ?" ఎప్పట్నుంచో అడగాలనుకుంటూ, సమయం దొరక్క అడగని ప్రశ్న అడిగాను.

నవ్వింది! మళ్ళీ అదే నవ్వు, గుండెల్ని కరకరా కోసేసే నవ్వు.

"చెప్పవే ?" రెట్టించాను.

జవాబుగా తల అడ్డంగా వూపింది.

"నీ యవ్వనమిలా అడవి గాచిన వెన్నెల కావల్సిందేనా ?"

"మరేం చేయమంటావ్ ?"

"అతడికి విడాకులిచ్చెయ్యి ! ఈ కారణంతో విడాకులు కూడా తేలిగ్గానే లభి స్తాయి."

"ఇచ్చి ఏం చేయాలనీ నీ ఉద్దేశ్యం !"

"మరో పెళ్ళి చేసుకో !"

"ముందుకొచ్చే వాడెవడో చూపిస్తావా?"

"అలా అనకు సుజ్జీ ! నీకేం తక్కువ ? నీ అందాన్ని చూసి కో అంటే కోటిమంది వచ్చి నీ ముందు క్యూలో నుంచుంటారు."

"వచ్చినవాడు గతాన్ని అడగడనే నమ్మకం నీకుందా ?"

"గతాన్ని అడగడానికిందులో ఏ ముందే? నీ భర్త ఇంపోటెంటన్న సంగతీ, నువ్వింకా కన్యవేనన్న సంగతీ - తెలిసిన వాడే వస్తాడుగా."

"ఆరేళ్లు కలిసి ఒక్కింట్లోనే సంసారం చేశావుగా,ఒక్కసారేనా నిన్ను ముట్టుకోలేదా కనీసం ముద్దు అయినా పెట్టుకోలేదా అని వాడికి వచ్చే సందేహాలకి, సమాధానం చెప్పగలనా నిమ్మీ ? పిచ్చిదానా... తన భర్త తనతో తప్ప ఇంకెవర్తో  కొంచెం సరదాగా మాట్లాడినా - ఆడదే సహించలేదే... అలాంటిది ఈ మగాళ్లెంతనీ...."

"అయితే నీ సమస్యకిక పరిష్కారం లేదా ?"

మళ్లీ తల అడ్డంగా ఊపింది సుజాత.

"మరి మీ అత్తా వాళ్ళు నీకింకా పిల్లలెందుకు పుట్టట్లేదని అడగట్లేదా ?"

"ఎందుకడుగలేదూ !? అడిగారు. వాళ్ళ కోసం హాస్పిటల్‌కి వెళ్ళినట్టుగా.... వెళ్ళి.... తనలో లోపం లేదని - నాలోనే లోపం వుందని - నాకిక పిల్లలు పుట్టరని డాక్టర్ చెప్పాడని చెప్పేశాను."

"అది విని ఏమీ అన్లేదా ?"

"కొడుక్కి రెండో పెళ్లి చేద్దామనుకుంటున్నారు!"

ఎంత ఆపుకుందామన్నా నవ్వాగలేదు నాకు ! అంత బాధలోనూ నాతోపాటే శృతి కలిపింది సుజాత.

"చెయ్యనీ! ఆ రెండోదైనా వీడి బండారం బయటపెడ్తుంది. అప్పటిగ్గానీ ఆ ప్రబుద్ధుడికి బుద్ధిరాదు" అన్నాను కసిగా.

"తన అశక్తతని తలచుకుని నీ విషయంలో కనీసం సానుభూతి మాటలైనా మాట్లాడ్తాడా అతను?"

"అప్పుడు తను మరీ లోకువ అవుతానని భయంకదూ... అందుకని ఆ విషయాన్ని పట్టించుకోనట్టే వుంటాడు. తినడం, తిరగడం, నిద్రపోవడం ! ఇదీ అతని దిన చర్య" అంది సుజాత.

" అసలు నిన్ను పెళ్ళి చేసుకోవడానికి ఎన్ని గుండెలుండాలి అతడికి ? అసలే ధైర్యంతో నిన్ను పెళ్ళాడాడట"

సుజాత మాట్లాడలేదు.

"అతడి సంగతలా వుంచు ! నీ సంగతేమిటీ ? వెన్నెలనీ, వెన్నెల రాత్రుల్నీ, మల్లెపూలనీ, రోడ్లపై నవ్వుతూ తుళ్లుతూ నడిచే దంపతులనూ - చూస్తూంటే నీకే కోరికలూ కలగవా ?"

నవ్వింది సుజ్జీ.

" ఓ మాట చెప్పనా ? నువ్వెలాగూ లోకుల దృష్టిలో వివాహితవేగా - ఎవర్తోనైనా రహస్య సంబంధం పెట్టుకుని, నీకోరికలను తీర్చుకుంటే...." ఆ పైన చెప్పడానికి నాకే ఏదోలా అన్పించింది.

నవ్వింది సుజ్జీ మాట్లాడకుండా.

"ప్లీజ్ సుజ్జీ - అలా నవ్వకు! నేనీ నవ్వును భరించలేక పోతున్నాను. చిన్నప్పటి నుండి పిల్లలంటే నీకెంత ఇష్టమో మనం బొమ్మలాటలు ఆడుకున్నప్పుడల్లా - ప్లాస్టిక్ బొమ్మను పట్టుకొని నీ బిడ్డంటూ ఎంత మురిసిపోయే దానివో, నీవు మరిచిపోయినా, నేను మరిచిపోలేదు! ఏమైనా కానీ, నీకో బాబు పుడ్తేనైనా కొంత వరకు నిన్నితర ఆలోచన్లు దరిచేరవు ! కానీ... అదెలా సాధ్యం ? - అసలు వ్యక్తే ఆ విషయంలో అశక్తుడయినప్పుడు... నీ కనీసపు కోరిక ఎలా నెరవేరుతుంది." ఆవేదనగా ఏమిటేమిటో మాట్లాడాను !

"ప్రశాంత జీవితం మినహా నాకిక ఏ కోరికలూ లేవు నిమ్మీ ! ఇందులో నువ్వంత గా ఫీల్ అవ్వాల్సిందేముందో నా కర్థం కావట్లేదు! పిచ్చివెుదడ్డు ఎక్కడిదో? పడుకో - గుడ్‌నైట్!'' అంటూ కళ్లుమూసుకుంది.

నాకెంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. పక్కమీద అటూ ఇటూ పొర్లుతూ గత స్మృతుల్లో మునిగిపోయాను.

ఆ శివరావు ఎంత నరరూప రాక్షసుడు కాకపోతే పండంటి సుజ్జీ జీవితాన్ని నాశనం చేస్తాడు.

శోభనం రాత్రి సుజ్జీ గదిలోకి వెళ్ళే సరికి గుర్రుపెట్టి, నిద్రపోతూ కనిపించాడట.

ఎప్పుడో అర్ధరాత్రి మెలకువ వచ్చి కింద పడుకున్న సుజ్జీనీ లేపి - "నేను ఈ విషయంలో పూర్తిగా అశక్తుణ్ణి ! లాస్ట్ ఇయర్ సైకిల్ ప్రమాదంలో నాకీ లోపం ఏర్పడింది. ఈ విషయం అందరికీ తెలిస్తే, వాళ్ళ సానుభూతిని ఎదుర్కొనే ధైర్యం లేదని నిన్ను పెళ్ళి చేసుకున్నాను. ఈ విషయం ఎవరికైనా చెప్పావో ప్రాణం తీస్తాను" అని బెదిరించాడట.

అలాంటి పరిస్థితిని ఎదుర్కొనే ఆడపిల్లకు ఎంత గుండె నిబ్బరం కావాలో ఆలోచిస్తేనే మనసు నీరవుతుందే, అనుభవించిన సుజ్జీ ఎంత నరక యాతనకి గురయిందో !?

ఈ పెళ్ళికి కట్నమిచ్చుకోవడానికే తాతలు దిగొచ్చిన సుజాత తల్లిదండ్రులకి, కూతురికి మళ్ళీ పెళ్ళి అది చేసే స్తోమత లేక - వాళ్ళకీ సంగతి తెలిసినా కుమిలిపోవడం మినహా మరేం చేయలేక పోయారు.

శారీరకంగా అతడిలో లోపం అలా వుంచి 'పక్కింటి రమేశ్ వైపు ఎందుకు చూశావ్, ఆ పాలవాడితో అంతసేపు ఎందుకు మాట్లాడావ్- దోబీకీ బట్టలిస్తూ అంత ఆలస్యం దేనికి చేశావ్ ?' అంటూ పుట్టెడు అనుమానాలతో సుజ్జీనీ చిత్రహింస పెడ్తూ వుంటాడట!

పైగా తనమీద ఎవరికీ ఏ అనుమానమూ రాకుండా - ఇంట్లో ఎంత మంది ఉన్నా, ఎంత పెద్ద ఫంక్షన్ వున్నాసరే, తనూ తన

భార్యా సెపరేట్ రూంలో పడుకోవాల్సిందేనట!

ఆలోచిస్తూ ఆలోచిస్తూ అప్రయత్నంగానే ఎందుకో సుజ్జీ ముఖంకేసి చూశాను.

బెడ్ లైట్ డిమ్ వెలుగులో దానిముఖం అతి ప్రశాంతంగా కన్పిస్తోంది.

అంత ప్రశాంతత ఆ ముఖంలోకి ఎలా వచ్చిందో అర్థం కాలేదు. ఎంత అందంగా వుందో ఆ ముఖం ? ఇప్పుడే మగాడైనా దాన్నీ స్థితిలో చూశాడంటే ఈ అవకాశాన్ని ఛస్తే వదులుకోడు.....

అలా ఆలోచిస్తున్న నాకు హఠాత్తుగా మెరుపులాంటి ఓ ఊహతట్టి సుజ్జీని లేపి "ఈ ఒక్కనైట్ బసంత్‌తో గడుపు సుజ్జీ ! ఈ దెబ్బతో నువ్వు తల్లివైపోతే ఆ శివరావు తేలు కుట్టిన దొంగలా కుమిలిపోతాడు! వాడి కదే శిక్ష!" అంటూ దాని సమాధానం కోసం చూడకుండానే బసంత్ పడుకున్న మా బెడ్రూంలో అడుగెట్టాను.

నా పెదాల స్పర్శతో మెలకువ వచ్చిన బసంత్ చిన్నగా నవ్వుతూ "డౌన్ ! డౌన్! అమ్మగారే ఆగలేక పోయారన్నమాట ! థాంక్స్ ! "అంటూ తనవైపు లాక్కున్నారు!

నెమ్మదిగా నా ప్లాన్ సంగతి చెప్పాను, తనా పనిచేయలేనన్నారు. కన్నీళ్ళు పెట్టు కొని కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడ్డాను! చివరకు ఎంతో ఫోర్స్‌చేశాక ఒప్పుకున్నారు.

బసంత్, సుజ్జీ పడుకున్న గెస్ట్ రూంలో అడుగు పెట్టగానే అతడికి తెలీకుండా నేను బయట గడియ పెట్టాను !

లోపల... బసంత్ బోల్ట్‌వేసుకున్న శబ్దం విన్పించ లేదు.

అతడు వెళ్ళి మంచం మీద కూర్చున్న సవ్వడి విన్పించింది. సభ్యత కాదని తెలిసినా, కుతూహలాన్ని అణచుకోలేక ఊపిరి బిగబట్టి, గదిలో ఏం జరుగుతుందో విందామని తలుపుల దగ్గరే నించున్నాను.

బసంత్‌ది అసలే కండలు తిరిగిన శరీరం కాబట్టి - కదిలినప్పుడల్లా మంచం శబ్దం కావడం నాకు అనుభవమే!

ఈ పాటికి సుజ్జీ బసంత్ కౌగిట్లో కరిగిపోతూ ఉంటుంది. అతడి

విశాలమైన ఛాతీలో అది గువ్వలా ఇమిడిపోయి ఉంటుంది. బసంత్ తన పెదాలతో సుజ్జీ పెదాలనీ నొక్కిపెట్టి.... ఇక ఆపైన ఆలోచించలేక పోయాను !

ఏదో తెలీని బాధ... నన్ను తిని వేయడం మొదలెట్టింది.... అంతకు ముందు లేని ఈర్ష్యలాంటిదేదో మొలకెత్తి నేను చూస్తూండగానే ఏపుగా పెరిగి, మహావృక్షమై నుంచుంది.

నాపై బసంత్‌కున్న ప్రేమ యింతేనా ? నాముందే మరో ఆడదానితో కులికే ధైర్యం ఎలా వచ్చిందతనికి ? నేను వెళ్ళమనగానే సరేనని బుర్రూగించి వెళ్ళడమేగానీ వెనకా ముందు ఆలోచించే పనేలేదా ? అతడిలాగే నేను కూడా మరో మగాడి పక్కలోకి వెళ్తే బసంత్ సహించేవాడేనా ? - ఇలాంటి ఛాన్స్ దొరికితే ఈ మగాళ్ళంతా యింతేనేమో... ఛీ, ఏమ్మగాళ్లో బాబూ ! నమ్మక ద్రోహులు!

ఏదో బసంత్ అంటే ఏదో మగాడు కాబట్టి పోనీ... అనుకున్నా - ఈ సుజ్జీకేమైంది? తను తలుపులు తీసుకొని బయటికి వచ్చేయొచ్చుగా!

అబ్బే, అప్పుడే ఎలా వస్తుంది ? ఛీ ఛీ ! తన స్నేహితురాలి భర్త అనే ఇంగితం కూడా వుండక్కర్లా...?

ఆవేశంతో ఆపాదమస్తకం వూగిపోసాగేను !

ఇంకొక క్షణం కూడా ఇక అక్కడ నిల్చోలేకపోయాను. అప్పటికే గడియారం రెండు గంటలు కొట్టింది! బసంత్ గెస్ట్ రూంలోకి వెళ్ళి గంటపైనే అయింది. నాలో ఓపిక నశించింది. ఇక నన్ను నేను నిలదొక్కుకోలేక, భళ్ళున తలుపులు తెరిచి డోర్ ప్రక్కనే వున్న స్విచ్ వేశాను.

ఆశ్చర్యం ! గదిలో సుజ్జీ లేదు ! బసంత్ అయితే సరే సరి... ఒళ్ళెరుగకుండా గుర్రు పెట్టి నిద్రపోతున్నారు! అది కలో - నిజమో అర్థం కాలేదు. కళ్ళు నులుముకొని మరీ చూశాను! నేను చూసింది అబద్ధమేమీ కాదు.

అయితే సుజ్జీ ఏమైనట్టు ? ఎక్కడికి వెళ్ళిందో చూద్దామనీ వెనక్కితిరిగాను, వంటింట్లోంచి బయటకు వస్తూ నన్ను చూసి నవ్వింది సుజ్జీ.

ఆ నవ్వు....

ఆ నవ్వు ఇదివరకులా నా హృదయాన్ని కెలికేయలేదుగానీ, నన్నూ, నా వ్యక్తిత్వాన్నీ అపహాస్యం చేస్తూ, నన్ను ఆత్మ విమర్శ చేసుకునేలా చేసింది, ఇక తనతో మాట్లాడే ధైర్యం లేక బసంత్ పడుకున్న గదిలోకి, వెళ్ళి బోల్ట్ వేసుకుని కుమిలి కుమిలి ఏడ్చాను.

పాలావిడ కేకలకి మెలకువ వచ్చి, పాల గిన్నె తీసుకొని వీధి గుమ్మం దగ్గరికి వచ్చాను.

“రాత్రి వీధి తలుపుకి గొళ్ళెం పెట్టుకోవడం మరిచి పోయారా అమ్మగారూ, తలుపులు నెట్టగానే తెరుచుకున్నాయి” అంది పాలావిడ.

ఏదో అనుమానం వచ్చి, గాభరాగా పాల గిన్నె వాకిట్లోనే వదిలి ఒక్కుదుటున బాల్కనీలోకి వచ్చాను. అక్కడ సుజ్జీకి బదులు చిన్న స్లిప్ ఏదో గాలికి రెపరెప లాడుతోంది.

**పిచ్చి నిమ్మీ,**

రాత్రి నాకు అలా చెప్పి, నువ్వు బసంత్ దగ్గరకు నిజంగానే వెళ్ళడం చూసేసరికి- మొదట తమాషాకి అన్నావేమో అనుకున్న నా ఊహలు తారుమారయ్యేయి. నిన్ను అనుసరించి వచ్చి మీ ఇద్దరి సంభాషణ విన్న తరువాత - నా కాళ్ళూచేతులు ఆడలేదు.

వెంటనే బెడ్‌రూంకి పరుగెత్తుకు వచ్చి రెండు దుప్పట్లుతీసుకొని వంటింట్లోకి వెళ్ళి, ఆ తరువాత జరిగిన సంగతినీ, నీలో సంఘర్షణనీ గమనిస్తూనే వున్నాను! ఒక రకంగా నువ్వు చెయ్యబోయేది చెప్పావు కాబట్టి నేను రక్షించుకోగలిగి, నా పట్ల నీకున్న సద్భావాలని కూడా చెక్కు చెదరనీకుండా, కాపాడుకోగలిగేను! లేకపోతే ఏమయ్యేదో వూహిస్తేనే ఒళ్ళు జలదరిస్తోంది.

సరే - నీ ప్రశ్నలతోనే నిన్న రాత్రంతా వేధించావు కాబట్టి, అసలు నేనిక్కడకు ఎందుకు వచ్చానో, ఎలా వచ్చానో చెప్పడానికే మూడ్ లేకపోయింది. శివరావుకి తెలీకుండా వీసాకి ప్రయత్నించాను. వీసా వచ్చింది. అమెరికా వెళ్ళబోయే ముందు- నాకున్న ఒక్కగానొక్క ఆత్మీయురాలివైన నిన్ను చూసి వెళ్ళాలని - యింట్లో వాళ్ళెవ రికీ చెప్పకుండా బయల్దేరి వచ్చాను.

ఎన్నోసార్లు మీ యింటికి వద్దామని ప్రయత్నించీ, విఫలమయ్యాను కాబట్టి - నేనిక్కడుంటాననే అనుమానంతో నా ఆరా తీయడానికి ఏ క్షణాన్నైనా శివరావు యిక్కడికి రావొచ్చు ! మళ్ళీ ఆ నరకకూపంలోకి వెళ్ళే ఇచ్ఛలేక - వెళ్ళేముందు నీకు చెప్పి అసలే గిల్టీగా ఫీలవుతోన్న నిన్ను కష్టపెట్టేందుకు మనస్సొప్పక - చెప్ప కుండా వచ్చినట్లే చెప్పకుండానే వెళ్తున్నాను.

**-నీ సుజ్జీ.**

లెటర్ చదువుకుని పిచ్చి నవ్వొకటి నవ్వుకున్నాను - అదేమిటో ఈ సారి నా నవ్వు అచ్చు సుజ్జీ నవ్వులాగే అన్పించి - ఆ నవ్వు లోని అంతరార్థం బోధపడి..... పేలవమైన నవ్వొకటి మళ్ళీ నా పెదాలపై చోటుచేసుకుంది.

నా వెనుక బరువైన శ్వాసేదో విన్పించడంతో - ఉలిక్కిపడి వెనుదిరిగాను !

బసంత్! అతడి కళ్ళల్లో నీళ్ళు !


''నేను ఎలాంటివాణ్నో పరీక్షించడానికే మీరిద్దరూ కలిసి ఆ నాటకం ఆడుతున్నారనుకున్నాను! మిమ్మల్ని ఏడ్పించి, మీ ఎత్తుకు పైఎత్తు వేయాలనే ఉద్దేశంతో - నేను ఆ గదిలోకి వెళ్ళానేగానీ, నువ్వింత పిచ్చిపని చేస్తావనుకోలేదు నిర్మలా- ఏమైతే నేం రాక రాక వచ్చిన నీ ఫ్రెండ్‌ని బాగానే సత్కరించావు !'' అంటూ జీవంలేని నవ్వొకటి నవ్వాడు.

అసలే పశ్చాత్తాపం నా అణువణువూ దహించేస్తూంటే బసంత్ మాటలు కిరోసిన్ పోసినట్టయి, ఇక భరించలేక ''బసంత్'' అంటూ అతణ్ని వాటేసుకుని బావురుమన్నాను.

*'ఆంధ్రజ్యోతి' సచిత్ర వార పత్రిక*

***20-7-1973.***


# కన్నీళ్ళతో కాలక్షేపం....







1971



ఉస్మానియా విశ్వవిద్యాలయ
విద్యార్థి రచయితల సంఘం

యోగ్యతాపత్రము

1970 వ సంవత్సరములో [illegible] కళాశాలల స్థాయిలో నిర్వహించబడినటువంటి

కథానికల పోటీ


లో

ఉత్తమ కథగా ఎన్నికయిన "కన్నీళ్ళతో కాలక్షేపం" కథా రచయిత్రి :

కుమారి జి. అమృతలత గారికి యోగ్యతాపత్రము

[illegible]

# కన్నీళ్ళతో కాలక్షేపం



కాలేజీనుండి యింటికి వస్తూనే నీరసంగా పుస్తకాలు టేబుల్ పైకి గిరాటేసి, ఏనాడూ లేనిది యిల్లంతా నిశ్శబ్దం రాజ్యమేలుతున్నట్లు గమనించి, ఓ వంక ఆశ్చర్యపోతూనే, మరోవంక 'సిలోన్' ఆన్ చేశాను.

" ఉషా ! నీకీ విషయం తెలుసా ?" అంతవరకూ పేపర్ చదువుతోన్న అన్నయ్య పేపరు మడుస్తూ అడిగాడు.

" ఏ సంగతి అన్నయ్యా?" అడిగాను.

" అదేనమ్మా - మూడేళ్ళ క్రితం మనమందరం కలిసి మీ వదిన తమ్ముని పెళ్ళికి వెళ్ళాం గుర్తుందా ? అక్కడ పెళ్ళికూతురింట్లో వజ్రమాల అనే అమ్మాయి కలిసిందన్నావ్ చూడూ నీకు...."

"ఓహ్.... ఆ అమ్మాయా ? తనకి ఓ బాబటగా ఇప్పుడూ !" అన్నాను ఉత్సాహంగా.

“ ఆ - ఆవునవునూ.... కానీ...”

“ చాలా అందంగా ఉంటుంది కదన్నయ్యా - నా కెంతో నచ్చింది! చాలా మంచిది.”

“ నీ దృష్టిలో మంచివాళ్ళు కాని వాళ్ళేరి ఉషా ? నీ వయస్సున్న ఆడపిల్లలందరూ నీ దృష్టిలో మంచివాళ్ళే!”

“ ఇంతకీ నీ ఉద్దేశ్యం ఆ అమ్మాయి మంచిది కాదనా ?”

“ అబ్బబ్బ ! ఏమిటమ్మా ఇది చిన్నపిల్లలా ? - నేను చెప్పేది అదికాదు ఉషా!”

“ ఏదయినా ఏది కాకున్నా, ఆరు నూరయినా నూరు ఆరైనా ఆమె మాత్రం చాలా మంచిది”అంటూ అన్నయ్య మాటలు విన్పించుకోకుండా బాత్‌రూంలోకి నడిచి ముఖం కడుక్కోసాగేను... తర్వాత తీరిగ్గా ఫ్రెష్‌గా అన్నయ్యతో పోట్లాట పెట్టుకోవచ్చని !

మరుక్షణం మాల స్మృతులు నన్ను చుట్టుముట్టాయి....

★★★

‘కాకి ముక్కుకు దొండపండు’ ఆ జంటను చూస్తూంటే నాకా సామెత జ్ఞప్తి కొచ్చింది.

ఆ అమ్మాయి పాలరాతి విగ్రహంలా చక్కటి అవయవాల పొందికతో- స్వర్ణకాంతులీనే శరీరచ్ఛాయతో ధగధగా మెరిసి పోతూంటే, ఆమె వెనువెంటే తిరుగుతూ ముఖంలో ఏ కోశానా కళాకాంతులనేవే లేక - నల్లటి తుమ్మ మొద్దు శరీరంతో వెలవెలా బోతున్నాడు అతడు.

ఇద్దరూ బీ.ఎస్సీ సెకండియర్ చదువుతున్నారట! ఆమెకతణ్ణి పెళ్ళాట్టం ఏమాత్రం యిష్టం లేకున్నా, భారీ ఎత్తున... కట్న కానుకలు యిచ్చుకోలేని ఆమె తండ్రి - ఆమెకెంతో నచ్చచెప్పి పదివేల రూపాయల కట్నంతో వాళ్ళ పెళ్ళి జరిపించాడట !

అతని తల్లి వడ్డీలకు వడ్డీలు వసూలుచేసి దాదాపు ఓ మహారాణిలా వెలిగిపోతోందట ఆ ఊళ్లో ! ఆమె గురించి నేనడక్కుండానే తెలిసిన విషయాలు ఇవి !

మా వదిన తమ్ముని పెళ్ళిలో నాకా అమ్మాయి కలిసింది.

అంత మందిలో ఎక్కువ చదువుకున్నవాళ్ళం మేమిద్దరమే కాబట్టి అంత తొందరగా కలిసిపోయాం ! సినిమాల గురించీ, కాలేజీ గురించీ అవీ యివీ మాట్లాడుకున్నాం ! మాట్లాడుకున్న పదిహేను నిమిషాల్లో- అసాధారణమైన ఆమె తెలివితేటలు గ్రహించాను.

అదేమిటో చిన్ననాటి నుండీ నాకు పెళ్ళిళ్ళకి వెళ్లడం ఇష్టం ఉండేది కాదు. అందుకే సాధారణంగా ఎంతో క్లోజ్ ఫ్రెండ్ మ్యారేజైనా ఎటెండ్ చేయకపోయే దాన్ని ! కానీ, ఆ పెళ్ళికి వదిన ఎంతో బలవంతం చేయడం వల్ల విధిలేక వెళ్ళాను.

ఆమెని - అందమైన వాళ్ళలోనే లెక్కకట్టొచ్చు ! అతణ్ని చూస్తూంటే మాత్రం డోకు వచ్చేట్టున్నాడు !

నల్లగా ఉన్నా, తేజస్సు ఉట్టిపడే ముఖమున్న వాళ్ళుంటారు. కాని, అతనిలో ఆ రెండూ సున్నా ! భయంకరమైన కళ్ళూ, మోటు చేతులూ ! ఆ చేతులతో ఆమె అందమైన ముఖాన్ని అతడు తన వైపుకు తిప్పుకునే దృశ్యం ఊహిస్తేనే తేళ్లూ, పాములూ ఒంటినిండా పాకుతున్నాయనిపిస్తుంది ! ఆమె ఎలా భరిస్తుందో మరి?

ఎవరో చెప్పగా విన్నాను. చదువులో కూడా అతడు అంతంత మాత్రమేనని. ఫస్టియర్‌లో మూడు సార్లు తప్పేడట ! మరి గుణగణాలెలాంటివో తెలీలేదు నాకప్పట్లో ! ఆమె డిగ్రీ కంప్లీట్ చేయిస్తామనే షరతుమీద పెళ్ళవడంతో యిద్దరూ యింకా చదువుకుంటున్నారట ! ఆమె పేరు వజ్రమాల, అతని నామధేయం సుధాకర్.

'థాంక్ గాడ్, పేరైనా బావుంది !' అనుకున్నాను.

ఆమె ఎటువెళ్తే, అతనూ అటే వెళ్ళటం గమనించి: " అతనలా ఆమె వెనకాలే తిరుగుతూంటే ఆమెకు చీదరగా ఉన్నట్టుంది." వదిన కామెంట్ చేసింది.

" మరి ఉండదా ? అతనికెంత ఆమె వెంట తిరగాలని ఉన్నా అది నల్గురిలో ఎగ్జిబిట్ చేసుకోవాలా ?" అన్నాను అతని ప్రవర్తనను ఏవగించుకుంటూ.

అయినా, ఆమె అతణ్ని ఏమీ అనకుండానే - చకచకా తన

పనులు తాను చేసుకుపోతూనే ఉంది ! పెళ్ళికూతురు ఆమె ఆడబిడ్డ అవడంతో టీ, కాఫీ, జూస్ వగైరాలు చేసివ్వడంలాంటి పనుల్లో మునిగిపోయింది. మేమిద్దరం మాట్లాడు కోవడానికి అసలు టైమే దొరకలేదు. ఏ కాస్త దొరికినా, అది సుధాకరే వినియోగించుకునే వాడు!

"మీరు అదృష్టవంతులు, పెళ్ళయ్యాక్కూడా చదువుకోగల్గుతున్నారు!" అన్నాను ఏదో ఒకటి మాట్లాడాలి కదాని.

" నిజమే, కాని, చదువు సాగటం మాత్రం చాలా కష్టమండీ ! నేను నెక్స్ట్ ఇయర్ డిస్‌కంటిన్యూ చేయబోతున్నాను," అంది.

" అదేం !?" అంటూ ఆమె ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాను.

" ఆఁ ఏమీలేదండీ ! నాకే యిష్టంలేదు," అంటూ పనున్నదానిలా వెళ్ళిపోయింది.

ఆ సమయంలో ఆమెలో వ్యక్తమైన ఆ అభిమానానికి జోహార్లు అర్పించకుండా వుండలేకపోయాను.

ఆమెకి చదవాలనే తృష్ణయితే చాలా ఉంది! అతడు ఫేలౌతూ, ఈమె పాసవుతూంటే చిన్నతనమనిపించి మానేస్తోందా ? ఆమెలోని విశాల భావాలకి అలాంటి కారణాలేవీ అడ్డు రావనిపించింది. మరేమిటి ?

"సమ్‌థింగ్ ఈజ్ దేర్" అన్పించినా ఆ విషయంలో ఎక్కువగా ఊహాగానాలు చేయలేదు నేను.

సుధాకర్ ఆ రాత్రి ఆ పెళ్ళి సందట్లో కూడా బెడ్ అరెంజ్ చెయ్యమని పేచీ పెట్టాడని తెలిసి పెళ్లన్నా, సంసారమన్నా విరక్తి కలిగింది నాకు.

ఆమె, నేనూ దాదాపు మళ్ళీ కలుసుకోవటం పడలేదు. ఆ తర్వాత ఎనిమిది నెలలకి తెలిసింది - మాలకి తండ్రి పోలికలు అచ్చుగుద్దుకుని ఓ బాబు పుట్టాడనీ, నాతో చెప్పినట్టే మాల చదువు మానేసిందనీ !

ఒకసారి మాటల సందర్భంలో మాల అయిష్టంగానే కాపురం చేస్తోందని వదిన చెప్తే నాకది ఏమంత ఆశ్చర్యాన్ని కల్గించలేదు

కానీ, కారణం అడక్కుండా మాత్రం ఉండలేకపోయాను.

★★★

" మాలా ! ఓ పది రూపాయలుంటే ఇవ్వవూ ? వారం రోజుల్లో ఇచ్చేస్తా."

" నా దగ్గిర ఎక్కడుంటాయండీ ! అత్తయ్యనడగండి."

" అస్తమానం అడిగితే, ఎందుకని కస్సుమంటుంది మాలా ! ప్లీజ్ ఇవ్వవూ?"

" నా దగ్గరున్న యిరవై రూపాయలు కిందటి వారం తీసుకున్నారుగా, ఉన్నవన్నీ ఇచ్చేశాను అప్పుడే."

" మీ ఆడవాళ్ళు అలాగే చెప్తార్లే, చాలా అవసరముండి అడుగుతున్నాను మాలా!"

" ప్రతీసారిలా డబ్బుకి కటకటలాడేకంటే, ఉద్యోగం చేస్తేనేం మీరు ?"

" ఎందుకు చెయ్యాలి ? అయినా, నాకేం తక్కువుందని - ఆ ముష్టి ఉద్యోగాలు చెయ్యడానికి ?"

" మీకు ఇంట్రెస్టు లేకపోతే మానండి. నేనైనా చేస్తాను ! అలా ప్రతీదానికీ అత్తయ్య వాళ్ళమీద ఆధారపడాల్సిన అవసరముండదు."

" నీకు మాత్రం ఉద్యోగం చేయాల్సిన గతేంపట్టిందనీ ?.... నేనేమైనా, చచ్చాననుకున్నావా నువ్వు ఆఫీసులెమ్మట వూరేగడానికి? అయినా - నీకు వీడెప్పుడు ఛస్తాడా అన్నట్టుంది ! నే చావగానే, చక్కా టింగురంగా అంటూ సీతాకోకచిలుకలా ముస్తాబై కులుకుతూ ఆఫీస్‌కెళ్దామనేమో !?"

" హుఁ ! ఒకవేళ నేను ఉద్యోగమే చేయదలుచుకుంటే నేనెవర్నీ లక్ష్యపెట్టను. అందుకు మీరు బ్రతికి ఉండటం అదేమంత ఆటంకం కూడా కాదు నా దృష్టిలో! కానీ, ఏదైనా.... సామరస్యంగా, మీ అంగీకారంతోనే చేయాలని ఉంది గానీ, ఇలా బజార్లకెక్కాలని లేదు."

" అబ్బో ! మాటలు నేర్చిన కుక్కని వేటకి తీసుకెళ్తే ఇస్కో అంటే ఇస్కో అందట. బి.ఎస్సీ చదువుతూన్న ఆడదాన్ని పెళ్ళి చేసుకుంటే ఇదే తంటా ! ప్రతీదానికి ఇలా ఎదిరించి మాట్లాడ్డం చదువుకున్న

అమ్మాయి లక్షణం కాబోలు!'' హేళనగా అన్నాడు సుధాకర్.

"తార్కికంగా మాట్లాడితే, ఎదిరించి మాట్లాడ్తోందనీ, అదనీ యిదనీ లేనిపోనివి ఊహించుకుని ఆడవాళ్ళని దుయ్యబట్టడం మీ మగవాళ్ళ రివాజు కాబోలు!'' అంది మాల ఏమాత్రం తగ్గకుండానే.

"నోర్ముయ్'' అంటూ ఉగ్రరూపం దాల్చిన సుధాకర్ మాల ఆ చెంపా ఈ చెంపా వాయించి, జుట్టుపట్టి తల గోడకు అదే పనిగా బాదడం మొదలెట్టాడు.

" అమ్మా !'' అంటూ తోటకూర కాడలా తల వేలాడేసి దభేలున పడిపోయిన మాలని చూసి కొంచెం కంగారుపడినా, మరుక్షణంలోనే గబగబా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ నిర్లక్ష్యంగా బయటికి నడిచాడు సుధాకర్.

★★★

అర్ధరాత్రి పన్నెండు దాటింది.

తూలుకుంటూ యింట్లోకి అడుగు పెట్టిన సుధాకర్‌కి బెడ్‌రూంలో బాబుని తన పక్కన జేర్చుకుని గాఢంగా నిద్రబోతోన్న మాల కన్పించింది.

" మాలా !'' పిలిచాడు.

కళ్ళు విప్పలేదు మాల.

" మాలా - నిన్నే !''

అప్పటికీ మెలుకువ రాలేదు మాలకి.

విసురుగా వెళ్ళి చెయ్యిపట్టి లాగాడు సుధాకర్.

బాబుకి మెలుకువ వచ్చి, కేర్‌మన్నాడు. ఉలిక్కిపడి కళ్ళు విప్పిన మాలకి ఎదురుగా ఎర్రని కళ్ళతో, భయంకరంగా ఊగిపోతూన్న సుధాకర్ కన్పించాడు.

వణికిపోతూ లేచి నుంచుంది.

" ఏం ? భర్త వస్తాడనే చింతేమైనా ఉందా నీకు ? సుష్టుగా మెక్కి హాయిగా నిద్రపోతున్నావ్ ! వీడు ఆకలితో వస్తాడూ అన్నం

పెట్టాలనే ఇంగితముండక్కర్లా? మహారాణిలా పవ్వళించగానే సరిపోయిందనుకున్నావా ? అయినా, నీ కడుపు నిండిందిగా ! ఇక యింకొకరి సంగతి నీ కెందుకూ ? నేనన్నం తినకుండా నువ్వు తినొద్దనీ - యిలాంటి వెధవ్వేషాలేస్తే సహించేది లేదనీ - ఎన్నిసార్లు చెప్పానీకు?'' అంటూ మాల చెంప ఛెడేల్ మనిపించాడు.

తూలిపడబోయిన మాల - నిలదొక్కుకుని - కళ్ళల్లో నీళ్ళు తిరుగుతూంటే, చెంపను తడుముకుంటూ అలాగే నించుంది.

'నడూ - అన్నం పెట్టు.''

మాట్లాడకుండా వంటింట్లోకి వెళ్ళి అన్నం పెట్టింది మాల. ఏడుస్తోన్న బాబుని మరి రెండు అంటించాడు సుధాకర్.

'' వెధవ గోల ! ఇంట్లోకి రాగానే పిడుగులు మీద పడ్తోన్నట్టు ఒకటే ఏడ్పు!'' విసుక్కుంటూ వంటగదికేసి దారి తీశాడు.

చల్లగా చల్లారిపోయిన అన్నం చూడగానే మళ్ళీ రెచ్చిపోయాడు సుధాకర్.

'' ఎన్నిసార్లు చెప్పాలి నీకు, నేనొచ్చేసరికి వేడి వేడన్నం తయారుగా ఉంచాలని?''

'' పన్నెండు దాటాక యింటికి వస్తే వేడి అన్నం ఎలా దొరుకుతుందండీ ?''

'' అదంతా నా కనవసరం ! నేనింటికి వచ్చేసరికి వేడి అన్నం తయారుగా ఉంచి తీరాలి. ఇలా నా కన్నా ముందు నువ్వు అన్నం తిన్నా, నిద్రపోయినా సహించేది లేదు.''

'' నేనింకా అన్నం తినలేదు లెండి. ఎందుకు ఎగిరెగిరిపడ్తారు?''

'' చాల్లే ! ఈ బి.ఎస్సీ చదువుకుతోడు అబద్ధాలొకటా ? ఏం ఆడవాళ్లో - మమ్మల్ని చంపడానికే పుట్టారు ! ఛీ ఛీ - ఈ కొంపలో ప్రశాంతత అనేదే లేదు!'' ఆదరాబాదరాగా అన్నం తిని మంచమెక్కాడు సుధాకర్.

★★★

బాబు గుక్కపట్టి అదేపనిగా ఏడుస్తున్నాడు. నిద్రాభంగమైందేమో చర్రున కోపమొచ్చింది సుధాకర్‌కి.

" పాలు సరిగా ఇస్తేకదా - వాడేడ్వకుండా వుండేందుకు ? ఏమిటో బాధ్యత తెలీని మనిషివి!" అన్నాడు ముఖం చిటపట లాడిస్తూ.

" పాలుంటేగా యివ్వడానికి, వాడికవి సరిపోవడం లేదు. అమూల్ స్ప్రే తెమ్మంటే తీసుకొచ్చారా మరి ?"

" ఓహో ! ఇలా సరిపోవడం లేదనే ఎత్తువేస్తే ఎంచక్కా గేదెపాలు తాగించొచ్చు కదాని ఈ వేషాలేస్తున్నట్టున్నావ్ ! నీ కెప్పుడూ నీ సౌందర్యం చెడి పోతుందేమోనన్న భయం తప్ప - నీ పిల్లోడ్ని ఎలా పెంచాలా అన్న బెంగ ఏడుస్తేగా ?"

నిట్టూరుస్తూ అంది మాల: " బాధపడకండి ! నాకు అలాంటి భయాలేవీ లేవు. నా సౌందర్యం మీద నాకే ఇంటరెస్టూ లేదు ! నా పాలు బాబుకి నిజంగానే సరిపోవడంలేదని - ఉన్న విషయమే చెప్తున్నాను."

" అదే - ఎందుకు సరిపోవడంలేదని అడుగుతున్నాను !" దాదాపు గర్జిస్తున్నట్టే అడిగాడు.

" నేను తింటోన్న తిండిలో బలమైన విటమిన్స్ లేక," అసహనంగా అంది మాల.

" అంటే - నీ ఉద్దేశ్యం మేం నీకు పెడ్తూన్న తిండి కేవలం గడ్డిలాంటిదేననా?"

" చూడండీ - ప్రతిదానికి ద్వంద్వార్థాలు తీస్తే నేనేం చెప్పలేను ! అర్థరాత్రి ఏ పన్నెండింటికో వస్తారు. అంతదాకా నేను అన్నం తినొద్దు. తింటే మీక్కోపం! తినకపోతే వాడికి పాలు రావు. ఇంత చిన్న విషయం తెలుసుకోకపోగా, రోజూ ఏదో ఒక రాద్ధాంతం చేయడం సహజమైపోయింది మీకు," తనను తాను ఎంతో కంట్రోల్ చేసుకుంటూనే ఆ మాటలుచెప్పగలిగింది మాల.

" మరి ఎంతయినా నేను నీలా బి.ఎస్సీ ఫస్టియర్ మొదటిసారే పాసయ్యానా ఏమన్నానా - అలాంటి విషయాలన్నీ గ్రహించడానికి? నేనేదో మొద్దును! నువ్వంటే- బి.ఎస్సీవి. ఆ తెలివితేటలన్నీ నీకే ఉన్నాయి ! ఎప్పుడూ నీ సుపీరియార్టీ చూపించుకోవాలనే తపనే తప్ప - ఆడది నడుచుకునేట్టు నడిస్తేగా నువ్వు ?" అంటూ ముసుగు

తన్ని పడుకున్నాడు.

" సుపీరియార్టీ ! అయాం ఎగ్జిబిటింగ్ మై సుపీరియార్టీ," అంటూ పేలవంగా నవ్వుకుని, 'నయం! చెయ్యిచేసుకోలేదీ రోజు !' అనుకుంది మాల.

★★★

ఆ రోజే బాబు పుట్టిన్రోజు....

మాల ఫ్రెండ్స్ చాలామంది హైదరాబాద్ నుండీ, వరంగల్ నుండీ వచ్చారు. మాల ఫ్రెండ్ వనజ తెచ్చుకున్న నూటయాభై రూపాయల్లో- ఏభై మాయమయ్యాయి. మాలకి ఏదో అనుమానమొచ్చి అడిగింది భర్తని:

' వనజ సూట్‌కేస్‌లో ఏభైరూపాయలు కన్పించడటం లేదండీ?"

" నిజంగానా ? ఎవరు తీస్తారు ? మన పనిమనుషులంతా నమ్మకస్తులేనే! ఒకవేళ ఆమె వందే తెచ్చుకుందేమో ? లేకపోతే నలభై రూపాయలెవరు తీస్తారు చెప్పు?" అన్నాడు.

'అరే... ఏభై అంటే నలభై అంటాడేం ?" అనుకుని ఏదో అనుమానమొచ్చి వనజ దగ్గరకు వెళ్ళి: " ఏదీ, మళ్ళీ లెక్కెట్టు వనజా !" అంది.

"నలభయ్యే తక్కువ ఉన్నాయ్ మాలా ?" అంది వనజ లెక్కపెట్టడం ముగించి.

" దొంగ దొరికాడు ' అనుకుంది మాల, తను ఏభై అంటే అతను నలభై అని పొరపాటుగా అనేశాడు, ఆ పొరపాటే అతను చేసిన తప్పిదనాన్ని పట్టిచ్చింది. అణువణువూ అతని మీద అసహ్యం కలిగింది మాలకి.

అతనేం మనిషి ? పెళ్ళాం ఫ్రెండ్స్ మనీ కొట్టేసే ప్రబుద్ధుడా ?

తను మర్నాడు ఎన్నో రోజులుగా కూడబెట్టుకున్న వంద రూపాయల్లోంచి నలభై తీసి వనజ చేతిలో పెడుతూ అంది మాల: " పనిమనిషి తీసిందట వనజా - బెదిరిస్తే నిజం చెప్పింది."

'ఛ ! ఇదేం బతుకు ? మొగుడు చేసిన వెధవ పనికి ఇటు మింగలేకా కక్కలేకా అటు తన ఫ్రెండు నష్టపోవద్దనీ - అనవసరంగా

పనిమనిషి పేరు వాడుకున్నానే!' అంటూ తనను తాను తిట్టుకుంది మాల.

★★★

" బారసాలకి నా ఫ్రెండ్స్ బాబుకి ప్రెజెంట్ చేసిన బంగారపు ఉంగరాలు బీరువాలో పెట్టాను ! కన్పించటం లేదండీ !"

" ఆ - చెప్పడం మరిచేపోయాను ! నాకు చాలా అవసరమొచ్చి మొన్న అమ్మేశాను మాలా ! ఏమీ అనుకోకు,"

నిర్లక్ష్యంగా చెపుతూన్న సుధాకర్‌ని నిర్లిప్తంగా చూస్తూ అనుకుంది మాల: 'పోనీలే! నిజాయితీగానైనా చేసింది చెప్పారు'.

★★★

" అత్తయ్యా! మా అక్కయ్య నా పెళ్ళికి ప్రెజెంట్ చేసిన వెండిగ్లాసు కన్పట్టం లేదేం ?"

" ఎవరిదో తన స్నేహితుని పెళ్ళికెడ్తూ దాన్ని తీసుకెళ్లాడు సుధాకర్, నీకు చెప్పలేదా ?" అంది రమణమ్మ.

" ఆఁ ఆవునవును, చెప్పారు ! మరిచేపోయాను ఆ సంగతి," అంటూ తన గదిలోకి వచ్చి బెడ్‌మీద వాలి వెక్కివెక్కి ఏడ్చింది మాల.

అక్కయ్య ఆ వెండి గ్లాసు చేయించడానికి అష్టకష్టాలు పడి, ఎంతో ప్రేమగా తన పెళ్ళికి అది చదివిస్తే, తీరా ఇతడు దాన్ని తన ఫ్రెండ్‌కి ప్రెజెంట్ చేశాడు!

'మరీ ఇంత సంస్కార హీనుడా సుధాకర్ ! ఇలాంటివాడితోనా తను ఇన్నాళ్ళనుండీ సంసారం చేస్తోంది ? ఆ మాటకొస్తే అత్తయ్యా అంతే ! ఏదైనా పిండివంటలు చేసుకుంటే తన చాటుగా తింటుంది, ఆడబిడ్డ రెండు మూడు సార్లు మందలించినా ఆమెకా గుణం పోదే? పోనీ తన కళ్లెదుటే తనకి పెట్టకుండా తినొచ్చుగా, అలా చాటుమాటు వ్యవహారాలు ఎంత జుగుప్స కలిగిస్తాయి ? ఈ ఇంట్లో నా అని చెప్పుకునేందుకు ఉంది తన ఆడబిడ్డ సరోజ ఒక్కతే ! భగవంతుడు ఆ కొంచెమేనా మేలు చేశాడులే !' అనుకుంది మాల.

★★★

ముఖానికున్న సబ్బు కడుక్కోకుండా అలాగే ఆలోచిస్తున్న నేను ఎదురుగా ఉన్న అద్దంలో చూసుకుని క్షణకాలం సిగ్గుపడ్డాను.

ముఖం కడుక్కుని బయటికి వచ్చిన నాకు ఎవరో ఏడుస్తున్నట్టు వెక్కిళ్ళు విన్పించి, విస్మయంగా తలతిప్పి చూశాను. వంటింట్లో వదిన ఏడుస్తోంది.

" ఏమిటొదినా - ఏమైందసలు?" గాబరాగా అడిగాను.

"మాల ఎండ్రిన్ తీసుకు చచ్చిపోయిందట ఉషా !" అని బావురుమంది వదిన,

" ఏమిటి వదినా ? - నీవంటోంది నిజమేనా?"

" నిజమే ఉషా !" అంటూ ముఖాన్ని చేతుల్తో కప్పుకుంది వదిన.

అయితే, ఇందాక అన్నయ్య చెప్తానన్న సంగతి ఇదేనా ?

'భగవాన్'! ఏనాడూ దేవుని పేరెత్తని నేను మొదటిసారిగా దేవుణ్ణి తలుచుకుని రెండు చేతుల్తో నుదురు పట్టుకు కూలబడ్డాను.

ఆ తర్వాత పదిహేనురోజులూ నేను నాలో లేను. వదినా వాళ్ళింటినుండి ఏదో దూరపు చుట్టరికంతప్ప, మాలా-నేను కనీసం ఫ్రెండ్స్మైనా కాదు. ఓ రెండు రోజుల పరిచయంతోనే - ఆమె నాలో ఎంత డీప్ ఇంప్రెషన్ కల్గించకపోతే - నేనీనాడు ఆమె కోసం యింతగా బాధపడ్తాను ?

ఆమె అందమైందీ, చదువుకుందీ... తెలివైందీ, అయితే.... ఎన్ని ఉండీ ఏం లాభం ? వాటికి గుర్తింపే లేనపుడు !

" అంత సడెన్గా మాల ఎందుకీ అఘాయిత్యానికి పూనుకుందో నీకేమైనా తెలుసా వదినా ?" అడిగాను.

" ఊఁ " అంటూ చెప్పడం మొదలెట్టింది.

★ ★ ★

" నా కెలా చేసైనా సరే - డబ్బు తెచ్చివ్వు మాలా ?"

" నా దగ్గర లేవండీ ?"

" పదివేల రూపాయలిచ్చి మీ నాన్న నిన్ను నాకంటగట్టి నీ పీడ వదిలించుకోవాలని చూశాడేమో ? నా దగ్గర ఆ పప్పులేం ఉడకవు,

నిన్ను గాక యింకెవర్ని చేసుకున్నా కనీసం యిరవై వేలన్నా వచ్చేవి! ఏదో మా అమ్మ వెర్రి బాగుల్ది కాబట్టి ఒప్పుకుంది.''

'' జరిగిపోయినదానికి ఇప్పుడు నన్నేం చేయమంటారు ?''

'' ఏం చేస్తావో నాకదేం తెలీదు ! ఏదేమైనా డబ్బు తెచ్చి ఇచ్చేదాకా ఈ గుమ్మం తొక్కడానికి వీల్లేదు.''

'' ఇచ్చే కట్నం పదివేలు ఏనాడో ఇచ్చారు ! మీరిలా చీటికీ మాటికీ అడగడానికి మీరిచ్చిన సొమ్మేదీ నా మీద లేదు ! మీరు చేయించిన నగలన్నీ ఏనాడో తీసుకు పోయి అమ్ముకున్నారు ! ఇక నా వంటి మీద మీరు కట్టిన మాంగల్యం తప్ప - ఏమీలేదు.''

'' అవును. ఆ మాంగల్యమే ఇమ్మంటున్నాను. ఆ పవిత్రమైన మాంగల్యం నీలాంటి పొగరుబోతు మెడలో ఉండటానికి వీల్లేదు! నేను కట్టిన మాంగల్యం నాది నాకివ్వు ! మరో అయిదువేలిచ్చేదాకా నువ్వీ యింటిగడప తొక్కొద్దు! ఊఁ తీసివ్వు ! నాక్కోపమొస్తే నేను మనిషినే కాను ! అటు డబ్బా- ఇటు మంగళసూత్రం - ఏదైనా సరే... ఏదో ఒకటి ఇస్తావా సరి ! లేకపోతే నిన్నేం చేస్తానో నాకే తెలియదు !'' ఉన్మాదిలా ఊగిపోతూ అన్నాడు సుధాకర్.

అదిరిపోయిన మాల సుధాకర్ ముఖంలోకి తేరిపార చూసి ఏమనుకొందో ఏమో ఒక్కసారిగా పెద్దపెట్టున నవ్వింది.

'' చక్కగా చెప్పారు సుధాకర్ గారూ ! - భర్త అనగానే కలిగే తీయని తలపులు నాలో ఏనాడూ తీసుకురాలేదు మీరు ! చీటికీ - మాటికీ ఏదో రకంగా హింసిస్తూ మీ సన్నిధినే నరకతుల్యం చేశారు! కన్నె ప్రాయంలో నేనేనాడూ ఎలాంటి శక్తికి మించిన కోరికలు కోరుకోలేదు ! భార్యాభర్త లిద్దరూ కేవలం అన్యోన్యంగా ఉంటే అంతే చాలనుకున్నాను ! కాని, ఏ పూర్వజన్మ పాపఫలమో మీనుండి నేను ఎలాంటి ఆప్యాయతకీ నోచుకోలేదు ! ఇంతచేసీ... అఫ్‌కోర్స్... మీ చేతుల్తో కట్టిన మాంగల్యం నా మెడలో ఉండటానికి వీల్లేదనే నగ్నసత్యాన్ని ఇన్నాళ్ళకి మీ ద్వారా తెలుసుకోగలిగాను! లెటిట్ బీ! మానసికంగా నేనూహించుకున్న భర్త నాకేనాడో చచ్చాడు ! ఇక మిగిలింది - మీరు.... కేవలం.. కేవలం....''

'' మాలా ?'' అగ్ని కణాలు కురిపిస్తూ చూశాడు సుధాకర్.

" షటప్ ! అలా పిలవటానిక్కూడా నీకు అర్హతలేదు. ఇన్నాళ్లూ లోకానికి వెరిచి నీతో కాపురం చేశాను ! నీకూ - నాకూ ఇకనుండి ఏ సంబంధమూ లేదు. నా ఒంటిమీద చెయ్యేస్తే మర్యాద దక్కదంటున్నాను."

" ఓహ్... ఏం చేస్తావేంటీ ? " సిగరెట్ ముట్టిస్తూ అడిగాడు సుధాకర్.

" ఏదేనా చేస్తాను !"

" విడాకులిస్తావా ?" పొగవదుల్తూ తాపీగా అడిగాడు సుధాకర్.

" అవసరమొస్తే అంత పనీ చేస్తాను ! అండర్‌స్టాండింగ్ లేని సంసారం కన్నా ఆ పని వెయ్యిరెట్లు ఉత్తమం ! అందుకు అభిమానం అడ్డొస్తే ఆత్మహత్య ఉండనే వుంది."

" ఓ యబ్బో ! చస్తా చస్తా అని బెదిరించే ఆడదెప్పుడూ చావదు! అయినా ఇప్పుడు నిన్నెవడు ఆదుకుంటాడో చూస్తాను ! ఒంటిమీద చెయ్యేస్తే మర్యాద దక్కదట - మర్యాద ! ఏదీ మొదట నీకున్న మర్యాద విలువెంతుందో చూద్దాం?" అంటూ మీదమీదకి రాబోయాడు.

" సుధాకర్ !" గర్జించింది మాల.

ఇంట్లో జరుగుతోన్న రభసకి మెలుకువ వచ్చిన రమణమ్మ, సరోజా అందరూ ఆ గదిలోకి పరుగెత్తుకొచ్చారు.

" ఇదో - నువ్వు కట్టిన నీ పవిత్రమైన మాంగల్యం !"

"మాలా ! ఎంత పనిచేశావ్ మాలా ? నువ్వు - నువ్వు ఆడదానివేనా అసలు?" రెచ్చిపోయిన సుధాకర్ ఆవేశంతో ఊగిపోతూ మాలవేపు వచ్చాడు.

" ఆగండి ! దగ్గర కొస్తే ఏం చేస్తానో నాకే తెలీదు."

" ఏం చేస్తావే రాస్కెల్ ?" అంటూ మీదమీదకి రాబోయిన సుధాకర్ చెంప ఛెడేల్‌మనిపించి, మరుక్షణం పక్కనే గూట్లో అది వరకే దాచుకున్న ఎండ్రిన్ గటగటా తాగేసింది మాల.

అందరూ చూస్తుండగానే మాల శరీరం ముచ్చెమటలు పోసి నల్లగా మాడిపోయింది. ఒక్కసారిగా కెవ్వుమని కేకవేసిన మాల

కుప్పలా కూలబడి పోయింది.

సుధాకర్ ఆవేశం చల్లబడి, వాస్తవం గుర్తించి అచేతనుడయ్యాడు. 'మాల చచ్చిపోయింది, మాల చచ్చిపోయింది !! ఇది నిజమా - కలా' అని కళ్ళు నులుముకుని మరీ చూశాడు. నిజమే !

"మాలా" అంటూ బావురుమని తల్లిని వాటేసుకున్నాడు సుధాకర్.

" వదినా " అంటూ మాల శరీరంమ్మీద వాలి వెక్కి వెక్కి ఏడ్చింది సరోజ.

మాల శరీరాన్ని దహనం చేశాక ఆ బూడిదలో పొర్లాడి వెక్కి వెక్కి ఏడ్చాడట సుధాకర్.

★★★

వదిన చెప్పటం ఆపింది.

" దొంగ రాస్కెల్, పవిత్రమైన ఆ బూడిదని మలినం చేశాడు!" ఆవేశంగా అన్నాను.

మాలా ! ఆ దుర్మార్గుడు నిన్నెంత రాచి రంపాన పెట్టకపోతే రెండేళ్ళ పసికందునీ, ఎనిమిదినెలల నీ ప్రెగ్నెన్సీనీ కాదని - నువ్వీ అఘాయిత్యానికి పూనుకుంటావ్ ? నీ గురించీ, నీ బాధల గురించీ మాకు తెలిసింది అత్యల్పం. నువ్వు ఎవరికీ చెప్పకుండా దాచుకుంది అనల్పం ! అంత బాధలోనూ నువ్వు కాపాడుకున్న నీ అభిమానధనం నన్ను మరింత కదిలించి వేస్తోంది.

కేవలం ఒక గంట పరిచయంలోనే నువ్వు నాలో చెరగని ముద్రేశావే ! ఎటు చూసినా, ఏం చేసినా నాకు నువ్వే గుర్తొస్తూ, నా హృదయాన్ని కలచి వేస్తున్నావే- మూడేళ్ళు నీతో సంసారం చేసిన సుధాకర్‌కి ఏ స్మృతులు గుర్తుకు రాకపోగా- రెండో పెళ్ళికి సిద్ధపడ్డాడంటే ప్రపంచంలో ఏది శాశ్వతం అన్పిస్తోంది.

సుధాకర్ నీతో చేసింది కాపురం కాదు మాలా - నీ కన్నీటితో కాలక్షేపం ! సుధాకర్‌లా - భార్యల 'కన్నీళ్ళతో కాలక్షేపం' చేసే మొగాళ్ళకి నీ జీవితమొక కనువిప్పయితే... అవును... అయితే.... నువ్వాశించిన నీ 'కనీసపు కలలు' నిజమయేందుకు ఆస్కారం లభిస్తుంది !

కాని - ఈ దేశం పుణ్యభూమి - అది ఈ దేశంలో - ఓ పగటి కలేనేమో !?

*(రచయిత్రి : నిజామాబాద్ మహిళా కళాశాలలో బి.ఏ, (తృతీయ) వయస్సు:19, స్వస్థలం : నిజామాబాద్, చాలా కాలంగా రచనలు చేస్తున్నారు. కొన్ని సాహిత్య సంస్థలతో సంబంధం ఉంది.)*

*- విద్యార్థి సాహితి - కథాంజలి - 3 (ఎమెస్కో పాకెట్ బుక్స్) సౌజన్యంతో....*


*మే, 1971*

# మనసు ఎదగని మనుషులు....

*‘స్వాతి మాసపత్రిక - ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల సంఘం’ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల కోసం సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ.*



1971




రిక్షా ఆగీ ఆగగానే రిక్షావాలాకి డబ్బులిచ్చి అరుణని చూసీ చూడ్డంతోనే వాటేసుకోవాలనీ... వూపిరి సలపకుండా మాట్లాడాలనీ... ఏవేవో కోరికలతో ఇంట్లోకి అడుగెట్టిన నేను - ఎదుటి దృశ్యానికి విచలితే అయ్యాను.

ఉవ్వెత్తున లేస్తూ కిందపడే కడలి అలల్లా అరుణ ఎద - ఎగిసెగిసి పడ్తోంది. చక్రాల్లా తిరుగుతూ చిలిపితనానికి ప్రతిరూపాలనిపించే దాని కళ్ళలో - ఎన్నడూ చూడని నీళ్ళని చూసి - అసలేమైందో, ఎందుకేడుస్తోందో అర్థంగాక, ఏంచెయ్యాలో, ఎలా ఓదార్చాలో నాకు పాలుపోక నించుండిపోయాను

“పొద్దుటే బయల్దేరి వస్తున్నాను” అని టెలిగ్రామ్ యిచ్చినా కూడా నన్ను రిసీవ్‌చేసుకోవడానికి బస్టాండ్‌కి రాకపోతే మొదలు ఆశ్చర్యపోయినా... పోనీలే ఏం ప్రిపరేషన్స్‌లో మునిగిపోయిందో రాలేకపోయిందని సరిపెట్టుకున్నాను.

కాని.. ఇదేమిటీ ? ఇల్లంతా చిందర వందరగా వుంది. వస్తువులన్నీ వుండాల్సిన స్థలాల్లో లేవు. ఓమూల అనిల్ కాబోలు నిండా ముసుగెట్టుకొని గాఢ నిద్రలో వున్నాడు.

"అరూ" పిలిచాను.

ఉలిక్కిపడి నా వేపు చూసి, చటుక్కున కళ్ళుతుడుచుకుంది.

లేవబోతోన్న అరుణని వారిస్తూ సూట్‌కేస్ స్టూల్‌పైపెట్టి దాని మంచం దగ్గరికి వెళ్ళాను.

"తోవ తప్పి... వచ్చావా... విజ్జీ" ఎంత నవ్వుతూ మాట్లాడబోయినా... పెల్లుబికి వస్తోన్న దుఃఖం మధ్య దానికి మాటలు పెగల్లేదు.

నా టెలిగ్రామ్ అందలేదన్నట్టు గా దాని వాలకమే చెప్తోంది.

"ఏమైంది అరూ ? ఎందుకలా ఏడుస్తున్నావ్ ?" కంగారుని అణుచుకోలేక అడిగాను.

అంతవరకూ అతి కష్టమ్మీద ఆపుకున్న దాని దుఃఖం కట్టలు తెంచుకుంది. "అరే ! ఏమిటది అరూ... ఇప్పుడేమైందనీ యిలా బాధపడ్తున్నావ్ ?" అంటూ దగ్గరికి తీసుకున్నాను.

అడిగానే కాని నాకు తెలుసు, నేను ఓదార్పుగా మాట్లాడ్తే మరింత బాధపడ్తుందేగాని, ఏమీ చెప్పదనీ...! అందుకే మాట్లాడకుండా కూర్చుని దాని తల నిమురుతూ వుండిపోయాను.

నాలో అంతులేని ఆలోచనలు గజిబిజిగా అలుముకున్నాయ్.

నాకన్నా అరుణ పెద్దది ! - నేనూ, అరుణ ఓ గంటతేడాలో కవలలుగా పుట్టాం. మేము పుట్టిన మర్నాడే - గిట్టిన అమ్మని మేమే పొట్టన పెట్టుకున్నామని బంధువులంతా చిన్న చూపు చూసినా, నాన్న మమ్మల్ని పల్లెత్తు మాట అనకుండా పెంచి పెద్దజేసాడు.

అరుణా నేనూ - నిజానికి లోకం దృష్టిలో కేవలం ఒక తల్లి రక్తమాంసాలు పంచుకు పుట్టిన అక్కా చెల్లెళ్ళమే కావచ్చు ! కానీ మా యిద్దరి మధ్యా ఆ అక్కా చెల్లెళ్ళ అనుబంధం కన్నా మధురమైన బంధమేదో వుంది.

మేమిద్దరం ఒకే చోట కలిసి వుంటే అసలే చదవమని నాన్న

అరుణని తన వద్ద వరంగల్లో, నన్ను హైదరాబాద్ హాస్టల్లో వుంచేవాడు.

ఓ నెల రోజులు గడిచాయీ అంటే మా ప్రాణాలు విలవిల్లాడి పోయేవి. ఎప్పుడు ఒకర్నొకరు చూసుకుందామా... ఎప్పుడు సెలవులిస్తారా అన్న తహతహ మమ్మల్ని నిలువనిచ్చేదికాదు.

నెలా పదిహేను రోజులైందీ అంటే - ఏడ్పు మొదలెట్టేదాన్ని...! అందుకే - నాన్న అప్పుడప్పుడూ అరుణని నా వద్దకు తీసుకొచ్చి దాని ముఖం చూపించి తీసుకెళ్ళేవాడు.

సెలవులొస్తున్నాయంటే చాలు - పట్టరాని సంతోషం పొంగిపొర్లేది నాలో ! ఓ వంక పరీక్షలు రాస్తూనే మరో వంక బట్టలన్నీ సర్దుకునేదాన్ని.

సెలవుల్లో ఎంతో సరదాగా ఆడుతూపాడుతూ... తిరిగే మాకు, స్కూలు గుర్తుకు రాగానే స్కూలు ఓ చెఱసాలలా - అక్కడి టీచర్స్ - యమభటుల్లా తోచి ఎక్కడలేని భయం కలిగేది !

అలాగో - ఇలాగో, ఎలాగో కష్టపడి స్కూల్ ఫైనల్ ముగించాం.

ఇద్దరికీ క్లాసొచ్చింది. అరుణ ఆకారంలో, నా స్వరూపంలో కూడా కాలంతో పాటు మార్పులెన్నో వచ్చాయ్.

కొంచెం నలుపు వర్ణమే అయినా పెద్దపెద్ద చక్రాల్లాంటి కళ్ళతో ఆకర్షణీయంగా, కోమలంగా ఉండే రూపం అరుణది. మనిషిలాగే దాని మనసూ సున్నితమే.

పైకి లోకమంటే భయపడేదాన్లా అవుపించే అరుణ నిజానికి లోకాన్ని లెక్కచేసేది కాదు.

అయితే చూడటానికి ఎవర్నీ లెక్కచేయని మనిషిలా అవుపించినా - నేను లోకాన్ని చూసి విపరీతంగా భయపడేదాన్ని.

మగా - ఆడా తేడా లేకుండా - అందర్తో ఫ్రీగా మాట్లాడే అరుణ - మగ పిల్లల పట్ల బిడియంగా వుండే నన్ను చూసి: " మన - తప్పేంలేనపుడు ఎవర్ని చూసి... మాత్రం ఎందుకు భయపడాలి విజ్జీ ! "అనేది.

" నిష్కారణంగానే నిందలంటగడ్తూ గోరంతలు కొండంతలు చేసే మన సమాజం - మనం 'డోంట్‌కేర్'గా ఉంటే - సహించదు సరికదా - మనం వేసే ప్రతి అడుగునీ గుచ్చి గుచ్చి చూస్తుంది

అరూ !" అనేదాన్ని నేను.

" ప్రతీదీ భూతద్దంలో పెట్టి చూడకు విజ్జీ ! మనలో తప్పులేనప్పుడు నిందలు ఎవరంటగడ్తారు చెప్పు ! నిప్పులేందే పొగెలా వస్తుంది? ఎవరైనా - ఎవరి గురించైనా - చెడుగా చెప్తున్నారంటే దాన్లో కొంచెమైనా నిజం దాగి వుంటుంది" అనేది అరుణ.

" నీ మాటలూ నిజమే అరూ ! కానీ.... మగాళ్ళతో మాట్లాడ్తేనే మలినమైపోయినట్టుగా చూసే మన సమాజం కొన్నిసార్లు... మనలో తప్పులేకున్నా రాళ్ళు విసిరేస్తుంది ! అందుకే మనం లోకమంటే... లోలోపల భయపడాలి, దానికి అనుకూలంగానే నడుచుకోవాలి," చెప్పేదాన్ని నేను.

" ఏమో బాబూ ! మనమెంత పవిత్రంగా వున్నా ఈలోకం విమర్శించక మానదు! మన పవిత్రతేమిటో ఆపవిత్రతేమిటో ఆ భగవంతునికి తెలిస్తేచాలదూ!? ఈ కాకులు అరిచాయని బాధపడ్తూ కూర్చుంటే, మనమేం సాధిస్తాం చెప్పువిజ్జీ !"

" కాకులు అరుస్తాయని భయం కాదు అరూ నాకు ! కాకులు అరవడానికి మనం అవకాశం కల్పించగూడదూ అనీ"

" సర్లేవే... మన ప్రవర్తనలో లోపం ఏమీలేనపుడు ఏ కాకులు మాత్రం ఎలా అరుస్తాయి, మన పిచ్చికాక పోతే" అంటూ ఆ సంభాషణ తుంచేసేది అరుణ.

ఇలా ఓవంక మావి పరస్పర విరుద్ధ తత్వాలే అయినా, మరోవంక మా యిద్దరి మధ్యవున్న గాఢానురక్తి మాలోమాకే ఆశ్చర్యం కలిగించేది!

లోకాన్ని లెక్కచేయని అరుణ ఏనాటికేనా ఏదో ఒక సాహసం చేస్తుందని, నేనూహించినట్టే - అనిల్‌ని ప్రేమించి పెళ్ళాడింది.

అనిల్ - మా యింటి పక్కనే వున్న ప్రైమరీ స్కూల్లో టీచర్. అరుణకి స్కూల్ ఫైనల్లో లెక్కలకి ట్యూషన్ చెప్పేవాడు.

వారిద్దరి మధ్యఉన్న ఆ పరిచయం రాను రానూ ప్రణయంగా మారి ఏకంగా... పరిణయానికే దారి తీసింది.

అరుణ నిర్ణయం విని, నాన్న మండిపడ్డాడు. ఇంట్లోంచి

వెళ్ళిపొమ్మన్నాడు. చిల్లిగవ్వ ఆస్తిరాదని బెదిరించాడు. అనిల్‌ని తలదన్నే అందగాణ్ణి తీసుకొస్తానన్నాడు. అయినా అరుణ కరుగలేదు, చెక్కు చెదరలేదు. వెళ్ళి నాన్న రెండు కాళ్ళూ కళ్ళకద్దుకొంది. అంతే... వెనక్కి తిరక్కుండా గుమ్మం దాటింది.

అదే రోజు ఖమ్మంలో ఆ కొత్త దంపతుల కాపురం, ఆ మర్నాడు నా పేరిట వీలునామా... ఆ మరుసటి దినం నాన్న అంత్యక్రియలు.... యిలా ఆ మూడు రోజుల్లో జీవితం మూడు మలుపులు తిరిగింది.

నాన్న మరణానంతరం అరుణని నావద్దకే రమ్మని వుత్తరం రాశాను, ఉన్న ఆస్తేదో యిద్దరం అనుభవించి ఆనందంగా రోజులు వెళ్ళదీద్దామన్నాను.

కాని అరుణ అందుకు అంగీకరించలేదు ! ఉన్న దాంట్లోనే తృప్తిగా జీవితం వెళ్ళదీసుకుంటామంది.

వాళ్ళ కొత్త కాపురపు విశేషాలూ, అనిల్ చిలిపిపనులూ, అవీయివీ తమాషాగా మరీ మరీ చదవాలనిపించేలా - ఉత్తరాలు రాస్తూ, నా యోగ క్షేమాలు కనుక్కుంటూ వుండేది.

అయిదు నెలలు గడిచాయోలేదో, అనిల్‌కి కారు యాక్సిడెంట్లో కుడి చెయ్యి విరిగి, రెండు కళ్ళూ చితికిపోయాయి! అయినా, అరుణ కుంగిపోలేదు. నిరుత్సాహ పళ్ళేదు.

'గుడ్డివాడయితేనేం రాజాలా కూర్చుంటాడు ! నేను లేనూ నా అనిల్‌కి అండగా' అనే మొండి ధైర్యంతో ఎలాగో అక్కడే ఉద్యోగం సంపాదించుకుంది.

పెళ్ళయి ఏడాది పూర్తవలేదు. ఏడాదిలో ఎన్నో అష్టకష్టాలు పడింది. అనిల్ కళ్ళు పోయాక, రెండుసార్లు వచ్చాను అరుణ ఇంటికి. ఇది మూడోసారి! నేనింత క్రితం వచ్చినపుడు అనిల్ విషయంలో ఏమాత్రం బాధపడనిదాన్లా అవుపించిన అరుణకి - ఇంతలోనే మళ్ళీ ఏ సమస్య ముంచుకొచ్చిందని యిలా కుమిలి కుమిలి ఏడుస్తోంది!

" అరూ ! - ఏమిటది ? నీకేమైంది అరూ ? అసలేం జరిగింది? చెప్పవూ నీ బాధేమిటో?" నాలో క్షణక్షణానికి అధికమవుతున్న ఆరాటాన్ని అదుపులో పెట్టుకుంటూ అడిగాను.

" నిజం విజ్జీ - నిజం ! నువ్వన్నది అక్షరాలా నిజం!" అంటూ

ఏడ్చేసింది.

దాని మాటలేమిటో నాకేమీ బోధపడడం లేదు. నేనన్నది నిజమట ! అక్షరాలా నిజమట ! ఏమిటా నిజం ? అసలు నేనేమన్నానో నాకేం గుర్తు రాలేదు !

మంచం కిర్రుమంది. అనీల్‌కి మెలుకువ వచ్చినట్టుంది. దుప్పటి తొలగించి పిలిచాడు: " అరూ, మంచినీళ్లు !"

అరుణ లేచి కళ్ళు తుడుచుకుని కిటికీలో వున్న కూజాలోంచి నీళ్ళు వంచి, గ్లాసు అందించింది.

తాగుతూ అడిగాడు: "ఎవరదీ వచ్చిందీ ? అమ్మాయి గొంతులావుంది!"

" నేను బావా - విజ్జీని ! ఇందాకే వచ్చాను! "

" ఓహో - అలాగా ! మరి నువ్వు వస్తున్నట్లు... అరూ చెప్పలేదేం నాతో?. "

నేనెప్పుడొచ్చినా ట్యూబ్‌లైట్‌లా వెలిగే అనిల్ ముఖంలో - నేనెన్నడూ ఎరుగని ఉదాసీనతని చూసి ఓవంక విస్తుపోతూనే చెప్పాను: " నేనిచ్చిన టెలిగ్రామ్ అందలేనట్టుంది బావా ! "

"ఊఁ"అంటూ నిండా ముసుగెట్టుకు పడుకున్న అనిల్ ప్రవర్తన నాకు వింతగా అన్పించింది.

" అక్కయ్యా!" ఎక్కడి నుండో వినబడిన పిలుపుకి వెనుదిరిగి చూశాను.

గుమ్మంలో చిరునవ్వు చిందిస్తూ... చూపుల్తో తనక్కావలసిన వ్యక్తికోసం గాలిస్తూ ఓ ఇరవై ఏళ్ళబ్బాయ్ నించున్నాడు.

నేను మంచంలోంచి లేచి: "అరూ, ఎవరో వచ్చాడు చూడూ " అంటూ వంటగదికేసి నడిచాను.

లోపలినుండి అరూ టీ ట్రేతో వస్తోందల్లా ఆ వ్యక్తిని చూసి ఉలిక్కిపడినట్టుగా- క్షణకాలం టీ కప్పులు చణచణమన్నాయి.

"రా రవీ ! అక్కడే నించున్నావేం ?" అరూ పిలుపులో నీరసం... అర్థంగాని అసహాయతేదో తొంగి చూసింది.

" ఏమైంది అక్కయ్యా - అలా వున్నావ్ ? ఒంట్లో బాలేదా ?"

ఆ అబ్బాయి కంఠంలో ఆదుర్దా ధ్వనించింది.

" అబ్బే ! అదేం లేదు - బాగానే వున్నాను - కూర్చో అలా... ఆ... అన్నట్టు... మిమ్మల్ని ఒకర్నొకరికి పరిచయం చేయలేదు కదూ !" అంటూ అతణ్ణి నాకూ, నన్ను అతనికీ పరిచయం చేసింది.

అతనికి కొత్తా పాతా లేనట్టు చాలా క్లోజ్‌గా మాట్లాడి వెళ్ళిపోయాడు. మొత్తానికి అతడు సహృదయుడూ, కలుపుగోలు మనిషిలా అవుపించాడు.

" ఎలా పరిచయమయ్యాడతను ?" అడిగాను.

అనిల్‌కి యాక్సిడెంట్ ఇతని వల్లే జరిగిందనీ - అటునుంచి స్పీడ్‌గా వస్తున్న లారీ - ఇటునుంచి దూసుకు వస్తున్న ఇతడి కారూ - ఎలా తప్పుకుందామన్నా వీల్లేక పోయిందట అనిల్‌కి.

ఓ పచ్చని సంసారం తన వల్ల చితికిపోయిందని రవి వాపోని రోజు లేదట. అందుకే అప్పుడప్పుడూ వచ్చి మాట్లాడిస్తూ వుంటాడట. రవి తను వున్నంత సేపూ ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పి తెగ నవ్విస్తూ - బాధలూ, బరువులూ మరిపిస్తాట్ట ! రవే ప్రయత్నించి, వాళ్ళ నాన్న పలుకుబడితో - అరుణకి ఉద్యోగం యిప్పించాడట ! రవి వివరాలన్నీ అరుణ వంట చేస్తూ చెప్తూంటే - 'ఊఁ' కొడ్తూ విన్నాను.

ఎన్నో రోజుల తర్వాత ముగ్గురం కలిసి సరదాగా భోజనం చేశాం కదా అనే తృప్తి అయినా నాకు దక్కకుండా - అదేమిటో అరూ ఏ విషయమో ఆలోచిస్తోన్నట్లూ - పరధ్యానంగా వుంటోన్నట్టూ గమనించాను.

ఆ రాత్రి రెండు చేతుల్తో దాని ముఖం నావైపుకు తిప్పుకు అడిగాను: " అరూ- ఎందుకే నేనొచ్చేసరికి నువ్వలా ఏడుస్తూ కన్పించావ్ ? చెప్పవూ ఏమైందో ?"

"ఇది చూడూ" అంటూ ఒక ఉత్తరం నాకు అందించింది. దాన్లో అరుణకీ, రవికీ సంబంధం అంటగడ్తూ ఇక ముందైనా ఆ సంబంధాన్ని తెంచేసుకోకపోతే బ్రతుకు నవ్వులపాలు చేస్తామంటూ అసభ్యంగా రాశారెవరో.

" అయితే - ఈ మాత్రపు బెదిరింపులకే ఇలా ఏడుస్తూ

కూర్చుంటావా ? మన తప్పేం లేనపుడు ఎవరేమనుకున్నా మనకెందుకు చెప్పు ? కాకులు వెక్కిరించాయని కోకిల చిన్న బుచ్చుకుని - పాడకుండా వుండటంలో అర్థంలేదు అరూ" ఒకప్పుడు మా వాగ్వివాదంలో సాధారణంగా అరుణ అనేమాటలే నేనిప్పుడు అంటున్నానని నాకు తెలీక కాదు.

కానీ... అన్నీ తెలిసిన అరుణే, లోకాన్ని కించిత్తు కూడా లెక్కచేయని అరుణే... ఎవరో ఏదో అన్నారని ఇప్పుడెందుకిలా లోలోపలే బాధపడ్తోంది !?

"కాలేజీ ఎలెక్షన్స్‌లో తమకి పోటీగా రవి నిలబడ్తున్నాడనీ... నన్నల్లరిపెట్టబోయిన విద్యార్థిని నడిరోడ్డులో నేను అవమానించా ననీ.... రెణ్ణెల్ల కింద కసితో స్టూడెంట్స్ ప్రారంభించిన ఈ దుష్ప్రచారం క్షణాల్లో ఈ వూరంతా పాకిపోయింది. నన్ను చూడగానే ఈలలు వేస్తూ - చప్పట్లు చరిచే కొందరి అనుచిత ప్రవర్తనా... ఏగోడల మీద చూసినా నాగురించీ - రవి గురించీ రాసిన అసభ్యకరమైన రాతలూ రోడ్డెంట నేను వెళ్తోన్నప్పుడల్లా : 'ఏయ్ పతివ్రతా ! ఈ రాత్రికి మీ ఇంటికి నేను వస్తాను గానీ, రవిని ఈరోజు రావద్దని చెప్పు!' అనే మాటలూ... నన్ను చిత్రవధ చేస్తున్నాయి! రవిని చూశావ్‌గా ! 'అక్కయ్యా' అంటూ ఆప్యాయంగా నా వెను వెనుకే తిరిగే ఆ పసివాడికీ - నాకూ సంబంధం ! రవిని చూస్తూ ఆ భావన నాలో తలపుకు ఒచ్చినప్పుడల్లా నా గుండెనెవరో నొక్కేస్తున్నట్టూ నన్నే శక్తో పాతాళ లోకానికి తొక్కేస్తున్నట్టూ, ఫీలవుతున్నాను !"

" పర్సనల్ గ్రడ్జెస్‌తో - ఆ స్టూడెంట్స్ - మధ్యలో నిన్ను బలిపశువుని చేసారు. చదువుతోంది పెద్ద చదువులన్నట్టేగానీ వాళ్ళ బుద్ధులెంత చిన్నవో అర్థం కావడం లేదూ ? పోనీలే అరూ ! ఏనుగెడుతూంటే వూరకుక్కలు అలాగే మొరుగుతాయ్. మనిషిఎదిగినా 'మనసు ఎదగని మనుషులు' వీళ్లు! వీళ్ల మాటలకు బాధపట్టం దేనికీ ? నీలో నువ్విలా కుమిలి కుమిలి పోతే అసలే అంతంతమాత్రంగా వున్న నీ ఆరోగ్యం దెబ్బతింటుంది," ధైర్యాన్ని నూరిపోస్తూ అన్నాను.

" కాని - ఎంత ప్రయత్నించినా నేను మామూలు మనిషిని కాలేకపోతున్నాను విజ్జీ ! ఎలాగూ అనిల్‌కి కళ్ళు కనబడవని - నేను

అతని ముందే రవితో కులుకుతున్నానట ! ఈ మాటలు తింటోన్నా, పడుకున్నా, కూర్చున్నా, ఏ పని చేస్తున్నా... నన్ను ములుకుల్లా గుచ్చుతున్నాయి. ఇలా ఎందుకు జరిగింది ? నాలో ఏ వెకిలితనాన్ని చూసి ఈ లోకం నన్నిలా సత్కరించింది ! దీనికి ఎవర్ని నిందించను?"

జీవముడిగిన కళ్ళతో, పాలిపోయిన చెంపలతో రోజూ ఆఫీసుకి వెళ్ళివస్తోంది అరుణ.

కాని... ఏ పని చేసినా, ఎంత నవ్వించినా కూడా అన్నంటికీ దానిలో యాంత్రికత తప్ప జీవముండేది కాదు !

అప్పటికే నేను ఖమ్మం వచ్చి దాదాపు వారం రోజులయింది. ఈ వారం రోజుల్లో అరుణలో నేను ఆశించిన మార్పేదీ తీసుకురాలేక పోయాను !

ఆ మర్నాడు దిండులో తల దూర్చి: " నువ్విహ వెళ్ళిపో విజ్జీ ! ఇంకెన్నాళ్ళని ఇక్కడే ఉంటావ్ ? నన్నీ పరిస్థితుల్లో వదిలి వెళ్ళేందుకు నీకు మనసొప్పక నాదగ్గరే వుండిపోతే - రేపు ఈ సమాజం నీక్కూడా ఆ రవితో సంబంధం అంటగుడ్తుంది. అందుకే - ప్లీజ్ వెళ్ళిపో విజ్జీ! లేకపోతే నీ జీవితం కూడా నాలాగే నాశనమవుతుంది." అంది అరుణ.

" ఏమిటిది అరూ ? నిందలకు భయపడి నీ సాన్నిధ్యాన్ని దూరం చేసుకునేంత అవివేకురాల్నా నేను ? నీకు అలా వెళ్ళమనటానికి నోరెలా వచ్చిందే ? పోనీ లోకం మనిద్దరి గురించి చెప్పుకుంటే చెప్పుకోనీ ! కనీసం ఈ విషయంలో నైనా మనిద్దరం ఒకరికొకరం పరస్పరం తోడున్నాం కదా అనే తృప్తయినా నాకుంటుంది." అంటూ నచ్చచెప్పాను.

రోజూ సాయంత్రం నాల్గింటికే వచ్చే అరుణ ఈ రోజు యింకా రాలేదేమిటి చెప్మా అని తనకై ఎదురుచూస్తూ అలాగే గుమ్మంలో నించున్నాను ! మనస్సంతా అదోలా - చీకాగ్గావుంది !

అనిల్ పిలిచినట్టు విన్పించి: " పిలిచావా బావా ?" అంటూ అతని వద్దకు వెళ్ళాను.

" అవును! అలా కూర్చో విజ్జీ ! నీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి!" అన్నాడు అనిల్.

ఇన్నాళ్ళకి అనిల్ ముభావానికి నేనూహిస్తున్న కారణమే అతను చెప్పబోయే విషయానికి నాంది కావొద్దని మనసులోనే భగవంతుని ప్రార్థిస్తూ దడదడలాడ్తోన్న హృదయంతో పక్కనే వున్న కుర్చీలో కూర్చుంటూ -

"చెప్పుబావా ?" అడిగాను.

" ఏమని చెప్పాలో... అసలెలా ప్రారంభించాలో నాకర్థమవడం లేదు విజ్జీ. అయినా చెప్పకుండా వుండలేకపోతున్నాను! వారం రోజుల కిందట నువ్వు రేపొస్తావనగా - పక్కింటతనొచ్చి, అరుణా రవీ గురించి - అందరూ చెడుగా అనుకుంటున్నారనీ, అరుణని అదుపులో పెట్టుకోలేకపోతే చేజారిపోతుందనీ - ఏదేదో వాగాడు. తల వాచేలా చీవాట్లు పెట్టి పంపిచేశానుగానీ ఆలోచిస్తున్న కొద్దీ లోకులు అనుమానిస్తోన్న దానికి ఆధారం లేకపోలేదనిపిస్తోంది !" అన్నాడు అనిల్.

" బావా ? "

" నా స్థానంలో నువ్వు వుంటే నాబాధేమిటో నీకు తెలిసివచ్చేది విజ్జీ ! తనలో ఏ ఉద్దేశ్యం లేకపోతే రవి అస్తమానం ఎందుకు ఇక్కడికి వస్తాడు ? తనవల్ల ఓ నిండు జీవితం చితికి పోయిందనే జాలితో తనకు చేతనైన సాయం చేయడానికే రవి వస్తున్నాడంటే - బుద్ధివున్నవాడెవడూ అంగీకరించడు ! అదీగాక ఎందుకూ పనికిరాని నాలో - దేన్ని చూసుకుని అరుణ తన సంసారంపై ఆశలు పెంచు కుంటుంది ? తమ్ముడనే పరదా చాటున రవిని చేరదీసి తన అవసరాలన్నీ తీర్చుకోవడానికి - అరుణకి అవకాశం ఉందన్న విషయం నువ్వు కాదనగలవా ? పైగా నా భార్య లోకుల దృష్టిలో ఓ పతితగా చెలామణీ అవుతందనేది గుర్తొస్తే- నేనెంత చిత్రవధకి గురవుతున్నానో ఒకసారి ఆలోచించి - నన్నర్థం చేసుకో విజ్జీ!"

అనిల్ అరుణని అనుమానిస్తున్నాడనేది నేనూహించనిదేం కాకపోయినా, అదేమిటో అనీల్ అంటోన్న ఒక్కోమాట - నా హృదయాన్ని ఒక్కోసమ్మెట పోటై, నన్ను బాధపెట్టింది!

"అన్నీ తెలిసిన నువ్వేయిలా మాట్లాడ్డం నాకు నచ్చలేదు బావా! నీ తోటిదే తనలోకమనీ - నువ్వే తన జీవిత సర్వస్వమనీ లోకుల

నిందలు సయితం లెక్కచేయక తను బతుకుతోంది ఎవరికోసమో నీకు తెలీదా బావా ?"

" నువ్వేమన్నా అనుకో, నన్నెంత హృదయంలేని వాడిగానైనా లెక్కేసుకో ! కానీ - ఎన్ని కోణాల్లోంచి ఆలోచించి చూసినా - నా అనుమానం నిరాధారమైనది కాదనే అన్పిస్తోంది ! ఎవరైనా ఎవరి గురించైనా చెడుగా చెప్తున్నారంటే దాన్లో కొంచెమైనా నిజం దాగుండకపోదు! నిప్పులేందే పొగెలావస్తుంది విజ్జీ."

"ఛీ ఛీ" అనిల్ మీద చెప్పలేనంత అసహ్యమేసి - అతడి ముఖం చూడడానికి యిష్టంకాక, అక్కడినుండి లేచొచ్చిన నేను - అరుణ బెడ్‌రూంలో వెక్కివెక్కి ఏడుస్తుండటం చూసి అవాక్కయిపోయాను.

అయితే అరుణ... అంతా విన్నదన్నమాట! ఏది వినకూడనిదో ఏది తను వినకూడదనుకుందో అది అరుణ వినవే విన్నది !

అరుణని ఓదార్చేందుకు ధైర్యం చాలని నేను "ఏడ్వనీ... దాని హృదయంలో పేరుకున్న బాధంతా కరిగి కన్నీళ్ళరూపంలో బయట పడేదాకా ఏడ్వనీ" అని ఆ రాత్రంతా దాని దగ్గరకే వెళ్ళలేదు.

ఆ మర్నాడు - ఎంతో సంతోషంతో తను నవ్వుతూ, నన్ను నవ్విస్తూ, ఇంట్లో నవ్వుల పువ్వులు వెదజల్లింది అరుణ.

ఏ విషయం తనలోని ఈ మార్పుకి దారి తీసిందా అని ఎంత ఆలోచించినా సమాధానం దొరక్క - ఏమైతేనేం తను అన్నీ మరిచి-యిప్పుడు సంతోషంగా వుంటోంది కదా - అంతే చాలనుకుని, ఆ రాత్రి సంతృప్తిగా నిద్రపోయాను.

" అరూ ! లే ! పాలొచ్చాయ్ ! టీ పెట్టు !" ఎనిమిదైనా లేవని అరుణని కుదుపుతూ పిలిచాను. ఎలాంటి సమాధానం రాక పోవడంతో చేయిపట్టి పిలువబోయి - అంతే... కెవ్వుమన్నాను.

నాకు స్పృహ వచ్చేసరికి అరుణ కాళ్ళ మీదపడి పసిపిల్లాడిలా రోదిస్తోన్న రవీ.... కొంచెం దూరంలో నిశ్చలంగా నించున్న అనిల్ కన్పించారు.

అరుణ శవం పక్కనే నిద్ర మాత్రల సీసా, గాలికి రెప రెప లాడుతున్న లేత గులాబీ రంగు కాగితాలు కన్పించాయి.

వణుకుతోన్న చేతుల్తో ఆ కాగితాలు విప్పాను.

విజ్జీ,

ఒకనాడు కళకళ్ళాడిన బ్రతుకు మోడువారినా, చిన్ననాటి అభిప్రాయాలు తారుమారే అయినా, వాటన్నింటికీ తట్టుకుని ఎప్పటికప్పుడు నన్ను క్రుంగ దీయాలని చూసిన మనుషుల ముందు - ఆ మాత్రమైనా నిలదొక్కుకుని: 'ఎవరేమనుకున్నా ఫర్వాలేదు... నా అనిల్ నన్నర్థం చేసుకుంటే అంతే చాల'నుకున్నాను !

కాని, పాపం.... అనిల్ ఏమైనా మానవాతీతుడా ? ఆ మాటకొస్తే అతడూ ఈ సమాజంలోని వ్యక్తేగా! ఎవరి బలహీనతలు వారివి ! అందుకు ఎవర్నీ నిందించీ లాభం లేదు ! ఇంటి యజమానురాలికీ - సర్వెంట్‌కీ; పినతండ్రీ- కూతుళ్ళకీ; అత్తా - అల్లుళ్ళకీ ; వదినా - మరిదికీ ; పెళ్ళయినా భర్తతో కోరికలు తీరని అమ్మాయికీ - పక్కింటి బ్రహ్మచారికీ అక్రమ సంబంధాలు చిత్రిస్తూ.... వెలువడుతున్నాయి కొన్ని పుస్తకాలు ! అవి చదువుతోన్న యువకులు... కన్పించిన ప్రతి ఆడపిల్లా అలాంటిదేననే చులకన, ఆమె చనువుగా మాట్లాడిన ప్రతి మగాడితోనూ ఆమెకి సంబంధముందనే అనుమానం, తాము కన్ను గీటితే చాలు ప్రతి ఆడదీ తమ వళ్ళో వచ్చి పడ్తుందనే తేలిక భావాలకి లోనవుతున్నారు !

విద్యార్థుల హృదయాలను కలుషితం చేస్తూ వాళ్ళ మనసులను ఎదగనీయకుండా అర్థం పర్థం లేని కథలతో వెలువడుతోన్న సెక్స్ పుస్తకాల ప్రభావానికి వాళ్ళు రెచ్చిపోతున్నారు.

స్త్రీకీ పరాయి పురుషునికీ మధ్య ఉన్న అనుబంధానికి అర్థం కేవలం శారీరక సంబంధమే తప్ప మరే మమకారాలకీ చోటులేదు మన సమాజం దృష్టిలో.

ఇలాంటి సమాజం మారనంత వరకూ మన ఆడవాళ్ళ జీవితాలకి మోక్షం లేదు!

రవి మన పెదనాన్న కొడుగ్గానో, చిన్నాన్న కొడుగ్గానో పుట్టి, ఒకవేళ మా యిద్దరి మధ్యా - అలాంటి అక్రమసంబంధమే వున్నా - ఎలాంటి అనుమానాలూ కలగని మన సమాజపు విశాల హృదయానికి జోహార్లు అర్పించాలని వుంది! మన సమాజపు పోకడపై ఈ వ్యాఖ్య

కర్ణకఠోరమైనదే కావొచ్చు - కానీ ఇన్నాళ్ళూ నేను మోసిన నిందల కన్నా, భరించిన అపవాదులకన్నా - అదేమంత భయంకరమైంది కాదనే నా విశ్వాసం !

ఏదేమైనా మన దేశంలో ఆడపిల్లగా పుట్టడంకన్నా నికృష్టమైనదీ, దౌర్భాగ్యమైనదీ మరోటి లేదనీ - ముందు జన్మంటూ వుంటే నన్నిహ ఏజన్మలోనూ... ఆడదానిగా పుట్టించవద్దని భగవంతుని ప్రార్థిస్తూ.... నిప్పులేని చోట - పొగని వెతికే సాంప్రదాయమున్న మన సమాజంలో బతకడానికి భయమేసి కాదు - అసహ్యం కలిగి - నేనీ లోకంలోంచి తప్పుకుంటున్నాను.

**- అరుణ**

థ్యాంక్‌గాడ్ ! ఇక ఏ కాకుల అరుపులూ వినిపించని సుదూర తీరాల్లోకి అరుణ వెళ్ళిపోయిందనేది నాకిప్పుడెంతో ఆనందాన్నిస్తోంది!


అహ్హహ్హ - అహ్హహ్హ ! ఏయ్ మనుషులూ ! నావంక అలా కళ్ళప్పగించి చూస్తున్నారెందుకూ ? నా క్యారెక్టర్‌తో కూడా ఆటాడుకోవాలనా ?

ఎబ్బే, నేను పిచ్చిదాన్నని నన్నెవరూ ఆ విషయంలో పట్టించుకోరులెండి ! అదో- అలా ఆ రోడ్డెంట వెళ్తోన్న ఆ అమ్మాయి జీవితంతో చెలగాటమాడక యింకా అలాగే చూస్తున్నారేం? పాపభీతి కలుగుతోందా ? నా ముఖం ! ఆ మాటకి మీకసలు అర్థం తెలుసా?

అయినా అదేమిటీ ? నేనేమన్నానని నాపై అలా రాళ్ళు రువ్వుతున్నారు. నేనంటోన్న మాటలు మీకంత కటువుగా ధ్వనిస్తున్నాయా ? నాకు దెబ్బ తగులుతోంది. - ప్లీజ్, మీ రాళ్ళ వర్షం ఆపండీ ?......... ఆపరా ? - ఒరేయ్, నాకేం రాళ్ళు విసరడం చేత కాదనుకున్నార్రా ? ఇదిగో - ఒకటీ - రెండూ- మూడూ ! పారిపోతున్నారు.... పిరికి వెధవలు ! హి-హి-హి !

***స్వాతి మంత్లీ (మే - 1971)***

# ఆశయాలూ_ఆదర్శాలూ






**1970**

"మీరీ చీరలో చాలా బావున్నారండీ"

లీజర్ పీరియడ్లో లైబ్రరీకేసి దారితీస్తూంటే హఠాత్తుగా విన్పించిన కామెంట్‌కి వెనుదిరిగి చూశాను.

నవ్వుతూ నించున్న వినీల కన్పించింది.

"థ్యాంక్యూ" అంటూ నేనూ నవ్వాను.

వినీల నిన్ననే కొత్తగా మా క్లాసులో జాయినైన సంగతి తప్ప ఆమె గురించి నాకేమీ తెలీదు.

"చూడండి మంజులా, మీరు హాస్టల్లో వుంటున్నారని విన్నాను. నేను కూడా రేపు జాయినవుదామనుకుంటున్నాను. మరి వివరాలవీ తెలుసుకోవాలి కదా..." అంటూ అర్ధోక్తిలో ఆగిపోయింది.

"ఆఫీసులో హాస్టల్ రూల్సూ రెగ్యులేషన్స్‌కి సంబంధించిన బుక్‌లెట్ ఇస్తారు. అందులో మీక్కావల్సినవన్నీ వుంటాయి" చెప్పాను.

"అలాగా ! చాలా థ్యాంక్స్" అంటూ హడావిడిగా వెళ్ళిపోయింది.

'మొత్తానికి చాలా కలుపుగోలు పిల్ల' అనుకున్నాను.

అదీ మా పరిచయం!

వినీల హాస్టల్ కొచ్చేసింది. విశేషించి తను నా రూమ్మేట్. రోజులు జాలీగా గడుస్తున్నాయ్. ఇద్దరిమధ్యా అరమరికలనేవే లేనంత సన్నిహితమయ్యాం. కాలేజీకి యిద్దరం కలిసే వెళ్ళి వచ్చేవాళ్ళం. చాలామంది అమ్మాయిలకి ఈర్ష్య కల్గించేంత యిదిగా మా స్నేహం గట్టిపడింది.

ఆ రోజు కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ నైనందువల్ల నాకు వేరే పనులుండటంతో - వినీలని హాస్టల్‌కి పొమ్మని చెప్పి, చాలా ఆలస్యంగా వచ్చాను హాస్టల్‌కి.

"నీలూ... ఏమైందసలు ? కళ్ళన్నీ ఎఱ్ఱబడ్డాయేం?" కాలేజీ నుండి వస్తూనే వినీల అవతారాన్ని చూసి కంగారుగా అడిగాను.

వినీల మాట్లాడకుండా నా ఉనికే గమనించనిదానిలా ఎటో చూస్తోంది.

"చెప్పు నీలూ - ఏమైందో ?"

"ఏమవలేదు మంజూ" నవ్వడానికి ప్రయత్నిస్తూ అంది వినీల.

"నీకంత చెప్పాలని లేకపోతే చెప్పకు, అంతేగాని నిజాన్ని మభ్యపెట్టేందుకు ఏదో ఒకటి చెప్పి మన మధ్యఉన్న అండర్ స్టాండింగ్‌ని చిన్నబుచ్చకు నీలూ" అంటూ బెడ్‌పై వాలి పోయాను.

" నాపై కోపమొచ్చిందా మంజూ" అంటూ నా బెడ్‌మీద కూర్చుంది వినీల.

"అబ్బే... ముద్దొచ్చింది!"

"అలాగా... అబ్బ, ఎంత అదృష్టం! అయాం రెడీ ! ఇవ్వుమరీ!"

"మాట్లాడితే ఇదొకటీ... కొంటెమాటలూ, కుళ్ళుజోకులూ"

"అయితే ఈసారి నీకు నిజంగానే కోపమొచ్చిందన్నమాట. నేనేదో ఎప్పటిలా ఉత్తుత్తి కోపమే వస్తుంది కదా అని చెప్పలేదుగానీ - నీకిలా నిజంగానే కోపం వస్తుందని తెలిస్తే తప్పకుండా చెప్పేదాన్ని! నిజం మంజూ, నాతలకాయతోడు!"

నాకు వస్తోన్న నవ్వు నిగ్రహించుకోవడానికి ముత్తాతలు దిగొచ్చారు.

బెట్టు సడలనీకుండా ముఖం గోడవేపు తిప్పుకున్నాను.

"ఓడిపోయావ్ మంజూ... పైకి నవ్వకున్నా లోలోపల నవ్వుతూనే వున్నావ్...!"

అప్పటికీ మాట్లాడలేదు నేను.

"చూడు మంజూ... చిన్న విషయాలకే తట్టుకోలేనంత సున్నితం నా మనసు. మా క్లాస్‌లో ఈరోజు ఓ సంఘటన జరిగింది....."

ఒక క్షణమాగి మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

"షీలా నేనూ సైకాలజీ గ్రూప్‌లో వున్నాం కదూ, ఈ సారి సైకాలజీ టెస్ట్‌లో షీలకి చాలా తక్కువ మార్కులు వచ్చాయి. ఆ మధ్య ఆమె ఆరోగ్యం బాగాలేక ఎగ్జామ్స్ సరిగా రాయలేక పోయింది. మేడమ్ అదోలా మాట్లాడారు. కేవలం ఫ్యాషన్స్ కొరకే ఆమె కాలేజీకి వస్తోందట! షీలకేమో గాని, నాకే తల కొట్టేసినట్టుగా ఫీలయ్యాను. 'షీలా, మరో సారి ఇలా చేయకూడదు!' అని సున్నితంగా మంద లిస్తే తన పనికి తనే సిగ్గుపడి మరోసారి బాగా చదవడానికి ప్రయత్నం చేసేది కదా. ఆమెనలా అవమానిస్తే వచ్చేదేదీ లేకపోగా ఆమె నొచ్చుకోదా ?"

"అ అవమానం గుర్తొచ్చినప్పుడల్లా ఆమెకి ప్రతీ పరీక్ష బాగా రాయాలనే పట్టుదల కల్గుతుంది ! ఇందులో బాధ పడాల్సిందే ముంది నీలూ ?"

"షీలా స్థానంలో నిన్నూహించుకుని ఆ మాటలను మంజూ... ఏ పిల్లకయినా కావల్సింది ప్రోత్సాహం. ప్రోత్సహించకున్నా - కనీసం డిస్కరేజ్ చేయకపోతే చాలు! లోకంలో అందరూ తెలివైనవాళ్ళే వుండరు. క్లాస్‌లో అందరికన్నా తను తెలివి తక్కువదేమోనన్న ఇన్‌ఫీరియార్టీ కాంప్లెక్స్ - ప్రతిక్షణం, ప్రతి నిముషం ఆమెని భయపెట్టి ఆమె పతనానికే దారి తీస్తుంది."

ప్రతి వ్యక్తి బాధలన్నీ వినీల బాధలేనేమో? అందరిగురించీ ఆలోచిస్తుంది. ఆ పిల్ల ఎప్పుడూ అలాంటి ఆలోచనల్లతోనే కాలం గడుపుతుంది.

అయితే అందరి ఆడపిల్లల్లా ఆమె ఆలోచనలు అర్థరహితమై నవీ... పనికి మాలినవి కావు. ఆమె భావాల్లో, ఆలోచనల్లో ఆమె విశాల దృక్పథం, ఉత్తమ అభిరుచులూ, ఉదాత్త లక్షణాలూ తొంగి

చూస్తూనే ఉంటాయి.

అందుకే వినీలంటే అంత ఇష్టం నాకు.

★★★

ఆ రోజు కాలేజీడే. రంగురంగుల చీరలతో ముస్తాబై కొండంత ఉత్సాహంగా కాలేజీ గ్రౌండ్స్‌లో తిరుగుతున్నారు విద్యార్థినులు.

తెలుగు డ్రామా ప్రదర్శిస్తున్నారు. ఆ డ్రామా గురించి వినీల కామెంట్స్ చేస్తూంటే నవ్వలేక కడుపు చేత్తో పట్టుకున్నాం నేనూ షీలా.

మా పక్కనున్న చేర్‌లోని అమ్మాయి మరో అమ్మాయిని అడుగుతోంది:

"అరుణా- ఈ చీర బావుందే! ఎక్కడ కొన్నావ్ ? ఎంతకే ? అబ్బ, నీకు అన్నీ మంచి చీరలే దొరుకుతాయి!"

"ఇక్కడే, ప్రకాశ్ క్లాథ్ ఎంపోరియంలో!" అందా అమ్మాయి గర్వంగా.

'ఈ రింగ్స్ బావున్నాయ్ - నీవేనా - మీ అక్కయ్యవా? - ఏమిటివీ - ఇలావున్నా యి? గోల్డువి కావా - రోల్డుగోల్డ్‌వా ?'

"నావేనే - రోల్డ్‌గోల్డ్ పెట్టుకునే ఖర్మ నాకేమిటే ?" అందా అమ్మాయి చిన్న బుచ్చుకుంటూ.

వినీలా నేనూ అనుకోకుండానే ఒకరి ముఖాలు మరొకరు చూసుకుని ఫక్కుమనబోయి సభ్యతగా వుండదని ముసిముసిగా నవ్వుకున్నాం.

కల్చరల్ ప్రోగ్రామ్సు అయ్యాక హాస్టల్ కొచ్చాం.

"ఎంత చదువుకుంటున్నా... ఎన్ని తెలివి తేటలున్నా... మన ఆడవాళ్ళు కొన్ని విషయాల్లో ఎంతకీ మారరు మంజూ"

"ఎవర్నో ఒకర్ని దుయ్యబట్టంది - నీకు నిద్రే పట్టదుగా - ఊఁ చెప్పూ" అన్నాను నవ్వుతూ.

"అదికాదే మంజూ! మన ఆడాళ్ళకి చీరలూ నగల విషయం తప్ప మాట్లాడేందుకేమీ దొరకవా ? నాకొకటి మరీ చిత్రంగా అన్పిస్తుంది మంజూ - ఎంత కొత్త వాళ్ళనయినా సరే అంత

నిస్సంకోచంగా చీరల విషయం ఎలా అడగ్గల్గుతారీ ఆడవాళ్ళనీ" అంది వినీల.

'ఆరోజు నన్ను చూడగానే మీరీ చీరలో చాలా బావున్నారండీ అన్నావే - మరి నీ సంగతేమిటి ?' అడిగాను.

'కామెంట్స్ చేయడం వేరూ ఇదివేరూ మంజూ! ఒకరు అందంగా వుంటే మెచ్చుకోవడంలో తప్పేమీలేదు. అయినా నేనేమన్నానూ ? మీరీచీరలో బావున్నారండీ - అన్నానా ? ఈ చీర బావుంది - ఎక్కడ కొన్నారండీ, ఎంతక్కొన్నారండీ అన్నానా?"

'ఇంతకీ నీ వుద్దేశం ?'

"ఉద్దేశానికేముంది మంజూ - మనం కొన్ని ఇలాంటి సిల్లీ అలవాట్లు మానుకోవాలి. ప్రగతి సాధించాలని లెక్చర్స్ దంచుతామా? తీరా మన కబుర్లు ఇంకా చీరలను దాటనంటాయి. చీరలు ప్రాణమైతే, నగలు వూపిర్లా వున్నాయి... మన ఆడవాళ్ళకి. అంతెందుకూ ? మా ఊళ్ళో ఒకమ్మాయివుంది. ఎన్నో నెలల తర్వాత వాళ్ళక్క అత్తారింటినుండి వస్తే ఆమె మొట్ట మొదట వేసేది కుశల ప్రశ్నలు కాదు, 'అబ్బ, ఈచీరెంత బావుందే! ఏ చీరంటారుదీన్ని ? ఎవరు కొనిచ్చారు ?' ఇక వాళ్ళక్క మనఃస్థితి నూహించు! 'దీనికి నేనొచ్చిన సంతోషంకన్నా ఈ చీరమీదే మోజు ఎక్కువున్నట్టుందే' అని బాధ పడ్తుంది"

వినీల మాటల్లో నిజం లేకపోలేదు. ఆ చెల్లెలు కాస్త ఓపిక పడ్తే, ఆ చీర పేరేమిటో, ఎంతక్కొన్నారో ఏ షాప్‌లోకొన్నారో, ఎవరు కొన్నారో, ఎవరు కొనిచ్చారో ఆ తర్వాత వాళ్ళక్కయ్యే చెప్తుందిగా అన్పించింది నాకు.

"పరిచయం ఆయీ అవగానే ఒకరి చీరెలు మరొకరు కట్టుకునేంత క్లోజ్ అయిపోవడం - ఏ కొంచెం మనస్పర్థలు వచ్చినా ఒకర్నొకరు దుమ్మెత్తిపోసుకుంటూ ఆగర్భ శత్రువుల్లా వ్యవహరించడం, ఏ సినిమాలో ఏ హీరోయిన్ ఏ నగ పెట్టిందో - ఎలాంటి చీర కట్టిందో - అది బావుందో లేదో, అలాంటి చీర ఏ షాప్‌లో దొరుకుతుందో- ఇక ఎప్పుడేనా తనకు తక్కువ మార్కులు వస్తే లెక్చరర్ పక్షపాతం చూపారనో - తెలుగు మీడియం చదివిన అమ్మాయికి ఫస్ట్‌రాంక్

వస్తే కాపీ చేసిందేమో లేకపోతే అన్ని మార్క్స్ ఎలా వస్తాయనో - ఇవీ మన కబుర్లు'' చెప్పడం ఆపింది వినీల.

నామట్టుకు నాకన్పించింది: 'వినీలలాంటి అమ్మాయిలు నూటికి ఇరవై మంది ఉన్నా చాలు.... ఆ కాలేజీ పిల్లలందరూ జీవితంలో పైకి వస్తారు!'

★★★

'మన ప్రవర్తన సాధ్యమైనంతవరకూ ఎదుటి వాళ్ళని రంజింప చేసేదిగా వుండా లేగానీ బాధకల్గించేలా వుండకూడదు. మన సన్నిధి ఒకరికి చందమామలా చల్లదనాన్ని కల్గించాలే గానీ నిప్పుల కుంపటిలా దుర్భరంగా అన్పించకూడదు. మన మాటలతో, చేతలతో ఎదుటివాళ్ళని మురిపించి, వాళ్ళ బాధలని మరిపింప జేసేలా వుండాలి - అందుకు సదా మనం నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ-ప్రపంచంలోని ఆనందమంతా ఇంకెక్కడోలేదు - మన చెంతే వున్నట్టు ప్రవర్తించాలి' ఇవీ వినీల అభిప్రాయాలు.

కాలేజీలో అయినా - మరెక్కడో అయినా అలా ఎంతమంది వుంటారు ? మాట్లాడ్తేనే నోటి ముత్యాలు రాలిపోతాయేమో అనేలా కొందరుంటే, 'ఇంత నాసిరకపు చీరలు కట్టే నాంచారమ్మతో మాట్లాడేదేమిటీ నా తలకాయ' అనుకునే వాళ్ళు మరికొంతమంది. తామేం మాట్లాడుతున్నారో తెలీకుండా బడబడా వాగుతూ ఒకరిని విమర్శించడమే పనిగా పెట్టుకునే వాళ్ళు ఇంకొందరు.

★★★

ఆ రోజు ఆదివారం, హాస్టలర్స్ అందరికీ విజిటర్స్ వచ్చి వెళ్తున్నారు. వినీలకి అమ్మా నాన్నా తప్ప తోబుట్టువులెవరూ లేరు. ఉన్న అమ్మా నాన్నా కూడా ఎప్పుడూ వచ్చిన పాపాన పోరు. ఎప్పుడేనా వినీలలో విచారం గూడుగట్టుకొందీ అంటే అది - ప్రతి ఆదివారం సాయంత్రం సమయంలోనే...

అందరికీ విజిటర్స్ వస్తూంటే కిటికీ లోంచి గేట్‌వైపు వచ్చీపోయే వాళ్ళను చూస్తూ అదోలా వుండేది. ఆ దృశ్యం నా హృదయాన్ని కెలికేది. అందుకే వినీలకి మా అన్నయ్యని పరిచయం చేశాను.

అన్నయ్య వస్తే అరగంటపాటు ముగ్గురం కలసి కబుర్లు చెప్పుకునేవాళ్ళం. సాధారణంగా మా కబుర్లు చొప్పదంటువి కాకుండా ఏదో ఒక సమస్య గురించి ఆర్గ్యూ చేసేవే !

ఎప్పటిలా ఎక్కువసేపు వెయిట్ చెయ్యకుండానే అన్నయ్య వచ్చాడు. అవీ ఇవీ ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాక మా సంభాషణ పెళ్ళిల్లూ, కట్నాల మీదికి మళ్ళింది.

'అన్నట్టు షీలాకి పెళ్ళయిందన్న సంగతి నీకు తెలుసా మంజూ?' అంది హఠాత్తుగా వినీల నావేపు చూస్తూ.....

'అరే, నిజంగానా !' ఆశ్చర్యపోతూ అడిగాను.

'నిన్నా మొన్నటిదాకా నాకూ తెలీదనుకో. కాని నిన్న తనంతట తనే చెప్తే నీలాగే నేనూ ఆశ్చర్యపోయాను. షీలా వాళ్ళు చాలా బీదవాళ్ళన్న సంగతి నీకు తెలిసిందేగా, ఒప్పుకున్నంత కట్నం ఇవ్వలేదనీ - అందరికీ స్కూటర్లున్నాయి తనకి లేదనీ రోజూ రాచి రంపాన పెట్టి... చివరకు దాని క్యారెక్టర్ బాగా లేదనే నెపంతో పుట్టింటికి పంపించాడట ! వాళ్ళ పుట్టింట్లో ఇంకా పెళ్ళికావల్సిన వాళ్ళు ఐదుగురు ఆడపిల్లలు! వాళ్ళ నాన్న చేస్తోంది గుమాస్తా వుద్యోగం... ఇప్పుడు వాళ్ళ నాన్న ఓ స్కూటర్ తన అల్లుడిగారికి కొనిస్తే... అతని అనుమానం గాలికెగిరిపోయి, ఆ మరుక్షణం షీల ఓ పతివ్రతే అవుతందతనికి! అబ్బ, ఏం మగాళ్ళు బాబూ వీళ్ళూ' అంటూ ఓరగా అన్నయ్య వంక చూసింది వినీల.

అన్నయ్య తన ఎడంచేతి వేళ్ళపై కుడిచేతి వేళ్ళతో చిటికెలు వేస్తూ, కిటికీలోంచి బయటికి చూస్తూ కనిపించాడు.

'ఇంకో విషయం చెప్పనా మంజూ - షీల డైవర్స్ తీసుకుందట! ఆమె చెల్లెలి భర్త కూడా తన చదువుకోసం డబ్బులిమ్మంటే ఇవ్వలేదని భార్యని పుట్టింటికి తరిమేశాడట. తన చదువుకోసం భార్యపై ఆధారపడే ఈ మగాడి వ్యక్తిత్వాన్ని ఊహించు! తన కాళ్ళపై తను నిలబడాలనే పట్టుదలతో... చదువుకుంటే ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోదా - అని ఓ పక్క ట్యూషన్ చెప్తూ షీలా మన కాలేజీలో చదువుకుంటూంటే, ఇక అక్షరమ్ముక్క రాని షీలా చెల్లెలి సమస్య-ఆమె ఆత్మహత్యతోగాని పరిష్కారం కాలేదు'

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు అన్నయ్య. స్వతహా జాలి గుండె గల అన్నయ్య కళ్ళలో సుళ్ళు తిరుగుతోన్న నీళ్ళని స్పష్టంగా చూసాను.

'నిజమేనండీ ! మీరు చెప్తోంటే ఈ కట్నాలనే బూజు పట్టిన ఆచారానికి ఎన్నో నిండు జీవితాలు బలై పోతున్నాయి!" అన్నాడు.

"కేవలం సానుభూతి కాదండీ కావల్సింది! మీ మగాళ్ళలో మార్పు! ఎంతో పెద్ద పెద్ద చదువులు చదివిన మగాళ్ళు కూడా ఈ కట్నాల వేలం పాటలో ఏ ఆడపిల్ల ఎంత ఎక్కువ ధర పాడితే ఆ అమ్మాయి మెళ్ళో తాళి కడ్తున్నారు. అబ్బ, తలుచుకుంటే జుగుప్సగా అన్పించడంలేదూ..... అదీ గాక....."

ఆవేశంగా మాట్లాడుతోన్న వినీలని చూస్తూ నవ్వుతూ అన్నాడు అన్నయ్య:

"న్యాయాన్యాయాల సంగతలా వుంచండి, మీవాదనా పటిమ చూస్తూంటే భవిష్యత్‌లో లాయర్‌గా తప్పకుండా రాణిస్తారనిపిస్తోంది"

విజిటర్స్‌ని ఇక దయచేయొచ్చన్నట్టు ఆరు గంటలు కొట్టింది హాస్టల్ క్లాక్.

"మరి నే వెళ్ళొస్తా" నంటూ గేట్‌దాటి వెళ్ళి పోతోన్న అన్నయ్య వంక చూస్తూ అలాగే కూర్చున్నాం - నేనూ వినీలా.

ఓ ఐదు నిమిషాలు గడిచాయి. అందాకా వాళ్ళిద్దరి సంభాషణలో కేవలం ఓ శ్రోతగా మిగిలి పోయిన నేను 'అయితే నువ్వు కట్నం తీసుకోనివాణ్ణే పెళ్ళాడ్తావా నీలూ?' అడిగాను.

"అన్నట్టేగా....'

"అందుకు ఏ మగాడూ ముందుకు రాకపోతే..."

'అలాగే ఉండిపోతాను'

'నువ్వున్నది ఏ దేశంలో అన్న సంగతి మరిచి పోతున్నావ్ నీలూ. పెళ్ళి చేసుకోకుండా ఇంట్లో కూర్చున్న అమ్మాయిని చూసి గౌరవించే సమాజమా మనది?'

'మన యువతరం తలచుకుంటే ముళ్ళ కంపలా ఉన్న సమాజాన్ని పూల పాన్పులా మలుచుకోవచ్చు మంజూ! ప్రతీ ఆడపిల్లా కట్నమివ్వమని భీష్మించుక్కూర్చుంటే, ప్రతీ మగాడూ కట్నం

తీసుకోవడం ఓ అగౌరవంగా భావిస్తే... ఓ నూతన సమాజ సౌధ నిర్మాణానికి పునాది రాళ్ళు పడటం ఎంత సేపు ? సమాజ మంటే ఎవరు ? మనం! మనమే సమాజం, సమాజమే మనం! మారుతోన్న ఫ్యాషన్లకనుగుణంగా మనం మారడం లేదూ ? అలాగే సమకాలీన పరిస్థితులకి తగినట్టుగా మనక్కావల్సిన సమాజాన్ని మనమే సృష్టించుకోవచ్చు కదా ! అందుకు ఎవరో ఒకరు పూనుకోక తప్పదు. 'నా ఒక్కదానితో నా ఒక్కడితో జరిగేదేమిటీ - ఒరిగేదేమిటీ'- అనుకుంటే - వెయ్యేళ్ళు గడిచినా ఈ సమాజంలో మార్పురాదు ! అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించామని విర్రవీగుతోన్న మనం ఇంకా కట్నాలూ, కానుకలూ అంటూ బూజు పట్టిన అభిప్రాయాలూ, ఆచారాలూ వదల్లేకుండా ఉన్నామంటే - సిగ్గుగా లేదూ ?'

"ఎందుకులేదూ ? - కానీ - మార్పనేది రెండువేపులా రావాలి కదా!" అనుకున్నాను.

★★★

**డియర్ మంజూ...**

నువ్వు కాలేజీనుండి వచ్చేసరికి నేను హాస్టల్లో లేకపోవడం చూసి కంగారు పడ్తావేమోనని నీకీ లేఖ రాస్తున్నాను. ఇంత అర్థాంతరంగా మావూరు ఎందుకు వెళ్ళిపోవాల్సి వచ్చిందా అని ఆలోచిస్తున్నావనుకుంటా. ఇంత ప్రాణస్నేహితురాలివై ఉండీ, కొన్ని విషయాలు నీతో ఇంత వరకూ చెప్పలేక పోయాను.

నిన్న నీవు ఆదివారమైనా స్పెషల్ క్లాసుందని కాలేజీకి వెళ్ళావోలేదో మీ అన్నయ్య హాస్టల్‌కి వచ్చారు. నేనూ, నా ఆశయాలూ, ఆదర్శాలూ నచ్చాయట- పైగా మీ అమ్మా నాన్నలక్కూడా ఏ అభ్యంతరమూ లేదట నన్ను కోడలుగా స్వీకరించడానికి.

'నీ కిష్టమేనా ?' అని నన్ను అడిగారు.

ఇక నావిషయం. చిన్ననాటే ప్రసాద్ బావకి మనసిచ్చాను. మనిషి ఎంత అందగాడో మనసంత సున్నితం. అన్ని విధాలా నాకు నచ్చిన మనిషి. చదువు మెట్రిక్యులేట్ అన్న ఒక్క విషయం మినహా మరో లోపం లేదతనిలో - చదువు విషయంలో కూడా నాకే సంకోచంలేదు!

కానీ నా దురదృష్టం వల్ల అతనికి టీబీ వ్యాధి సోకి ముదిరి పోయిందాకా కనుక్కోలేకపోయాం ఎవరమూ !

అసలే ఆ సంబంధం ఇష్టం లేని అమ్మా నాన్నలు మా పెళ్ళికి అడ్డుపడ్డారు! ఇలా అయితే బాలేదని వాళ్ళెవ్వరికీ తెలీకుండా అతన్ని శానిటోరియమ్‌లో చేర్పించి నాకు చదువు కోసం పంపిస్తోన్న డబ్బులో కొంత మిగిల్చుకొంటూ నెలనెలా అతని మందుల కోసం పంపించాను ఇన్నాళ్ళూ. ఇంకా కొన్ని నెలల్లో పూర్తిగా నయమవుతుందన్నాడు డాక్టర్.

మీ అన్నయ్యకీ విషయమంతా చెప్పి - నేను అతణ్ణి షీలాని పెళ్ళిచేసుకోమనీ... తద్వారా ఓ మోడు జీవితాన్ని చిగురింపజేసిన వారవుతారనీ చెప్పాను.

కొన్ని క్షణాలపాటు ఆలోచించి ఏమనుకున్నారో ఏమో 'అలాగే' అని తలూపి, వెళ్ళిపోయారు. నిజంగా మీ అన్నయ్య ఎంత సహృదయుడో చెప్పడానికి ఈ కాగితాలు చాలవు.

చూడూ మంజూ! డబ్బూ, అందంవున్న నాలాంటిదానికి పెళ్ళి కావడం ఎంత సులభమో - షీలా లాంటి అభాగ్యులకు అంత కష్టం! అలాంటివాళ్ళ జీవితాలకోసం ఏకొంచెం పాటుపడినా నా ఆశయాలు ఫలించినట్టే! అయితే నా ఆశయం వెనకాల ప్రసాద్ బావను వదులుకోలేని స్వార్థం దాగివుందన్న సంగతి నేనేం మభ్యపెట్ట దల్చుకోలేదు నీదగ్గర !

నేనిక రానేమోనని బెంగెట్టుకోకు! రెండు రోజులు ఇంట్లోవుండి వస్తాను! మీ అన్నయ్య సంస్కారాన్ని నిండు మనసుతో అభినందిస్తూ....

నీ

వినీల

*(ఆలిండియా రేడియో సౌజన్యంతో)*

*తేదీ..13-9-1970,* ***at 1.00 p.m***

# కాలం వెక్కిరించింది!



1969



చెంప చెడేల్‌మంది.

దిమ్మరపోయిన రవి చెంపలు తడుముకుంటూ వుండి పోయాడు!

"ఇడియట్, బుద్ధిలేదూ ?" అరిచాను. అప్పటికీ రవి మాట్లాడలేదు.

"అసలెందుకు రాశావీ ప్రేమలేఖ ?"

నెమ్మదిగా తలెత్తి, మెల్లిగా అన్నాడు: "ప్రేమలేఖ అన్న పదంలోనే మీక్కావలిసిన సమాధానం ఇమిడి వుందండీ."

"చాల్లే... ఏనాడూ షూ ముఖం ఎరుగని నిన్నూ.... తాతలా ఇరవై రెండు ఇంచీల బాటమున్న నీ లూజ్‌ప్యాంట్ ముఖాన్నీ - ఏం చూసి ప్రేమించాలి? అసలెందుకు ప్రేమించాలి?" వ్యంగ్యంగా అన్నాను.

"ప్రేమకు బాహ్య సౌందర్యంతో పనేముందండీ ? ప్రేమక్కావలసింది ఆత్మ సౌందర్యం."

నవ్వాను - పకపకా నవ్వాను.

రవి అయోమయంగా కళ్ళు మిటకరిస్తూ దిక్కులు చూడ్డం మొదలెట్టాడు.

"మన కాలేజీలో నాకున్న పేరేమిటో తెలుసా నీకు ?" సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ అడిగాను.

"తెలుసు!"

"చెప్పు?"

"మిస్ కాలేజీ"

"ప్రేమలో నీవు కోరేది ఆత్మసౌందర్యమే అయినపుడు - మరి నాలోని బాహ్య సౌందర్యాన్నే ఎందుకు కోరుకున్నావ్ ?"

"అలా అని ఎందుకనుకున్నారు ? మీలో నేను చూసింది మీ ఆత్మ సౌందర్యంగానీ మీ అందం కాదు!"

"బావుంది.. చాలా బావుంది! కాని - నా ఆత్మ సౌందర్యాన్ని అప్పుడే ఎలా కనిపెట్ట గలిగావ్ ? వెళ్ళు ! మళ్ళీ ఇలాంటి వెర్రి వేషాలేయకుండా జాగ్రత్త పడు." వార్నింగిచ్చాను !

రవి తలవంచుకు వెళ్ళిపోయాడు.

ఎంత ధైర్యంలేకపోతే అతడు కాలేజీలో నోట్స్ ఇస్తాననే మిషతో ప్రేమలేఖ రాసి పెడ్తాడు! పైగా ఇలా ఇంటికొచ్చి ఆ విషయం ప్రస్తావించడానికెన్ని గుండెలుండాలి? రమణారెడ్డిని సైతం మరిపించే ఆ ఆకారం, ఆ పంది మూతి ముఖం నాకు ప్రేమలేఖ రాయడ మేమిటీ ?

పాపం! ప్రతిఫలంగా మిరపకాయలాంటి చెంప దెబ్బ ఘాటుగా తిన్నాడు ! మళ్ళీ ఇలాంటి వేషాలెయ్యడులే !

అయినా అతణ్ణి ఏంచూసి ప్రేమించాలీ? ఏం ప్రత్యేకతవుందనీ?

అతడు దీనంగా, జాలిగా వెళ్ళిపోయిన విధానం గుర్తొచ్చి ఎంత ఆపుకుందామనుకున్నా ఆగకుండా తెరలు తెరలుగా నవ్వొచ్చింది.

"విజ్జీ, ఏమిటోయ్, నీలో నువ్వే అలా తీరిగ్గా ముసి ముసిగా నవ్వుకుంటున్నావ్?" అంటూ భుజమ్మీదపడ్డ చేతులు చూసి ఉలిక్కిపడి పక్కకి తిరిగాను.

రజిత !

అల్లరిగా నవ్వాను దాన్నిచూసి. మాట్లాడకుండా మూతి బిగించింది.

నేను ఆరోజు కాలేజీకీ వెళ్ళలేదు. చెప్పకుండా ఇంట్లో వుండిపోయానని దానికి కోపమొచ్చింది.

ప్రసన్నం చేసుకోవాలని నేనే మాట్లాడించాను.

"ఏం రాజీ. మాట్లాడవా నాతో ?"

సున్నాచుట్టిన మూతిని మరింత అందంగా ముడేసి, కాళ్ళూపుకుంటూ దిక్కులు చూడసాగింది - నా ప్రశ్నకు సమాధానం చెప్పకుండా.

"నేనేంచేయను రాజీ, ఇవాళ కాలేజీకి రానని చెప్పేందుకి మీ యింటిదాకా వద్దామని ఎంత ప్రయత్నించినా కుదర్లేదు. - ఎలా చచ్చేది ?"

"అవును. ఎలా కుదుర్తుంది? అమ్మాయ్ గారు రవీంద్ర లవ్‌లో పడ్డాక ఇంకెలా తీరిక చిక్కుతుంది?" ఉక్రోషంగా అంది రజిత.

"బీసీ నాటి తాతలా వాడి ఫ్యాషనూ వాడూ - అలాంటివాడిని నేనెలా ప్రేమిస్తాననుకున్నావ్ రాజీ !"

"లవ్ ఈజ్ బ్లైండ్. ప్రేమ ఫ్యాషన్ను చూడదు. అయినా రవికేమైందోయ్? ఎర్రగా బుర్రగా బాగానే వుంటాడుగా"

"అవును. ఎర్రగా గెడకర్రలా వుంటాడు. కొయ్యలా నడుస్తాడు. ఆడదాన్లా సిగ్గు పడతాడు. మనమేదేనా ఒకమాటంటే దెబ్బకు ఏడుస్తాడు. బాగా వుండకేం... బాగానే వుంటాడు..."ఆవేశంగా ఏమేమో అన్నాను.

"నీ ధోరణి చూస్తూంటే స్వయంవరం చేసుకునేట్టు కన్పడుతోంది!"

నవ్వుతూ అంది రజిత.

"అవసరమొస్తే అంతపనీ చేస్తాను రాజీ- నేను పెళ్ళాట్టమంటూ జరిగితే ఎప్పటికైనా ధర్మేంద్ర లాంటి పర్సనాలిటీ, సెక్రెటరీ నవల్లోని రాజశేఖరం లాంటి వ్యక్తిత్వంగల వాడినే పెళ్ళాడ్తాను !"

"ఎందుకు విజ్జీ, నీకా బోడి ధీమా ? అలాంటి వాడు దొరక్కపోతే ఏంచేస్తావ్?"

"అలాగే ఉండిపోతానేమో!?"

"భేష్.... భేష్ !" అంటూ చప్పట్లు చరుస్తూ నా దగ్గరికి వచ్చి నా ముఖంలోకి తేరిపార చూస్తూ అంది రజిత: "అయినా అలాంటి ఆశలు చాలా ప్రమాదకరం విజ్జీ. కన్నె కలలెప్పుడూ అలల్లా విరిగిపోతాయ్. నీ ఊహాసుందరుడిలాంటివాళ్ళు నవలల్లో, సినిమాల్లో తప్ప ఎక్కడా అవుపించరు. అందమున్నచోట గుణం. గుణమున్నచోట అందం చాలా అరుదు."

"ఎక్కడో ఎందుకు ? మీ పక్కింటి అబ్బాయ్ ప్రకాశ్ లేడా? అతనికేమైంది ? అందమూ - గుణమూ - రాజశేఖరాన్ని మరిపించే ఆ వ్యక్తిత్వమూ..."

"ప్రకాశా?" క్షణకాలం నివ్వెరపడి, అంతలోనే సర్దుకొని నవ్వుతూ అడిగింది రజిత: "ఆయన అంగీకరించారా మరి ?"

"తప్పకుండా అంగీకరిస్తాడనే నమ్మకం నాకుంది ! నాకేం లోపముంది? అదీగాక మానాన్నా, వాళ్ళ నాన్నా మంచి ఫ్రెండ్స్ ! పైగా చిన్నప్పటి నుండీ వాళ్ళిద్దరూ మమ్మల్ని భార్యాభర్తలుగా లెక్కేసుకుని ఆనందిస్తున్నారు. ప్రకాశ్... వాళ్ళ నాన్నమాటను కాదనడనే ధైర్యం నాకుంది.!"

"ఓ.కే. వస్తా ! మళ్ళీ కలుస్తా ! ఇంట్లో చుట్టాలున్నారు!" అంటూ గబ గబా వెళ్ళిపోయింది!

అది వెళ్ళిపోయిన వైపే చూస్తూండిపోయాను - ఎప్పుడు కలిసినా గంటల తరబడి కబుర్లు చెప్పే రజితేనా అంత త్వరగా కొంప మునిగిపోతున్నట్టుగా వెళ్ళిపోయింది అనుకున్నాను!

ఆ మర్నాడే రజితావాళ్ళ నాన్నకి ట్రాన్స్‌ఫరై విశాఖపట్నం వెళ్ళిపోయారు ! మరో మూడు వారాల తర్వాత - ఎలాంటి

అడ్డంకుల్లేకుండా ప్రకాశ్‌తో నా వివాహం జరిగిపోయింది !

రజిత తను నా పెళ్ళికి రాలేక పోయినందుకు క్షమాపణలతో ఉత్తరం రాసింది.

★★★

"ప్రకాశ్...!"

"ఊఁ"

"ఎందుకలా వుంటున్నారు ?"

"ఎలా ?" శూన్యంలోకి చూస్తూ అడిగాడు ప్రకాశ్.

"అదోలా ?"

"ఎవరన్నారు ? నాకేమైంది ? బాగానే వున్నానే ?"

"అవును. మీరు బాగానే వున్నారు. మధ్య మీ అంతర్యాన్ని అర్థం చేసుకోలేక, నన్ను నేను సరిపెట్టుకోలేకపోతున్నాను. పెళ్ళయి - మూణ్నెల్లు అవుతోంది. ఇంతవరకూ సరదాగా ఏనాడేనా పిక్చర్‌కి తీసికెళ్ళారా ? కనీసం కబుర్లు చెప్పారా?"

"క్షమించు విజయా ! నా మనస్సేమీ బావుంటంలేదు. నన్నేమీ విసిగించకు. నన్నిలా బ్రతకనీ"

"ఏనాడేనా నోరు తెరిచి అడిగితే ఇదీ ధోరణి ! మిమ్మల్ని బ్రతకనీకుండా రాక్ష సిలా చంపుతున్నానా ?"

"ఆ పని జరిగితే బాగానేవుండు. కాని కాల్చుకు తింటున్నావ్. నీక్కావలిసింది నేనుకాదు. నా అందం. నా డబ్బూ - నా పర్సనాలిటీ."

"ప్రకాశ్..."

"అవును. నీకలల కోసం నా జీవితాన్ని నాశనం చేశావు."

"ప్రకాశ్... ఏమిటది ? నువ్వు నీ ఇష్టప్రకారంగా నన్ను పెళ్ళాడలేదా?"

పేలవంగా నవ్వుతూ అన్నాడు ప్రకాశ్:

"హుఁ ఇష్టం ! నా ఇష్టాన్ని కాలదన్ని నా ఇష్టదేవత నాకందకుండా వెళ్ళి పోయింది! తనను తానే మోసంచేసుకుంటూ బతుకుతోంది."

"ఎవరామె? ఆమెను మరిచిపోలేరా ?"

"మరుపా ? అదీ జన్మలో అసాధ్యం!"

"ఆమె నాకంటే అందంగా వుంటుందా?" నా ప్రశ్నలో నాకే తెలీని ఈర్ష్య ఏదో తొంగి చూసినట్టనిపించింది.

"ఊహుఁ నీకంటే కూడా నలుపు ! నీ ఛాయలోని తళతళలూ, నీ కళ్ళల్లోని మిలమిలలూ ఆమెలో కాగడా పెట్టి వెదికినా కన్పించవు!"

"మరి ఏముందామెలో ?" నా అణువణువూ ద్వేషాగ్ని బుసలుకొట్టింది - పొగలు రేపింది !

"అది తెలిస్తే ఈ బాధెందుకు ? అదే నీలో చూసి సరిపెట్టుకునే వాణ్ణి కదా !"

"భగవాన్ !" అంటూ నుదురు కొట్టుకుని పక్కగదిలోకి నడిచాను-

ఆ రాత్రి అంతా ఆలోచిస్తూనే గడిపాను. తలంతా వేడెక్కింది. పరిష్కారమార్గం కనుపించలేదు.

అప్పుడే తెలతెలవారుతోంది. కిటికీలోంచి వీధిగుండా చూస్తున్నాను.

పాలావిడ పాలు తెస్తూంది. పక్కనే ఆమె భర్త వస్తున్నాడు సాయంగా.

అతడిది నల్లని పోతులాంటి ఆకారం. ఆమెది మేలిమి బంగారు శరీరచ్ఛాయ!

అయినా వాళ్లందరూ అంత హాయిగా ఎలా బతుకుతున్నారు? ప్రపంచంలోని ఆనందమంతా అతడి పొందులో లభిస్తోన్నట్టు ఆమె కళ్ళల్లో కొన్ని కోట్ల ఆనందరేఖలు లీలగా మెరుస్తు న్నాయ్ !

కాని... కాని... దురదృష్టమంతా నాది ! అన్ని అందాలూ పుణికి పుచ్చుకున్న ప్రకాశ్... ఎందుకో నాకు అందరాని చందమామై కవ్విస్తున్నాడు.

నాలో ఏం లోపముంది ? అతడి అందంతో నా అందం పోటీపడ్తోంది. అయినా నా జీవితంలో ఏదిలేదని ఈ వెల్తీ ఏర్పడింది? ఎందుకోసం?? నేనేం పాపం చేశాననీ!!!

"పోస్ట్ !" పోస్ట్‌మాన్ కేక విని పరుగెత్తుకు వెళ్ళాను. రాజీనుండి వచ్చింది. గబగబా చించి చదివాను.

విజ్జీ,

నీనుండి ఊహించని తిరస్కృతిపొందిన రవి దేశాలవెంట పిచ్చివాడై తిరిగాడు కొన్నాళ్ళు. వారం రోజుల కిందట ఈ వూళ్లో లారీ ఏక్సిడెంట్లో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. నిజంగా రవిని తలుచుకుంటే మనస్సంతా బాధతో విలవిల్లాడి పోతోంది.

ఇంతకీ నీ సంసారం ఎలా వుంది ? నీ నుండి ఉత్తరాలు రావడం లేదెందుకనీ? ప్రకాశ్ లాలనలో బద్ధకస్తురాలివవుతున్నట్టున్నావ్ ?

నీ నుండి త్వరగా లేఖని ఆశిస్తూ -

-నీ

రాజీ.

నా కళ్ళనుండి జలజలా నీళ్ళు జాలువారేయి.

రవి ! అబ్బ... ఇహ ఊహించలేకపోయాను. దానికి సమాధానంగా రజితను ఒక వారం రోజులుండి పోవడానికి రమ్మని రాశాను. వీలవదనీ, రావాలని లేదనీ లేఖ రాసింది.

రాకపోతే మాట్లాడననీ, ఉత్తరాలే రాయననీ బెదిరిస్తూ రాశాను. మరో రెండు రోజుల్లో వచ్చింది రజిత. ఆమాంతం వెళ్ళి వాటేసుకున్నాను. దాదాపు మూడేళ్ళ తర్వాత రాజీని చూశాను. మూడుగంటలు చూడకుండా వుండలేని మేము మూడేళ్ళు ఎలా గడిపామో ?

ఇల్లంతా కలియదిరుగుతూ, ఒళ్ళంతా కళ్ళుచేసుకుని నా సంసారం గురించి అడుగుతోంది రజిత.

ఏమని చెప్పాలి, ఎలా చెప్పాలి ?

ఆ రాత్రి దాని పక్కలో పడుకుని, వెలుతుర్లో దాని ముఖం చూస్తూ చెప్పే ధైర్యం లేక లైటార్పి అన్ని విషయాలూ చెప్పాను.

నన్ను ఒళ్ళోకి లాక్కుని ఓదారుస్తూ వుండి పోయింది చాలాసేపు. అప్పుడే జీవితంలో మొదటిసారిగా చల్లని ఒడిలోని అనుభూతి ఎలాంటిదో చవిచూశాను.

పెనుగాలికి ఊగిసలాడస్తూ ఎప్పుడారిపోతుందో తెలీని జ్యోతిలావున్న నా మనసు దానివద్దే తిరిగి మామూలుకు సర్దుకుని

దేదీప్యమానమై వెలగడం మొదలెట్టింది.

ఆ రాత్రి నాకు ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు గానీ, తిరిగి మెలుకువ వచ్చేసరికి కాకులు కావుకావుమంటున్నాయ్.

నా పక్కకి తిరిగాను. రజిత లేదు.

ఎక్కడికి వెళ్ళిందా అని అలాగే ఆలోచిస్తూ పావుగంట చూశాను. అయినా రాలేదు. నెమ్మదిగా పక్కమీది నుండి లేచి పరుపుమీదికి చూశాను.

లేత గులాబీ రంగు కాగితాలు రెపరెపలాడుతున్నాయ్. దడదడలాడుతూన్న హృదయంతో అందుకున్నాను.

విజ్జీ.

సెక్రటరీ నవల్లోని రాజశేఖరంలాంటి భర్త లభించాడు ! ధర్మేంద్రలాంటి అందముంది ! స్త్రీకి అంతకన్నా ఇంకా ఏం కావాలి? ప్రకాశ్‌తో అన్ని విధాలా సుఖపడ్తూ నీ జీవితం నందనవనం చేసుకున్నావవనుకున్నాను గానీ -ఇలా నరకతుల్యం అవుతుందనుకో లేదు.

ప్రకాశ్ ముభావంగా, అంటీఅంటనట్టుగా వుండేందుకు ముఖ్య కారకురాలు నిజంగా నీ పాలిటి రాక్షసి!

ఆ రాక్షసి... నీ రజితే అంటే - నమ్ముతావా విజ్జీ నువ్వు?

నాకు తెలుసు విజ్జీ - నువ్వు నమ్మవు! కాని ఇది నిజం! ప్రకాశ్, నేనూ ప్రాణ ప్రదంగా ప్రేమించుకున్నాం.

కానీ ఆ విషయం ఎవరికీ తెలీదు. వివాహం చేసుకుందామను కునేంతలోనే నువ్వూ ప్రకాశ్‌ని కోరుకుంటున్నావని తెలిసింది.

అదీగాక ప్రకాశ్ నాన్నా - మీ నాన్నా ప్రాణ స్నేహితులనీ - ప్రకాష్ తిరస్కృతి ఆ ఇరువురి ప్రాణ మిత్రుల మధ్య పగను రేపకూడదనీ.... ప్రకాశ్ తిరస్కారం నీ ఆశలు మొదలంటా నాశనమయేందుకు నాంది కాకూడదనీ... ప్రకాశ్‌ని కాళ్ళా వేళ్ళా పడి బతిమాలాను!

అయినా ప్రకాశ్ వినలేదు. నామాట ఒప్పుకోకపోతే చస్తానని బెదిరించాను ! ఇహ లాభం లేదని, నా మనస్సు మారదని - తెలిసి నీతో పెళ్ళికి ఒప్పుకున్నాడు!

కానీ ఇక్కడా నాకు ఎదురుదెబ్బే తగిలింది. ప్రకాశ్ అటు నన్నూ మరువలేక ఇటు నీకూ సుఖాన్ని ఇవ్వలేక - తనూ సుఖపడలేక పోయాడు! నీతో సరిపెట్టుకోలేక, నన్ను మరువలేక మధ్య ప్రకాశ్ సతమతమవుతున్నాడు!

ఇంకా కొన్నాళ్ళు అలాగే దొర్లితే.... అమ్మో వూహించలేను! రవిలాగే ప్రకాశ్ పిచ్చివాడై.... వద్దు, భగవాన్ వద్దు.... అందుకే నా చావు నీ జీవితాన్ని స్వర్గమయం చేస్తుందనీ.... నా మరణవార్త వినయినా ప్రకాశ్ నా చివరికోరికనీ మన్నించి - ఓ మామూలు మనిషై - నీతో సరిగ్గా కాపురం చేస్తాడన్న నమ్మకంతో నేను ఈ లోకంలోంచి తప్పుకుంటున్నాను శాశ్వతంగా. ఎక్కడున్నా నాక్కావలసింది నీ సుఖమే విజ్జీ నాకు !

-నీ

రాజీ

నిజం తెలిసిన నేను నిలువెల్లా వణికిపోయాను, లోకం స్థంభించలేదుగానీ నా హృదయం మొద్దు బారింది!

అయ్యో రాజీ... ఎక్కడికి వెళ్ళావ్ ? ఏం సాధించడానికి ?

ఆ విషయం కొన్ని గంటలముందు తెలిసినా - మిమ్మల్ని మళ్ళీ కలిపి మీ మార్గాన్నుండి తప్పుకునేదాన్ని !

ప్రకాశ్ ఎర్రబారిన కళ్ళతో వచ్చాడు లోపలికి.

''నా రాజీ చనిపోయింది విజ్జీ. తను రైలు కిందబడి చనిపోయింది. నేను లేకుండానే ఒంటరిగా వెళ్ళిపోయింది. నేనులేని రాజీలేదు. రాజీలేని నేనూలేను. వెళ్తున్నాను విజయా ! వెళ్తున్నాను... రాజీ ఒడిలో ఆనందం పంచుకోడానికి వెళ్ళి పోతున్నాను. నువ్వు నానుండి ఏవేవో ఆశించావ్. కానీ ఏమీ అందించలేని అసహాయుణ్ణై పోయాను. ఈ అసమర్థుడు ప్రేమించిన రాజీని... పెళ్ళాడిన విజ్జీనీ ఎవరినీ సుఖపెట్టలేకపోయాడు గానీ రాజీ దగ్గర సుఖపడడానికి పోతున్నాడు'' అంటూ వెళ్ళిపోయాడు.

ఇహ ప్రకాశ్‌ని ఆపేందుకు ఏ శక్తీ చాలదు. వారించే సాహసంలేని నేను స్థాణువులా నిలబడిపోయాను.

ఇద్దరు ప్రేమికులను తెలిసీ తెలీక నేను విడదీసినా- విధి ఆ ఇద్దర్నీ ఒక్కటి చేయనుంది!

ప్రేమికులు! ప్రేమ ! ప్రేమించడం! ప్రేమింపబడటం... నిజంగా ఎంత అదృష్టం! నన్ను ఏ అదృష్టం వరిస్తుందని రవి ప్రేమను కాలదన్ని అతని పతనానికి కారకురాలినయ్యాను !?

ముగ్గురి నూరేళ్ళ జీవితం నాశనం చేసింది నేను! మూడు అమృత హృదయాల్లో విషబిందువులు చిలకరించింది నేను!

నేను మహాపాపిని! నా పాపానికి నిష్కృతి లేదు!

సుఖపడటానికి పుట్టని రజిత, నన్ను సుఖపెట్టాలని ప్రయత్నించి - ఓడి, నాకోసం బలి అయిపోయింది !

తను సుఖపడి, నన్ను సుఖ పెట్టాలని ఆశించిన రవి నానుండి ఊహించని తిరస్కారం పొంది, శాశ్వతంగా కనుమూసాడు.

తను సుఖపడక, నన్ను సుఖపెట్టక - జీవితంతో  రాజీపడలేక ఈ లోకంలోంచి నిష్క్రమించాడు ప్రకాశ్.

కాని.... నేనో !?

ముగ్గురి హృదయాల్లో కార్చిచ్చును రేపి, ఆ మంట తాలూకు వేడి సెగలు నన్ను మొదలంటా దహించి వేస్తూంటే.... లోకం శూన్యంగా, బ్రతుకును యాంత్రికంగా లాక్కొస్తూన్న నన్ను చూసి - కాలం ఆగలేదుగానీ... వెక్కిరించింది!

*అమృతలత బి.ఏ (ప్రథమ)*

*విమెన్స్ కాలేజ్ మ్యాగజైన్, నిజామాబాద్.*

***1969***

# పాఠకుల స్పందన....

## అన్‌రెస్ట్:

★ *అమృతలత గారి 'అన్‌రెస్ట్' కథ ఆలోచింపచేసేదిగా ఉంది. నేటి రాజకీయ, సామాజిక పరిస్థితుల్ని సూటిగా చర్చించిన రచయిత్రి అభినందనీయురాలు.*

***- ఈ. మురళీకృష్ణ, సామర్లకోట. తేదీ: 19-10-1989***

★ *'అన్‌రెస్ట్' పూర్తిగా 'చర్చ'లా కొనసాగిన కథ ! అరుణ పాత్ర ద్వారా రాజకీయపు లొసుగుల్నీ - తీవ్రవాదాన్నీ - 'ఇజాల' ముసుగుల్నీ అన్ని కోణాల్లోంచి స్పృశించారు. ఈ కథలో దేశం బాగుపడాలనే గొప్ప దేశభక్తి వుంది !*

***- కిరణ్‌బాల, ఆర్మూర్.***

## స్పందన:

★ *అమృతలత గారి కథ 'స్పందన' బావుంది.*

***- వీరభద్ర స్వామి, ఖమ్మం***

★ *ఈ వారం మయూరి పత్రికలోని 'స్పందన' కథ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. రచయిత్రి అమృతలత గారికి మా కృతజ్ఞతలు.*

***- కె. నాగేశ్వర రావు, గుంతకల్.***

## కాలని తెప్ప:

★ ఆంధ్రజ్యోతి 12-2-1982 సంచికలో అమృతలత గారి కథ 'కాలని తెప్ప' చాలా బావుంది. ఎంతో అమాయకురాలైన లక్ష్మి తన చేతనైనంత సహాయం - ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా చేసి - చివర్లో ఆమెకు కనీస సహాయం చెయ్యని ఆ స్వార్థపరుల కారుపై కసికొద్దీ విసిరిన రాయి దెబ్బకి - కారు అద్దాలు భళ్ళుమన్న సంఘటన కథకి గొప్ప ముగింపు. రచయిత్రికి నా అభినందనలు.

**- యం. సీత, శ్రీశైలం.**

★ 12-2-1982 ఆంధ్రజ్యోతిలో అమృతలత గారి 'కాలని తెప్ప' సహజంగా వుంది.

**- చెన్నాప్రగడ సత్యనారాయణ, మత్స్యపురి.**

★ మీ 'కాలని తెప్ప' కథలో నాకో విషయం అర్థం కాలేదు. రాజేష్ లచ్చిని చూస్తోన్న తీరు విమలకి అసహ్యం కలిగించింది. కారు తొందరగా కదిలితే బావుణ్ణు అనుకుంది. కారు కదిలి లచ్చి రూపం కనుమరుగు కాగానే 'విమల గుండెలు కుదుటపడ్డాయి. రాజేష్ భుజం మీద సుతారంగా తల ఆనించి పడుకుంది' అని రాసారు. ఈ చిత్రీకరణ గురించి నాకు తీవ్రమైన అభ్యంతరముంది. రాజేష్ విమలను దగ్గరకు తీసుకోవడం వేరూ... విమల రాజేష్ భుజంమీద సుతారంగా తల ఆనించడం వేరూ. రెంటికీ పెద్ద తేడావుంది. లచ్చి విషయంలో అంతవరకూ రాజేష్ ప్రవర్తన అసహ్యించుకున్న విమల, రాజేష్ భుజం మీద తల ఎలా అనించగలిగింది ? రాజేష్ మీద ఆమె అసహ్యాన్ని చిత్రీకరించి, తద్వారా ఆ అసహ్యాన్ని పాఠకుల్లో సైతం కలిగేలా మీరు చిత్రించారు. మరి ఆ అసహ్యాన్ని పాఠకులు మరిచి పోయేలా మీ చిత్రీకరణ లేదా ? అంత తొందరగా మరిచి పోగలిగితే - అంత 'అసహ్యం' విమల కెందుకూ ?

**- సి.హెచ్. మధు, నిజామాబాద్.**

- *'విమల రాజేష్ భుజం మీద సుతారంగా తల ఆనించి పడుకుంది' అని నేను రాసిన వాక్యం ద్వారా... విమల అప్పటి వరకూ జరిగిందంతా దులిపేసుకుని భర్తతో అడ్జెస్టయిన విధానం, తద్వారా ఆ పాత్ర స్వభావం పాఠకులకి పూర్తిగా అర్థమవుతుంది!*

*'అంత తొందరగా మరిచిపోగలిగితే అంత అసహ్యం విమలకెందుకూ ?' అని కదూ అడిగారు. జరిగిన విషయం విమల మరిచిపోలేదు.... మరిచిపోయే మనిషి కూడా కాదు. పోతే - భర్తమీద విమలకి అసహ్యం లేదు. అసహ్యం ఏర్పడ్డప్పుడు తిరుగుబాటు చేస్తుంది. భర్తని కాదని వెళ్ళి పోతుంది. కథలో విమల స్వభావం దానికి భిన్నమైంది కాబట్టి... (అవసరం తీరాక లచ్చిని నిర్లక్ష్యం చేయడంలో ఆమెకూ పాత్రవుంది కాబట్టి), భర్త గుణాలు తెలిసీ, అతడితో అడ్జెస్టు అయిపోతూ వచ్చి - అతడి నీచగుణాలు బయటపడ్డప్పుడు,*

ఈర్ష్యతో భర్త మనస్తత్వాన్ని విశ్లేషించే చూసిందే తప్ప, ఎదిగిన మనసుతో, చైతన్యంగల స్త్రీ గా తిరుగుబాటు భావాలతో ఆమె ఆ కథలో లేదు ! భర్తని అసహ్యించుకునే స్థాయికి ఆమె ఎదిగివుంటే- కథ మరోలా ఉండేది! అప్పుడు విమల లచ్చిని అసహ్యించుకునేది కాదు !

**- అమృతలత**

మీ 'కాలని తెప్ప' కథ చదివి ఈ ఉత్తరం రాయకుండా ఉండలేకపోతున్నాను. కథలోని పాత్రల చిత్రణ చాలా సహజంగా ఉంది. రాజేష్ లాంటి వాళ్ళు మన నిజ జీవితంలో అడుగడుగునా కనిపిస్తారు. అమాయకులను తమ అవసరాలకు వాడుకుని ఎంగిలి విస్తరాకుల్లాగా విసిరేస్తారు. రాజేష్ భార్య విమల నేటి సగటు ధనవంతురాలైన స్త్రీలకు ప్రతినిధి. మొదట లచ్చిని చూసి అసహ్యించుకోవడం, ఒక చీర దానం చేయమనగానే తన ఖరీదైన బట్టలు గుర్తుకు తెచ్చుకోవడం చాలా సహజంగా వుంది. తన కొడుకు ప్రాణం నిలవడానికి లచ్చి దగ్గర బిచ్చమెత్తిన విమల ఆమెను ఇంటిదగ్గర వదలి రమ్మనగానే వీలు కాదని తప్పించుకోవడం ఆమె నీచ గుణాన్ని బయట పెట్టింది. కథ ముగింపు చాలా బావుంది. తమ అవసరం తీరిపోగానే తనను వదలించుకుని పోతున్నారే అన్న కసితో - లచ్చి రాయితీసుకొని కారు పైకి విసరడం అద్భుతంగా వుంది.

- సి. రమణమూర్తి, హైదరాబాదు.

## అంతుబట్టని ఆంతర్యాలు:

భూగర్భాన్నీ, చంద్రశిలను పరిశీలించి, పరిశోధించి, పరీక్షించిన అభ్యుదయ మానవుడికి, కామం, స్వార్థం, మోహం, జుగుప్స మొదలగు అస్త్రాల్ని తోటి మనిషి ఏది ఎప్పుడు ఎవరిపట్ల ఎలా ఉపయోగిస్తాడో అంతుబట్టదు. ఈ సమస్యకు చక్కని రూపకల్పనే అమృతలత గారి 'అంతుబట్టని ఆంతర్యాలు' కథానిక.

**- హేమలతా బోనారావు, - బి. సూరిబాబు, సిరికొండ - వెంకటేశం, కరీంనగర్.**

★ 'అంతుబట్టని ఆంతర్యాలు' కథ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది.

**- న్యాయపతి శ్రీనివాసరావు, బరంపురం.**

★ 7-3-1975 సంచికలో ప్రచురించిన 'అంతుబట్టని ఆంతర్యాలు' కథ అత్యుత్తమంగా ఉంది. సగటు మగవాళ్ళ మనస్తత్వాల్ని వాస్తవికంగా చిత్రించారు రచయిత్రి. కథ కథలా కాకుండా, సంఘటనలు నిజంగా జరుగుతున్నట్లు ఫీలయ్యాం. మానవ మస్తిష్కాల్లో, మనస్తత్వాల్లో సైతం మార్పు తేగల ఇటువంటి మరికొన్ని కథలు రచయిత్రి రాస్తారని ఆశిస్తాను. వారికి నా అభినందనలు.

**- పి. రామాచారి, నిజామాబాద్.**

★ 'అంతుబట్టని ఆంతర్యాలు' నాకు చాలా బాగా నచ్చింది. రచయిత్రి చక్కగా రాసారు. అభినందనలు.

**- చెన్నూరి నాగరాజు, నిజామాబాద్.**

## మనసు ఎదగని మనుషులు:

★ "స్వాతి" మే సంచికలో అమృతలత గారి 'మనసు ఎదగని మనుషులు' అన్న కథ వాస్తవానికి దగ్గరగా ఉంది. నేటి విద్యార్థిలోకంలో ప్రబలుతోన్న కుళ్ళును సూటిగా చెప్పి నందుకు రచయిత్రికి మా ధన్యవాదాలు.

**- బుజ్జి, 'అమ్ములు', 'కుమారి' , నాగేంద్రపురం., స్వాతి, మంత్లీ జూన్ 1971.**

★ అమృతలత గారి 'మనసు ఎదగని మనుషులు' నన్నెంతో ఆకర్షించింది.

**- అరుణ కిరణ్ విజయనగరం., స్వాతి, మంత్లీ జూన్ 1971.**

## పొదరిల్లూ మాది :

★ వందేమాతరం శతజయంతోత్సవాల సందర్భంలో ఆమె ఉపన్యాసం- 'అమ్మ-ఇల్లు-పిల్లలు'తో ఓ కథలా మొదలెట్టి - తెల్లపిల్లలు ఇంటిని ఎలా ఆక్రమించుకున్నారో తెలుపుతూ... చివర్లో ఓ దేశభక్తి గీతంతో ముగించారు ! పిల్లలకి కథ చెప్తున్నట్టుగా మొదలై - పెద్దలకి కనువిప్పుగా ముగిసిందీ

ఉపన్యాసం ! ఆమె రచనా నైపుణ్యానికిది బహుశః పరాకాష్ఠ కావచ్చు!

**- ఇందిరాదేవి, ఆర్మూరు.**

★ ఈ ఉపన్యాసం రొటీన్, ఊకదంపుడు ఉపన్యాసంలా కాకుండా - ఓ కథలా - ఏమాత్రం రాజకీయ పరిజ్ఞానం లేనివారికి, నిరక్షరాస్యుల క్కూడాసూటిగా - బుర్రల్లోకి ఎక్కేలా - వెరైటీగా వుంది. చివర్లో దేశభక్తి గీతం చదువుతూంటే అణువణువూ రోమాంచితమవుతుంది!

**- తుర్లపాటి లక్ష్మి, నిజామాబాదు.**